www.andhrajyothy.com
హైదరాబాద్ సిటీ*
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
సోమవారం | 22-4-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 | సంచిక (Issue) : 6
శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్లపక్షం, తిథి: చతుర్దశి తె. 3.26 తదుపరి పౌర్ణమి, నక్షత్రం: హస్త రా. 7.59 తదుపరి చిత్త, వర్జ్యం: తె.4.50-6.36, దుర్ముహూర్తం: మ.12.38-1.28, మ.3.08-3.59, అమృతఘడియలు: మ.1.16-3.03, రాహుకాలం: ఉ.7.30-9.00, సూర్యోదయం: 5.57, సూర్యాస్తమయం: 6.29
Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ప్రాణాలకు తెగించి పోరాడుతున్నాం

రేపు మాకు, మా పిల్లలకు ఏమవుతుందో తెలియదు
11 సునీతకు, నాకు దేవుడే రక్ష
బాబాయి హత్య కేసులో అవినాశ్‌రెడ్డి నిందితుడు
సీబీఐ చెప్పిన విషయాన్నే మేమూ చెబుతున్నాం
జగన్ అడ్డుపడకుంటే నిందితులకు శిక్ష పడేది: షర్మిల
ఆస్తిలో వాటా పొందే హక్కు ఆడబిడ్డకు ఉందని స్పష్టం
కర్నూలు, నందికొట్కూరులో 'ఏపీ న్యాయ్ యాత్ర'



లక్ష్మీనృసింహుడి సాక్షిగా చెబుతున్నా.. పంద్రాగస్టులోగా

2 లక్షల రుణమాఫీ





భువనగిరి రోడ్‌షోలో అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. పెద్ద సంఖ్యలో హాజరైన ప్రజలు, పార్టీ శ్రేణులు

- వచ్చే పంట నుంచి వరికి రూ.500 బోనస్.. గుట్టలో భక్తులకు సౌకర్యాలు కల్పిస్తా
- 60 వేల కోట్లతో మూసీ ప్రక్షాళన.. సాగునీటి కాల్వలను పూర్తి చేస్తాం
- నాతోపాటు సీఎం అర్హత ఉన్న వ్యక్తి కోమటిరెడ్డి.. సీఎం పదవి నాకు బాధ్యత
- సర్కార్‌ను ఎందుకు కూలగొడతారు?.. ఇచ్చిన హామీలను నెరవేర్చినందుకా??
- కేసీఆర్ బిడ్డకు బెయిల్ రావాలంటే భువనగిరిలో బీజేపీ గెలవాలంట!
- బీఆర్ఎస్, బీజేపీని వామపక్షాలు బొందపెట్టాలి.. భువనగిరి ప్రచారంలో రేవంత్
- 3 జిల్లాల్లో నేడు రేవంత్ పర్యటన.. నామినేషన్ కార్యక్రమాల్లో పాల్గొననున్న సీఎం

యాదాద్రి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): "యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి సాక్షిగా చెబుతున్నా..! ఏది ఏమైనా సరే.. పంద్రాగస్టులోగా రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తా" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉద్ఘాటించారు. వచ్చే పంట నుంచే వరికి రూ.500 బోనస్ ఇచ్చి, ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని స్పష్టం చేశారు. ఆదివారం రాత్రి యాదాద్రి-భువనగిరి జిల్లా కేంద్రంలో భువనగిరి లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తున్న చామల కిరణ్ కుమార్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా జరిగిన రోడ్‌షోలో, అంబేడ్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన సభలో రేవంత్‌రెడ్డి మాట్లాడారు. యాదగిరిగుట్టలో భక్తులకు సౌకర్యాలు కల్పిస్తానని, కుర్చీవేసుకుని.. ఇక్కడే కూర్చుని

మిగతా 13వ పేజీలో...

క్రికెట్ టీమ్‌లా..

సీఎం రేవంత్ నాయకత్వంలో 11 మంది మంత్రులం ఒక జట్టుగా ఉన్నాం: ఉత్తమ్



మార్కెట్లో సన్నాల జోష్

- పోటీ పడి కొంటున్న ప్రైవేటు ట్రేడర్లు, మిల్లర్లు
- ఇప్పటికి 6.52 లక్షల టన్నుల కొనుగోళ్లు
- కేంద్రాల్లో మరో 6 లక్షల టన్నుల సేకరణ
- క్వింటాకు రూ.2,600-2,900 వరకు ధర
- గరిష్ఠ ధర దక్కకుండా మార్కెట్ అధికారులు, వ్యాపారుల కుమ్మక్కు
- చర్యలు తీసుకోవాలని రైతుల విజ్ఞప్తి

హైదరాబాద్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): యాసంగి సీజన్‌లో పండించిన సన్న రకం ధాన్యం హాట్ కేకుల్లా అమ్ముడుపోతోంది. సాంబ మసూరి, జైశ్రీరాం, సోనా మసూరి తదితర రకాల ధాన్యానికి క్వింటాలుకు రూ.2,600 నుంచి రూ.2,900 వరకు ధర పలుకుతోంది. గ్రేడ్- ఏ ధాన్యాన్ని ట్రేడర్లు, రైస్‌మిల్లర్లు పోటీ పడి కొంటుండగా... రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సాధారణ, గ్రేడ్- ఏ రకాల ధాన్యాన్ని కనీస మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నారు. యాసంగి వరి కోతలు ఇంకా జోరందుకోలేదు. ఉమ్మడి కరీంనగర్, వరంగల్ తదితర జిల్లాల్లో ఇప్పుడిప్పుడే వరికోతలు మొదలయ్యాయి. కానీ, ముందస్తుగా వరి నాట్లు వేసిన నిజామాబాద్, కామారెడ్డి, సూర్యాపేట, నల్లగొండ జిల్లాల్లో ధాన్యం మార్కెట్‌కు ఎక్కువగా వస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటివరకు 6 లక్షల

మిగతా 3వ పేజీలో...

కాంగ్రెస్ గెలిస్తే.. మీ సంపదను ముస్లింలకు

పంచేస్తారు

తల్లుల మెడలోని మంగళసూత్రాలనూ వదలరు

రాజస్థాన్ ఎన్నికల ర్యాలీలో ప్రధాని సంచలన వ్యాఖ్యలు



- వామపక్షాల కబంధ హస్తాల్లో చిక్కుకున్న కాంగ్రెస్
- తీవ్ర ఆందోళనకరంగా ఉన్న ఆ పార్టీ మేనిఫెస్టో
- అవినీతితో దేశాన్ని నిర్వీర్యం చేసిన కాంగ్రెస్
- ఆ పార్టీకి ఒకప్పుడు 400 సీట్లు.. ప్రస్తుతం 300 సీట్లలోనూ పోటీ చేయలేకపోతోంది
- దారం తెగిన గాలిపటంలా మారిన 'ఇండియా'
- ఎన్నికల్లో గెలవలేక బరిలోంచి పారిపోతున్నారు
- పరోక్షంగా సోనియాని ఉద్దేశించి మోదీ విమర్శ

జైపూర్, ఏప్రిల్ 21: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే దేశ ప్రజల సంపదను ముస్లింలకు పంపిణీ చేస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆదివారం రాజస్థాన్‌లోని బన్స్వారాలో, జాలోర్ జిల్లాలో నిర్వహించిన ఎన్నికల ర్యాలీల్లో ఆయన పాల్గొని, ప్రసంగించారు. అర్బన్ నక్సల్ మనస్తత్వం కలిగిన ఆ పార్టీ నాయకులు మన తల్లులు, సోదరీమణుల మెడల్లోని మంగళసూత్రాలను కూడా వదలరని, వాళ్లు ఆ స్థాయికి కూడా వెళ్లగలరని మండిపడ్డారు. తల్లులు, సోదరీమణుల వద్ద ఉన్న బంగారాన్ని లెక్కపెట్టి, దాని గురించి పూర్తి సమాచారం సేకరిస్తామని, తర్వాత ఆ ఆస్తిని పంపిణీ చేస్తామని కాంగ్రెస్ మేనిఫెస్టోలో పేర్కొన్నారని తెలిపారు. ఈ దేశంలోని

మిగతా 12వ పేజీలో...

తడిసిన వడ్లన్నీ కొనాల్సిందే

- సర్కారు నిర్లక్ష్యం వల్లే ఈ దుస్థితి
- కేటీఆర్‌తో పొన్నం కుమ్మక్కు: బండి సంజయ్
- సిరిసిల్ల జిల్లా వీర్నపల్లిలో కొనుగోలు కేంద్రాల పరిశీలన

2

కాంగ్రెస్ పార్టీది ముస్లిం లీగ్ మేనిఫెస్టో

- కుల, మతాలతో ప్రజల్ని రెచ్చగొట్టి ఓట్లు పొందాలనేది ఆ పార్టీ ప్రణాళిక
- వారి మేనిఫెస్టోలో అభివృద్ధి, సంక్షేమం శూన్యం
- నాణ్యమైన విద్య, పేదలకు పక్కా ఇళ్లు.. రైతు, మహిళా సంక్షేమానికి మోదీ గ్యారెంటీ: కిషన్‌రెడ్డి



అకాల వర్షాలతో 3,120 ఎకరాల్లో పంట నష్టం

- వ్యవసాయశాఖ ప్రాథమిక అంచనా
- పూర్తి నివేదిక అందగానే పరిహారం: తుమ్మల

హైదరాబాద్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా గడిచిన రెండు రోజుల్లో కురిసిన అకాల వర్షాలతో 3,120 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు రాష్ట్ర వ్యవసాయశాఖ ప్రాథమికంగా అంచనా వేసింది. ఈమేరకు ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. నారాయణపేట, నాగర్‌కర్నూల్, కామారెడ్డి, నిజామాబాద్, యాదాద్రి భువనగిరి, సిద్దిపేట జిల్లాల్లో 2,200 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు వ్యవసాయశాఖ అధికారులు తమ నివేదికలో పేర్కొన్నారు. వరి, మొక్కజొన్నతోపాటు ఉద్యాన పంటలు కూడా దెబ్బతిన్నట్లు తెలిపారు. రంగారెడ్డి, నిర్మల్, జనగామ జిల్లాల్లో కురిసిన అకాల వర్షాలకు 920 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు మరో నివేదికలో పేర్కొన్నారు. అంటే రెండు రోజుల్లో కలిపి 3,120 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు అధికారులు ప్రభుత్వానికి సమాచారం ఇచ్చారు. మెదక్, పెద్దపల్లి, వనపర్తి, జగిత్యాల, వికారాబాద్, జయశంకర్ భూపాలపల్లి,

మిగతా 3వ పేజీలో...

రాంచీలో జరిగిన ఉల్‌గుల్ న్యాయ్ మహార్యాలీ సభలో కేజ్రీవాల్, హేమంత్ సోరెన్ కోసం కేటాయించిన కుర్చీలు



బీజేపీని సాగనంపండి

ఓటర్లకు 'ఇండియా' కూటమి నేతల పిలుపు

- గిరిజనులను బీజేపీ అంటరానివారిలా చూస్తోంది
- అయోధ్య, పార్లమెంట్ భవన ప్రారంభాలకు ఆహ్వానించకుండా రాష్ట్రపతి ముర్మును అవమానించింది
- రాజ్యాంగాన్ని మార్చే యత్నాలను అడ్డుకుంటాం
- 150-180 స్థానాలకే బీజేపీ పరిమితం
- ఝార్ఖండ్ ర్యాలీలో కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే
- నా భర్తను జైల్లో చంపాలని చూస్తున్నారు: కేజ్రీ భార్య
- ప్రజాస్వామ్యాన్ని ఓడనివ్వొద్దు: జైల్ నుంచి సోరెన్ లేఖ
- అస్వస్థతతో హాజరు కాని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్
- రాముడు అందరివాడు: ఫరూఖ్ అబ్దుల్లా

రాంచీ, ఏప్రిల్ 21: బీజేపీకి అధికారం నుంచి నిష్క్రమించే మార్గాన్ని చూపాలని 'ఇండియా' కూటమి నేతలు ముక్తకంఠంతో ఓటర్లను కోరారు. కేంద్ర సంస్థలతో విపక్షాలను అణగదొక్కాలని చూస్తున్న మోదీ సర్కారుకు లోక్‌సభ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఝార్ఖండ్ రాజధాని రాంచీలో ఆదివారం జరిగిన 'ఉల్‌గుల్(మహోద్యమం) న్యాయ్ మహార్యాలీ', భారీ బహిరంగ సభలో వారు మాట్లాడారు. కేంద్రం బెదిరింపులకు తలొగ్గకుండా.. ఇండియా కూటమిని

మిగతా 12వ పేజీలో...

14 స్థానాల హస్తగతానికి..

- రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాచరణ
- అంతా తానై నడిపిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి
- ఒక్కో స్థానంలో మూడు దఫాలుగా పర్యటన
- బహిరంగ సభలు, రోడ్డు షోలకు ప్రణాళికలు
- మోదీ వైఫల్యాలపైనే ప్రధానంగా ప్రచారం
- వంద రోజుల్లో అమలు చేసిన గ్యారెంటీలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కేడర్‌కు దిశా నిర్దేశం
- మంత్రులు, ముఖ్య నేతలకు ఇన్‌చార్జి బాధ్యతలు

హైదరాబాద్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఎక్కడికక్కడ గ్రూపులు.. ముఖ్య నేతల కొట్లాటలు.. నాయకులకు, పార్టీ శ్రేణులకు మధ్య సమన్వయ లోపం.. ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా వ్యవహార శైలి... ఇదీ ఒకప్పుడు రాష్ట్రంలో కాంగ్రెస్ పరిస్థితి. కానీ.. ఇప్పుడు ఆ పార్టీ తీరు పూర్తిగా మారిపోయింది. ప్రత్యర్థి పార్టీలకు దీటుగా వ్యూహ, ప్రతివ్యూహాలు రచించడం.. ఇప్పటిదాకా అమలు చేసిన పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడం.. విపక్ష నేతల విమర్శలను తిప్పికొట్టడం.. ఇలా ఒకటీ, రెండు కాదు.. అన్ని అంశాల్లోనూ పైచేయి



మిగతా 2వ పేజీలో...



అనుమతుల్లో మహా వేగం!

- ఐదు నెలల్లో 827 భవన నిర్మాణ అనుమతులు
- ప్రస్తుతానికి ఆన్‌లైన్ ఫైళ్ల సత్వర పరిష్కారం
- ఆఫ్‌లైన్ దరఖాస్తుల పెండింగ్
- టీఎస్‌బీపాస్‌లో పొందుపరచి పునఃపరిశీలన
- అప్‌లోడింగ్ ప్రక్రియ షురూ చేసిన హెచ్‌ఎండీఏ

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): రాజధాని మహానగర (హైదరాబాద్) విస్తరణ, అభివృద్ధిలో కీలకమైన హెచ్‌ఎండీఏలో.. భవన నిర్మాణ అనుమతులు జోరందుకున్నాయి. గడిచిన ఐదు నెలల్లో 827 భవన నిర్మాణాలకు అనుమతులు వచ్చాయి. ప్రతి గురువారం మల్టీ స్టోర్ బిల్డింగ్ (ఎంఎస్‌బీ) కమిటీ సమావేశాలను జరుపుతూ.. బహుళ అంతస్తుల భవన నిర్మాణ అనుమతులను త్వరితగతిన జారీ చేసేందుకు హెచ్‌ఎండీఏ చర్యలు చేపట్టింది. రాష్ట్రంలో కొత్త సర్కారు వచ్చాక భవన నిర్మాణ అనుమతుల్లో జాప్యం జరుగుతోందంటూ రాజకీయ విమర్శలు వస్తున్న సంగతి తెలిసిందే. కొత్త ప్రభుత్వం కొలువుదీరడం.. హెచ్‌ఎండీఏలో కీలక అధికారులకు

మిగతా 14వ పేజీలో...



ఉరేసుకున్న నాగరాజు; (ఇన్‌సెట్) బాలుడు శేఖర్ (ఫైల్)

బాలుడిని చంపి..టవర్ ఎక్కి ఉరేసుకున్న దొంగ

- దొంగతనాన్ని చూశాడనే గొంతు నులిమి చిన్నారి హత్య
- మరో వ్యాపారిపై దాడి.. ఆపై, సెల్‌టవర్ ఎక్కి రాత్రంతా అక్కడే.. ఉదయం ఆత్మహత్య
- జోగిపేటలో ఓ ఉన్మాది క్రైమ్ కథాంతం

3



'జై భవాని', 'హిందూ' తొలగించం

- పార్టీ గేయాన్ని మార్చబోం.. ఈసీకి స్పష్టం చేసిన ఉద్ధవ్
- 'జై బజరంగబలీ' అని నినదిస్తూ ఓటేయాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చినప్పుడు మీరేం చేశారు?
- ఉచిత అయోధ్య యాత్రకు బీజేపీకి ఓటేయాలని షా అడగలేదా?
- మతం పేరుతో ఓట్లడిగేందుకు వీలుగా చట్టాలు మార్చేశారా?
- ఎన్నికల సంఘానికి ఉద్ధవ్ ఠాక్రే ప్రశ్నలు

12

మోదీ పాలనలో రైలు ప్రయాణం ఓ శిక్షే

- రైల్వేను కాపాడాలంటే ఆయనను గద్దె దించాలి
- కిక్కిరిసిన కేరళ ఎక్స్‌ప్రెస్ వీడియోతో రాహుల్ ట్వీట్



ఎవరెస్ట్, ఎండీహెచ్ మసాలాల్లో క్యాన్సర్ కారకాలు!

- ఈ రెండు సంస్థలకు చెందిన నాలుగు ఉత్పత్తుల్లో ఇథిలీన్ ఆక్సైడ్
- హాంకాంగ్ ప్రభుత్వ సంస్థ వెల్లడి
- ఆ ఉత్పత్తుల ఉపసంహరణ

14

సామాన్యుల కోసం బీజేపీ చేసిందేమీ లేదు

- అప్పులు తప్ప అభివృద్ధి చేయని బీఆర్ఎస్: మంత్రి సీతక్క



ముథోల్, ఏప్రిల్ 21: పదేళ్ల కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ బడా పారిశ్రామికవేత్తలకు తప్ప సామాన్యుల కోసం చేసిందేమీ లేదని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి, మంత్రి సీతక్క అన్నారు. ఆదివారం నిర్మల్ జిల్లాలోని ముథోల్ నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. బీజేపీ హయాంలో కేవలం అదానీ, అంబానీలే తప్ప రైతులు, సామాన్య ప్రజలు అభివృద్ధి చెందలేదని ఆరోపించారు. జిల్లాలోని సిమెంట్ ఫ్యాక్టరీని తెరువలేదని, ఆదిలాబాద్ నుంచి ఆర్మూర్ వరకు రైల్వేలైన్‌ను, బాసరలో కేంద్రీయ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయలేదని విమర్శించారు. బాసర ట్రిపుల్ ఐటీలో విద్యార్థుల సమస్యలను ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. జీఎస్టీని పెంచి పేదవారిని ఇబ్బందులు పెట్టిందని, నిత్యావసరాల ధరలను పెంచిందని దుయ్యబట్టారు. రాష్ట్రంలో పది సంవత్సరాలు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ అభివృద్ధి చేయలేదు కానీ అప్పులు మాత్రం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ నియోజకవర్గ అభ్యర్థి ఆత్రం సుగుణను ఆశీర్వదించి, గెలిపించాలని కోరారు.

ఉద్యమంలో వినోద్‌ది చురుకైన పాత్ర: కేటీఆర్



హైదరాబాద్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమంలో కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌ది చురుకైన పాత్ర అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. టీఆర్ఎస్ వ్యవస్థాపక సభ్యుల్లో వినోద్ కూడా ఒకరని, తెలంగాణకు అనుకూలంగా పార్లమెంట్‌లో 32 పార్టీలు లేఖలు ఇవ్వడంలో ఆయన ముఖ్యపాత్ర పోషించారని ఆదివారం ఎక్స్ వేదికగా కేటీఆర్ తెలిపారు. "2014లో కరీంనగర్ ఎంపీగా గెలిచిన వినోద్‌కుమార్ నియోజకవర్గం అభివృద్ధి కోసం పనిచేశారు. కరీంనగర్ పట్టణం స్మార్ట్‌సిటీ ప్రాజెక్టుకు ఎంపిక కావడంలో, జాతీయ రహదారులు, రైల్వే లైన్లు తీసుకురావడంలో ఆయన కీలకపాత్ర పోషించారు. పార్లమెంట్‌లో అత్యధిక ప్రశ్నలు వేసిన ఎంపీల్లో రెండోస్థానంలో నిలిచారు" అని పేర్కొన్నారు. కరీంనగర్ అభివృద్ధి, సమస్యల పరిష్కారం కోసం వినోద్‌ను గెలిపించాల్సిన అవసరం ఎంతైనా ఉందని కేటీఆర్ అన్నారు.

హామీలు అమలు చేయలేకే కాంగ్రెస్ దుష్ప్రచారం

- తుమ్మలపై దాడికి వ్యూహంపై విచారణ జరిపించాలి
- బీఆర్ఎస్ నేతలు నామా, వద్దిరాజు, పువ్వాడ

ఖమ్మం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం ఆ హామీలను అమలు చేయలేక డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతోందని బీఆర్ఎస్ లోక్‌సభ పక్ష నేత నామా నాగేశ్వరరావు, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీమంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావుపై దాడికి వ్యూహం జరిగిందన్న విషయంపై ప్రభుత్వం పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఖమ్మం బీఆర్ఎస్ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 'కాంగ్రెస్ 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చింది. గడిచిన 120 రోజుల్లో ఇచ్చిన హామీలు ఏవీ అమలు చేయకపోవడంతో ప్రజలు వ్యతిరేకతతో ఉన్నారని గుర్తించింది. లోక్‌సభ ఎన్నికల్లో ప్రజల దృష్టి మళ్లించేందుకు ఫోన్‌ట్యాపింగ్‌లు, దాడులకు వ్యూహాలు వంటి అంశాలను ప్రచారంలోకి తీసుకొస్తున్నారు' అని వారు ఆరోపించారు. ఖమ్మంలో సుపారీలు ఇచ్చి దాడులు చేయించే సంస్కృతి లేదన్నారు. ప్రస్తుతం ముగ్గురు మంత్రులున్న ఖమ్మం జిల్లాలో సమస్యలు పరిష్కరించలేకపోతున్నారని విమర్శించారు. సాగు, తాగునీటి సమస్యలు జిల్లాలో అధికంగా ఉన్నాయన్నారు. ఖమ్మం లోక్‌సభ అభ్యర్థి ఎవరో కూడా తేల్చుకోలేని పరిస్థితిలో కాంగ్రెస్ ఉందని విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎక్కువ స్థానాల్లో విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. నారాయణఖేడ్ జిల్లా సింగారంతండాలో బీఆర్ఎస్ కార్యకర్త శ్రీనునాయక్‌ను కాంగ్రెస్ కార్యకర్తలు హత్యచేయడాన్ని ఖండించారు.

పైరవీలకు అడ్డాగా సచివాలయం: కేపీ వివేకానంద

హైదరాబాద్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పాలన వచ్చాక సచివాలయం, ప్రభుత్వ కార్యాలయాలు, ముఖ్యమంత్రి నివాసం పైరవీలకు అడ్డాగా మారాయని, తమ ప్రభుత్వంలో పైరవీలకు తావు ఉండేది కాదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద అన్నారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి తమ ఎమ్మెల్యేలను నియంత్రించలేకపోతున్నారని, ఆయన నాయకత్వాన్ని పార్టీ సీనియర్లు పలువురు వ్యతిరేకిస్తున్నారన్నారు. ఈ పరిస్థితిలో కాంగ్రెస్ అత్యధిక ఎంపీ స్థానాలు గెలవకపోతే సీఎం కుర్చీ పోతుందని రేవంత్ భయపడుతున్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన దానం నాగేందర్, కడియం శ్రీహరి, గడ్డం రంజిత్‌రెడ్డిపై ఆ పార్టీ క్యాడర్ తిరుగుబాటు చేస్తోందన్నారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత చోటుచేసుకునే రాజకీయ మార్పుల దృష్ట్యా కాంగ్రెస్ ఎమ్మెల్యేలను రక్షించుకునేందుకు రేవంత్ తాపత్రయపడుతున్నారని, కొద్ది రోజుల్లోనే బండారం బయటపడుతుందని జోస్యం చెప్పారు.

వెంకట్రామిరెడ్డి మమ్మల్ని నిండా ముంచారు

- మల్లన్నసాగర్ నిర్వాసితులను గోస పెట్టారు
- భూ నిర్వాసితులు హయతోద్దీన్, శ్రీనివాస్‌రెడ్డి

గజ్వేల్, ఏప్రిల్ 21: బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి చట్టసభలకు వెళ్లే అర్హత లేదని మల్లన్నసాగర్ భూ నిర్వాసితులు హయతోద్దీన్, శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కలెక్టర్‌గా పనిచేసిన ఆయన మల్లన్న సాగర్ భూ నిర్వాసితుల విషయంలో చట్టాలను పాటించలేదని, న్యాయస్థానాలను పట్టించుకోలేదని ఆరోపించారు. ఆనాటి ప్రభుత్వాధినేత దృష్టిలో పడటానికే ప్రయత్నాలు చేస్తూ.. నిర్వాసితులను నిండా ముంచారని విమర్శించారు. గజ్వేల్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. కొవిడ్ సమయంలో భూ నిర్వాసితులు కల్లు తాగడానికి వెళితే డీజిల్ దొంగతనం.. ధాన్యం ఎండబోస్తే నాన్‌బెయిలబుల్ కేసులు పెట్టించి వెంకట్రామిరెడ్డి వేధించారని మండిపడ్డారు. నిర్వాసితుల ప్రాణాలు తీసేందుకు ప్రయత్నిస్తే.. గతంలో మానవ హక్కుల కమిషన్‌లో కేసులు పెట్టామని గుర్తుచేశారు. ఆయన అకృత్యాలను త్వరలోనే బయటపెడతామని తెలిపారు. నిర్వాసితుల సమస్యలు ఎక్కడివక్కడే ఉన్నాయని చెప్పారు. తమను తాత్కాలికంగా డబుల్ బెడ్‌రూం ఇళ్లలో ఉంచారని.. ఇప్పటికీ ప్లాట్ ఇవ్వలేదని పేర్కొన్నారు. అద్భుతమైన కాలనీ కట్టామని మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతున్నారని.. అందరినీ ఒకేచోట చేర్చి.. నిర్వాసితులకు ఉపాధి లేకుండా చేశారని చెప్పారు. కాలనీలో దుర్భర పరిస్థితులు ఉన్నాయని, ఇళ్లు కూలుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

మాదిగలను మోసం చేసిన కాంగ్రెస్

- వర్గీకరణపై మాట ఇచ్చి నిలబెట్టుకోలేదు: మంద కృష్ణ
- ఎస్సీ వర్గీకరణకు బీజేపీ కట్టుబడి ఉంది: డీకే అరుణ

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 21: ఎస్సీ వర్గీకరణ విషయంలో కాంగ్రెస్ పార్టీ మాదిగలను మోసం చేసిందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఆరోపించారు. మహబూబ్‌నగర్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీజేపీ అభ్యర్థి డీకే అరుణతో కలిసి ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో 2013లో సోనియాగాంధీ మాట ఇచ్చి నిలబెట్టుకోలేదని విమర్శించారు. ఇప్పుడు రాహుల్‌గాంధీ ప్రధాని అయినా మాదిగలను న్యాయం జరగదన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా మాదిగలను మోసం చేస్తూనే ఉందని ఆరోపించారు. షెడ్యూల్డ్ కులాల వర్గీకరణ కోసం ప్రధాని మోదీ భరోసా ఇవ్వడం సంతోషకరమని, మాటిస్తే నిలబెట్టుకోవడంలో మోదీని మించిన వారు లేరని అన్నారు. రామమందిరం నిర్మాణం, ఆర్టికల్ 370 రద్దు విషయంలో ఈ విషయం నిరూపితమైందన్నారు. మళ్లీ మోదీ ప్రధాని అయితే వర్గీకరణ సమస్య పరిష్కారం అవుతుందని పేర్కొన్నారు. మాదిగను సీఎంను చేస్తానని కేసీఆర్ నమ్మించి మోసం చేశారని దుయ్యబట్టారు. ఎస్సీ వర్గీకరణతోనే మాదిగలు అభివృద్ధి చెందుతారని డీకే అరుణ అన్నారు. అందుకోసం 30 ఏళ్లుగా మందకృష్ణ పోరాడుతూనే ఉన్నారని, ఈ సమస్యను ప్రధాని మోదీ దృష్టికి కిషన్ రెడ్డి తీసుకెళ్లారని తెలిపారు. ఎస్సీ వర్గీకరణకు బీజేపీ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

14 స్థానాల హస్తగతానికి..

(మొదటి పేజీ తరువాయి)

సాధిస్తోంది. ఆరు గ్యారెంటీల్లో చాలా పథకాలు అమలు చేస్తున్నామని, ఆగస్టు 15కల్లా రుణమాఫీ సైతం అమలు చేస్తామని ప్రకటించడం ద్వారా.. ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని విస్మరించబోమన్న సంకేతాలు ఇస్తోంది. రాష్ట్రంలో 17లోక్ సభ స్థానాలు ఉండగా.. కనీసం 14 చోట్ల గెలుపే లక్ష్యంగా ప్రచార పర్వంలో కాంగ్రెస్ దూసుకుపోతోంది. ఇండియా కూటమి అధికారంలోకి రావాలన్నా, రాష్ట్రంలో ప్రభుత్వం సుస్థిరంగా కొనసాగాలన్నా.. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో అత్యధిక సీట్లు సాధించాలని ఆ పార్టీ భావిస్తోంది. ఈ మేరకు రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికలను సవాల్‌గా తీసుకున్న సీఎం రేవంత్‌రెడ్డి.. అన్నీ తానై వ్యూహాలు రచిస్తున్నారు. దీనికి తోడు ఎవరెలా పని చేస్తున్నారన్న దానిపై అధిష్ఠానం ఓ కన్నేసి ఉంచడంతో.. తమకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించిన నియోజకవర్గాల్లో పూర్తిగా దృష్టి పెడుతున్నారు. ఖమ్మం, నల్లగొండ, మహబూబాబాద్ వంటి స్థానాల్లో గెలుస్తామని పూర్తి భరోసా ఉన్నా.. ఏ స్థానాన్నీ తేలికగా తీసుకోకూడదని కాంగ్రెస్ నాయకత్వం భావిస్తోంది. గట్టి పోటీ ఉన్న నియోజకవర్గాల్లో ఎలాంటి కార్యాచరణ అమలు చేస్తామో.. ఈ స్థానాల్లోనూ అంతే కష్టపడి పని చేయాలని కేడర్‌కు దిశానిర్దేశం చేస్తోంది. అసెంబ్లీ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో బీఆర్ఎస్ పోటీ నామమాత్రమేనన్న అంచనాకు వచ్చిన కాంగ్రెస్ నేతలు.. మెజారిటీ స్థానాల్లో బీజేపీతోనే ముఖాముఖి పోటీ ఉంటుందని భావిస్తున్నారు. ఇటీవల పార్టీ అభ్యర్థులు, నియోజకవర్గ ఇన్‌చార్జిలతో భేటీ అయిన ఏఐసీసీ సంస్థాగత ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ సైతం.. బీఆర్ఎస్ పని అయిపోయిందని, బీజేపీనే టార్గెట్ చేయాలని సూచించారు. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి సహా పార్టీ నాయకులందరూ బీజేపీనే టార్గెట్ చేసుకుని విమర్శలు పెంచారు. బీఆర్ఎస్‌పై విమర్శలు చేస్తున్నా.. లోక్‌సభ ఎన్నికల తర్వాత ఆ పార్టీకి ఉనికి ఉండదన్న తరహాలోనే మాట్లాడుతున్నారు. ఆ పార్టీని ప్రధాన ప్రత్యర్థిగా పరిగణనలోకి తీసుకోవట్లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం పడిపోతుందని బీఆర్ఎస్ నాయకత్వం ప్రకటించిన ప్రతి సారీ.. ఆ పార్టీ ఎమ్మెల్యేనో, ముఖ్య నేతో తమ పార్టీలో కనిపించేలా చర్యలు తీసుకుంటోంది.

మోదీ వైఫల్యాలే అస్త్రాలుగా


రాష్ట్రంలో వంద రోజుల్లోనే ఐదు గ్యారెంటీలను అమలు చేసిన తీరును వివరించడమే కాకుండా... హామీల అమల్లో మోదీ ప్రభుత్వ వైఫల్యాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లే కార్యాచరణను కాంగ్రెస్ అమలు చేస్తోంది. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలని చెప్పిన మోదీ.. పదేళ్లలో ఇచ్చింది 7.21 లక్షల ఉద్యోగాలేనని, ఎన్నికల ముందు హామీ ఇచ్చినట్లుగా పేదల ఖాతాల్లో రూ.15 లక్షలు జమ కాలేదని.. తన ప్రసంగాల్లో సీఎం రేవంత్ గుర్తు చేస్తున్నారు. ముఖ్యంగా విభజన చట్టంలో యూపీఏ ప్రభుత్వం పొందుపరిచిన హామీలనూ అమలు చేయని వైనాన్ని ప్రజలకు వివరిస్తున్నారు. అదే సమయంలో ఇచ్చిన హామీ మేరకు తమ ప్రభుత్వం వంద రోజుల్లో ఐదు గ్యారెంటీలను అమలు చేసిందని, కేంద్రంలోనూ అధికారం ఇస్తే పాంచ్ న్యాయ్ గ్యారెంటీలనూ అమలు చేస్తుందని చెబుతున్నారు. ఇక, రైతులకు రూ.2 లక్షల రుణమాఫీపై ఉన్న గందరగోళానికి తెరదించుతూ ఆగస్టు 15 కల్లా రుణమాఫీ అమలు పూచీ తనదని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టమైన ప్రకటన చేశారు.

అంతా తానై రేవంత్ ప్రచారం

రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల కార్యాచరణను అంతా తానై నడిపిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి.. అభ్యర్థుల తరఫున ప్రచారాన్నీ తన భుజస్కంధాలపైనే వేసుకున్నారు. రాష్ట్రంలోని 17 నియోజకవర్గాల్లోనూ సభలు, కార్నర్ మీటింగ్‌లు, రోడ్‌షోలకు హాజరయ్యేలా ప్రణాళికలు రచించారు. ఒక్కో నియోజకవర్గంలో కనీసం 3 కార్యక్రమాలు ఉండేలా ప్లాన్ చేశారు. ఇప్పటికే మహబూబ్‌నగర్, మహబూబాబాద్, మెదక్, భువనగిరి అభ్యర్థుల తరఫున ఒక దఫా సభల్లో పాల్గొన్నారు. అలాగే, రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీతో ప్రచారం చేయించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ మేరకు మే నెల మొదటి వారంలో నల్లగొండ, భువనగిరిలో ప్రియాంక రోడ్‌షో ఉంటుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

క్షేత్ర స్థాయిలో కార్యకర్తలకు బాధ్యతలు

పోల్ మేనేజ్‌మెంట్‌పై కాంగ్రెస్ ప్రధానంగా దృష్టి పెట్టింది. కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలు, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న, అధికారంలోకి వస్తే ఇండియా కూటమి అమలు చేయనున్న గ్యారెంటీలను ప్రతి ఓటరును కలిసి వివరించేందుకు బూత్ స్థాయి నుంచి అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి వరకు ఓ వ్యవస్థను ఏర్పాటు చేసింది. మండల, నియోజకవర్గ సమన్వయకర్తల భాగస్వామ్యంతో ఈ కార్యాచరణను అమలు చేసే ప్రధాన బాధ్యతను బూత్‌స్థాయి నేతలకు అప్పగించింది. బూత్ స్థాయిలో బాగా పని చేసిన వారికి గ్రామ, మండల స్థాయిల్లో పదవులు, కమిటీ సభ్యత్వాల్లో ప్రాధాన్యం ఇస్తామని ఇప్పటికే సంకేతాలు ఇచ్చింది. ఓటరును పోలింగ్ బూత్ వరకు తీసుకువచ్చి ఓటేయించే బాధ్యతను వారికే అప్పజెప్పింది.



ఉష్ణోగ్రతలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	42.3	27.2
ఖమ్మం	41.0	27.0
నల్లగొండ	41.0	25.2

మాధవీలతపై కేసు నమోదు

అఫ్జల్‌గంజ్: హైదరాబాద్ బీజేపీ లోక్‌సభ అభ్యర్థి మాధవీలతపై కేసు నమోదైంది. ప్రచారంలో ఓ వర్గం మనోభావాలు దెబ్బతీసేలా ప్రవర్తించారంటూ 'ఫస్ట్ లాన్సర్' సంస్థకు చెందిన ఇమ్రాన్ షేక్ చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు బేగంబజార్ పోలీసులు తెలిపారు. 'ఈనెల 17న సిద్ధి అంబర్ బజార్ వద్ద మాధవీలత ఓ మసీదుపై బాణం ఎక్కుపెట్టి వదులుతున్నట్లు అభినయించారు. ఇది ముస్లింల మనోభావాలను దెబ్బతీయడమే'నని ఇమ్రాన్ ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని బేగంబజార్ ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్ తెలిపారు.

క్రికెట్ టీమ్‌లా పని చేస్తున్నాం

- సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో 11 మంది మంత్రులం జట్టుగా ఉన్నాం
- మా ఎమ్మెల్యేలు కేసీఆర్‌కు టచ్‌లో లేరు
- ఉన్నారని చెప్పడం ఈ దశాబ్దపు జోక్
- నిస్పృహలో కేసీఆర్ చిల్లర మాటలు
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ సభలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

హుజూర్‌నగర్, ఏప్రిల్ 21: రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో 11మంది మంత్రులం మంచి క్రికెట్ టీమ్‌లా పనిచేస్తున్నామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లోని రాజీవ్‌గాంధీ ప్రాంగణంలో నిర్వహించిన నియోజకవర్గ ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ నిస్పృహలో ఉన్నారని, సిగ్గు, లజ్జ లేకుండా ఏది పడితే అది మాట్లాడుతున్నారని విమర్శించారు. ఆయన చిల్లర మాటలు పట్టించుకోవద్దన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో ఉండి మంచి పరిపాలన చేస్తుంటే, 25 మంది ఎమ్మెల్యేలు తనతో టచ్‌లో ఉన్నారని కేసీఆర్ చెప్పడం దశాబ్దపు జోక్ అని ఎద్దేవా చేశారు. రూ.లక్ష కోట్లతో కేసీఆర్ కట్టిన కాళేశ్వరం నాలుగేళ్లలో కూలిపోయిందని, ఆయన సాగర్ ప్రాజెక్ట్ గురించి, నీళ్ల గురించి, కరువు గురించి మాట్లాడడం సిగ్గుచేటన్నారు. రైతులకు అన్యాయం చేసిన కేసీఆర్.. ఇప్పుడు రైతుల గురించి పర్యటన చేయడానికి సిగ్గు, శరం ఉండాలన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీలకు డిపాజిట్ రాకుండా చేయాలన్నారు. రాష్ట్రంలో ఏడు వేల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని, కనీస మద్దతు ధర కంటే తక్కువకు ధాన్యం కొంటే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రైతులకు రూ.500బోనస్ కచ్చితంగా అందిస్తామన్నారు. దేశంలో ఇండియా కూటమి అత్యధిక స్థానాలు గెలుచుకుని అధికారంలోకి రాబోతుందన్నారు. జూన్ 9న రాహుల్ గాంధీ ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారన్నారు. రాజ్యాంగాన్ని, రాజ్యాంగ సంస్థలను మోదీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందన్నారు. దేశంలోని మీడియాను అణచివేస్తోందన్నారు. పార్లమెంటులో 145 మంది ఎంపీలను సస్పెండ్ చేసి మోదీ నిరంకుశంగా వ్యవహరించారన్నారు. న్యాయ వ్యవస్థపై ఒత్తిడి తెస్తున్నారని, కార్యనిర్వాహక వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. మోదీ మళ్లీ గెలిస్తే ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుందన్నారు. ఇండియా కూటమిలో కమ్యూనిస్టుల పాత్ర కీలకమని, తెలంగాణలో సీపీఐ, సీపీఎం మద్దతు ఇవ్వడం ఎంతో గర్వకారణమన్నారు.

త్వరలోనే సింగరేణిలో కొత్త గనుల తవ్వకాలు

- రామగుండం నుంచే కార్మికుల సొంతింటి కల నెరవేరుస్తాం: మంత్రి దుద్దిళ్ల



గోదావరిఖని, ఏప్రిల్ 21: తెలంగాణ కొంగు బంగారమైన సింగరేణిలో త్వరలోనే కొత్త గనుల తవ్వకాలు చేపడుతామని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. ఆదివారం పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో జరిగిన సన్నాహక సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పదేళ్ల కాలంలో బీఆర్ఎస్, బీజేపీ కార్మికులకు చేసిందేమి లేదని, కార్మికుల సమస్యలు పరిష్కరించిన పాపానపోలేదని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో డిపెండెంట్ ఉద్యోగాల కోసం లక్షల రూపాయలు కార్మికుల నుంచి వసూలు చేశారని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత వాటిని పారదర్శకంగా ఇస్తున్నామని చెప్పారు. వైఎస్సార్ హయాంలో 17వేల ఇళ్లకు పట్టాలు ఇచ్చామని, మిగిలిన కార్మికుల సొంతింటి కలను రామగుండం నుంచే నెరవేరుస్తామని తెలిపారు. ప్రమాదంలో మృతిచెందిన కార్మిక కుటుంబానికి రూ.కోటి ఎక్స్‌గ్రేషియాను కాంగ్రెస్ ప్రభుత్వమే ఇచ్చిందని గుర్తుచేశారు. రాష్ట్రంలో నిరుద్యోగాన్ని రూపుమాపడం కోసం ఐటీ పార్కులను ఏర్పాటు చేసి, ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. సింగరేణిలో పదవీ విరమణ పొందిన కార్మికులకు సూపర్ స్పెషాలిటీ వైద్యం అందించేందుకు చర్యలు చేపడుతున్నట్టు చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లోనూ కోల్‌బెల్ట్‌లోని ప్రజలు బీఆర్ఎస్‌కు బుద్ధి చెప్పాలని ఆయన కోరారు. పెద్దపల్లిలో గడ్డం వంశీకృష్ణను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి, ప్రభుత్వ సలహాదారు హర్కార వేణుగోపాల్‌రావు, ఎమ్మెల్యేలు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, ప్రేమ్‌సాగర్‌రావు, వివేక్, గడ్డం వినోద్, ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీ పాల్గొన్నారు.

తడిసిన వడ్లన్నీ కొనాల్సిందే

సర్కార్ నిర్లక్ష్యం వల్లే వడ్లు తడిచాయి.. కాంగ్రెస్ పార్టీని చూస్తే జాలేస్తోంది

- సంక్షోభంలో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ
- కేటీఆర్‌తో మంత్రి పొన్నం కుమ్మక్కు
- నూలు అక్రమ కొనుగోళ్లపై తక్షణమే విచారణ చేపట్టాలి: బండి సంజయ్

హైదరాబాద్/ సిరిసిల్ల, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలతో కొనుగోలు కేంద్రాల్లో తడిసిపోయిన వడ్లన్నీ ప్రభుత్వమే కొనాలని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ అభ్యర్థి బండి సంజయ్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే వేలాది క్వింటాళ్ల వడ్లు తడిసిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పాలనలో రైతులకు అన్యాయం జరిగిందని, ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో అంతకంటే ఎక్కువ మోసం జరుగుతోందని ధ్వజమెత్తారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10వేల పరిహారం ఇస్తామన్న కేసీఆర్, కేటీఆర్ మాటలు గాలికి ఎగిరిపోయాయని మండిపడ్డారు. కాంగ్రెస్ నేతలు కూడా కేసీఆర్ స్కూల్లోనే ట్రైనింగ్ తీసుకుని వచ్చినట్టున్నారని, దొంగ హామీలతో ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గంలోని పలు మండలాల్లో ఆదివారం బండి సంజయ్ ప్రచారం నిర్వహించారు. సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడుతూ జూన్ 4నాటికి ఎన్నికల కోడ్ ముగుస్తుందని, ఆ మరుసటి రోజే రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని ఎందుకు చెప్పడం లేదు? అని కాంగ్రెస్‌ను నిలదీశారు. ఎంపీ ఎన్నికల తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించి ఓట్లు దండుకుని, రుణమాఫీ హామీని ఎగ్గొట్టాలన్నది ఆ పార్టీ ఎత్తుగడ అని ఆరోపించారు. మద్దతు ధరపై రూ.500 బోనస్ ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, కానీ.. రాష్ట్రంలో ప్రస్తుతం మద్దతు ధర కన్నా రూ.500తక్కువకు రైతులు ధాన్యం అమ్ముకుంటున్నారని చెప్పారు.



సిరిసిల్ల జిల్లా వీర్నపల్లిలో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న సంజయ్

బీఆర్ఎస్, కాంగ్రెస్ కలిసి కుట్ర

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చే ఉద్దేశం గానీ, అవసరం గానీ బీజేపీకి లేదని బండి సంజయ్ స్పష్టం చేశారు. ప్రభుత్వాలను కూల్చడం కాంగ్రెస్ నాయకులకు వెన్నతో పెట్టిన విద్య అని వ్యాఖ్యానించారు. పాపం.. కాంగ్రెస్‌ను చూస్తే జాలేస్తోందని, లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీకి పోటీ చేసే అభ్యర్థులే దొరకట్లేదని ఎద్దేవా చేశారు. "రాముడిపై భక్తి ఉండాలి. కానీ.. రాముడి పేరు వింటేనే బీఆర్ఎస్, కాంగ్రెసోళ్లు భయపడిపోతున్నారు. అయోధ్య అక్షింతలను రేషన్ బియ్యం అనేటోళ్లను ఏమనాలె? బీఆర్ఎస్ గుడిని మింగే రకమయితే, కాంగ్రెస్ గుడిలోని లింగాన్ని కూడా మింగే రకం" అని నిప్పులు చెరిగారు. తనను ఓడించేందుకు బీఆర్ఎస్, కాంగ్రెస్ కలిసి కుమ్మక్కు కుట్రలకు తెరదీశాయన్నారు.

కేటీఆర్, మంత్రి పొన్నం కుమ్మక్కు

మాజీ మంత్రి కేటీఆర్, మంత్రి పొన్నం ప్రభాకర్ కుమ్మక్కై సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను సంక్షోభంలోకి నెట్టారని సంజయ్ ఆరోపించారు. యారన్ కొనుగోళ్లలో రూ.కోట్ల మేర దోపిడీ జరుగుతుంటే, నేతన్నలు నష్టపోతుంటే.. ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదు? అని నిలదీశారు. వస్త్ర పరిశ్రమ సంక్షోభానికి బాధ్యత వహించాల్సింది బీఆర్ఎస్సేనని అన్నారు. కేటీఆర్ మంత్రిగా ఉన్నప్పుడు కొన్ని కంపెనీల వద్ద నుంచే నూలు కొనుగోలు చేయాలని షరతు పెట్టారని, ఆ కారణంగానే నేతన్నలు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేటీఆర్‌తో కుమ్మక్కు కాలేదని నిరూపించుకోవాలన్నా.. చేనేత కార్మికుల సంక్షేమంపై ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా.. ఈ అంశాలపై విచారణ చేపట్టాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సవాల్ విసిరారు. చేనేత కార్మికులకు ఏడాదిపాటు ఉపాధికి ఇబ్బంది లేకుండా ఆర్డర్లు ఇవ్వాలని, పాత విద్యుత్ బకాయిలు మాఫీ చేయాలని, రూ.370కోట్లతో ప్రవేశపెట్టిన వర్కర్ టు ఓనర్ పథకాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు.

నాణ్యమైన విద్య, పేదలందరికీ ఇళ్లు

- యువత, రైతు, మహిళా సంక్షేమానికి కృషి
- 3 కోట్ల మందిని లక్షాధికారులను చేస్తాం
- కాంగ్రెస్‌ది ముస్లిం లీగ్ మ్యానిఫెస్టో
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి



హైదరాబాద్ శ్రీనగర్ కాలనీలో కిషన్‌రెడ్డికి హారతి ఇస్తున్న బీజేపీ కార్యకర్త

హైదరాబాద్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ ప్రభుత్వం 2047 నాటికి 'వికసిత్ భారత్' లక్ష్యంగా పనిచేస్తోందని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి తెలిపారు. తొమ్మిదిన్నరేళ్లలో మోదీ సర్కారు చేపట్టిన పథకాల ఫలాలు దేశ ప్రజలకు అందుతున్నాయని.. వచ్చే ఐదేళ్లలో మరింత అభివృద్ధి, సంక్షేమం సాధించే దిశగా కార్యక్రమాలు ఉంటాయని వెల్లడించారు. పార్టీ మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత వంద రోజుల కార్యాచరణకు సంబంధించిన ఎజెండాను జూన్ రెండో వారంలో వెల్లడిస్తామని చెప్పారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ మ్యానిఫెస్టో తెలుగు ప్రతిని కిషన్‌రెడ్డి, ఎంపీ లక్ష్మణ్ విడుదల చేశారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడారు. నాణ్యమైన విద్య, పేదలందరికీ ఇళ్లు మోదీ గ్యారెంటీ అని చెప్పారు. సేవ, సుపరిపాలన.. యువత, మహిళలు, రైతులు, పేదల సంక్షేమం.. సుస్థిర అభివృద్ధి ఎజెండాగా మోదీ గ్యారెంటీ పేరుతో బీజేపీ సంకల్ప పత్రాన్ని రూపొందించామని పేర్కొన్నారు. భారతదేశాన్ని ప్రపంచ మిల్లెట్ హబ్‌గా మారుస్తామని వెల్లడించారు. మూడు కోట్ల మంది గ్రామీణ మహిళలను లక్షాధికారులను చేస్తామని చెప్పారు. కీలక రంగాలకు నైపుణ్య శిక్షణను అందించడం ద్వారా స్వయం సహాయక బృందాల బలోపేతం చేస్తామని తెలిపారు. ప్రస్తుతం మనం ప్రపంచంలో ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్నామని.. భవిష్యత్తులో మూడో ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతామని పేర్కొన్నారు. దేశంలోని అన్ని వర్గాల భాగస్వామ్యంతో భారత్‌ను మళ్లీ విశ్వగురువును చేయడమే మోదీ గ్యారెంటీ అని వివరించారు. 3 దశాబ్దాల తర్వాత దేశానికి సుస్థిరమైన ప్రభుత్వాన్ని అందించామని తెలిపారు. ఉగ్రవాద దాడులు తగ్గిపోయాయని, నక్సలైట్ల భరతం పడుతున్నామని చెప్పారు. అవినీతిపరులు జైళ్లకు పోయారని.. అవినీతిపై ఉక్కుపాదం మోపుతున్నామని తెలిపారు. కాంగ్రెస్ గత 70 ఏళ్లలో దేశ వ్యాప్తంగా చేసిన అన్యాయాలు, అక్రమాలు, అవినీతి, బంధుప్రీతిని తాము సరిదిద్దుతున్నామని చెప్పారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టో.. ముస్లిం లీగ్ మ్యానిఫెస్టోలా ఉందన్నారు. కులం, మతం, వర్గాలవారీగా రెచ్చగొట్టి ఓట్లు పొందేలా ఆ మ్యానిఫెస్టో తీసుకొచ్చారని మండిపడ్డారు.

కాంగ్రెస్‌వి ఓటు బ్యాంకు రాజకీయాలు

కాంగ్రెస్‌వి ఓటు బ్యాంకు రాజకీయాలని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ విమర్శించారు. కులం, మతం, ప్రాంతం పేరుతో ప్రజలను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందేందుకు.. ఓటు బ్యాంకు రాజకీయాలకు ముడిపెట్టిన పత్రమే రాహుల్ గాంధీ 'అన్యాయ'పత్రం అని పేర్కొన్నారు. వికసిత్ భారత్ కోసం బీజేపీ పాటుపడుతుంటే.. విభజన భారత్ కోసం కాంగ్రెస్ కుట్రలు పన్నుతోందని విమర్శించారు. కాంగ్రెస్ న్యాయపత్రం బ్రిటీషర్లు అనుసరించిన విభజించు-పాలించు మాదిరిగా ఉందని విమర్శించారు. తెలంగాణలో 100 రోజుల్లో 6 గ్యారెంటీలు అమలు చేస్తామని ప్రజలను మోసం చేశారని.. ఇప్పుడు రాహుల్ గాంధీని ప్రధానిని చేస్తేనే హామీల అమలంటూ మరోసారి మభ్యపెడుతున్నారని మండిపడ్డారు. వికసిత్ భారత్ లక్ష్యంగా మోదీ సంకల్ప పత్రాన్ని ప్రవేశపెట్టారని లక్ష్మణ్ తెలిపారు. కాగా, కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఈ నెల 25న బాన్సువాడ వస్తున్నారని బీజేపీ వర్గాలు తెలిపాయి.

బాలుడిని చంపి.. టవర్ ఎక్కి ఉరేసుకున్న దొంగ

- దొంగతనానికి సాక్ష్యంగా ఉన్నాడని హత్య
- ఆపై, సెల్‌టవర్ ఎక్కి రాత్రంతా అక్కడే
- ఆదివారం ఉదయం ఆత్మహత్య


నాగరాజు, తీవ్రగాయాల పాలైన అయిత ప్రకాశ్

జోగిపేట, ఏప్రిల్ 21: వ్యాపారులను బెదిరించి డబ్బు వసూళ్లకు పాల్పడే ఓ వ్యక్తి ఓ దుకాణంలో దొంగతనం చేశాడు. ఆ దొంగతనాన్ని చూశాడని ఓ పన్నెండేళ్ల బాలుడిని అత్యంత దారుణంగా చంపాడు. ఆపై, డబ్బు కోసం మరో చిరు వ్యాపారిపై హత్యాయత్నం చేశాడు. అనంతరం మద్యం మత్తులో సెల్‌టవర్ ఎక్కి, రాత్రింతా అక్కడే గడిపాడు. మద్యం మత్తు దిగో.. చేసిన తప్పులకు భయపడో చివరికి అదే సెల్ టవర్‌పై ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సంగారెడ్డి జిల్లా జోగిపేటలో జరిగిన ఓ దొంగ క్రైమ్ కథాంతమిది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. జోగిపేటలో నివాసముండే వడ్డె నాగరాజు(28) స్థానిక అందోల్ రోడ్డులోని చిరు వ్యాపారులపై రౌడీయిజం చేస్తూ వేధింపులకు గురి చేసేవాడు. ఈ క్రమంలో మూడు రోజుల క్రితం ఓ దుకాణంలో వైరు దొంగతనం చేశాడు. అదే ప్రాంతానికి చెందిన ఆలకుంట శేఖర్(12) అనే బాలుడు దొంగతనం చేసింది నాగరాజేనని సదరు దుకాణ యజమానికి చెప్పాడు. ఈ విషయం తెలుసుకున్న నాగరాజు శనివారం సాయంత్రం శేఖర్‌ను తన వద్దకు పిలిచాడు. మాట్లాడుకుందామని చెప్పి స్థానిక వెంకటేశ్వర థియేటర్ వెనక ఉన్న నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి గొంతు నులిమి శేఖర్‌ను చంపేశాడు. ఆపై, బండరాయితో శేఖర్ తలపై మోది మృతదేహాన్ని సమీపంలోని పాడుబడ్డ బావిలో పారేశాడు. ఆ తర్వాత అడిగితే డబ్బు ఇవ్వలేదని కారణంతో అయిత ప్రకాశ్ అనే చిరువ్యాపారిపై దాడి చేసి అతని తల పగలగొట్టాడు. అనంతరం.. నీ కొడుకును చంపి బావిలో పడేశానని.. శేఖర్ తల్లికి సమాచారమందించాడు. ఆపై, శనివారం రాత్రి పూటుగా మద్యం సేవించిన నాగరాజు పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ టవర్ ఎక్కి, రాత్రంతా అక్కడే ఉన్నాడు. ఆదివారం ఉదయం రాము అనే స్నేహితునికి ఫోన్ చేసి తాను సెల్ టవర్‌పై ఉన్నానని, బీరు, బిర్యానీ తీసుకురమ్మని కోరాడు. ఈ మేరకు అక్కడికి వెళ్లిన రాము ఎంత నచ్చజెప్పినా నాగరాజు కిందికి రాకపోగా.. అతని కోసం పైకి వచ్చిన రాముపై కత్తితో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన రాము టవర్ కిందకు దిగి విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లాడు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు ఎంత చెప్పినా నాగరాజు కిందకు దిగలేదు. నాగరాజు బాగా ఎత్తులో ఉండటం, ఎండ అధికంగా ఉండటంతో ఏమీ కనిపించకపోవడంతో డ్రోన్లు తెచ్చేందుకు పోలీసులు వెళ్లారు. పోలీసులు తిరిగొచ్చి డ్రోన్ల సాయంతో చూసేసరికి నాగరాజు సెల్‌టవర్‌పై ఉన్న వైర్లుతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుని ఉన్నాడు. కాగా, మృతదేహాన్ని కిందికి దించిన పోలీసులు పోస్టుమార్టానికి తరలించారు. అలాగే, పాడుబడిన బావిలో ఉన్న శేఖర్ మృతదేహాన్ని కూడా వెలికి తీశారు.

అకాల వర్షాలతో 3,120 ఎకరాల్లో పంటనష్టం

(మొదటి పేజీ తరువాయి)

వరంగల్, ములుగు, మహబూబాబాద్.. తదితర జిల్లాల్లో కూడా అకాల వర్షాలతో పంటనష్టం జరిగింది. ఈ వివరాలను కూడా వ్యవసాయశాఖ అధికారులు సేకరిస్తున్నారు. పంట నష్టంపై రైతులవారీగా వివరాలను సేకరించాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. రైతు పేరు, పంట పేరు, సర్వే నంబరు, జరిగిన పంట నష్టం, పట్టాదారు పాసుపుస్తకం ఖాతా నంబరు, బ్యాంకు అకౌంట్ నంబరు, ఐఎఫ్ఎస్సీ కోడ్, బ్యాంకు పేరు.. తదితర సమగ్ర వివరాలు సేకరించే పనిలో వ్యవసాయశాఖ అధికారులు నిమగ్నమయ్యారు. యాసంగి సీజన్ ప్రారంభమైనప్పటి నుంచి క్రాప్ బుకింగ్ యాప్‌లో సాగు వివరాలు నమోదు చేశారు. ఆ వివరాల ఆధారంగా రైతుల వారీగా సర్వే చేస్తున్నారు. వడగళ్లు, గాలి దుమారాలు, అకాల వర్షాలతో నష్టపోయిన పంటల వివరాలపై రెండు, మూడు రోజుల్లో సర్వే పూర్తయ్యే అవకాశాలున్నాయి.

నివేదికలు వచ్చాక పరిహారం: తుమ్మల

వర్షాలతో జరిగిన పంట నష్టంపై అధికారులు సర్వే చేస్తున్నారని, నివేదికలు అందిన వెంటనే నష్టపరిహారం పంపిణీ చేస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రైతుల వారీగా సర్వే చేసి తక్షణమే నివేదిక ఇవ్వాలని ఆదేశించినట్లు తెలిపారు. గత మార్చి నెలలో కురిసిన వడగండ్ల వానలతో జరిగిన పంట నష్టంపై సర్వే పూర్తయిందని, రైతులకు నష్టపరిహారం పంపిణీ చేయటానికి ఎన్నికల సంఘం అనుమతి కోరినట్లు తెలిపారు. ఇంతవరకు అనుమతి రాలేదని, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని... మరోమారు కేంద్ర ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి చేస్తామని ఒక ప్రకటనలో తెలిపారు కాగా వానాకాలం సీజన్‌కు సరఫరాచేసే పచ్చిరొట్ట విత్తనాల టెండర్ల నిర్వహణకు అనుమతి ఇచ్చినందుకు ఎన్నికల సంఘానికి తుమ్మల కృతజ్ఞతలు తెలిపారు.

ఉదయం ఉడికించి.. సాయంత్రం చల్లబడి!

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రతలు.. పమ్మిలో 44.9 డిగ్రీలు.. సాయంత్రానికి భారీ వర్షం

- పలుచోట్ల కూలిన చెట్లు.. తడిసిన కల్లాల్లోని ధాన్యం
- పలు జిల్లాల్లోనూ 44 డిగ్రీలపైనే ఉష్ణోగ్రతలు..
- మూడు రోజులు తేలికపాటి వర్షాలు


కారేపల్లి-ఖమ్మం రహదారిపై కూలిన చెట్టు

ఖమ్మం/కొత్తగూడెం/హైదరాబాద్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పగలంతా తీవ్రమైన ఎండకొట్టగా.. సాయంత్రానికి వాతావరణం పూర్తిగా మారిపోయింది. ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల్లోని పలుచోట్ల ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం పవిత్మలో అత్యధికంగా 44.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. పలు జిల్లాల్లోనూ పగటి ఉష్ణోగ్రత 44 డిగ్రీలు దాటింది. జగిత్యాల జిల్లా జైనాలో 44.8, ఖమ్మం జిల్లా నేలకొండపల్లి, నల్లగొండ జిల్లా కట్టంగూర్‌లో 44.7, ఖమ్మం పట్టణం, నల్లగొండ జిల్లా ఇబ్రహీంపట్నంలో 44.6, కొత్తగూడెం జిల్లా అశ్వాపురం, ఖమ్మం జిల్లా బాణాపురం, మంచిర్యాల జిల్లా నస్పూర్‌లో 44.5 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇక సాయంత్రం ఖమ్మం నగరం, మధిరతోపాటు మరికొన్ని చోట్ల ఈదురుగాలులతో కూడిన వర్షం పడింది. రేపల్లి మండలం గిద్దెవారిగూడెం గ్రామ సమీపంలో ఇల్లెందు-ఖమ్మం ప్రధాన రహదారిపై చెట్టు కూలి అక్కడ పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనాలపై పడింది. తల్లాడలో ఈదురుగాలులతో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పాల్వంచ, చంద్రుగొండ, మణుగూరు, జూలూరుపాడు, సుజాతనగర్, అశ్వారావుపేట, లక్ష్మీదేవిపల్లి, టేకులపల్లి ఇల్లెందు, ములకలపల్లి మండలాల్లో ఈదురు గాలులతో వర్షం కురిసింది. కరకగూడెం మండలంలోని పలు గ్రామాల్లో కల్లాల్లోని ధాన్యం తడిసిపోయింది. కన్నాయిగూడెంలో 20 ఇళ్లపై రేకులు గాలికి ఎగిరిపోయాయి. సూర్యాపేట జిల్లాలో పలుచోట్ల మోస్తరు వర్షం కురిసింది. సూర్యాపేట పట్టణంలోని పలు వార్డుల్లో చెట్లు విరిగి రోడ్లకు అడ్డంగా పడ్డాయి. విద్యుత్తు తీగలపై కొమ్మలు విరిగిపడటంతో 2 గంటల పాటు సరఫరా నిలిచింది. చివ్వెంల, ఆత్మకూర్(ఎస్)మండలాల్లో పలుచోట్ల కల్లాల్లో ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. హుజూర్‌నగర్ నియోజకవర్గంలో సైతం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. మోతె మండలంలోని పలు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం బస్తాలు తడిశాయి.

మూడు రోజులు అక్కడక్కడ వర్షాలు..

ఇక సోమవారం నుంచి బుధవారం వరకు రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈనెల 25 నుంచి ఉష్ణోగ్రతలు పెరుగుతాయని, పొడి వాతావరణం నెలకొంటుందని వెల్లడించింది.

తుది దశకు మల్టీ-లెవల్ పార్కింగ్ కాంప్లెక్స్

ఏకకాలంలో 250 కార్లు, 200 మోటార్‌సైకిళ్ల పార్కింగ్.. నాంపల్లిలో 15 అంతస్తుల్లో 80 కోట్లతో నిర్మాణం

- అందులోనే కమర్షియల్ కాంప్లెక్స్‌లు, థియేటర్లు
- దేశంలోనే తొలిసారిగా.. జర్మన్ పాలిస్ పార్కింగ్ విధానం
- లోక్‌సభ ఎన్నికల తర్వాత ప్రారంభించే అవకాశం


పార్కింగ్ ఊహా చిత్రాలు


నాంపల్లిలో నిర్మాణంలో ఉన్న పార్కింగ్ కాంప్లెక్స్

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): నాంపల్లిలో నిర్మిస్తున్న మల్టీ-లెవల్ పార్కింగ్(ఎంఎల్‌పీ) త్వరలో అందుబాటులోకి రానుంది. 15 అంతస్తుల్లో రూ.80 కోట్లతో నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టు తుదిదశకు చేరుకుంది. దేశంలోనే జర్మన్ పాలిస్ పార్కింగ్ విధానంలో నిర్మించిన ఎంఎల్‌పీ ఇదే కావడం గమనార్హం.

హైదరాబాద్‌లో ట్రాఫిక్ కష్టాలు తెలియనిది కాదు. ఇక పార్కింగ్ కోసం కీలక కూడళ్లలో అగచాట్లు పడాల్సిందే. మల్టీ-లెవల్ పార్కింగ్ అంశం దశాబ్దన్నర క్రితమే.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో తెరపైకి వచ్చింది. ప్రస్తుతం హైదరాబాద్ మెట్రోరైల్ ఎండీగా ఉన్న ఎన్వీఎస్ రెడ్డి.. అప్పట్లో జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్‌గా ఈ అంశంపై అధ్యయనం చేశారు. కానీ, 2018 వరకు కూడా ఈ అంశం కార్యరూపు దాల్చలేదు. నాంపల్లి మెట్రో స్టేషన్ సమీపంలో హైదరాబాద్ మెట్రోరైల్ సంస్థకు ఉన్న అర ఎకరం స్థలంలో 2018లో ఎంఎల్‌పీకి శంకుస్థాపన చేశారు. పీపీపీ పద్ధతిలో రూ.80 కోట్లతో ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపట్టారు. కొవిడ్ కాలంలో పనులు కాస్త నెమ్మదిగా సాగినా.. జర్మన్ పాలిస్ విధానం ద్వారా తక్కువ స్థలంలో ఎక్కువ వాహనాలను పార్క్ చేసేలా 15 అంతస్తుల నిర్మాణం తుది దశకు చేరుకుంది. వీటిలో ఐదంతస్తుల్లో కమర్షియల్ కాంప్లెక్స్‌లు, రెండు స్క్రీన్‌లతో థియేటర్లు ఉంటాయి. 10 అంతస్తులను పార్కింగ్‌కు కేటాయిస్తారు. మొత్తం 1.04 లక్షల చదరపు అడుగుల స్థలంలో.. 68% పార్కింగ్‌కు.. 32% వాణిజ్య సముదాయాలకు కేటాయిస్తారు. ఈ కాంప్లెక్స్‌లో ఏకకాలంలో 250 కార్లు, 200 ద్విచక్రవాహనాలను పార్క్ చేయవచ్చు. ఈ విధానం విజయవంతమైతే.. నగరంలోని మరికొన్ని ప్రాంతాల్లోనూ ఎంఎల్‌పీలను నిర్మించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఈ కాంప్లెక్స్ పనులను మెట్రోరైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి ఆదివారం పరిశీలించారు. నెలరోజుల్లో ట్రయల్ రన్ ప్రారంభించాలని డెవలపర్లను ఆయన కోరారు.

ప్రత్యేకతలివే..!

- నాంపల్లి ఎంఎల్‌పీలో అత్యాధునిక టెక్నాలజీని వాడుతున్నారు. గ్రౌండ్‌ఫ్లోర్‌లో నాలుగు(ఎగ్జిట్/ఎంట్రీ) టెర్మినల్స్ ఉంటాయి.
- టెర్మినల్స్ వద్ద వాహనాలను ఆపేందుకు 'టర్న్ టేబుల్స్' ఉంటాయి. వాహనాలను ఈ టేబుల్‌పై వదిలితే.. వాటిని లిఫ్టుల ద్వారా నిర్ణీత అంతస్తులో పార్కింగ్ చేస్తారు.
- కంప్యూటరైజ్డ్ స్కానర్లు వాహనం కొలతను బట్టి స్లాట్లను ఇస్తాయి. ఎస్‌యూవీ, సెడాన్ లాంటి వాహనాలకు ప్రత్యేక పార్కింగ్ స్థలాలుంటాయి.
- వాహనదారులకు ఆర్ఎఫ్ఐడీ స్మార్ట్‌కార్డులుంటాయి. వారు ఎప్పుడు వాహనాన్ని పార్క్ చేశారు? వాహనం ఎంత సమయం.. ఏ టెర్మినల్‌లో పార్కింగ్‌లో ఉంది? ఎప్పుడు బయటకు వెళ్తోంది? అనే వివరాలను సులభంగా గుర్తిస్తారు.
- నగదు చెల్లించి కూడా వాహనాలను పార్క్ చేసుకోవచ్చు.
- వాహనదారులు కార్లను తిరిగి తీసుకునేప్పుడు రివర్స్ తీసుకునే అవసరం లేకుండా.. 'టర్న్ టేబుల్స్' వాహనాన్ని కావాల్సిన దిక్కుకు రొటేట్ చేస్తాయి.
- మొత్తమ్మీద వాహనాన్ని పార్క్ చేసేందుకు ఒక నిమిషం, తిరిగి తీసుకునేందుకు 2నిమిషాలు పడుతుందని అంచనా.


ముక్క నివేష్, పార్శి గౌతమ్ (ఫైల్)

అమెరికాలో రోడ్డు ప్రమాదం.. ఇద్దరు తెలంగాణ యువకుల మృతి

హుజూరాబాద్, స్టేషన్‌ఘన్‌పూర్, ఏప్రిల్ 21: అమెరికాలో శనివారం జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో తెలంగాణకు చెందిన ముక్క నివేష్(19), పార్శి గౌతమ్ (19) అనే యువకులు మరణించారు. నివేష్ స్వస్థలం కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ కాగా గౌతమ్ సొంతూరు జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ పరిధి శివునిపల్లి. నివేష్, గౌతమ్ ఇంటర్ పూర్తి చేసిన తర్వాత బీటెక్ చదివేందుకు ఏడాదిన్నర క్రితం అమెరికాలోని అరిజోనా వెళ్లారు. ఇరువురు ప్రస్తుతం బీటెక్ సెకండియర్ చదువుతున్నారు. నివేష్, గౌతమ్ మరికొందరు స్నేహితులు కలిసి శనివారం(అమెరికా కాలమాన ప్రకారం) స్థానికంగా ఓ జలపాతం సందర్శనకు కారులో వెళ్లారు. అక్కడి నుంచి అరిజోనాలోని ఇంటికి తిరిగి వస్తుండగా వీరి ప్రయాణిస్తున్న కారును వెనక నుంచి మరో కారు బలంగా ఢీకొట్టింది. దీంతో కారు వెనక సీట్లో కూర్చొని ఉన్న నివేష్, గౌతమ్ అక్కడికక్కడే మరణించారు. అరిజోనా పోలీసులు బాధిత కుటుంబసభ్యులకు ఈ ప్రమాదంపై సమాచారం ఇచ్చారు. నివేష్, గౌతమ్ మృతదేహాలు స్వస్థలానికి చేరుకునేందుకు మూడు రోజులు సమయం పట్టే అవకాశం ఉంది.

మార్కెట్లో సన్నాల జోష్



(మొదటి పేజీ తరువాయి)

మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు జరిగాయి. గతేడాది ఏప్రిల్ 15వ తేదీ నాటికి కేవలం 3 వేల టన్నుల ధాన్యం సేకరణ మాత్రమే జరగటం గమనార్హం. గతేడాది కంటే ఈసారి ముందస్తుగా రాష్ట్రంలో ధాన్యం సేకరణ ప్రారంభమైంది. దీనివల్లే భారీస్థాయి సేకరణ సాధ్యమైంది. ఏ-గ్రేడు ధాన్యానికి క్వింటాలుకు రూ.2,203, సాధారణ ధాన్యానికి రూ.2,183 చొప్పున ప్రభుత్వ సెంటర్లలో ధాన్యం సేకరిస్తున్నారు. ప్రైవేటు ట్రేడర్లు, రైస్‌మిల్లర్లు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌ల నుంచి వచ్చిన వ్యాపారులు కూడా విడిగా ధాన్యం కొనుగోళ్లు చేస్తున్నారు. మార్కెట్ యార్డులు, రైస్‌మిల్లర్లు, చెక్‌పోస్టుల్లో ఎంట్రీ అయిన వివరాల ప్రకారం చూస్తే... 6.52 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు జరిగాయి. ప్రభుత్వం చేపట్టిన ధాన్యం సేకరణకు ఇది అదనం. అంటే రాష్ట్రంలో ఇప్పటివరకు 12.55 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం విక్రయాలు జరిగాయి.

ధాన్యం ధరలు ఇవీ..

శుక్రవారం సూర్యాపేట మార్కెట్లో సాంబమసూరి ధాన్యం గరిష్ఠ ధర రూ.2,901, జైశ్రీరాం ధర రూ.2,696 పలికింది. సోనామసూరిని దేవరకద్ర మార్కెట్లో రూ.2,509, మహబూబ్‌నగర్‌లో రూ.2,603, వనపర్తిలో రూ.2,540, నారాయణపేట్‌లో రూ. 2,580, గద్వాలలో రూ.2,481 చొప్పున ప్రైవేటు ట్రేడర్లు కొనుగోలు చేశారు. తిరుమలగిరి మార్కెట్లో ఆర్ఎన్ఆర్ రూ.2,347, నారాయణపేట మార్కెట్లో హంస రూ.2,255 చొప్పున కొన్నారు. 1010 రకం ధాన్యాన్ని రూ.2,200 నుంచి రూ.2,300 చొప్పున కొంటున్నారు. శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేటు ట్రేడర్లు 55,340 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశారు.

గరిష్ఠ ధర కొందరికేనా?

ప్రైవేటు మార్కెట్లో గరిష్ఠ ధర కొందరికే దక్కుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ట్రేడర్లు, మార్కెట్ కమిటీల అధికారులు కుమ్మక్కై.. కొంత ధాన్యానికి గరిష్ఠ ధర చెల్లించి, మిగిలిన ధాన్యాన్ని తక్కువకు కొంటున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకే పరిమితం కాకుండా, ప్రైవేటు మార్కెట్లో జరుగుతున్న కొనుగోళ్లు, చెల్లిస్తున్న ధరలపై కూడా దృష్టిపెట్టాలని రైతులు కోరుతున్నారు. కాగా, 17 శాతానికి మించి తేమ ఉంటే ప్రభుత్వ సెంటర్లలో ధాన్యం తీసుకోవటం లేదు. ఆరబెట్టిన తర్వాతే కాంటా పెడతామని నిర్వాహకులు చెబుతున్నారు. దీంతో నేరుగా తెచ్చిన ధాన్యాన్ని విక్రయించటం రైతులకు ఇబ్బందికరంగా మారింది.

నేడు భువనగిరికి జాతీయ ఎస్సీ కమిషన్

- గురుకుల పాఠశాలలో విచారణ నిర్వహించనున్న సభ్యులు
- 'కలుషిత ఆహారం' ఘటనను తీవ్రంగా పరిగణించిన కేంద్రం

భువనగిరి టౌన్, ఏప్రిల్ 21: యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రం భువనగిరి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో నెలకొన్న 'కలుషిత ఆహారం' ఘటనపై జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు సోమవారం విచారణ నిర్వహించనున్నారు. గురుకుల పాఠశాలకు చెందిన ఆరో తరగతి విద్యార్థి ప్రశాంత్(12) ఈ నెల 13వ తేదీన కలుషిత ఆహారం తిని మృతి చెందడం, మరికొంతమంది విద్యార్థులు ఆస్పత్రుల పాలవ్వడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. దీంతో ఈ ఘటనను కేంద్రం తీవ్రంగా పరిగణిస్తూ జాతీయ ఎస్సీ కమిషన్‌ను భువనగిరికి పంపుతోంది. ఎస్సీ కమిషన్ సభ్యుల పర్యటనకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆర్డీవో అమరేందర్ తెలిపారు. ఈ ఘటనలో ఇప్పటికీ నలుగురు విద్యార్థులు హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీరాం శ్రీనివాస్‌ను అధికారులు సస్పెండ్ చేశారు. కలుషిత ఆహారం ఘటన నేపథ్యంలో వార్షిక పరీక్షలను వాయిదా వేయడంతో విద్యార్థులంతా రెండు రోజుల క్రితమే ఇళ్లకు వెళ్లిపోయారు.

టెట్‌కు 2,86,386 దరఖాస్తులు

హైదరాబాద్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు అభ్యర్థుల నుంచి 2,86,386 దరఖాస్తులు వచ్చాయి. శనివారంతో (20వ తేదీ) టెట్ దరఖాస్తుల గడువు ముగిసింది. పేపర్-1కు 99,958 మంది, పేపర్-2కు 1,86,428 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. పేపర్-2లో మ్యాథ్స్‌కు 99,974 మంది, సోషల్ స్టడీస్‌కు 86,454 మంది అప్లై చేశారు. మొదట టెట్‌కు దరఖాస్తు గడువు ఈ నెల 10వ తేదీ వరకు ఉండగా.. తర్వాత 20వ తేదీ వరకు పొడిగించారు. దీంతో దరఖాస్తుల సంఖ్య భారీగా పెరిగింది. కాగా, దరఖాస్తులు సమర్పించిన అభ్యర్థులు వాటిని ఎడిట్ చేసుకోవడానికి ఇచ్చిన ఆప్షన్ గడువు కూడా ముగిసింది. రాష్ట్రంలో మెగా డీఎస్సీని నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. దీనికి ముందు టెట్‌ను నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మే 20 నుంచి జూన్ 3 వరకు ఈ పరీక్షలను కంప్యూటర్ ఆధారిత విధానం (సీబీటీ)లో నిర్వహించనున్నారు.

నేడు పద్మశ్రీ అందుకోనున్న సోంలాల్ నాయక్

- ఢిల్లీలో రాష్ట్రపతి చేతుల మీదుగా ప్రదానం


సోంలాల్‌నాయక్

భువనగిరి రూరల్, ఏప్రిల్ 21: భగవద్గీతను బంజారా భాషలోకి అనువదించిన కేతావత్ సోంలాల్ నాయక్ సోమవారం ఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా పద్మశ్రీ అందుకోనున్నారు. ఇందుకు సంబంధించి రాష్ట్రపతి భవన్ నుంచి వచ్చిన ఆహ్వానం మేరకు ఆయన ఆదివారం ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం ఆకుతోటబావికి చెందిన సోంలాల్ నాయక్ నిరుపేద కుటుంబంలో జన్మించారు. ఆయన 701 శ్లోకాల ద్వారా భగవద్గీతను బంజారా భాషలోకి అనువదించారు. అనువాదం పూర్తయిన 20 ఏళ్ల తర్వాత బంజారా భగవద్గీత 2014లో ప్రచురితమయింది. భగవద్గీత అనువదించిందుకు సోంలాల్‌నాయక్‌ను కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది జనవరి 25న పద్మశ్రీ అవార్డుకు ఎంపిక చేసింది. కాగా, ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలోని భువనగిరి మండలం బొల్లేపల్లి గ్రామానికి చెందిన కమ్యూనిస్టు యోధుడు, మాజీ ఎంపీ రావి నారాయణ రెడ్డి గతంలో పద్మశ్రీ అందుకున్నారు.

వరి ధాన్యం తడవకుండా చర్యలు

- ఇప్పటి వరకు 6.7 లక్షల టన్నుల వడ్ల కొనుగోలు: చౌహాన్

హైదరాబాద్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అకాల వర్షాలు పడుతున్న నేపథ్యంలో... ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ ఆదేశించారు. ఆదివారం ఈ మేరకు అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని, కాంటా పెట్టిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్లు, డీసీఎస్‌వోలు, జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్లు... ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రైవేట్ ట్రేడర్లు, రైస్ మిల్లర్లు ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలకు పాల్పడకుండా నిఘా పెట్టాలని, రైతులకు కనీస మద్దతు ధర అందేలా పర్యవేక్షణ చేయాలని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన ప్రతి గింజను సేకరించేందుకు రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ సిద్ధంగా ఉందని కమిషనర్ తెలిపారు. ఈ విషయంలో రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసానిచ్చారు. రాష్ట్ర పౌర సరఫరాలు, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని, రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 7,109 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 6.75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని.. 1,01,121 మంది రైతుల నుంచి కనీస మద్దతు ధరకు సేకరించామని డీఎస్ చౌహాన్ వెల్లడించారు.

ఐఐటీ, మెడికల్ 'కోటా' మెటీరియల్ సిద్ధం

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఐఐటీ, మెడికల్ ఫౌండేషన్‌కు సంబంధించిన 6,7,8,9,10 తరగతులకు స్టడీ మెటీరియల్, అసైన్‌మెంట్లు సిద్ధం చేసినట్లు కోటా పేజెస్ ఆదివారం తెలిపింది. మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ ఫౌండేషన్ మెటీరియల్‌ను డిజిటల్ మొబైల్ వెర్షన్‌లో వాట్సాప్ ద్వారా పొందవచ్చు. స్టడీ మెటీరియల్‌తో పాటు అసైన్‌మెంట్స్ సిద్ధంగా ఉన్నాయి. మరింత సమాచారం కోసం ఐఐటీఎఫ్, ఎంఈడీఎఫ్ అని టైపు చేసి 9849016661 వాట్సాప్ నంబర్‌కు మెసేజ్ చేయాలి.

'దొంగ జడ్జి' ధనీరాం మృతి

- జీవితకాలంలో వేయి కేసులు, వంద అరెస్టులు
- జడ్జిగా అవతారమెత్తి నేరగాళ్ల విడుదల

న్యూఢిల్లీ, ఏప్రిల్ 21: మోసాల్నే పెట్టుబడిగా పెట్టి జీవితకాలమంతా చోరీలు చేసి బతికిన ఘరానా దొంగ ధనీరాం మిట్టల్ (85) మరణించాడు. జడ్జిగా అవతారమెత్తడమే కాకుండా క్రిమినల్స్‌ను విడుదల చేస్తూ ఎడాపెడా ఉత్తర్వులు జారీ చేయడం అతడు చేసిన నేరాలకు పరాకాష్ఠ. వృద్ధాప్యం కారణంగా గుండెపోటుతో గురువారం ఢిల్లీలో మృతి చెందాడని పోలీసులు తెలిపారు. దశాబ్దాల తరబడి సాగిన అతడి నేర ప్రవృత్తిని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఫ్యాన్సీ కార్లను దొంగిలించడంలో అతడు స్పెషలైజ్ చేశాడు. అతడేదో అల్లరిచిల్లర దొంగమీ కాదు. ఉన్నత విద్యావంతుడు. రోహతక్‌లో బీఎస్సీ చదివి ఫస్ట్‌క్లాస్‌లో పాసయ్యాడు. రాజస్థాన్‌లో ఎల్ఎల్‌బీ చేశాడు. పలువురు న్యాయవాదుల వద్ద మున్షీ (గుమస్తా)గా పనిచేశాడు. 1964లో తొలిసారిగా మోసం కేసు నమోదయింది. అప్పటి నుంచి చనిపోయే వరకు కేసుల ప్రవాహం కొనసాగింది. తప్పుడు పత్రాలు సృష్టించి 1968 నుంచి 1974 వరకు స్టేషన్ మాస్టర్‌గా పనిచేశాడు. హరియాణాలోని ఝజ్జర్ కోర్టు వద్ద పార్కు చేసిన కారును దొంగిలించి సొంతానికి వాడుకున్నాడు. కొద్ది రోజుల పాటు అదే కోర్టుకు జడ్జిగా వచ్చానని చెప్పుకొని దీర్ఘకాల శిక్షను అనుభవిస్తున్న క్రిమినల్స్‌ను విడుదల చేస్తూ ఉత్తర్వులు ఇచ్చాడు.. జీవితకాలంలో మొత్తం 1,000కిపైగా కేసులు నమోదయ్యాయి. ఇందులో 150 దొంగతనం కేసులు. మిగిలినవి ఫోర్జరీ, మారుపేర్లతో వ్యవహరించడం, మోసం వంటివి ఉన్నాయి. సుమారు వందసార్లు అరెస్టయ్యాడు. 2016లో ఆయనకు 77 ఏళ్ల వయసు ఉన్నప్పుడు రాణీబాగ్‌లో కారు దొంగతనం చేసి అరెస్టయ్యాడు. అది అతనికి 95వ అరెస్టు కావడం గమనార్హం. హరియాణా, పంజాబ్, చండీగఢ్, రాజస్థాన్‌లలో కేసులు నమోదయ్యాయి.

వివిధ

బొమ్మలు: అక్బర్



వడ్లరాశి కింద

ఇంకా ఆ గుట్టల కింద చేలలో
మోపులు కట్టి ఎత్తుతున్నట్టే ఉంది

కోత కోసిన ఆ చేల నడుమ తిరిగే
మిణుగురులు గుర్తొచ్చినప్పుడు
గుండెగుమ్మి నిండా
చీకట్లు కమ్ముకుంటున్నయి.

తూర్పాల వట్టి, వొడ్లు కుప్పనూకినంక
చుట్టూ పొత్తి వోస్తుంటే
వొడ్లరాశి మీద కొడవలి లెక్క కూర్చునే
ఆ వెన్నెలపిట్ట ఏ మబ్బుల్లో దాసుకుందో!

కుట్టిన వొడ్లబస్తాలకు ఆనుకొని
కల్లుధార కోసం మర్రాకు పట్టుకునే
కూలీతల్లులందరు ఇప్పుడెక్కడ ఉన్నరో!

గడ్డివాము సందుల్లో
సాట, పొరక దాచిపెట్టిన
ఆ గుర్తులెక్కడున్నవో ఇప్పుడు?
రెక్కలు దాసుకోకుండా
నిండార కూలిజేసి ఇంటికొచ్చి
కంటినిండా నిద్రపోయిన రోజులేవి?

ఎడ్లకు గడ్డేసి, బర్లకు కుడితివెట్టి
పాలు పిండుకొని వచ్చె మా ఎంకన్న
ఎప్పుడైనా ఎదురైయ్యిండా?
ఏ మెట్రోస్తంభాల కింద
వరికంకుల బొమ్మ గీస్తుండో.

ఇట్లా మీ మధ్య
ఆరడుగుల నీడలాగ తిరుగుతున్న గానీ
పరిగె గింజలాగ
నా ఆత్మను ఆ చేలలోనే వొదిలేసి వచ్చిన

ఏ అర్ధరాత్రి పూటైనా మెలకువ వస్తే
రెక్కలుగట్టుకొని వరికల్లంలోకి వాలిపోత

కల్లం చేసుడంటే మాటలా?
బండెడు పెండ తెచ్చి అలుకుపెట్టాలె
తెల్లారక ముందే బంతులు గట్టాలె
ఎండగాక ముందే మెద దులుపాలె
కొలిచేటప్పుడు కుండ కుండకు
ఆరున్నొక్క రాగం ఎత్తుకోవాలె

మార్కెట్ ముందట
రైతు ఇప్పుడు ధర పలుకుతలేడు గానీ
ఒకప్పుడు పనివాటోళ్లందరూ
'కట్టడి'కి వరుసగట్టెటోళ్ళు
పక్షులకింతా, ప్రకృతికింతా
కూలిచేసినోళ్ళకింత పంచిపెట్టినంక
మిగిలినదానితోటి తిన్న నాడే
రైతు పచ్చని నారుమడి లాగ బతికిండు
ఇయ్యాల ఎడ్లకు
ఏ రాజ్యపు దిష్టి తగిలిందో
ఒంటి మీద ఎక్కడ చూసినా
నల్లగా వాతలు పెట్టిన
　　అచ్చులు మిగిలినవి
పుట్లకొద్ది ధాన్యం పండె పొలంలో
ఇనుపకంచెలు మొలుస్తున్నవి

పొలాలను దాటి, ఎంతో దూరం వచ్చేసి
నాగరికత అంటున్నం గానీ
ఆ నాగరికతకు మూలాలు
ఇంకా ఆ వడ్లరాశి కిందనే ఉన్నయి.

■ తగుళ్ళ గోపాల్
☎ 83098 37260

ఆటా నవలల పోటీ ఫలితం

అమెరికా తెలుగు సంఘం (ఆటా) నిర్వహించిన నవలల పోటీలో ఉణుదుర్తి సుధాకర్ రచించిన 'చెదరిన పాదముద్రలు' నవలకి లక్ష రూపాయిలు బహుమతిగా ఇవ్వాలని ఆటా కార్యవర్గం నిర్ణయించింది. ఈ నవలని ఆటా త్వరలోనే ప్రచురిస్తుంది.

రవి వీరెల్లి

'లౌకిక విలువలు - సాహిత్యం' సదస్సు

సమూహ సెక్యులర్ రైటర్స్ ఫోరం ఆధ్వర్యంలో 'లౌకిక విలువలు-సాహిత్యం' అంశంపై తెలంగాణ రాష్ట్ర స్థాయి సదస్సు ఏప్రిల్ 28న ఉదయం 10గంటల నుంచి సెనేట్ హాల్, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్‌లో జరుగుతుంది. ప్రారంభ సమావేశం తర్వాత నాలుగు సెషన్లలో జరిగే సమావేశాలకు యాకూబ్, మెట్టు రవీందర్, పసునూరి రవీందర్, భూపతి వెంకటేశ్వర్లు అధ్యక్షత వహిస్తారు. ప్రాంభోపన్యాసం నందిని సిధారెడ్డి, ముగింపు ఉపన్యాసం ఖాదర్ మొహియుద్దీన్ చేస్తారు. అంశాలపై ప్రసంగాలు ఉంటాయి. 'ఫాసిస్ట్ పోకడలను సాహిత్యంలోకి వస్తువుగా తీసుకురావడం ఎలా?' అంశంపై నరేష్ కుమార్‌సూఫీ, మెర్సీ మారగ్రెట్ నిర్వహణలో ప్యానెల్ డిబేట్ ఉంటుంది.

సమూహ సెక్యులర్ రైటర్స్ ఫోరం

ఐదు పుస్తకాల ఆవిష్కరణ

కొండపల్లి నీహారిణి మూల గ్రంథానికి మరిగంటి లక్ష్మణాచార్యులు హిందీ అనువాదం 'చిత్రకళా తపస్వి డా. కొండపల్లి శేషగిరిరావు కీ జీవన్ గాథా'; కొండపల్లి నీహారిణి రాసిన స్త్రీవాద సాహిత్య విమర్శ సంపుటి 'అనివార్యం'; మయూఖ అంతర్జాల పత్రిక కథా సంకలనాలు 'కథా మయూఖం', 'బాల కథా మయూఖం'; ఇంకా ధూళిపాళ అరుణ కథా సంపుటి 'మిగిలేవి గురుతులే'... ఈ ఐదు పుస్తకాల ఆవిష్కరణ సభ ఏప్రిల్ 27 ఉదయం 10గంటల నుంచి సైసీ హబ్ హోటల్, కొత్తపేట, హైదరాబాద్‌లో జరుగుతుంది. మాడిశెట్టి గోపాల్, ఓలేటి పార్వతీశం, ఎన్. గోపి, నరేంద్రరాయ్, వారాల ఆనంద్, కొలకలూరి ఇనాక్, సి. మృణాళిని, తదితరులు పాల్గొంటారు.

నక్క హరికృష్ణ

'నీతిచంద్రిక - చిన్నయ గద్యశైలి' అంశంపై ప్రసంగం

రాజాం రచయితలవేదిక సమావేశం ఏప్రిల్ 28 ఉ.10గంటలకు విజయనగరం జిల్లా రాజాంలో విద్యానికేతన్ పాఠశాలలో జరుగుతుంది. పై అంశంపై ఒమ్మి రమణమూర్తి ప్రసంగిస్తారు.

గార రంగనాథం

అనగనగా ఒక 'మంచి పుస్తకం'

20 సంవత్సరాల మంచి పుస్తకం

పిల్లలు బాగుంటే ప్రపంచం బాగుంటుంది. పిల్లలు సృజనాత్మకంగా ఎదిగితే భవిష్యత్తు కళాత్మక శోభతో అలరారుతుంది. ఉత్కృష్టమైన ఈ పనికి తల్లిదండ్రుల కన్నా, తరగతి గదుల కన్నా పుస్తకాలే ఎక్కువ దోహదపడగలుగుతాయి. పాఠ్య పుస్తకాల కంటే పఠన గ్రంథాలే ఈ వికాసానికి దారి చూపగలుగుతాయి. ఈ ఎరుకతోనే సరిగ్గా ఇరవయ్యేళ్ల క్రితం ఇదే నెలలో ఏర్పాటైంది 'మంచి పుస్తకం'. బాల సాహిత్యం కోసమే అంకితమయ్యి ఈ రెండు దశాబ్దాల్లో అయిదు వందల వరకు పుస్తకాలు ప్రచురించింది. లాభాపేక్షకి అతీతంగా పిల్లల బాగే తమ ఆకాంక్షగా నిర్వాహకులు కొనరాజు సురేష్, పి. భాగ్యలక్ష్మి పనిచేస్తున్నారు. 'మంచి పుస్తకం' అనేది ఇప్పుడు వారి ఇంటిపేరయ్యింది. వారందించే ప్రచురణలు పిల్లల పాలిట మంచి పుస్తకాల పంటయ్యింది. గురుతరమైన ఈ పనిలో ముఖ్య భూమికగా ఉన్న సురేష్, భాగ్యలక్ష్మిలతో మాటామంతి!

'మంచి పుస్తకం' తొలి అడుగుల గురించి చెప్పండి?

సురేష్: 'బాల సాహితి' పునాదిగా 'మంచి పుస్తకం' ఏర్పడింది. పిల్లల్లో తెలుగు బాగా చదివే సామర్థ్యాన్ని పెంచటం, పుస్తకాలు అంటే ప్రేమ కలిగేలా చెయ్యటం ఈ రెండు సంస్థల ఉద్దేశాలు. 1990లో 'బాల సాహితి' ట్రస్ట్‌గా ఏర్పడినప్పుడు, 2002లో 'మంచి పుస్తకం' పని మొదలుపెట్టి 2004లో దీనినొక ట్రస్ట్‌గా రిజిస్టర్ చేసినప్పుడు తెలుగులో పిల్లల పుస్తకాలలో కొంత కొరత ఉందనే చెప్పాలి. ఉన్నవాటితో మొదలుపెట్టి, ప్రచురణలు పెంచుకుంటూ, ఎంపిక చేసిన పుస్తకాలు పంపిణీ చేస్తూ పుస్తకాల జాబితాను విస్తరించుకుంటూ ముందుకెళ్లాం. కంటెంట్, నాణ్యత, ధరల రీత్యా మంచి పుస్తకం ప్రత్యేక గుర్తింపు పొందింది.

'మంచి పుస్తకం' అనగానే పిల్లల పుస్తకాలకి అడ్డా అన్న గుర్తింపు తెచ్చుకోగలిగారు. ఈ నేపథ్యంలో మీ ఇరవై ఏళ్ల కృషి ఎలా సాగిందో చెప్పండి?

భాగ్యలక్ష్మి: పుస్తకాల ప్రచురణ చేస్తున్నప్పుడు అవి పెద్ద ఫాంటుతో, బొమ్మలతో చైల్డ్ ఫ్రెండ్లీగా ఉండటానికి మంచి పుస్తకం ప్రాధాన్యత ఇచ్చింది. అదే క్రమంలో బై-లింగ్వల్ పుస్తకాల ప్రచురణ మొదలయ్యింది. సోవియట్ బాల సాహిత్యాన్ని మొదట్లో ఎక్కువగా తిరిగి ప్రచురించింది. అప్పటికే ఉన్న సోవియట్ పిల్లల పుస్తకాల తెలుగు అనువాదాలలో భాషను సరళీకరించి, ఫాంట్ సైజ్ పెంచి ప్రచురించింది. వీటిల్లో కొత్తగా కొన్ని అనువాదాలను మంచి పుస్తకం చేయించింది కూడా.

పిల్లలు చదవటానికి దోహదం చేసేలా చేసిన ప్రయోగాలలో 'కథాకదంబం' పేరుతో మంచి పుస్తకం 50 కార్డులను ప్రచురించింది. ఒక్కొక్క కార్డు 4 పేజీలు. చిన్న కథల నుండి మొదలై క్రమేపి కథలు పెద్దవి అవుతాయి. వీటి ఆధారంగా పిల్లలు తెలుగు చదవటం నేర్చుకున్నారని చాలా మంది టీచర్లు, తల్లిదండ్రులు, వాలంటీర్ల ద్వారా ఫీడ్‌బ్యాక్ లభించింది.

పిల్లల పుస్తకాలు అంటే క్రౌన్ సైజులో చిన్నగా ఉంటాయని కొంచెం పెద్ద తరగతి పిల్లల్లో ఓ అభిప్రాయం బలపడిన సంగతి మా గమనికలోకి వచ్చింది. ఆ పుస్తకాలు సైజు పెంచి ఉన్నా ఆకర్షణ కొరవడి వాటిని చదవటానికి సిద్ధంగా లేరని పరిశీలనలో తెలిసింది. ఈ మానసిక అవరోధాన్ని అధిగమించటానికి 1/8 డెమ్మీ సైజులో 16 పేజీల పుస్తకాలను ఇంపైన రీతిలో 'పుస్తకాలతో స్నేహం' అన్న సిరీస్‌ని మంచి పుస్తకం ప్రచురించింది. పది పుస్తకాలు ఒక సెట్‌గా మొత్తం 160 పేజీల రీడింగ్ మెటీరియల్ ఇది. ఒక పుస్తకం చదవగానే పిల్లల్లో ఉత్సాహం, ఆత్మవిశ్వాసం పెరుగుతాయి. '0' లెవల్ నుంచి 5వ లెవల్ వరకు ఇప్పటివరకు 10 సెట్లలో 85 పుస్తకాలను ఈ సిరీస్‌లో మంచి పుస్తకం ప్రచురించింది. చదవటంలో పిల్లలు ఏ స్థాయిలో ఉన్నారో వీటి ద్వారా తెలుసుకుని అక్కడినుంచి ముందుకి వెళ్లడానికి ఇవి ఎంతో ఉపయోగపడుతున్నాయి.

పిల్లల మానసిక వికాసానికి సాహిత్యం ఎలా దోహదపడుతుంది?

సురేష్: పుస్తకాలు చదవటం ద్వారా ఆలోచనా శక్తి, సృజనాత్మకత, భావ ప్రకటన వంటి ప్రయోజనాలు ఉంటాయని అనేకమంది చెపుతుంటారు. ఇందులో అనుమానం కూడా లేదు. కానీ, పిల్లలకు పుస్తకాలు అందుబాటులో ఉంచాలన్న ఆలోచన తప్పించి ఇతర ఏ ఉద్దేశాలు పెద్దవాళ్లకు ఉండకూడదు. పుస్తకాల నుంచి ఏం ఎంచుకుంటారో, ఏం నేర్చుకుంటారో పిల్లలకే వదిలెయ్యాలి. అది వాళ్ల వ్యక్తిగత పురోగతి.

ఏది బాల సాహిత్యం అని చెప్పడానికి నిర్దిష్ట ప్రమాణం ఏంటి?

భాగ్యలక్ష్మి: బాలలు అంటే 0-16 సంవత్సరాల వరకు ఉంటారు. వీళ్ల వివిధ ఆర్థిక, సామాజిక వర్గాలకు చెందిన వాళ్లు. వయస్సును బట్టి బొమ్మల సంఖ్య, ఫాంట్ సైజ్‌లలో తేడాలు ఉంటాయి. ఇక కంటెంట్ విషయానికి వస్తే వైవిధ్యానికి అంతు ఉండదు. తల్లిదండ్రుల మధ్య ఘర్షణ ఉండే కుటుంబ నేపథ్యం, ఆడపిల్లల వేధింపులతో మొదలుకుని మురికివాడల పిల్లల బొమ్మల కథల వరకు అన్నీ పిల్లల పుస్తకాలే. ఏ పుస్తకం ఎవరికి, ఎందుకు నచ్చుతుందో, ఎలా ప్రభావితం చేస్తుందో మనకి తెలియదని మంచి పుస్తకం బలంగా నమ్ముతుంది. సాధ్యమైనన్ని పుస్తకాలు పిల్లలకు అందుబాటులో ఉంచటమే మన పని.


ఈ ఇరవయ్యేళ్ల ప్రచురణల పర్వంలో మీకు ఎదురైన పెద్ద సవాళ్లు ఏమైనా ఉన్నాయా?

సురేష్: తెలుగులో చక్కటి మూల కథలు, నవలలు లేని కారణంగా అనువాదాలపై మొదట్లో ఎక్కువగా ఆధారపడాల్సి వచ్చింది. తానా సంస్థతో కలిసి రచనలను ఆహ్వానించి, ఎంపిక చేసిన వాటిని ప్రచురించటం ద్వారా దీనిని అధిగమించగలిగాం. మంచి పుస్తకం ప్రచురించిన 114 మూల రచనలలో 49 తానాతో చేసినవి!

మరొక పెద్ద సమస్య బొమ్మలు వేయించటం. మాకు బాగా చనువు ఉన్న శ్రీకాంత్ నాల్గింట మూడు వంతుల బొమ్మలు వేశాడంటే అతిశయోక్తి కాదు. అలాగే పావని, రాహక్ మాకు సన్నిహితమైన ఆర్టిస్టులు. చైతన్య పైరపు (కోవిడ్ కాలంలో చాలా చిన్న వయస్సులోనే చనిపోయాడు), తుంబలి శివాజీలు పరిచయం అయిన తరవాత బొమ్మలు వేయించటంలో వెసులుబాటు అయ్యింది. తాన సంస్థతో కలిసి ప్రచురించిన బొమ్మల కథల పుస్తకాలు, నవలలకి కొంతమంది కొత్త ఆర్టిస్టులతో బొమ్మలు వేయించాం.

తెలుగులో బాల సాహిత్యానికి ఆదరణ ఎలా ఉంది?

భాగ్యలక్ష్మి: కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలు తెలుగు పుస్తకాలు చదవాలని అనుకుంటున్నారు. మరి కొందరేమో తెలుగు వద్దని అనుకుంటున్నారు. అంతే కాకుండా ప్రయివేటు స్కూళ్లల్లో తెలుగులో మాట్లాడకూడదన్న నిబంధనలు, ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియం మొదలుపెట్టడం... ఇన్ని గందరగోళాల మధ్య కొట్టుమిట్టాడుతోంది తెలుగు బాల సాహిత్యం. ఇంతటి క్లిష్ట పరిస్థితులలోనూ మునుపటి కంటే ఇప్పుడు పిల్లల పుస్తకాల ఆదరణ బాగానే ఉందని చెప్పాలి.







ఇక తెలుగునాట వెలువడుతున్న బాల సాహిత్యం విషయానికి వస్తే సమకాలీన అంశాలతో కథలు చాలా తక్కువగా వస్తున్నాయి. కౌమార వయస్సు బాలల (యంగ్ అడల్ట్స్) కోసం పుస్తకాల అవసరం కూడా ఉంది. 'బాల్యం కథలు' చాలా మంది రాశారు. అలాగే పిల్లల కోసం కూడా రాస్తే బాగుంటుంది. పెద్దవాళ్ల కోసం రాసే వాళ్లు పిల్లల కోసం రాస్తే బాగుంటుంది. వాస్తవ జీవితాలు, అనుభవాల ఆధారంగా కథలు రాసే ఒరవడి ఏర్పడాలి.

నేటి తరం పిల్లల సైకాలజీ ఎలా ఉంటోంది? బాల సాహిత్యంతో వారికి స్నేహం కుదురుతోందా అసలు?

భాగ్యలక్ష్మి: ఇంగ్లీషులో తోటివాళ్లు చదువుతున్న దాన్ని బట్టి పెద్ద పెద్ద పుస్తకాలు, పుస్తకాల సీరీస్‌లు పిల్లలు చదువుతున్నారు. తెలుగులో చదువుతున్న పిల్లలకు చుట్టుపక్కల అంతగా పుస్తకాల వాతావరణం, చదివే సంప్రదాయం కనపడటం లేదు. కాబట్టి బాల సాహిత్యంతో అంతగా స్నేహం కుదరటం లేదనే చెప్పాలి.

పాఠ్య ప్రణాళికల్లో సాహిత్యాంశానికి ఎంత శాతం ప్రాధాన్యం ఉండాలి? ఆ మేరకు మన దగ్గర చోటు కల్పిస్తున్నారా లేదా?

సురేష్: పాఠ్య ప్రణాళికలలో ఏది చేరినా దానిని పరీక్షలు, మార్కుల దృష్టి నుంచే ఎక్కువగా చూస్తారు. తప్పనిసరిగా చదవాల్సిన దానికీ, ఇష్టంతో చదివే దానికీ మధ్య చాలా తేడా ఉంటుంది. పాఠ్యపుస్తకాలలోని కవితలు, కథలతో ప్రభావితం కావాలంటే వాటిని ఎంతో ఇష్టంగా చెప్పే టీచర్లు ఉండాలి. అలాంటి టీచర్లు తక్కువ, దీనివల్ల సాహిత్యం పట్ల ఇష్టం ఏర్పడే పిల్లలు ఇంకా తక్కువ.

డిజిటల్ యుగంలో.. అందునా కరోనా తర్వాత ఆన్‌లైన్ క్లాసుల కల్చర్ పెరిగింది. చిన్నారులు కూడా ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ వాడకానికి అలవాటు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఎలాంటి సాహిత్య ప్రయోగాలు అవసరమని భావిస్తున్నారు?

భాగ్యలక్ష్మి: అన్నం తినటం లేదనో, విసిగిస్తున్నారనో యూట్యూబ్ చూపించే వాళ్లు ఉన్నారు. పెద్దవాళ్లు కూడా చాలా ఎక్కువగా సెల్ ఫోన్, యూట్యూబ్, టీవీ, కంప్యూటర్, సోషల్ మీడియాలలో గడుపుతున్నారు. వెరసి పెద్దవాళ్ల స్క్రీన్ టైమ్ చాలా పెరిగింది. అదే పిల్లలకి కూడా అలవాటైతే నేరం మొత్తం వాళ్ల మీద మోపుతున్నాం.

చిన్న పిల్లలకి యూట్యూబ్ ఆడియో రైమ్స్, యానిమేటెడ్ కథలు, ఆడియో బుక్స్‌ని మంచి పుస్తకం ప్రోత్సహించటం లేదు. చేతిలో పుస్తకం పట్టుకోవటం కనీసం ఒక వయస్సు వరకైనా తప్పనిసరి అని మంచి పుస్తకం గాఢంగా నమ్ముతోంది. పిల్లలు చదవగలగటానికి పుస్తకాలే సరైన మాధ్యమం. డిజిటల్ మీడియా వేగంగా చొచ్చుకుని పోతున్న సమయంలో పుస్తకాన్ని, చదవటాన్ని బలంగా ముందుకు తీసుకుని వెళ్లాలంటే ప్రచురణకర్తల తోపాటు పుస్తకాలను పిల్లలకు దగ్గర చెయ్యటానికి తల్లిదండ్రుల, ఉపాధ్యాయులు, పెద్దవాళ్లు భాగస్వాములు కావాలి.

ఏఏ వయసు పిల్లలకి ఎలాంటి పుస్తకాలు ఇస్తే వారిలో పఠనాసక్తి పెరుగుతుంది?

సురేష్: చిన్న పిల్లలకు బొమ్మల కథల పుస్తకాలు, గొలుసు కట్టు కథలు (ఉదా: పేరు మరిచిన ఈగ, చిలక ముక్కు ఊడిపోయింది) బాగుంటాయి. పెద్దవాళ్ల కోసం రాసేటప్పుడు ఎటువంటి కథా లక్షణాలు ఉండాలో పిల్లల కథలలో కూడా అవే ఉండాలి. ముందు ముందు ఏం జరుగుతుందో అన్న ఉత్సుకతను కథ కలిగించాలి, ఒక సమస్య ఉండి దానికి పరిష్కారం ఉండాలి, క్లైమాక్స్ లేదా ముగింపు ఆశ్చర్యం కలిగించేలా ఉండాలి. మొత్తంమీద పెద్ద సంఖ్యలో మంచి పుస్తకాలు, సమాజంలో చదివే వాతావరణం ఉంటే పిల్లల్లో కూడా పఠనాసక్తి పెరిగే అవకాశం ఉంది.

ఈ ప్రయాణంలో పరిపరి తలుచుకునే ఇష్టం సందర్భాల గురించి చెప్పండి?

భాగ్యలక్ష్మి: విభవసు అని ఒక అబ్బాయి చిన్నప్పటి నుంచి హెచ్‌బిఎఫ్‌లో మా స్టాలులో కూర్చుని సైన్స్ పుస్తకాలు చదువుకునేవాడు. తెలుగులో చదవటం వల్ల కాన్సెప్ట్స్ చాలా వరకు అర్థం అయ్యాయని, తోటి విద్యార్థులకు అనుమానాలు ఉంటే వివరించగలిగేవాడినని, తద్వారా ఎంతో నేర్చుకున్నానని విభవసు చెప్పాడు. ఆ కారణంగానే యాస్ట్రో ఫిజిక్స్‌లో ఆసక్తి ఏర్పడిందనీ చెప్పాడు. ఎంతో సంతోషం కదా!

హైదరాబాదు పుస్తక ప్రదర్శన జరుగుతున్నప్పుడు ఆఫీసు మూసివేస్తాం. ఆ సమయంలో నల్లగండ్లలోని తల్లిదండ్రుల దగ్గరకు అమెరికా నుండి వచ్చిన ఒక తల్లి తన కొడుకుతో ఆఫీసుకు వచ్చింది. ఆఫీసు మూసి ఉండటంతో అంతటి ఎండలో బుక్ ఫెయిర్‌కి వాళ్లు వచ్చారు. అక్కడికి రాగానే తనకి పరిచయం ఉన్న 'కోటయ్య కట్టిన ఇల్లు' కనపడటంతో దానిని తీసుకుని ఆ బాబు కింద కూర్చుని దాంట్లో మునిగిపోయారు. పెద్దవాళ్లు కూడా పిల్లలతో సమానంగా పుస్తకాలు చూసి ఆనందపడుతుంటే అవే మాకు ఆనంద క్షణాలు.

బాల సాహిత్య వృద్ధికి వచ్చే రోజుల్లో మీరెలాంటి కృషి చేయాలని భావిస్తున్నారు?

భాగ్యలక్ష్మి: నేల విడిచి సాము చెయ్యకుండా ఇప్పుడు చేస్తున్న పనిని ఇంకా బాగా చెయ్యాలి. మూల రచనలను ప్రోత్సహిస్తూనే అనువాదం కోసం మంచి పుస్తకాలను ఎంపిక చేసి తెలుగులోకి తీసుకుని రావాలి. ఆలోచనలు పుట్టి, కొంత పని జరిగి ప్రచురణ వరకు రాని పుస్తకాలు ఎప్పుడూ ఉంటూ ఉంటాయి. మళ్లీ కొత్త శక్తినీ, స్ఫూర్తినీ తెచ్చుకుని వాటిని వెలుగులోకి తీసుకుని వచ్చే ప్రయత్నం చేస్తూ ఉంటాం.

ఇంటర్వ్యూ ■ ఒమ్మి రమేష్ బాబు

పార్వతీశం, నీకు వందేళ్ళు!

1924లో తెలుగులో పూర్తి హాస్య నవలగా ముద్రింపబడినది మొక్కపాటి నరసింహశాస్త్రి 'బారిష్టర్ పార్వతీశం'. ఈ నవలకు రచయితనంటే తప్ప గుర్తుపట్టలేనంతగా నవల ప్రఖ్యాతి తనను విఎంచి స్థిరపడిపోయిందని, "ఆ పేరు మీదనే నేటికీ చెలామణీ అవుతున్నా"నని మొక్కపాటి నరసింహశాస్త్రి ఒకచోట చెప్పుకుంటారు. గత శతాబ్ద కాలంలో (1924-2024) ఈ నవల పొందిన ప్రజాదరణకు ఇదొక నిదర్శనం.

తెలుగు నవలా సాహిత్యంలో హాస్య రచనలు కాస్త తక్కువే. ఆ తరహా రచనలు చేసిన వారిని వేళ్ళ మీద లెక్కించవచ్చు. హాస్యం ద్వారా 'వ్యంగ్యం' చెప్పేవారున్నారు. నిజానికి రెండూ వేరు వేరు. ఎన్.ఆర్. నంది, పతంజలి, ఆదివిష్ణు, డి.వి. నరసరాజు, యర్రంశెట్టి సాయి, జంధ్యాల తదితరులు, వీరితోపాటు ముళ్లపూడి వెంకటరమణ, శ్రీరమణలను ప్రత్యేకంగా ప్రస్తావించుకోవాలి. 'రాజకీయ భేతాళ పంచ వింశతిక', 'నవ్వులో శివుడున్నాడురా' వంటి రచనలు నేటికీ 'వాస్తవ దృశ్యాలు'గా నిలిచి ఉన్నాయంటే కారణం- 'హాస్యం' (వ్యంగ్యం).

ఏముందీ 'బారిష్టర్ పార్వతీశం' నవలలో అనే సందేహం ఉన్నవారు బహుశా తెలుగు లోకంలో తక్కువనే నా భావన. ఇది మూడు భాగాల రచన. మొదటి భాగంలో ఉన్న హాస్యం రెండు మూడు భాగాలలో క్రమంగా తగ్గిందనే భావన ఉంది. ఇందుకు కారణంగా రచయిత 'హాస్యం జీవితంలో అన్ని దశల్లోనూ సమానంగా ఉండకపోవచ్చు' అని సర్ది చెప్పారు. వాస్తవం కూడా అంతే కదా. ఈ రచనలో ప్రధాన పాత్ర పార్వతీశం. ఇతను నరసాపురం దగ్గర మొగల్తూరు గ్రామవాసి. పడవ ప్రయాణం అతని నిత్య వ్యవహారం. అతను చదువు కోసం చెన్నై వెళ్లాడు. అక్కడి నుంచి ఇంగ్లాండ్ వెళ్లి బారిష్టర్ చదువుకొని వచ్చాడు. ఇదీ వరుసగా ఆ కుర్రాడి జీవితంలో 'వివిధ వికాస దశలు'. అయినా 'ఆంగ్లేయ విద్యతో పాటు అబ్బవలసిన అనేక రకాలైన సుగుణాలు అతనిలో కొరతపడ్డాయి. నేటి నాగరికతంతా అతనికి కొత్త. ఎన్నడూ రైలెక్కి ఎరగని వ్యక్తి అని శాస్త్రిగారు ముందుమాటలో చెబుతారు. అటువంటి వ్యక్తి ఇంగ్లాండు వరకు వెళ్లి బారిష్టర్ చదివి వచ్చాడంటే నమ్మవలసిందే.

పార్వతీశం చేసే ప్రతీపనిలో చదువరికి హాస్యం 'కనిపిస్తుంది'.



రైలులో అతడి నడత, మద్రాసులోనూ పడిన అవస్థలు, స్టీమర్‌లో చిక్కులు... రచన చదువుతున్నంతసేపు ఒక ఘట్టానికి మించి మరొక ఘట్టం కడుపు చెక్కలయ్యేలా నవ్విస్తుంది. చక్కని, ఆరోగ్యవంతమైన హాస్యాన్ని రచయిత మొక్కపాటి నరసింహశాస్త్రి ఈ రచనలో స్పృశించారు.

'బారిష్టర్ పార్వతీశం' చిరంజీవిగా నిలిచిపోవడానికి కారణం- ప్రధాన వస్తువులోని సునిశితమైన 'సన్నివేశపరమైన హాస్యం' దానికి సరిజోడైన 'సంభాషణ పరమైన' హాస్యం. అలాగే మనం కొత్త ప్రాంతాలకు పోయినప్పుడు అక్కడ ఆచార వ్యవహారాలు, వస్తువులు చూసినప్పుడు వాటిని ఎలా అనుసరించాలో తెలియక అయోమయానికి గురవుతాం. ఫోర్క్, చెంచాలతో దోశ తినటం ఎలానో నాకిప్పటికీ తెలియదని ప్రముఖ సినీ హాస్య రచయిత, దర్శకుడు జంధ్యాల అంటారు. అటువంటిది మొగల్తూరులోని అమాయకమైన కుర్రాడు చెన్నై, ఇంగ్లాండ్లకు వెళితే...!? "పొరపాటు మరో పొరపాటుకి మూలమై వికృతులు ఒకదానికొకటి గుది గ్రుచ్చినట్లు పెనవేసుకున్నట్లు చూపించి, ఊహకందని వంపులోకి కథను ఈడ్చితే"! అతనికి ఆవేదన, చదువరులకు ఆనందం!


పార్వతీశం స్వభావతః మూర్ఖుడు కాదు. పరిస్థితులతనిని మూర్ఖునిగాచేసి వెక్కిరిస్తాయి. పార్వతీశానికి మించి ఎప్పుడో ఒకప్పుడు నవ్వుల పాలైన అవస్థలు జీవితంలో మనం కూడా ఎదుర్కొనే ఉంటాం. అందుకే పార్వతీశం మనందరివాడు. ఇందుకు కారకులైన మొక్కపాటి వారికి తెలుగు సాహితీ లోకం రుణపడి ఉంది.

> **పార్వతీశం స్వభావతః మూర్ఖుడు కాదు. పరిస్థితులతనిని మూర్ఖునిగా చేసి వెక్కిరిస్తాయి. పార్వతీశానికి మించి ఎప్పుడో ఒకప్పుడు నవ్వుల పాలైన అవస్థలు జీవితంలో మనం కూడా ఎదుర్కొనే ఉంటాం. అందుకే పార్వతీశం మనందరివాడు. ఇందుకు కారకులైన మొక్కపాటి వారికి తెలుగు సాహితీ లోకం రుణపడి ఉంది.**

'బారిష్టర్ పార్వతీశం' రచనలో అతడు ఆడవాళ్ళ టోపీ కొనటం, ఫ్రాన్స్‌లో షాపులో తివాచీ మీద నడవకూడదేమోననుకొని మైనం నునుపు పెట్టిన చెక్కల మీద నడవబోయి పడిపోవటం... ఇలా ఆ పాత్ర చేతకానితనం మనకు విపరీతమైన హాస్యాన్ని అందిస్తుంది. కానీ ఆ పరిస్థితుల్లో మనం ఉంటే అనే ఆత్మ పరిశీలన చేసుకుంటే నవ్వు రాదు. "ప్రతీ హాస్యం వెనుక ఓ విషాదం ఉంటుందనే" చార్లీ చాప్లిన్ వ్యాఖ్యానం ఈ రచనంతటా కనిపిస్తుంది. మానవుడు చాలా విషయాల్లో అజ్ఞానుడు. అతనిలో అజ్ఞాన జనితమైన అపచారాలు చాలా ఉంటాయి. ఇటువంటివి కొన్ని చేర్చి ఒక వ్యక్తిలో చూపించటం కొంతవరకు అతిశయోక్తిలా కనిపించినా తప్పక హాస్యజనకంగా ఉంటుందంటారు రచయిత. హాస్యాన్ని ఆస్వాదించేవారు ఎంతమంది ఉంటారో, విమర్శించేవారు అంతకుమించి ఉంటారు. ముఖ్యంగా ఆంధ్రదేశంలో 'ఇది కాపీ రచన' అని, 'వీడి బొంద ఇంతగా హాస్యం రాయడం మన వాళ్లకు.. అబ్బే' అన్నవారున్నారని రచయిత అంటారు. ఈ విషయం గురించి రచయిత తన ముందుమాటలో "ప్రతీ ఆంధ్రుడికి ఒక గట్టి నమ్మకం. ఏమంటే బుద్ధి కుశలత కలిగిన ఏ పనిగాని ఆంధ్రుడు చేయలేడని. అందుకని అటువంటి అపురూపమైన రచన ఏదైనా కనబడితే 'ఇది ఎక్కడో చేతి దెబ్బ కొట్టాడని' అనుకొని తృప్తి పడతారు. అలా అనుకోకపోతే పాపం వారికి ఆ పూట భోజనం చేసినట్లుండదు" అని రాసుకున్నారు. ఇది నాటికి (1924) నేటికి (2024) ఏనాటికి వాస్తవమే కావచ్చు.

రచయిత వాక్యాలలోనే ముగింపు పలుకుతాను: "ఎవరైనా నాకు నవ్వు ఎప్పుడూ రాదు అంటే అతని శరీరతత్వంలో ఏదో జబ్బు ఉన్నదన్న మాట. లేదూ ఏమైనా సరే నేను నవ్వనని ఎవరైనా భీష్మించుకుని కూర్చుంటే అతనికి కొంచెం దూరంలో ఉండటం మంచిదన్నారు (ఇది కూడా ఓ ఆంగ్ల రచయిత చెప్పినదే సుమండీ. నేను గొప్ప ఆంధ్రున్ని మరి)".

■ భమిడిపాటి గౌరీ శంకర్
☎ 94928 58395



వృద్ధాప్యం ఒడ్డున

కనపడకుండా భూగర్భంలో
విత్తనం పెరుగుతున్నట్టు
పెరిగిపోతున్న వయస్సు

వయసొచ్చేది శరీరానికి
శరీర యంత్రాలకే అయినా
మనస్సుకీ ఆలోచనలకీ
ఎంత దూరమో..

నడవాల్సిన దారికి
నడిచొచ్చిన దారి
ఎన్నెన్ని రహస్య సూచనలో

వృద్ధాప్యం ఒడ్డుకి చేరుకుంటున్నపుడు
కొత్త జీవితంలోకి అడుగుపెడుతున్నట్టుంది

సముద్రమధ్యంలో
అణిగిమణిగి ఉన్న అలల్లా
తీరానికి చేరువవుతున్న కొద్దీ
తెలియని ఉద్వేగం

నీటిలో దాని కాళ్లను
చూసుకుంటున్న వంతెనలా
ప్రపంచాన్ని ఇంతవరకూ చూసిన కళ్లు
గతాన్ని గుర్తు చేసుకుంటూనే ఉన్నాయి

పేరుకున్న ధైర్యంతో వృద్ధాప్యం
వ్యాధిలా అనిపించక
కాలాతీత ఆరోహణో
నాతో పెరుగుతున్న సంఖ్యలానో అనిపిస్తోంది

సాయంకాలం వెలుగులా
చూస్తూ చూస్తూనే శక్తి సన్నగిల్లుతున్నా
దూరాన చీకటిలో కూడా
ఎక్కడో మిణుకు మిణుకుమంటున్న కాంతి

మనస్సులోకి ఏ ముసలితనాన్నీ రానివ్వక
కొవ్వొత్తిలా కరుగుతూ
నిశ్శబ్దంగా నేర్చుకుంటున్నదే
అనువాదం చేసుకుంటున్నాను

సూర్యోదయాలే కాదు
సూర్యాస్తమయాలూ ఇష్టమే
రెండూ అనివార్యాలేనన్న ఎరుకతోనే
ఎంత దూరమైనా ప్రయాణం

■ ముకుంద రామారావు
☎ 99083 47273

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru







అభ్యర్థి వస్తేనే..!



- క్షేత్రస్థాయిలో ప్రారంభం కాని బీఆర్ఎస్ ప్రచారం
- పోలింగ్‌కు మిగిలింది మరో మూడు వారాలే
- అయినా.. ఇంటింటి ప్రచారం లేదు
- అగ్రనేతలు సూచిస్తున్నా.. అదే తీరు
- అయోమయంలో పార్టీ శ్రేణులు
- పలువురు ఎమ్మెల్యేలు పార్టీ వీడుతారని ప్రచారం
- ప్రచారం చేయకపోవడానికి కారణమదేనా..?

పార్లమెంట్ స్థానం.. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు.. 25 నుంచి 30 లక్షల మంది ఓటర్లు.. బరిలో నిలిచే అభ్యర్థి అన్ని ప్రాంతాల్లో తిరిగే అవకాశం ఉండదు. అందరు ఓటర్లను కలిసే తీరిక దొరకదు. ఎక్కడికక్కడ ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు ప్రజలను కలవాలి. తమ పార్టీ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలి. కానీ, పార్లమెంట్ ఎన్నికల వేళ గ్రేటర్ బీఆర్ఎస్‌లో ఆ పరిస్థితి కనిపించడం లేదు.


హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గాల వారీగా బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం ఇంకా ప్రారంభం కాలేదు. మరో రెండు రోజుల్లో నామినేషన్ల దాఖలు ముగియనుంది. పోలింగ్‌కు గడువు మూడు వారాలు మాత్రమే ఉంది. అయినా ప్రచారంపై ప్రధాన ప్రతిపక్షం అంతగా దృష్టి సారించలేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. అభ్యర్థులు కాళ్లకు బలపం కట్టుకొని తిరుగుతున్నా.. పార్టీ అధిక ప్రాధాన్యమిస్తోన్న శాసనసభ్యుల్లో కొందరు మాత్రం ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. కొందరు కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, సీనియర్ నాయకులదీ అదేతీరు. కాలనీ, బస్తీలను ఏకం చేస్తూ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రచారం నిర్వహించిన బీఆర్ఎస్‌లో ఇప్పుడా జోష్ కనిపించడం లేదు. అభ్యర్థులు వస్తే తప్ప.. క్షేత్రస్థాయిలో ప్రచారం జరుగుతున్న దాఖలాలు దాదాపుగా లేవు. ఎమ్మెల్యేలు పార్టీ వీడుతారన్న ప్రచారం నేపథ్యంలో తాజా పరిణామాలు పార్టీ శ్రేణులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ క్రమం తప్పకుండా పార్టీ నేతలతో సమీక్ష నిర్వహిస్తున్నారు. క్షేత్రస్థాయిలో అనుసరించాల్సిన వ్యూహాలు, ప్రచారం ఎలా చేయాలనే దానిపై దిశానిర్దేశం చేస్తున్నారు. ఇటీవల అభ్యర్థులకు బీ-ఫారంలు ఇచ్చిన సందర్భంగా పార్టీ అధినేత కేసీఆర్ నేతలతో మాట్లాడారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు.. తెలంగాణ ప్రయోజనాల కోసం బీఆర్ఎస్ గెలుపు ఎంత అవసరమో ప్రజలకు

కారణమదేనా..?

గ్రేటర్ నుంచి పలువురు ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారని కాంగ్రెస్ పార్టీ ప్రచారం చేస్తోంది. ఇప్పటికే కొందరు ఎమ్మెల్యేలు అధికార పార్టీతో సంప్రదింపులు జరిపినట్టు తెలిసింది. హస్తం గూటికి వెళ్లాలా..? వద్దా..? అన్న దానిపై ప్రస్తుతానికి ఊగిసలాటలో ఉన్నట్టు సమాచారం. పోలింగ్ నాటికి ఒకరిద్దరు కారు దిగే అవకాశమూ లేకపోలేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. అందుకే ఎన్నికల ప్రచారాన్ని అంతగా పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ఇప్పటికే రెండు పర్యాయాలు సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. పార్టీలోకి చేరేందుకు సీఎం వద్ద సుముఖత వ్యక్తం చేసినట్టు సమాచారం. ఒకటి, రెండురోజుల్లో చేరిక ఉంటుందని ప్రచారం జరిగింది. కానీ, అనుచరులతో సమావేశం నిర్వహించిన ఆయన యూ టర్న్ తీసుకున్నారు. ప్రస్తుతానికి బీఆర్ఎస్‌ను వీడేది లేదని పేర్కొన్నారు. ప్రకాష్‌గౌడ్ చేరిక బహిర్గతం కాగా.. గోప్యంగా కాంగ్రెస్‌తో టచ్‌లో ఉన్న ఎమ్మెల్యేలు ఏం చేయనున్నారన్నది ఆసక్తికరంగా మారింది. ప్రచారం చేయకపోవడానికి పార్టీని వీడాలా..? వద్దా..? అన్న ఊగిసలాట కూడా కారణమా..? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

కాంగ్రెస్ వ్యూహం ఫలించేనా?

- కంటోన్మెంట్‌లో పూర్వవైభవం కోసం యత్నం
- ప్రత్యేక దృష్టి సారించిన రేవంత్ రెడ్డి
- ఉప ఎన్నికలో విజయం సాధించేలా పావులు



కంటోన్మెంట్ నియోజకవర్గం ఒకప్పుడు కాంగ్రెస్ పార్టీకి కంచుకోట. అక్కడ మళ్లీ పార్టీ జెండాను ఎగురవేసి నగరంలో బోణీ కొట్టాలని కాంగ్రెస్ ప్రయత్నం చేస్తోంది. రాష్ట్రంలో ఉప ఎన్నిక జరుగుతున్న ఏకైక అసెంబ్లీ స్థానాన్ని కైవసం చేసుకోవాలని వ్యూహాలు రచిస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి దీనిపై ప్రత్యేక దృష్టి సారించడంతో ఇక్కడి రాజకీయాలు రంజుగా మారాయి.

సికింద్రాబాద్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ ఉపఎన్నిక ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. కంటోన్మెంట్ నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున గెలిచిన ప్రతి ఒక్కరూ రాష్ట్ర మంత్రివర్గంలో చోటు దక్కించుకున్నట్లు చరిత్రను పరిశీలిస్తే తెలుస్తోంది. ఇక్కడి నుంచి 1994లో విజయం సాధించిన దివంగత నేత డి.నర్సింగ్‌రావు రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. 2009లో షాద్‌నగర్ నుంచి వచ్చి, ఇక్కడ పోటీ చేసి గెలిచిన పి.శంకర్‌రావు సైతం రాష్ట్ర మంత్రివర్గంలో చోటు సంపాదించారు. కంటోన్మెంట్‌కు చెందిన సర్వే సత్యనారాయణ స్థానిక మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గం నుంచి హస్తం పార్టీ తరఫున గెలిచి కేంద్ర మంత్రిగా ఎదిగారు. పార్టీలకు అతీతంగా జరిగే ఎన్నికలైనప్పటికీ సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పాలక మండలి ఎన్నికల్లో కూడా గతంలో అన్ని వార్డుల నుంచి కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులే విజయం సాధిస్తూ వచ్చారు. దాంతో

మిగతా 8వ పేజీలో..



మానసిక ఆరోగ్య సమస్యలకు

పెట్స్ థెరపీ!

- వాటితో ప్రవర్తనాపరమైన మార్పులు
- ఆటిజం రోగులలో డాగ్ థెరపీతో మార్పు: జర్మనీ అధ్యయనం
- ఇతర చికిత్సలకు ప్రత్యామ్నాయం కాదంటున్న సైకాలజిస్టులు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : సాయి.. ఓ పదిహేనేళ్ల కుర్రాడు. తన తోటి పిల్లలతో ఎప్పుడూ కొట్లాడుతూనే ఉంటాడు. స్కూల్ నుంచి మాత్రమే కాదు, పక్కింటి వాళ్ల నుంచి ఫిర్యాదులూ ఎక్కువే! దీంతో తల్లిదండ్రులు అతన్ని కొట్టడం, తిట్టడం చేశారు. అయినా.. అతని ప్రవర్తనలో మార్పు రాలేదు. స్నేహితులు ఆఫర్ చేయడంతో ఇంటికి ఓ పెట్‌ను తీసుకువచ్చాడు సాయి తండ్రి. అంతే.. అప్పటి వరకూ అందరితోనూ గొడవలు పడే సాయి ప్రవర్తనలో గణనీయమైన మార్పులు వచ్చాయి. తోటి పిల్లలతో సరదాగా మాట్లాడుతున్నాడు. తమ పెట్ బాగోగులనూ చూసుకుంటున్నాడు.

ఇది ఒక్క సాయి విషయంలో మాత్రమే కాదు.. ప్రపంచ వ్యాప్తంగా ఎంతోమందిలో ప్రవర్తనా పరమైన మార్పులను తీసుకురావడంలో పెట్స్ కీలకపాత్రనే పోషిస్తున్నాయంటున్నాయి అధ్యయనాలు. మానసిక ఆరోగ్య సమస్యలకు ఈ పెట్స్ థెరపీ ఉపయోగపడుతోందని పలు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. జంతువులతో ఇంటరాక్ట్ కావడం వల్ల కార్టిసోల్ (ఒత్తిడికి సంబంధించిన హార్మోన్) తగ్గుతుంది. దీనితో పాటుగా

మిగతా 8వ పేజీలో..

ఇప్పటివరకు రూ.14.63 కోట్లు సీజ్..



హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఆదివారం పలు ప్రాంతాల్లో నిర్వహించిన తనిఖీల్లో రూ.5.88 లక్షలు పట్టుబడినట్టు జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్ తెలిపారు. షెడ్యూల్ విడుదలైన నాటి నుంచి ఇప్పటివరకు రూ.14.63 కోట్ల నగదు, రూ.6.90 కోట్ల విలువైన వివిధ వస్తువులు, 20,920 లీటర్ల మద్యం పట్టుకున్నారు. 208 మందిపై కేసులు నమోదు కాగా.. 206 మందిని అరెస్టు చేశారు.

అయినా.. చికెన్, మటన్ విక్రయం

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మహావీర్ జయంతి సందర్భంగా ఆదివారం నగరంలోని పలు ప్రాంతాల్లోని దుకాణాల్లో చికెన్, మటన్ విక్రయాలు యథేచ్ఛగా జరిగాయి. చికెన్, మటన్ దుకాణాలు మూసివేయాలని జీహెచ్ఎంసీ ఆదేశాలు జారీ చేసింది. అలాగే ఆయా సర్కిళ్ల పరిధిలో దుకాణాలు తెరవకుండా చర్యలు తీసుకోవాలని అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్లు/డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లను కమిషనర్ రోనాల్డ్‌రోస్ ఆదేశించారు. ఆదేశాలు ఉల్లంఘిస్తూ పలు ఏరియాల్లో దుకాణాలను తెరిచారు. ఉదయం పూట సగం షెట్లర్లు తెరిచి విక్రయాలు కొనసాగించిన వ్యాపారులు.. సాయంత్రానికి పూర్తిగా తెరిచారు. అయినా.. ఎక్కడా జీహెచ్ఎంసీ అధికారులు కనిపించకపోవడం గమనార్హం.

హనుమాన్ జయంతి రోజున

మద్యం విక్రయాలు బంద్



- ఆదేశాలు జారీ చేసిన సీపీ

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): హనుమాన్ జయంతి రోజున మద్యం విక్రయాలపై నిషేధం విధిస్తూ హైదరాబాద్ సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఈనెల 23న ఉదయం 6 గంటల నుంచి బుధవారం ఉదయం 6 గంటల వరకు ఈ నిషేధం అమలులో ఉంటుంది. జంటనగరాల పరిధిలో అన్ని కల్లుదుకాణాలు, వైన్‌షాపులు, బార్‌లు మూసివేస్తారు. హనుమాన్ జయంతి సందర్భంగా నగరంలో భారీ ర్యాలీ నిర్వహిస్తారు.

చర్చ లేకుండా
చట్టాల మార్పు సరికాదు 8

ఐటీ జోన్‌లో
మద్యం, గంజాయి 6



ఏనుగమ్మా ఏనుగు..

అరెరే.. ఈ ఏనుగుపై బండరాళ్లు ఇలా ఎలా పేర్చారని అనుకుంటున్నారా.. అలా అనుకుంటే తప్పులో కాలేసినట్టే.. ఒకదానిపై ఒకటున్న బండరాళ్లలో కింద ఉన్నదానికి ఏనుగు ఆకారంలో పెయింట్ వేశారు. దీంతో ఈ బండరాళ్లను ఏనుగు మోస్తున్నట్టుగా కనిపిస్తోంది. ఈ దృశ్యం షాపూర్‌నగర్‌లో కనిపించింది.

పరీక్ష కేంద్రం తెలియక

విద్యార్థిని ఆందోళన

- కేంద్రానికి చేర్చి మానవత్వం చాటుకున్న నారాయణగూడ ఇన్‌స్పెక్టర్

అంబర్‌పేట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పరీక్ష కేంద్రాన్ని గుర్తించడంలో అయోమయానికి గురైన విద్యార్థినిని సకాలంలో పరీక్ష కేంద్రానికి చేర్చి నారాయణగూడ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ మానవత్వాన్ని చాటుకున్నారు. నల్గొండ జిల్లా నార్కట్‌పల్లికి చెందిన విద్యార్థిని వైష్ణవి తన అమ్మమ్మతో కలిసి ఆదివారం టీఎస్ఆర్‌జేసీ పరీక్షలు రాయడానికి నగరానికి వచ్చింది. ఆమె పరీక్ష కేంద్రం అంబర్‌పేట సీపీఎల్ బాలుర పాఠశాల. కాగా ఆటోడ్రైవర్ వారిని నారాయణగూడ విఠల్‌వాడి ప్రాంతంలోని పాఠశాల వద్ద దింపాడు. పరీక్ష సమయం సమీపిస్తున్న సమయంలో తప్పుడు పరీక్షా కేంద్రం వద్దకు వచ్చినట్లు విద్యార్థిని గుర్తించింది. ఏం చేయాలో తెలియక ఆందోళన చెందుతున్న సమయంలో పెట్రోలింగ్ విధుల్లో ఉన్న నారాయణగూడ ఇన్‌స్పెక్టర్ అక్కడికి వెళ్లి విద్యార్థిని సమస్యను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంటనే స్పందించి తన పోలీస్‌వాహనంలో వైష్ణవిని అంబర్‌పేట సీపీఎం బాలుర ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రానికి తీసుకెళ్లారు. మరో రెండు నిమిషాలు ఉండగానే పరీక్షా కేంద్రానికి చేర్చి పరీక్ష రాసే విధంగా సహకరించారు.



పోలీసు వాహనంలో విద్యార్థిని వైష్ణవితో ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్

ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ తాను గతంలో అంబర్‌పేటలో ఎస్సైగా పనిచేశానని, తనకు ఆ ప్రాంతంపై అవగాహన ఉండటంతోనే సకాలంలో విద్యార్థినిని పరీక్ష కేంద్రానికి చేర్చానని చెప్పారు. పరీక్ష పూర్తయిన తర్వాత వైష్ణవి ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్‌కు ఫోన్ చేసి కృతజ్ఞతలు తెలియజేసింది. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పలువురు ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్‌ను అభినందించారు.

ఫాసిజాన్ని ప్రేమతోనే ఓడించగలం 8

ఇటు ఇంపు..

అటు కంపు



పీపుల్స్ ప్లాజాలో లేజర్‌షోను తిలకిస్తున్న సందర్శకులు

నయనానందం వెనుక భరించలేని వాసన

- ముక్కుపుటాలదిరేలా సాగర్ జలాల దుర్వాసన
- ఇబ్బందులు పడుతున్న నగర ప్రజలు

నెక్లెస్ రోడ్డు పరిసరాల్లో ఆహ్లాదం కోసం వచ్చే సందర్శకులు అనారోగ్యాన్ని వెంటపెట్టుకుని వెళ్లే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. వేసవి కాలం సాయంత్రపు వేళల్లో సరదాగా కుటుంబీకులతో వచ్చే వారు లేజర్ షోతో ఎనలేని ఆనందం పొందుతున్నప్పటికీ సాగర్ జలాల కంపుతో ఈసడించుకునే పరిస్థితి ఏర్పడుతోంది.

ఖైరతాబాద్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ మార్గంలో కొద్దిరోజుల క్రితం వరకు నిర్వహించిన లేజర్ షోను ట్రాఫిక్ ఇబ్బందుల కారణంగా ప్రస్తుతం పీపుల్స్ ప్లాజాకు మార్చారు. ఇక్కడ ప్రతిరోజూ సాయంత్రం 6.30 నుంచి 9.30 వరకు మూడు షోలుగా లేజర్‌షో నిర్వహిస్తుండగా శని, ఆదివారాల్లో 4 షోలు చేస్తున్నారు. అంతర్జాతీయ స్థాయిలో రికార్డు సృష్టించిన 'నాటు.. నాటు' పాటతో పాటు వందేమాతరం పాటకు అనుగుణంగా వాటర్ ఫౌంటేయిన్‌లను ఆడిస్తూ సాగే ఈ షోకు సందర్శకుల నుంచి

మిగతా 8వ పేజీలో..

సీనియర్ సైంటిస్ట్ పేకాట దందా

● పేకాట స్థావరంపై దాడి.. 14 మంది అరెస్ట్

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): కండ్లకోయ టీచర్స్ కాలనీలోని పేకాటస్థావరంపై ఎస్‌ఓటీ, మేడ్చల్ పోలీసులు ఆదివారం దాడి చేశారు. నిర్వాహకుడితోపాటు పేకాట ఆడుతున్న 13 మందిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ. 53 వేల నగదు, 13 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. విచారణలో ఓ ప్రముఖ సంస్థలో సీనియర్ సైంటిస్ట్‌గా పనిచేస్తున్న పెగినేని రాజేష్ అక్రమ సంపాదన కోసం గ్యాంబ్లింగ్ స్థావరాలను నిర్వహిస్తున్నాడని, ప్రతీ ఆటకు రూ.వెయ్యి కమీషన్ తీసుకుంటున్నాడని పోలీసులు గుర్తించారు.

'సీపెట్' డిప్లొమా కోర్సుల ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

● జూన్ 9న కామన్ అడ్మిషన్ టెస్ట్ ● అందుబాటులో పీజీ కోర్సులు

కుషాయిగూడ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): చర్లపల్లి పారిశ్రామికవాడ ఫేజ్-2లో ఉన్న కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఇంజనీరింగ్ టెక్నాలజీ(సీపెట్-హైదరాబాద్)లో డిప్లొమా కోర్సుల ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ప్రోగ్రామ్స్ ఇన్ ప్లాస్టిక్స్ టెక్నాలజీ అండ్ ప్లాస్టిక్స్ మౌల్డ్ టెక్నాలజీ అంశాలలో మూడేళ్ల డిప్లొమా కోర్సులో చేరేందుకు పదవ తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులు. డిప్లొమా అనంతరం విద్యార్థులు ఈ-సెట్ ద్వారా బీ-టెక్ రెండో సంవత్సరంలో చేరే అవకాశం ఉంటుందని, ఈ సంస్థలోనే క్యాడ్/క్యామ్‌తో 'పీజీ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ మౌల్డ్ డిజైన్' కూడా అందుబాటులో ఉంది. బీఎస్సీ పూర్తి చేసిన విద్యార్థులకు 'పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ ప్రాసెసింగ్ అండ్ టెస్టింగ్ కోర్సు'ను అందిస్తున్నారు. జూన్ 9న కామన్ అడ్మిషన్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు సంస్థ ట్రైనింగ్ ఇన్‌చార్జి ఆంజనేయ శర్మ తెలిపారు. తమ సంస్థ అందించే శిక్షణ, సాంకేతిక సేవలు, ప్లేస్‌మెంట్స్, ఇతర సౌకర్యాలను తెలుసుకునేందుకు వీలుగా 'ఓపెన్ హౌజ్'ను నిర్వహిస్తున్నామని, ఇతర వివరాలకు 8093140230, 8374064444లో సంప్రదించాలని సూచించారు.

ఐటీ జోన్‌లో మద్యం, గంజాయి

● 24 గంటలు అమ్మకాలు ● పట్టించుకోని అధికారులు

ఐటీ జోన్ పరిధిలో చీమ చిటుక్కుమన్నా కనిపెట్టే నిఘా వ్యవస్థ అందుబాటులో ఉన్నప్పటికీ కిరాణం, చికెన్ దుకాణాల్లో 24 గంటలూ మద్యం, గంజాయి విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. అధికారులు పట్టించుకోవడం లేదు.



రాయదుర్గం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతానికి వేలాదిమంది కార్మికులు వలసొచ్చి జీవిస్తున్నారు. కొందరు భవన నిర్మాణ పనులు చేస్తుండగా, మరికొందరు ఐటీ కంపెనీల్లో హౌజ్ కీపింగ్, సెక్యూరిటీ ఉద్యోగాలు చేసుకుంటూ తమ కుటుంబాలను పోషించుకుంటున్నారు. వీరిని లక్ష్యంగా చేసుకుని మద్యం వ్యాపారులు కిరాణం, చికెన్ దుకాణాలకు మద్యం సరఫరా చేస్తున్నారు. నానక్‌రాంగూడ గ్రామం, గౌలిదొడ్డి, కేశవనగర్, టీఎన్‌జీకాలనీ ప్రాంతాల్లో 24 గంటలు అందుబాటులో ఉండడంతో పేదలు ఉదయం నుంచి రాత్రి వరకు మద్యం తాగి జేబులు ఖాళీ చేసుకుంటున్నారు. కొందరు పనికి వెళ్లకపోవడంతో ఇళ్లు గడవడం లేదు. కొన్ని దుకాణాల్లో గంజాయి కూడా విక్రయిస్తున్నారు. దీంతో కూలీలు మత్తుకు బానిసవుతున్నారు. కుటుంబ సభ్యులతో గొడవపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మద్యం, గంజాయి విక్రయాలను అరికట్టాలని పలువురు కోరుతున్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి

ఈద్ మిలాప్‌లు సోదరభావాన్ని పెంపొందిస్తాయి

● కాంగ్రెస్ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి

పహాడి షరీఫ్ ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఈద్ మిలాప్‌లు సోదరభావాన్ని పెంపొందిస్తాయని కాంగ్రెస్ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. ఆదివారం పహాడిషరీఫ్‌లోని ప్రీమియర్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈద్ మిలాప్ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను నాలుగు నెలల్లోనే అమలు చేసిందన్నారు. ఇటీవల జల్‌పల్లి మున్సిపాలిటీకి చెందిన తొమ్మిది మంది కౌన్సిలర్ల అనుచరులు, రంజిత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరగా, వారికి కుండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు చల్ల నర్సింహారెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ తీగల అనితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, బడంగ్‌పేట్ కార్పొరేషన్ మేయర్ సి. పారిజాత నరసింహారెడ్డి, కాంగ్రెస్ నాయకులు నిజముద్దీన్, అమరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సన్మానం



సరూర్‌నగర్ మండల ప్రజాపరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు ఓమర్ నివాసంలో ఆదివారం కాంగ్రెస్ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్ రెడ్డికి సన్మానం చేస్తున్న మజ్లిస్ నాయకులు - (పహాడిషరీఫ్ ఆంధ్రజ్యోతి)



కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతున్న ప్రేం రాజ్

మోదీ మూడోసారి ప్రధాని కావడం ఖాయం

రాజేంద్రనగర్, ఏప్రిల్21(ఆంధ్రజ్యోతి): కేంద్రంలో మూడోసారి నరేంద్ర మోదీ ప్రధానమంత్రి కావడం ఖాయమని, చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలో బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ ప్రేంరాజ్ పిలుపునిచ్చారు. ఆదివారం రాజేంద్రనగర్‌లోని పార్టీ కార్యాలయంలో బీజేపీ రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు గుంజ బాబురావు అధ్యక్షతన జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ నెల 22న ఉదయం చేవెళ్ల ఎంపీ అభ్యర్థిగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డి 50వేల మంది అభిమానులు, పార్టీ కార్యకర్తలతో కలసి బుద్వేల్ బాబూ జగ్జీవన్‌రాం విగ్రహం నుంచి రాజేంద్రనగర్ అంబేడ్కర్ విగ్రహం వరకు పాదయాత్రగా వచ్చి రాజేంద్రనగర్ తహసీల్దార్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేస్తారన్నారు. ఈ కార్యక్రమానికి కేంద్రమంత్రి పీయూష్ గోయల్, శాసనమండలి సభ్యులు ఏవీఎన్ రెడ్డి హాజరవుతారన్నారు. కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మూడు లక్షల మెజారిటీతో విజయం సాధించడం ఖాయమన్నారు. సమావేశంలో బీజేపీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, కార్యవర్గ సభ్యుడు మూల శ్రీనివాస్‌గౌడ్, దళితమోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోరని సదానంద్ పాల్గొన్నారు.



గౌలిపురా డివిజన్‌లో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

'హైదరాబాద్'లో బీజేపీ విజయం ఖాయం

చాంద్రాయణగుట్ట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికలలో ఈ సారి హైదరాబాద్ నియోజకవర్గంలో గాలిపటం కొట్టుకుపోయి, బీజేపీ గెలవడం ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు ఆదర్ల మహేశ్, డొంకి యాదగిరి అన్నారు. బీజేపీ హైదరాబాద్ ఎంపీ అభ్యర్థి కొంపెల్లి మాధవీలతకు మద్దతుగా గౌలిపురా డివిజన్‌లోని సీబీఐ క్వార్టర్స్‌లో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంచుతూ బీజేపీకి ఓటేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పాతబస్తీలో మజ్లి్స్‌కు వ్యతిరేకత ప్రారంభమైందన్నారు. ప్రచారంలో నాయకులు కౌడి సురేందర్, రఘుకాంత్, సుధీర్ కుమార్, లింగాల రమేశ్, ఎం.దయానంద్, ధర్మానంద్ రాజేశ్ పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో దోశలు వేస్తున్న బీఆర్ఎస్ హైదరాబాద్ ఎంపీ అభ్యర్థి శ్రీనివాస్‌యాదవ్

అభివృద్ధిని చూసి ఓటు వేయండి

● బీఆర్ఎస్ హైదరాబాద్ ఎంపీ అభ్యర్థి శ్రీనివాస్‌యాదవ్

అఫ్జల్‌గంజ్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): గత పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి ఓటర్లు తమ అమూల్యమైన ఓటును బీఆర్ఎస్ పార్టీకి వేసి తనను గెలిపించాలని ఆ పార్టీ హైదరాబాద్ ఎంపీ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్ కోరారు. ఆదివారం జాంబాగ్ డివిజన్‌లో బీఆర్ఎస్ నాయకులు ధన్‌రాజ్, శ్రీనివాస్‌గౌడ్, నరేందర్, క్రాంతి, జయశంకర్, నరేశ్‌లతో కలిసి ఆయన ఇంటింటికి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓ దుకాణం వద్ద దోశలు వేశారు. ప్రతి ఇంటికి వెళ్లి తనకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ.. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. ఈసారి తనను గెలిపిస్తే హైదరాబాద్ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రచారంలో ఆయన వెంట విజయ్ ముదిరాజ్, శేఖర్, సాయి, మహేశ్, రవీందర్‌రెడ్డి, అంబికా యాదవ్, జ్యోతియాదవ్, తులసి తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో కోటమైసమ్మ

విగ్రహ ప్రతిష్ఠాపనలు

● ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత
మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

రాజేంద్రనగర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): బుద్వేల్ శ్రీకోట మైసమ్మ ఆలయంలో భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠాపనలు ఘనంగా జరుగుతున్నాయి. ఆలయ పునర్నిర్మాణ అనంతరం మూడో రోజు ఆదివారం ఆలయంలో దేవతా మూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య నిర్వహించారు. అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్, బీఆర్ఎస్ అధికార ప్రతినిధి పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ టి.ప్రేందాస్‌గౌడ్, బీజేపీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, రాష్ట్ర గౌడ సంఘం కోశాధికారి పి.హరిచరణ్‌గౌడ్‌తోపాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ, ఆధ్యాత్మిక చింతన తోనే మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. మానవుడు సన్మార్గంలో నడుచుకోవాలంటే భక్తిమార్గం అవసరం అన్నారు.



కోట మైసమ్మ అమ్మవారిని దర్శించుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్, బీఆర్ఎస్ అధికార ప్రతినిధి పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి, తదితరులు



కోట మైసమ్మ ఆలయం వద్ద రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

ఉదయం 5 గంటలకు విగ్రహ ప్రతిష్ఠాపన

ఆదివారం ఉదయం 5 గంటల నుంచి శ్రీకోట మైసమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ప్రాతఃకాల పూజలు, యజ్ఞం, హోమాలు, గర్భన్యాసం, గర్తపీఠ పూజలు నిర్వహించారు. ఉదయం 8:19 గంటలకు వృషభలగ్న శుభముహూర్తాన శ్రీకోట మైసమ్మ తల్లి సింహవాహన బలి పీఠం, శిఖర దేవతల యంత్ర ప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠ, విగ్రహప్రతిష్ఠ నేత్రోన్మీలనం, అష్టబలి, మహాబలి, పూర్ణాహుతి, కుంబాభిషేకం, అలంకరణ, గోమాత దర్శనం, దర్పణ దర్శన పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. శ్రీకోట మైసమ్మ ఆలయ పునర్నిర్మాణం, విగ్రహ ప్రతిష్ఠాపన, పూజలు నిర్వహించిన అనంతరం భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. పూజా కార్యక్రమాలలో ఆలయ కమిటీ ప్రతినిధులు ఎ.దేవదాస్‌గౌడ్, పెంటయ్యగౌడ్, పి.నందంగౌడ్, కె.సత్యనారాయణ గౌడ్, నర్సింహ్మగౌడ్, వినాయక్ గౌడ్, పెండ్యాల శ్రీధర్, పెండ్యాల సాయిమల్లిక్, రగడంపల్లి శ్రావణ్, మజ్జిగ నరేశ్ యాదవ్ స్థానిక భక్తులు పాల్గొన్నారు.

పాతబస్తీ అభివృద్ధికి బీజేపీని గెలిపించండి: ఎంపీ అభ్యర్థి మాధవీలత

అఫ్జల్‌గంజ్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పాతబస్తీ అభివృద్ధి చెందాలంటే పార్లమెంట్ ఎన్నికలలో హైదరాబాద్ నియోజకవర్గంలో బీజేపీని గెలిపించాలని ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి కొంపెల్లి మాధవీలత అన్నారు. ఆదివారం గోషామహల్ డివిజన్‌లో కార్పొరేటర్ లాల్‌సింగ్, డి.గోపాల్‌జీ, సోమ్రాజ్‌సింగ్, నటరాజ్ నాంధారి, కమల్ సింగ్, దర్శన్‌లతో కలిసి ఆమె ఎన్నికల ప్రచారం చేశారు. ప్రతీ ఇంటికి వెళ్లి ఈ సారి జరుగుతున్న ఎన్నికలోల తనకు ఒక్క అవకాశం ఇచ్చి ఓటేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా మాధవీలత మాట్లాడుతూ మజ్లిస్ పార్టీ నాయకులు, ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి తప్పుడు ప్రచారం చేస్తూ పాత బస్తీ ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. తాను తాను శ్రీరామనవమి శోభాయాత్ర సందర్భంగా విల్లు ఎక్కుపెట్టిన వీడియోను ఎంఐఎంకు చెందిన కొందరు నాయకులు వక్రీకరించి ఓ వర్గం ప్రజలను రెచ్చగొట్టేందుకు కుట్రలు పన్నుతున్నారన్నారు. ప్రచారంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గోషామహల్ డివిజన్‌లో ఎన్నికల ప్రచారంలో మాధవీలత తదితరులు

సమాజాన్ని సన్మార్గంలో నడిపించే దిక్సూచి భగవద్గీత



భగవద్గీత కార్యక్రమంలో పద్మశ్రీ డాక్టర్. శోభారాజు తదితరులు

బర్కత్‌పుర, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): దారితప్పుతున్న మానవ సమాజాన్ని సన్మార్గంలో నడిపించడానికి భగవద్గీత దిక్సూచిగా నిలుస్తుందని అన్నమాచార్య భవన వాహిని వ్యవస్థాపకురాలు, పద్మశ్రీ డాక్టర్. శోభారాజు అన్నారు. ఆదివారం ఎల్‌బీ. స్టేడియం ఫతేమైదాన్ క్లబ్‌లో మీహిరా సంస్థ ఆధ్వర్యంలో భగవద్గీత పఠన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భగవద్గీత శ్లోకాలు, తాత్పార్యాలతో కూడిన వీడియోను ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన శోభారాజు మాట్లాడుతూ భగవద్గీతను ముందుపెట్టుకుని పూజలు చేయడం కాదు దానిని ఆచరించి ఆకళింపు చేసుకుంటేనే జీవితం సార్థకత అవుతుందన్నారు. న్యాయస్థానాలలో చాలా మంది నేరస్థులు భగవద్గీతపై ప్రమాణం చేసి అంతా నిజమే చెబుతామంటారని, వారంతా నిజమే చెబితే ఇన్ని కేసులు ఎందుకు పెరుగుతున్నాయన్నారు. భగవద్గీతను ఆచరిస్తే అదే మనల్ని భగవంతుడికి దగ్గర చేస్తుందన్నారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ గీత ప్రచారానికి శ్రీకారం చుట్టిన తనూజను ఆమె అభినందించారు. కార్యక్రమంలో ఆరే కృష్ణ మూవ్‌మెంట్ ప్రతినిధి నవామృత దాత, హైకోర్టు సీనియర్ అడ్వకేట్ పి. గంగయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ పోషణలో భాగస్వాములు కావాలి

మహిళలకు కుట్టు మిషన్లు అందజేసిన అవల్గి

పహాడిషరీఫ్ ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మహిళలు స్వయంగా తమ కాళ్లపై తాము నిలబడుతూ, కుటుంబ పోషణలో భాగస్వాములు కావాలని బీఆర్ఎస్ మహేశ్వరం నియోజకవర్గ ఉపాధ్యక్షుడు నాసర్ అవల్గి సూచించారు. మహ్మదీయా కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్, సాలేహ అజహరి మెమోరియల్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం పహాడిషరీఫ్‌లో మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన నాసర్ అవల్గి మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి మహిళలకు కుట్టు శిక్షణ ఇవ్వాలని అన్నారు. మహ్మదీయ రెసిడెంట్స్ అసోసియేషన్ కమిటీ పేద మహిళలకు శిక్షణ ఇచ్చి, వారికి కుట్టు మిషన్లు కూడా ఇవ్వడం అభినందనీయమన్నారు. శిక్షణ పొందిన మహిళలు సంఘంగా ఏర్పడితే ప్రభుత్వపరంగా సహాయం అందించేందుకు కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు అబ్దుల్ హమీద్‌ఖాన్, గౌస్‌ఖాన్, అమనుల్లాఖాన్, సయ్యద్ ఖదీర్, ముఖ్తదర్‌ఖాన్. హమీద్, బీఆర్ఎస్ నాయకులు కొండల్, ముజాహిద్‌ఖాన్, సిరాజ్‌ఖాన్, విశాల్ పాల్గొన్నారు

ఉత్సవ నిర్వాహకులు నిబంధనలను పాటించాలి



మాట్లాడుతున్న డీసీపీ సాయి చైతన్య

చార్మినార్/చాంద్రాయణగుట్ట ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఉత్సవ నిర్వాహకులు తప్పనిసరిగా నిబంధనలు పాటిస్తూ హనుమాన్ జయంతి వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య సూచించారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకుని చార్మినార్ ఏసీపీ డివిజన్ పరిధిలోని ఉత్సవాల నిర్వాహకులతో శనివారం రాత్రి ఘాన్సీబజార్‌లో, ఛత్రినాక పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఉత్సవ నిర్వాహకులతో వేర్వేరుగా డీసీపీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ర్యాలీలో రాజకీయ పార్టీల జెండాలను వాడొద్దని, ఎలాంటి ఉద్రేకపూరిత ప్రసంగాలు చేయొద్దని సూచించారు. ఉత్సవ నిర్వాహకులు బందోబస్తులో ఉన్న పోలీస్ సిబ్బందికి సహకరించాలని కోరారు. సూచించారు. శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఆయా కార్యక్రమాలలో దక్షిణ మండలం అదన పు డీసీపీ షేక్ జహంగీర్, చార్మినార్ ఏసీపీ చంద్రశేఖర్, ఇన్‌స్పెక్టర్లు కమతం చంద్రశేఖర్, సురేందర్ ఛత్రినాక ఏసీపీ సీహెచ్ చంద్రశేఖర్, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐలు త్రిమూర్తులు, శ్రీకాంత్, శోభ, పాండు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ, మహారాష్ట్రలో ఎన్నికల బరిలో ఇంక్విలాబ్ పార్టీ: ప్రధాన కార్యదర్శి ఖవి అబ్బాసీ

చార్మినార్ ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికలలో మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాలలో తమ పార్టీ తరఫున 25 మంది అభ్యర్థులు ఎన్నికలో బరిలో ఉన్నారని ఏఐఎంఐఎం ఇంక్విలాబ్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఖవి అబ్బాసీ తెలిపారు. ఆదివారం మొగల్‌పురాలోని పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణ, మహారాష్ట్రల్లో ముగ్గురేసి అభ్యర్థులను ఖరారు చేశామని, మహారాష్ట్రలోని పర్బని నుంచి షేక్‌సలీం, ఔరంగాబాద్ నుంచి సమద్ బాగ్వాన్, నాందేడ్ నుంచి హాఫేజ్ సుల్తాన్ పోటీ చేయనున్నారన్నారు. తెలంగాణలో హైదరాబాద్ నుంచి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఖాజామొయినుద్దీన్, సికింద్రాబాద్ నుంచి రఫీయుద్దీన్ ఖలీం, చేవెళ్ల నియోజకవర్గం నుంచి స్వయంగా తాను పోటీ చేస్తున్నట్లు తెలిపారు. తమ పార్టీ అభ్యర్థులందరూ సోమవారం ఆయా నియోజకవర్గాల పరిధుల్లో నామినేషన్లు వేయనున్నట్లు వెల్లడించారు.



భగవాన్ మహావీరు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న టీపీసీసీ కార్యదర్శి మనీలాల్‌షా, మోతీలాల్ భగత్

మహావీరుడి బోధనలను స్ఫూర్తిగా తీసుకోవాలి

అఫ్జల్‌గంజ్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పంచసూత్రాలను పాటించడం ద్వారానే మానవుడు మోక్షాన్ని పొందగలుగుతాడని సూచించిన మహావీరు భగవాన్ అని.. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో జైన్‌సేవా సంఘ్ ఆధ్వర్యంలో మహావీర్ జయంతి ఉత్సవాలు నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, టీపీసీసీ కార్యదర్శి మనీలాల్ షా, మోతీలాల్ భగత్ హాజరై భగవాన్ మహావీర్ చిత్రపటానికి వారు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహావీరు సూచనలు, బోధనలు ఆచరణీయమని, ఆయన చూపిన మార్గాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకొని ముందుకెళ్లాలని అన్నారు. కార్యక్రమంలో జైన్ సేవా సంఘ్ అధ్యక్షుడు యోగేష్ సింఘీ, మైనార్టీ కమిషన్ సభ్యులు హిమాన్షు బాఫ్నా, అశోక్‌జైన్, సురేశ్ సురానా, కైలాష్ బండారి, సురేశ్ జైన్, గౌతం, నంద, అశోక్, టాటెడ్, జిత్తు పాల్గొన్నారు.



చిన్నారితో మట్టికుండ తయారు చేయిస్తున్న ఆర్టిస్ పెంటయ్య

జూపార్కులో ప్రపంచ ధరిత్రి దినోత్సవం

మదీన, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ధరిత్రి దినోత్సవం(వరల్డ్ ఎర్త్ డే)ను ఆదివారం జూపార్కులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సందర్శకులకు పర్యావరణం, భూమి, ప్రకృతిపై అవగాహన కల్పించారు. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్, కాలుష్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా హ్యాండీక్రాఫ్ట్ ఆర్టిస్ట్ పెంటయ్య జూపార్కుకు వచ్చిన సందర్శకులు, చిన్నారులకు మటితో కుండలు, జార్‌లు, కుండీలు ఎలా తయారు చేయాలో నేర్పించారు. చిన్నారులు ఉత్సాహంగా మట్టికుండలను తయారు చేశారు. కార్యక్రమంలో జూపార్కు డిప్యూటీ క్యూరేటర్ ఎ.నాగమణి, పీఆర్‌ఓ హనీఫుల్లా, బయాలజిస్టులు లక్ష్మీనారాయణ, బాబురావు, సిబ్బంది దీపక్ తరుణ్, దేవన్న పాల్గొన్నారు.

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/RxkN7tG లో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy.comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.

రాజేంద్రనగర్ పీడీపీ చౌరస్తాలో నేడు స్వర్గీయ ఇంద్రారెడ్డి వర్ధంతి

రాజేంద్రనగర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి స్వర్గీయ పట్లోళ్ల ఇంద్రారెడ్డి వర్ధంతిని ఈ నెల 22వ తేదీ ఉదయం 9.30 గంటలకు రాజేంద్రనగర్ సర్కిల్ పీడీపీ చౌరస్తాలో నిర్వహిస్తున్నామని నిర్వాకులు సామ ఇంద్రపాల్ రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాశ్‌గౌడ్, తెలంగాణ డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బి. జ్ఞానేశ్వర్ ముదిరాజ్, చేవెళ్ల కాంగ్రెస్, బీజేపీ ఎంపీ అభ్యర్థులు డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఇంద్రారెడ్డి తనయుడు, బీఆర్ఎస్ యువనేత పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి, కార్పొరేటర్లు హాజరవుతారని అన్నారు.



కరాటే బెల్టులు అందుకున్న విద్యార్థులతో మాస్టార్లు

ఆత్మరక్షణకు కరాటే దోహదం

రాజేంద్రనగర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఆత్మరక్షణకు కరాటే దోహదం చేస్తున్నదని జపాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ కె.ఎస్ శ్రీనివాస్‌చారి, సీనియర్ బ్లాక్‌బెల్ట్ ఎం.బాలసుబ్రమణ్యం అన్నారు. జపాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం అత్తాపూర్‌లో కరాటేలో శిక్షణ పొందిన 28 మందికి పోటీలు నిర్వహించి, అర్హత సాధించిన వారికి బెల్టులు ప్రదానం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ క్రమం తప్పకుండా కరాటే శిక్షణలో భాగంగా వ్యాయామం చేయడం వలన ఆరోగ్యంగా ఉంటామని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ బ్లాక్‌బెల్ట్ రాజ్‌కుమార్, పవన్ భారతీ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు మత్స్యకారుల ఓట్లు అడిగే హక్కు లేదు

తెలంగాణ కాంగ్రెస్ ఫిషరీస్ చైర్మన్ సాయికుమార్

అఫ్జల్‌గంజ్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పదేళ్ల కాలంలో కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీలు అధికారంలో ఉండి తెలంగాణలో ఉన్న లక్షలాదిమంది మత్స్యకారులను మోసం చేశాయని కాంగ్రెస్ తెలంగాణ ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ రెండు పార్టీలకు పార్లమెంట్ ఎన్నికల్లో మత్స్యకారుల ఓట్లు అడిగే నైతిక హక్కు లేదని ఆయన అన్నారు. ఆదివారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు మోసాలకే బ్రాండ్ అంబాసిడర్ అన్నారు. ఈ రెండు పార్టీల అభ్యర్థులకు ఎన్నికల్లో ఓటు రూపంలో బుద్ధి చెప్పేందుకు మత్స్యకారులు సిద్ధంగా ఉన్నారని ఆయన హెచ్చరించారు.

ఇద్దరు వృద్ధుల అదృశ్యం



రాములు

అఫ్జల్‌గంజ్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి బయటికి వెళ్లిన వృద్ధుడు అదృశ్యమైన ఘటన గుడిమల్కాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గుడిమల్కాపూర్ తుల్జాభవానీ కాలనీకి చెందిన రాములు(65) ఈ నెల 18న ఇంటి నుంచి బయటికి వెళ్లి రాత్రి అయినా రాలేదు. అతని కుమారుడు సోనూ తండ్రి రాములు ఆచూకీ కోసం బంధువులు, స్నేహితుల ఇంట్లో వెతికినా ఆచూకీ లభించలేదు. ఆందోళన చెందిన సోనూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గౌస్‌నగర్‌లో మతిస్థిమితంలేని వ్యక్తి

మదీన, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేని వృద్ధుడు అదృశ్యమైయ్యాడు. బండ్లగూడ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం... గౌస్‌నగర్‌కు చెందిన యూనుస్(68) కు మతిస్థిమితం సరిగాలేదు. ఈనెల 10వ తేదీ ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగిరాలేదు. ఆందోళన చెందిన కుటుంబసభ్యులు బంధువులు, తెలిసినవారి వద్ద వాకబు చేసినా ఆచూకీ లభించలేదు. ఆదివారం కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

మహిళకు మాయమాటలు చెప్పి ఇంటిని రాయించుకున్న ముగ్గురిపై కేసు

మదీన, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మాయమాటలతో మహిళను నమ్మించి ఆమె ఇంటిని తమ పేరు మీద రాయించుకున్న ముగ్గురిపై బండ్లగూడ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం... గౌస్‌నగర్‌కు చెందిన సాబేరా బేగం అదే బస్తీలో ఉంటున్న జాఫర్ (వరసకు సోదరుడు)కు తన ఇంటి పత్రాలను ఇచ్చి అమ్మిపెట్టాలని కోరింది. ఇంటిని కాజేయాలని పథకం వేసి తనకు పరిచయమున్న షఫీ, అమేర్‌ఖాన్‌కు... జాఫర్ విషయం చెప్పాడు. ముగ్గురు కలిసి సాబేరా బేగంకు మాయమాటలు చెప్పి అమేర్‌ఖాన్ తన పేరు మీద ఇంటిని రాయించుకున్నాడు. మోసపోయాయని గ్రహించిన సాబేరా బేగం ఆదివారం బండ్లగూడ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ప్రమాదవశాత్తు కారులో మంటలు

● కాలిబూడిదైన ఇన్నోవా



మంటల్లో కాలిపోతున్న ఇన్నోవా కారు

రాజేంద్రనగర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో కారు కాలిబూడిదయింది. ఈ ఘటన శనివారం రాత్రి 10.45 గంటల సమయంలో శివరాంపల్లి నేషనల్ పోలీస్ అకాడమీ గేటు సమీపంలో జరిగింది. బాధితులు, పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం... బహదూర్‌పుర తాడ్‌బన్ బాసిత్‌నగర్‌కు చెందిన శహబాజుల్లాఖాన్ ప్రైవేటు ఉద్యోగి. అతడు స్నేహితు అబ్దుల్ ఖదీర్‌తో కలిసి ఇన్నోవా కారు (ఏపీ09 బీఎల్ 6177)లో శనివారం రాత్రి అరాంఘర్‌కు వచ్చాడు. 10.45 గంటల సమయంలో తిరిగి ఇంటికి వెళుతుండగా నేషనల్ పోలీస్ అకాడమీ గేటు వద్దకు రాగానే కారు ఆగిపోయింది. కారులోంచి మంటలు రావడంతో శహబాజుల్లా ఖాన్, అబ్దుల్ ఖదీర్‌లు కారు దిగారు. ఈ ప్రమాదంలో ఇన్నోవా కారు పూర్తిగా కాలిపోయింది. అత్తాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



వార్షిక సదస్సులో ఏపీ పెన్షనర్ల సంఘం ప్రతినిధులు

ఏపీ పెన్షన్‌దారుల బకాయిలు చెల్లించాలి

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రభుత్వం పెన్షన్‌దారులకు రావాల్సిన పీఆర్‌సీ, కరువు భత్యం బకాయిలను వెంటనే చెల్లించాలని హైదరాబాద్ సెటిల్డ్ ఏపీ పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు తీర్మానం చేశారు. నళినీ మోహన్‌కుమార్ అధ్యక్షతన నాంపల్లి తెలుగు యూనివర్సిటీలో ఆదివారం నిర్వహించిన నాలుగో వార్షిక సర్వసభ్య సమావేశానికి విశ్రాంత ఐఏఎస్ లక్ష్మీకాంతం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సంఘం కార్యకలాపాలు, ఆదాయ వ్యయాలు, సామాజిక సేవా కార్యక్రమాలపై చర్చించారు. సమావేశంలో పలువురు పెన్షనర్లు పాల్గొన్నారు.

బ్యూటీ క్లినిక్‌లపై అధికారుల దాడులు

రాయదుర్గం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): రాయదుర్గంలోని దీప్తి పర్మినెంట్ మేకప్ అండ్ కాస్మొటిక్ క్లినిక్, మాదాపూర్‌లోని వీ-స్పార్క్ వెల్‌నెస్ క్లినిక్‌లపై రంగారెడ్డి జిల్లా డీఎంహెచ్‌ఓ ఆధ్వర్యంలో వైద్యుల బృందం ఆదివారం దాడులు నిర్వహించింది. ప్రభుత్వ అనుమతి లేకుండా, అర్హులైన డెర్మటాలజిస్ట్ లేకుండా స్కిన్ ట్రీట్‌మెంట్‌లు చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. అలాగే, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా డ్రగ్స్ లైసెన్స్ లేకుండా బ్యూటీ ఉత్పత్తులను విక్రయిస్తున్నారని గుర్తించారు. త్వరలో పూర్తిస్థాయి విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.

అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

● కేంద్రాల్లో తడిసిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఈదురు గాలులతోపాటు అకాల వర్షాలకు పంటనష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని తెలంగాణ రైతు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు శేర్ నర్సారెడ్డి ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. భారీ ఈదురుగాలులు, అకాల వర్షాల కారణంగా మామిడి, నువ్వులు, వరి, మొక్కజొన్న, కూరగాయలు, తదితర పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని, వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి సాగు చేసిన పంటలు చేతికొచ్చే దశలో దెబ్బతినడంతో రైతులు నష్టపోయారని పేర్కొన్నారు. పంట నష్టాన్ని అంచనా వేసి రైతులకు నష్టపరిహారం అందేలా తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట తడిసిపోవడంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారని, కొనుగోలు కేంద్రాల్లో తడిసిన, రంగు మారిన వరి ధాన్యాన్ని ఎలాంటి ఆంక్షలు విధించకుండా వెంటనే కొనుగోలు చేయాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

సభ్యత్వం, డెవలప్‌మెంట్ పేరిట మోసం

● న్యాయవాది ఫిర్యాదుతో కంట్రీక్లబ్‌పై కేసు నమోదు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): కంట్రీక్లబ్ నిర్వాహకులు సభ్యత్వం తీసుకుంటే ఆకర్షణీయమైన ప్యాకేజీలంటూ మోసాలకు పాల్పడుతున్నారని సోమాజిగూడకు చెందిన న్యాయవాది శ్రీనివాస్‌చౌదరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కంట్రీక్లబ్ నిర్వాహకులు వై.రాజీవ్‌రెడ్డి, డి. కృష్ణకుమార్‌రాజులపై హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితుడు శ్రీనివాస్‌చౌదరి కుటుంబం 2001లో రూ.25 వేలు చెల్లించి క్లబ్ మనీబ్యాక్ స్కీములో చేరింది. గడువు ముగిసినా డబ్బులు తిరిగి ఇవ్వలేమని, దీనికి బదులుగా ప్లాట్ ఇస్తామని నిర్వాహకులు తెలిపారు. అందుకోసం 2006లో లక్షా 30వేలు తీసుకున్నారు. పలుసార్లు సంప్రదించగా కంట్రీక్లబ్ తపోవనం వెంచర్‌లో ప్లాటును కేటాయించారు. డెవలప్‌మెంట్ చార్జీల పేరుతో డబ్బులు వసూలు చేసి ఎలాంటి పనులు నిర్వహించలేదని, అంతేకాకుండా క్లబ్‌మెంబర్‌షిప్, మెయిన్‌టెనెన్స్ పేరుతో డబ్బు వసూలు చేశారని ఆరోపించారు. క్లబ్ చేపట్టిన వెంచర్లు ప్రభుత్వ నిబంధనల మేరకు లేవని, మధ్యతరగతి ప్రజలను మభ్యపెట్టి కంట్రీక్లబ్ కోట్లాది రూపాయలు కొల్లగొట్టిందని, ఈ మోసాలపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు.

ఇటు ఇంపు.. అటు కంపు

(5వ పేజీ తరువాయి)

మంచి స్పందన లభిస్తోంది. నగరవాసులే కాక ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి ఎంతో మంది సందర్శకులు ఈ షోను తిలకిస్తూ ఎంజాయ్ చేస్తున్నారు.

సాగర్ నీటి దుర్వాసనతో అసహనం

లేజర్‌షోను సందర్శకులు ఎంజాయ్ చేస్తున్నా హుస్సేన్‌సాగర్ జలాలు తీవ్ర దుర్గంధాన్ని వెలువరిస్తుండడంతో సందర్శకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. షో ద్వారా దాదాపు 50 అడుగుల పైకి లేచే నీరు గాలి ద్వారా ప్రేక్షకులపైకి వస్తూ దుర్గంధం వస్తుండడంతో సందర్శకులు ఇబ్బందులు పడుతున్నారు. హెచ్‌ఎండీఏ అధికారులు ఈ విషయమై దృష్టి సారించి హుస్సేన్‌సాగర్ జలాలను శుద్ధిచేసి లేజర్ షో జరిగే ప్రాంతంలో మురుగు, చెత్త లేకుండా, దుర్వాసన రాకుండా చూడాలని కోరుతున్నారు.

పెట్స్ థెరపీ..!

(5వ పేజీ తరువాయి)



రక్తపోటు తగ్గుతుందని పలు అధ్యయనాలు వెల్లడిస్తుంటే, ఒంటరితనం తగ్గిస్తాయని మరికొన్ని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. ఇక మార్స్ సంస్థ యూఎస్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్‌తో కలిసి చేసిన అధ్యయనంలో చైల్డ్ డెవలప్‌మెంట్‌పై జంతువుల ప్రభావం అధికమేనని తేలింది. ఆటిజం, ఏడీహెచ్‌డీ వంటి సమస్యలున్న పిల్లల్లో కొంతమేర ప్రభావం చూపే అవకాశాలున్నాయని వెల్లడించింది.

డిప్రెషన్ సమస్యలు దూరం..


పిల్లలు లేదా టీనేజర్లు ఉన్న ఇంట్లో పెట్స్ ఉంటే వారి ప్రవర్తనలో గణనీయమైన మార్పులు వచ్చే అవకాశాలున్నాయని చెబుతున్నాయి పలు అధ్యయనాలు. అమెరికన్ అసోసియేషన్ ఆఫ్ సైకియాట్రిస్ట్ చెప్పేదాని ప్రకారం.. జంతువుల పట్ల క్రూరంగా ప్రవర్తించే వారిలో మానసిక సమస్యలు ఉన్నట్లుగా చెప్పొచ్చు. ఈ తరహా ప్రవర్తన కలిగిన వారు ఇతరుల బాధలను అస్సలు పట్టించుకోరని వెల్లడించింది. మరికొన్ని అధ్యయనాల ప్రకారం పెంపుడు జంతువుల వల్ల శారీరక ఆరోగ్యం మెరుగవుతుందని, దీనితో పాటుగా డిప్రెషన్, ఆందోళన, పోస్ట్ ట్రామాటిక్ స్ట్రెస్ డిజార్డర్, డెమన్షియా వంటి సమస్యలు కూడా దూరం అవుతాయని చెబుతున్నాయి. ఇదే విషయమై వెటర్నరీ డాక్టర్ మణి మాట్లాడుతూ పెట్ పేరెంట్స్‌లో చాలా మంది స్ట్రెస్, యాంగ్జైటీ తగ్గిందని చెప్పడం చూశానన్నారు. ఈ కారణం చేతనే ఇటీవలి కాలంలో అమెరికా లాంటి దేశాలలో మానసిక ఆరోగ్య సమస్యలున్నవారికి పెట్ పేరెంటింగ్ సూచిస్తున్నారని తెలిపారు. దాదాపు 22శాతం పెట్ యజమానులు ఈ తరహా సూచనలు పొందిన వారేనని హ్యూమన్ యానిమల్ బాండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ వెల్లడిస్తోంది. మన దేశంలో ఈ తరహా పెట్ పేరెంటింగ్ సూచనలు పెద్దగా కనబడవు. డాగ్ థెరపీతో బులిమియా, యాంగ్జయిటీ డిజార్డర్ల పరంగా కొంత మెరుగైన ఫలితాలు చూశామని జర్మనీలోని ఓ అధ్యయనం సైతం వెల్లడించింది.

ప్రయోజనాలున్నాయి.. ప్రమాదాలూ ఉన్నాయి

పెట్ పేరెంటింగ్‌తో శారీరక, మానసిక ప్రయోజనాలు ఉన్నాయన్నది ఎంత నిజమో, వీటి వల్ల కొన్ని సమస్యలున్నాయనేది కూడా అంతే నిజం. ముఖ్యంగా ఆర్థిక పరంగా అవరోధాలు, వాటిని సరిగా చూసుకునే సామర్థ్యం, వాటికి తగిన వాతావరణం కల్పించడం, వాటి జుట్టు వల్ల కలిగే ఎలర్జీలు వంటివి సమస్యలను తెచ్చిపెడతాయి. ఏ ఒత్తిడి తగ్గించడానికి పెట్స్ తోడ్పడతాయనుకుంటున్నారో అవే పెట్స్ వల్ల ఒత్తిడి పెరిగే అవకాశాలూ ఉన్నాయని చెబుతున్నారు డాక్టర్లు. పెట్స్ వల్ల కొన్ని రకాల మానసిక ప్రయోజనాలు ఉన్న మాటలో కొంత వాస్తవం ఉన్నప్పటికీ ఇతర చికిత్సలకు ప్రత్యామ్నాయం మాత్రం పెట్స్ కావంటున్నారు పలువురు సైకాలజిస్టులు. అధ్యయనాలు కూడా అదే చెబుతున్నాయంటూ, ఓ పెట్‌ను పెంచుకున్న తర్వాత అది చనిపోతే బాధ నుంచి కోలుకోవడం కష్టమేనని, ఆ డిప్రెషన్ నుంచి బయటపడటానికి చాలాకాలమే పడుతుందని సైకాలజిస్ట్, పెట్ పేరెంట్ అభిలాష్ పేర్కొన్నారు.

సైలెంట్ కిల్లర్.. కాలేయ జబ్బు

● మద్యపానంతో మరింత ముప్పు
● నెలకు 300 నుంచి 400 కొత్త కేసులు
● ప్రాథమిక దశలో గుర్తిస్తేనే మెరుగైన చికిత్స



కాలేయ జబ్బు.. ఇది సైలెంట్ కిల్లర్. దీనిని తొలి దశలో గుర్తించకపోయినా.. గుర్తించాక నిర్లక్ష్యం చేసినా చివరికి కాలేయ మార్పిడి శరణ్యమవుతోంది. కాలేయ జబ్బును సకాలంలో గుర్తించి చికిత్సలు అందిస్తే ప్రాణాపాయం నుంచి బయటపడొచ్చు. సరైన ఆహార నియమాలు పాటించక చాలామంది క్రానిక్ లివర్ జబ్బుల బారిన పడుతున్నారు. సకాలంలో చికిత్స చేయించుకోలేక.. మందులు సరిగ్గా వాడక జబ్బు ముదిరి దాదాపు పది శాతం మంది ప్రాణాలు కోల్పోతున్నారు.

- హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి)

నగరంలో నెలకు 300 నుంచి 400 వరకు కొత్త కాలేయ కేసులు వస్తున్నాయి. దీనిపై అవగాహన లేక వ్యాధి ముదిరాక వైద్యులను సంప్రదిస్తున్నారు. చాలామందిలో ఈ జబ్బుకు మద్యపానం, ఫ్యాటీ లివర్ ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. కాలేయ జబ్బు బాధితుల్లో 80 నుంచి 85 శాతం పురుషులు ఉంటుండగా, 15 నుంచి 20శాతం మంది మహిళలు ఉంటున్నారు. ఫ్యాటీ లివర్ ఇబ్బంది ఉన్న వారిలో 60 శాతం మహిళలు ఉండగా, 40 శాతం మంది పురుషులున్నారు. ప్రస్తుతం కాలేయ దాతలు కూడా అంతంత మాత్రంగానే లభ్యమవుతున్నారు. ఐదుగురికి కాలేయం అవసరం అయితే ఒక్కరికే లభిస్తున్నదని హైటెక్‌సిటీలోని యశోద ఆస్పత్రి సీనియర్ గ్యాస్ట్రోఎంటరాలజిస్టు, హెపటాలజిస్ట్ డాక్టర్ కె.ఎస్.సోమశేఖర్‌రావు వివరించారు.

మద్యపానమే ప్రధాన శత్రువు

కాలేయ వ్యాధికి ముఖ్య కారణం మద్యపానం. రెండోది హెపటైటిస్ వైరస్(బీ, సీ). కొన్ని రకాల ఔషధాలు, రోగనిరోధక శక్తి లోపాలు కూడా కాలేయ వ్యాధికి కారకాలు. ఇటీవలి కాలంలో కొవ్వుతో కాలేయానికి అధిక ముప్పు ఏర్పడుతున్నదని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. పట్టణ ప్రాంతాల్లో కొవ్వు చేరిన కాలేయ వ్యాధి(ఫ్యాటీ లివర్) దాదాపు 30 శాతం మందికి ఉందని వైద్యులు పేర్కొంటున్నారు. క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, కొవ్వు తక్కువ కలిగిన ఆహారం తీసుకోవడం వల్ల కాలేయాన్ని సిర్రోసిస్‌గా మారకుండా జాగ్రత్త పడవచ్చు.

లక్షణాలు..

ఆకలిలేమి, కడుపులో వికారం, వాంతులు, కళ్లు, మూత్రం పసుపు రంగుకు మారడం.

మెత్తటి కాలేయం రాయిలా..

కణాల్లో వాపును నియంత్రణలో ఉంచే కాలేయం పనితీరుపై స్థాయికి మించిన భారం పడినప్పుడు అది తన విధులను సక్రమంగా నిర్వర్తించలేని పరిస్థితి ఏర్పడుతుంది. ఫలితంగా కాలేయ కణాలపై మచ్చలు ఏర్పడే అవకాశముంటుంది. మెత్తగా ఉండే కాలేయం రాయిలా గట్టిపడుతుందని, దీనినే కాలేయ సిర్రోసిస్(లివర్ సిర్రోసిస్)గా వ్యవహరిస్తారని వైద్యులు పేర్కొంటున్నారు. ఈ పరిస్థితి తలెత్తితే త్వరలోనే కాలేయ కేన్సర్ వచ్చే అవకాశాలు చాలా ఎక్కువగా ఉంటాయి. వ్యాధి ముదరక ముందే రోగనిర్ధారణ చేసుకుని, చికిత్స తీసుకుంటే కాలేయాన్ని సిర్రోసిస్, కేన్సర్ బారి నుంచి కాపాడుకోవచ్చు.

ఏడాదికి ఒక్కసారైనా పరీక్షలు తప్పనిసరి



తీవ్ర రూపమైన సిర్రోసిస్ వచ్చిన తర్వాత కాలేయాన్ని మళ్లీ సాధారణ స్థితికి తీసుకురావడం చాలా కష్టం, ప్రాథమిక దశలో కాలేయ సమస్యల(ఫ్యాటీ లివర్, సిర్రోసిస్)ను గుర్తిస్తే మంచి చికిత్స ద్వారా దానిని పూర్వస్థితికి తీసుకు రావచ్చు. ప్రతి ఒక్కరూ ఏడాదికి ఒక్కసారైనా ఎల్ఎఫ్‌టీ, హెబీ సాగ్, యాంటి హెచ్‌సీవీ, యూసీజీ అబ్డామిన్, ఫైబ్రోస్కాన్ పరీక్షలు తప్పనిసరిగా చేసుకోవాలి. ఫైబ్రోస్కాన్ వంటి ప్రత్యేక పరీక్ష చేయిస్తే కాలేయంపై ఎంత శాతం కొవ్వు ఉంది.. అది ఎంత వరకు గట్టిపడిందని తెలుసుకోవడానికి అవకాశముంటుంది. ఫ్యాటీ లివర్ ఇబ్బందులు రాకుండా జాగ్రత్త పడడం, ప్రొటీన్ ఆహారం తీసుకోవడం, కాలేయ జబ్బులపై అవగాహన పెంచుకోవడం చాలా అవసరం.

- డాక్టర్ కె.ఎస్.సోమశేఖర్‌రావు, హెపటాలజిస్ట్, సీనియర్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు, యశోద ఆస్పత్రి

ఇలాంటి సమస్యలు ఉంటే..

దీర్ఘకాలం మధుమేహం ఉన్నవారు, అధిక బరువు ఉన్న వారు, నిరంతరం మద్యపానం చేసేవారు, 1991కు ముందు రక్తమార్పిడి, ఆపరేషన్లు చేసుకున్న వారు. ఇంతకుముందు కామెర్లు వచ్చినవారు, కాలేయా వ్యాధి బారినపడే ముప్పు ఎక్కువగా ఉంటుంది.

ఫాసిజాన్ని ప్రేమతోనే ఓడించగలం

● ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్
● సమూహ సెక్యులర్ రైటర్స్ ఫోరం ఆధ్వర్యంలో కవి గాయక సమూహగానం
● ప్రారంభ సభలో పాల్గొన్న ప్రముఖ కవి కె.శివారెడ్డి, తదితరులు



కవి గాయక సమూహ గానం సభలో కె.శ్రీనివాస్, శివారెడ్డి, తదితరులు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): దేశంలో అసహనం, ఫాసిస్టు ధోరణులతో సాటి మనుషులను అకారణంగా ద్వేషించే తత్వం పెరిగిందని, ఇది సమాజానికి ఏమాత్రం మంచిది కాదని ప్రముఖ కవి కె.శివారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ద్వేష, విద్వేష భావనలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. ఇలాంటి వాతావరణంలో రాజ్యాంగస్ఫూర్తితో లౌకిక విలువల పరిరక్షణ కోసం కవులు, రచయితలు సమూహగానం చేయడం చాలా మంచి విషయం అంటూ కొనియాడారు. సమూహ సెక్యులర్ రైటర్స్‌ఫోరం ఆధ్వర్యంలో ప్రజాస్వామిక, లౌకిక రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం 'కలం గళం ఎత్తుదాం' నినాదంతో వంద మందికిపైగా కవులు, రచయితలతో 'కవి గాయక సమూహగానం' కార్యక్రమం ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ కవి కె.శివారెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగ స్థానంలో మనుస్మృతిని ప్రతిష్ఠించే దుష్ట ప్రయత్నాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ప్రశ్నించే గళాలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తమ రచనల ద్వారా, కళల ద్వారా ఫాసిజానికి, మత విద్వేషానికి వ్యతిరేకంగా సమాజాన్ని జాగృతం చేయడం కవులు, రచయితలు, కళాకారుల బాధ్యత అని, ఆ దిశగా సమూహ సెక్యులర్ రైటర్స్ ఫోరం కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్ ప్రారంభోపన్యాసం చేశారు. కేన్సర్ లాగే ఫాసిజం కూడా దశలవారీగా సమాజానికి వ్యాపిస్తుందని అన్నారు. ఫాసిజంలో ప్రజల సమ్మతం ఉంటుందని, ప్రస్తుతం మతం పేరుతో జరిగే మూకదాడులు, అత్యాచారాలు లాంటి అవాంఛనీయ ఘటనలకు ప్రజలు మద్దతు పలకడం లేదా మౌనంగా ఉండడం అందులో భాగమే అని విచారం వ్యక్తం చేశారు. దీన్ని ఫాసిజంలోని రెండవ దశగా కె.శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. ఫాసిజమా ఓడిపో.! వచ్చిపో.! అంటూ కవిత్వం రాయడమో లేదంటే నినదించడమో కాదు. కవులు, రచయితలు, కళాకారులు.. ప్రతి ఒక్కరూ వ్యక్తులుగా తమ చుట్టూ నెలకొన్న పరిసరాల్లోనూ, సమూహాల్లోనూ ఫాసిజానికి విరుగుడైన ప్రేమ, సామరస్య భావనలను పెంపొందించేందుకు కృషి చేయాలని కె.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ద్వేష వాతావరణాన్ని ఎదిరించడం, హేతుబద్ధంగా ఆలోచించడం, అబద్ధాలను నమ్మకుండా ఉండడం, సున్నితత్వాన్ని పెంచడం కోసం సాహిత్యం, కళల్లో మన భావాలను ఏవిధంగా వ్యక్తీకరించాలో కూడా మాట్లాడుకోవాలని కవులకు, కళాకారులకు దిశానిర్దేశం చేశారు. ఫాసిజాన్ని ద్వేషంతోగాక ప్రేమతో ఓడించగలమని కె.శ్రీనివాస్ నొక్కిచెప్పారు. సున్నితత్వాన్ని తెలియజేస్తూ ద్వేషాన్ని నిర్మూలించే ప్రేమ భావనలను సృజనాత్మక పద్ధతుల్లో చెబుతూ కవి గాయక సమూహ గానం ముందుకు సాగాలని తన ఆకాంక్షను వ్యక్తం చేశారు. కార్యక్రమానికి పసునూరి రవీందర్ సభాధ్యక్షత వహించగా స్కైబాబా సమన్వయకర్తగా వ్యవహరించారు. కవి గాయక సమూహ గానం తొమ్మిది సెషన్లతో రోజంతా సాగింది. యాకూబ్, సంగిశెట్టి శ్రీనివాస్, సుంకిరెడ్డి నారాయణరెడ్డి, నాళేశ్వరం శంకరం, కందుకూరి శ్రీరాములు, రాపోలు సుదర్శన్, దాసోజు లలిత, మెర్సీ మార్గరెట్, పేర్ల రాము, నరేష్ కుమార్ సూఫీ, ప్రసాదమూర్తి, నస్రీన్‌ఖాన్, తగుళ్ల గోపాల్, జ్వలిత, మాస్టార్జీ, యశ్‌పాల్‌తోపాటు వందమందికి పైగా కవులు, రచయితలు, గాయకులు ప్రజాస్వామిక లౌకిక రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం కవితలు చదివారు. పాటలు ఆలపించారు.

చర్చ లేకుండా చట్టాల మార్పు సరికాదు

● ప్రొఫెసర్ హరగోపాల్ ● ఎలక్టోరల్ బాండ్లు కొనుగోలు చేసి బీజేపీకి ఇస్తే కేసుల్లో వెసులుబాటు : అంజలి భరద్వాజ్

మంగళ్‌హాట్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై చర్చించాల్సిన పార్లమెంట్‌లో ఎలాంటి చర్చలు లేకుండానే చట్టాలు మార్పులు పొందుతున్నాయని ప్రొఫెసర్ హరగోపాల్ ఆందోళన వ్యక్తం చేశారు. చట్టాల్లో మార్పులు చేసి మరీ లబ్ధి చేకూర్చే కార్యక్రమాలకు పూనుకోవడం ప్రజాశ్రేయస్సుకు మంచిదికాదన్నారు. తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ, భారత్ జోడో అభియాన్‌ల ఆధ్వర్యంలో నాంపల్లి మదీన ఎడ్యుకేషన్ సెంటర్‌లో "ఎలక్షన్స్ 2024 - డెమోక్రసీ, కాన్‌స్టిట్యూషన్ ఇన్ డేంజర్" పేరుతో అన్‌విల్లింగ్ ది ఎలక్టోరల్ బాండ్ స్కామ్ అండ్ టేక్ ఓవర్ ది ఇన్‌స్ట్రక్షన్స్ అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హరగోపాల్ మాట్లాడుతూ దేశంలోని మేధావులు, యువకులు, నిరుద్యోగులు ఈ సారి ఎన్నికల్లో ఆలోచించి ఓటు వేయాలన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి పనిచేసే ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆర్టీఐ, డెమోక్రటిక్ రైట్స్ యాక్టివిస్ట్ అంజలి భరద్వాజ్ మాట్లాడుతూ ఎలక్టోరల్ బాండ్లతో నల్లధనం పెరిగిపోతుందని స్వయంగా ఆర్బీఐ చెప్పినా పట్టించుకోని ప్రభుత్వాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని అన్నారు. రాజకీయ లబ్ధి కోసం ఏకంగా పార్లమెంట్‌లో సగం మంది ప్రతిపక్ష ఎంపీలను బహిష్కరించి, కనీసం చట్టాలపై చర్చ లేకుండానే మార్పులు చేస్తున్నారని ఆరోపించారు. భారత్ ఎలక్ట్రానిక్స్, భారత్ టెలికాం కంపెనీలు ఎలక్టోరల్ బాండ్స్ కొనుగోలు చేసి బీజేపీకి ఇచ్చిన వెంటనే కాంట్రాక్టులు ఎలా ధారాదత్తం చేశారనేది ప్రజలందరూ తెలుసుకోవాలన్నారు. అనంతరం సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ మాట్లాడుతూ ఈడీ, సీబీఐ కేసులు నమోదు చేసిన వెంటనే బాధిత కంపెనీలకు చెందిన వారు నేరుగా ఎలక్టోరల్ బాండ్లు కొనుగోలు చేసి బీజేపీకి ఇస్తే వెంటనే ఆయా కేసుల్లో బెయిల్ దొరకడం, కాంట్రాక్టులు లభించడం ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. ఫార్మా కంపెనీలు, ఐటీ, టెలికాం తదితర కంపెనీలకు లబ్ధి చేకూరేలా చట్టాల్లో మార్పులు తెచ్చి కాంట్రాక్టర్లకు టెండర్లు, ఓపెన్ ఆక్షన్ లేకుండానే అప్పగించడం చూస్తున్నామని చెప్పారు. ప్రతిపక్ష పార్టీల అకౌంట్లను ఫ్రీజ్ చేయించి వారిని ఆర్థికంగా దెబ్బకొట్టేందుకు ఈడీ, సీబీఐ, ఐటీ వంటి సంస్థలను వాడుకోవడం సరికాదన్నారు. ఎన్నికల కమిషన్ స్వచ్ఛందంగా వ్యవహరించేందుకు ఖాళీగా ఉన్న పోస్టులను సుప్రీంకోర్టు భర్తీ చేయాలన్నారు. ఎలక్టోరల్ బాండ్స్ ద్వారా బీజేపీకి వేల కోట్ల రూపాయలు వచ్చాయని ప్రశాంత్‌భూషణ్ గుర్తు చేశారు. ఎన్నికల్లో ప్రజలు బీజేపీకి మద్దతిచ్చేందుకు సిద్ధంగా లేరన్నారు. ఈ సారి బీజేపీకి 250 నుంచి 270 ఎంపీ సీట్లు వస్తే అదే ఎక్కువ అని జోస్యం చెప్పారు.


యూసుఫ్‌గూడలో ఆదివారం ఎన్నికల ప్రచారం చేస్తున్న సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి

ఫొటో: స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి


విజనరీ లీడర్‌కు, ప్రజల కష్టాన్ని దోచుకుంటున్న జగన్‌మోహన్‌రెడ్డికి తేడా ఇదేనంటూ వివరిస్తూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఫాలోవర్స్ హైదరాబాద్ టీం సభ్యులు పోస్టర్లను రూపొందించారు. వీటిని ప్రముఖ రాజకీయ విశ్లేషకులు అడుసుమిల్లి శ్రీనివాస్, అప్పసాని రాజేష్, టీం సభ్యులు కొల్లి ప్రవీణ్, కుర్ర మహేష్, తదితరులు ఆదివారం ఆవిష్కరించారు

ఫొటో: స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి

అభ్యర్థి వస్తేనే..!

(5వ పేజీ తరువాయి)

వివరించాలని సూచించారు. అయినా పార్లమెంట్ ప్రచారం నామ్ కే వాస్తేగా సాగుతోంది.

ఎమ్మెల్యేలు.. ఎందుకిలా..?

గ్రేటర్‌లో 24 నియోజకవర్గాలుండగా.. శాసనసభ ఎన్నికల్లో 16 స్థానాలను బీఆర్ఎస్ కైవసం చేసుకుంది. సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఏడు స్థానాల్లో నాంపల్లి మినహా మిగతా ఆరు స్థానాలను గులాబీ పార్టీ గెలుచుకుంది. కారు దిగిన ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థిగా బరిలో నిలిచారు. సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ పార్లమెంట్ బరిలో నిలిచారు. సనత్‌నగర్, ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల నుంచి ప్రాతినిధ్యం వహిస్తోన్న ముగ్గురు ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ వాళ్లే. రంజాన్‌లో సమయంలో ఆయా ప్రాంతాల్లో ఇఫ్తార్ విందుల్లో ఎమ్మెల్యేలు మెరిశారు. అభ్యర్థితో కలిసి పాల్గొన్నారు. అధిష్ఠానం ఆదేశాల మేరకు అనంతరం నియోజకవర్గాల వారీగా సమన్వయ సమావేశాలు నిర్వహించారు. కొన్నిచోట్ల డివిజన్ల వారీగా సమావేశాలూ జరుగలేదు. పద్మారావు ఇప్పటికే నామినేషన్ కూడా దాఖలు చేశారు. పలు ప్రాంతాల్లో పాదయాత్రలు నిర్వహిస్తున్నారు. కానీ, పార్టీ ఎమ్మెల్యేలు మాత్రం స్వతహాగా ప్రచారం నిర్వహించడం లేదు. అభ్యర్థులు తమ నియోజకవర్గాలకు వచ్చినప్పుడు వారి వెంట కనిపిస్తున్నారు. 'కాలనీ, కుల సంఘాలతో అంతర్గతంగా చర్చిస్తున్నాం. ఇంటింటి ప్రచారం ఇంకా ప్రారంభించలేదు. త్వరలో మొదలవుతుంది' అని పార్లమెంట్ పరిధిలోని ఓ ఎమ్మెల్యే పేర్కొన్నారు. మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోనూ అదే పరిస్థితి కనిపిస్తోంది. ఈ నియోజకవర్గం పరిధిలో ఏడుగురు ఎమ్మెల్యేలూ బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారే. అయినా ఒకరిద్దరు వినహా మిగతా వారు ప్రచారానికి దూరంగా ఉంటున్నారు. పార్టీ శ్రేణులను సన్నద్ధం చేసేందుకూ ఆసక్తి చూపడం లేదు. కొన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు పార్టీ కార్యక్రమాల వివరాలను కార్పొరేటర్లు, నేతలకు చెప్పడం లేదు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో కంటికి నిద్ర లేకుండా.. కాలికి తీరిక లేకుండా పర్యటించిన ఎమ్మెల్యేలు ఇప్పుడా స్థాయిలో ప్రచారం నిర్వహించకపోవడంపై పార్టీ శ్రేణులు నిరాశ చెందుతున్నాయి.

కాంగ్రెస్ వ్యూహం ఫలించేనా?

(5వ పేజీ తరువాయి)



గల్లీల్లో సైతం హస్తం పార్టీ బలంగా కనిపించేది.

రాష్ట్ర విభజన అనంతరం బలహీనం

రాష్ట్ర విభజన అనంతరం స్థానికంగా కాంగ్రెస్ పార్టీ బలహీనపడింది. కేడర్ కూడా అంతంతమాత్రమే మిగిలింది. కాంగ్రెస్‌కు మద్దతుగా ఉండే కంటోన్మెంట్ బోర్డు సభ్యులు, మాజీ సభ్యులు అటు బీఆర్ఎస్, ఇటు బీజేపీలలో చేరడంతో పార్టీ బలహీనపడింది. సికింద్రాబాద్ కంటోన్మెంట్ కాంగ్రెస్‌కు పెద్ద దిక్కుగా, కేంద్ర మంత్రిగా సుపరిచితులైన సర్వే సత్యనారాయణ 2018 ఎన్నికల్లో కంటోన్మెంట్ శాసనసభ్యుడిగా పోటీ చేసి పరాజయం పాలయ్యారు. 2023 ఎన్నికల్లో ప్రజా గాయకుడు గద్దర్ కుమార్తె వెన్నెల పోటీ చేసినప్పటికీ ఓటమి పాలయ్యారు. 15 ఏళ్లుగా సమర్థవంతమైన నాయకత్వం లేకపోవడం, కేడర్‌ను కాపాడుకోలేకపోవడం, కొత్త నీరు నింపుకోకపోవడం తదితర కారణాలతో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి దయనీయంగా మారిందని పార్టీ శ్రేణులే స్వయంగా చెబుతున్నారు. ఇదిలా ఉండగా ప్రస్తుతం కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారంలో ఉంది. ఇదే సమయంలో సిట్టింగ్ శాసనసభ్యురాలు లాస్య నందిత రోడ్డు ప్రమాదంలో మరణించడంతో కంటోన్మెంట్‌కు ఉప ఎన్నిక అనివార్యమైంది. దీంతో ఉప ఎన్నికలో మరోసారి కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని నేతలు పావులు కదుపుతున్నారు.

సీఎం ప్రత్యేక ఫోకస్

ఉపఎన్నికపై రాష్ట్ర ముఖ్యమంత్రి, పీసీసీ సారథి రేవంత్‌రెడ్డి ప్రత్యేక ఫోకస్ పెట్టినట్లు పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. వ్యూహంలో భాగంగా గడిచిన ఎన్నికల్లో పోటీ చేసిన వెన్నెలను కాదని, బీజేపీ నుంచి పోటీ చేసి ఓడిన ఎన్.శ్రీగణేష్‌ను హస్తం పార్టీలో చేర్చుకుని, అతడికే టికెట్ కేటాయించారు. దీనిద్వారా బీజేపీకి బలమైన అభ్యర్థిని దూరం చేయడం, హస్తం పార్టీకి విజయావకాశాలను మెరుగుపరచుకోవాలన్నదే రేవంత్‌రెడ్డి వ్యూహంగా పేర్కొంటున్నారు. అంతటితో ఆగకుండా వివిధ కారణాల వలన పార్టీని వీడిన నాయకులను, కార్యకర్తలను ఘర్ వాపసీ పేరిట సొంత గూటికి చేర్చుకుంటున్నారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ పాలక మండలి మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్‌ను కాంగ్రెస్‌లోకి చేర్చుకున్నారు. వారం, పది రోజుల్లో మరిన్ని చేరికలకు వ్యూహం సిద్ధం చేస్తున్నట్టు తెలుస్తోంది. బీఆర్ఎస్, బీజేపీలతో పోలిస్తే కాంగ్రెస్ పార్టీకి బలమైన కేడర్ లేకపోవడంతో కంటోన్మెంట్‌లోని 8 వార్డుల నుంచి ద్వితీయ శ్రేణి నాయకులను తమ గూటికి చేర్చుకోవడంపై ముఖ్యమంత్రి దృష్టి సారిస్తున్నట్టు తెలుస్తోంది. సాయన్న ముఖ్య అనుచరులుగా పేరొందిన కొందరు బీఆర్ఎస్ ద్వితీయ శ్రేణి నాయకులను తాజాగా శుక్రవారం మైనంపల్లి హన్మంతరావు కాంగ్రెస్ పార్టీలోకి చేర్చుకోవడం దీనిలో భాగమేనని పేర్కొనవచ్చు. ఈ చేరికలు ఆరంభం మాత్రమేనని, ఎన్నికలు దగ్గర పడే కొద్దీ ఘర్ వాపసీ కార్యక్రమానికి మరింత పదును పెడతారని పార్టీ శ్రేణులు బాహాటంగానే పేర్కొంటున్నాయి. మల్కాజిగిరి లోక్‌సభ సభ్యుడిగా పనిచేసిన అనుభవంతో, ఆ పార్లమెంట్ పరిధిలోని కంటోన్మెంట్‌పై పూర్తి అవగాహన ఉన్న రేవంత్‌రెడ్డి.. ఉపఎన్నికలో విజయం సాధించి నగరంలో బోణీ కొట్టాలని విస్తృతంగా కృషి చేస్తున్నట్లు తెలుస్తోంది.

లైబ్రరీ రెస్టారెంట్



ఆజీచమ్ పుస్తకాంచమ్ హోటల్...

మహారాష్ట్రలోని ఓఝర్‌లో... ముంబయి, ఆగ్రా నేషనల్ హైవేలో ఉన్న ఈ హోటల్‌లో...

ఆకలి తీర్చే వేడివేడి ఆహార పదార్థాలే కాదు, విజ్ఞాన దాహాన్ని తీర్చే పుస్తకాలూ సందర్శకుల్ని ఆహ్వానిస్తాయి.

ఆరో క్లాసుతో చదువు ఆపేసినా... అక్షరాన్ని ప్రేమించే భీమ్‌బాయి జోంధాలే ఆలోచనకు ప్రతిబింబం ఇది.

ఆ హోటల్ గురించి, దాని ప్రారంభం వెనుక కథ గురించి డెబ్బై నాలుగేళ్ళ భీమ్ బాయి చెబుతున్నారిలా...

“నాకు వివాహం జరిగేనాటికి ఆరో తరగతి చదువుతున్నాను. నాకు చిన్నప్పటి నుంచి పరిశీలనాశక్తి ఎక్కువ. పుస్తకాలు చదవడం ఇష్టం. స్కూల్ లైబ్రరీలో పుస్తకాలన్నీ చదివేశాను. కాలేజీకి వెళ్ళాలన్నది నా కోరిక... కానీ హైస్కూల్ దాటలేదు. అత్తవారింట్లో అడుగుపెట్టగానే నా జీవితం పూర్తిగా మారిపోయింది. నా భర్త తాగుబోతు. ఏ పనీ చేయకుండా ఊరకే తిరుగుతూ ఉండేవాడు. దాంతో ఇంటి పనులే కాదు, మాకున్న కొద్దిపాటి పొలం బాధ్యతలు కూడా నా మీద పడ్డాయి. మాకొక అమ్మాయి, తరువాత అబ్బాయి. నాకెలాగూ సరైన చదువులేదు... పొలాన్ని తాకట్టుపెట్టయినా పిల్లల్ని పెద్ద చదువులు చదివించాలనుకున్నాను. కానీ తాగుడుకూ, జూదానికీ నా భర్త ఆ పొలంలో చాలా భాగం అమ్మేశాడు. దాంతో మేము నడిరోడ్డున నిలబడాల్సి వచ్చింది. వేరే వాళ్ళ పొలంలో కొంతకాలం పనిచేశాను. బంధువులెవరూ మా వైపు చూసేవారు కాదు. మా అబ్బాయి న్యూస్ పేపర్లు వేస్తూ... చదువుకు ఫీజులు కట్టుకొనేవాడు. మా ఊళ్ళో మేము గొప్పగా బతకకపోయినా... గౌరవంగానే బతికాం. కానీ రోజురోజుకూ పరిస్థితులు దుర్భరంగా మారడంతో... వేరే చోటికి మారిపోదామని నిర్ణయించుకున్నాం. మిగిలిన కాస్త పొలాన్నీ అమ్మేసి... నాసిక్ నగరానికి వచ్చేశాం.



కొన్నాళ్ళకు మా అబ్బాయి డిగ్రీ పూర్తి చేశాడు. కొందరు స్నేహితులతో మరాఠీ పుస్తకాల ప్రచురణ కంపెనీ పెట్టాడు. నేను చిన్నచిన్న పనులు చేస్తూ ఉండేదాన్ని. దానివల్ల పెద్దగా ఆదాయం వచ్చేది కాదు. నేను, మా అమ్మాయి ఆలోచించి... చిన్న టీస్టాల్ ప్రారంభించాం. “ఆడవాళ్ళు ఇళ్ళలో ఉండాలి. వీధుల్లో టీలు అమ్ముకోడానికా సిటీకి వెళ్ళారు?” అంటూ బంధువులు ఎత్తిపొడిచారు. “మేము కష్టాల్లో ఉన్నప్పుడు మీరు కనీసం పలకరించలేదు. మా బతుకు మేం బతుకుతున్నాం. మీ సలహాలు అవసరం లేదు” అని గట్టిగా చెప్పాను. నా పిల్లలు నాకు అండగా నిలిచారు. కొద్దికొద్దిగా పొదుపుచేసిన డబ్బుతో... మా టీ స్టాల్‌ను టిఫిన్ సెంటర్‌గా మార్చాం. వంటకాలు రుచిగా, శుచిగా ఉండడంతో ఆదరణ పెరిగింది.

తింటున్నదేంటో తెలియనంతగా...

మా హోటల్‌కు వచ్చిన కస్టమర్లు ఏదైనా ఆర్డర్ ఇచ్చాక... అది వచ్చే లోపల వాళ్ళ ఫోన్‌లో నిమగ్నమై పోయేవారు. ఒక్కోసారి ఏం తింటున్నారనేది కూడా వాళ్ళు గమనించనంతగా మమేకం అయిపోయేవారు. అన్ని చోట్లా జరిగేది ఇదే! 'ఇది చాలా చెడ్డ అలవాటు. కనీసం నా హోటల్‌లోనైనా ఈ అలవాటు మార్చడానికి ఏదైనా చెయ్యాలి' అని ఆలోచించాను. ఈలోగా మా అబ్బాయి పబ్లిషింగ్ కంపెనీ మూతపడింది. చాలా పుస్తకాలు మిగిలిపోయాయి. వాటిని కట్టలు కట్టి తెచ్చి, మా హోటల్లో పెట్టాడు. తీరిక సమయాల్లో వాటిని చదువుతూ ఉంటే... ఎంతో హాయిగా అనిపించింది. పుస్తకాలు మనకు మంచి స్నేహితులు, ప్రతి సందర్భంలోనూ మనకు చక్కటి సహచరులు. కానీ జనం ఫోన్లలో కూరుకుపోవడంతో పుస్తకాలు చదివే అలవాటు బాగా తగ్గిపోయింది. దాన్ని మా హోటల్ ద్వారా ప్రోత్సహిస్తే బాగుంటుందనే సలహా నా పిల్లలకు నచ్చింది. హోటల్‌లో ఒక మూల స్టాండ్ ఏర్పాటు చేసి... వాటి మీద పుస్తకాలు పేర్చాం. వాటిని ఉచితంగా చదువుకోవచ్చని కస్టమర్లను ప్రోత్సహించాం. క్రమంగా పుస్తకాల సంఖ్య, వాటిని చదివే వారి సంఖ్య పెరిగింది. ఆర్డర్ చేసిన పదార్థాలు వచ్చేలోగా... పుస్తకంలో రెండో మూడో అధ్యాయాలు చదివేసేవాళ్ళు కూడా ఉన్నారు. ఈ ఏర్పాటును చాలామంది మెచ్చుకున్నారు. ఇది ఆనోటా ఈనోటా విని... పుస్తక ప్రియుల రాక పెరిగింది. రెగ్యులర్ కస్టమర్లు కూడా ఎందరో. వారిలో కొందరు పుస్తకాలను విరాళంగా కూడా ఇస్తూ ఉంటారు.

పాతిక నుంచి అయిదు వేలకు...

ఒక స్థిరమైన బతుకు కోసం ఎంతో పోరాడాను. నా పిల్లలు బాగుండాలనే తపన నన్ను నడిపించింది. నా పిల్లలను చదివించుకోగలిగాను. గత పద్నాలుగు ఏళ్ళలో... మా హోటల్ బాగా అభివృద్ధి చెందింది. పాతికతో మొదలైన పుస్తకాల సంఖ్య అయిదు వేలకు చేరింది. వాటిలో మరాఠీ, హిందీ, ఇంగ్లీష్ పుస్తకాలు ఉన్నాయి. దీనితోపాటు... పుస్తక పఠనం మీద ఆసక్తిని పెంచడానికి మహిళా దినోత్సవం, రిపబ్లిక్ డే లాంటి ప్రత్యేక సందర్భాల్లో... ఉచితంగా పుస్తకాలను పంపిణీ చేస్తున్నాం. రోగులకు, వారితో వచ్చేవారికి కాలక్షేపం కోసం ఆసుపత్రుల్లో పుస్తకాలను బహుమతులుగా అందజేస్తున్నాం. ఇదంతా మా అబ్బాయి ఆలోచన. మందులు శరీరానికి స్వస్థత కలిగిస్తే... పుస్తకాలు మనసుకు ప్రశాంతత కలిగిస్తాయి. మా హోటల్లో ఎవరైనా పుస్తకాలు చదవడం చూస్తే... ఎంతో సంతోషంగా అనిపిస్తుంది. నేను చేసిన చిన్న ప్రయత్నం విజయవంతమయిందనే సంతృప్తి కలుగుతుంది. నాకు అంతకన్నా ఇంకేం కావాలి?”

సంకల్పం



బడి వయసులో స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో భాగస్వామ్యం... ఆమెలో సేవా స్ఫూర్తి రగిలించింది. ఆ స్ఫూర్తే నేడు ఆపదలో ఉన్న మహిళలకు అండగా నిలిచి... వారి జీవితానికి భరోసా కల్పిస్తోంది. మహిళలపై వివక్ష, లైంగిక వేధింపులపై మూడు దశాబ్దాలుగా అలుపెరుగని పోరాటం చేస్తున్న సామాజిక కార్యకర్త, న్యాయవాది... డాక్టర్ సుభాషిణి గుడిమల్ల తన ప్రయాణాన్ని 'నవ్య'తో పంచుకున్నారు.

అండగా నిలుస్తూ... పోరాటం నేర్పుతూ!

“మనం బాగుంటేనే సరిపోదు. మన చుట్టూ ఉన్న సమాజం కూడా బాగుండాలి. అప్పుడే దేశం బాగుంటుంది. ఇది నాకు చిన్న వయసులోనే అర్థమైంది. అందుకు ప్రధాన కారణం... ఐదో తరగతి నుంచే నేను భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో పాల్గొనడం. కాలేజీకి వెళ్లాక కూడా ఎన్ఎస్ఎస్‌లో భాగస్వామిని అయ్యాను. 1987లో నాకు 'ప్రెసిడెంట్ గైడ్ అవార్డు' కూడా వచ్చింది. నాటి రాష్ట్రపతి జ్ఞానీ జైల్‌సింగ్ నుంచి ఆ అవార్డు అందుకున్నాను. 1995లో ఐదు దేశాలకు వెళ్లాను. భారత ప్రభుత్వ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా ఇరవై మందిని ఎంపిక చేశారు. అందులో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి నేనొక్కదాన్నే. విద్యార్థిగా సామాజిక సేవలో భాగస్వామ్యాన్ని గుర్తించి ఈ అంతర్జాతీయ మీట్‌కు ఎంపిక చేశారు. అలాగే కాలేజీ రోజుల్లో ఢిల్లీ రిపబ్లిక్ పరేడ్‌లో జాయింట్ కమాండర్‌గా వ్యవహరించాను. విదేశీ పర్యటన తరువాత ప్రభుత్వం నిర్వహించే అక్షరాస్యత కార్యక్రమాలు, మహిళ ఉద్యమాల్లో పాల్గొన్నాను. రాత్రి పూట వాలంటీర్‌గా బస్తీల్లో చదువు చెప్పాను. పొదుపు, స్వయంసహాయక సంఘాలపై అధిక శ్రద్ధ పెట్టాను. ఎందుకంటే చాలా గ్రూపులు ఏర్పాటవుతాయి కానీ, అనేక కారణాలవల్ల మధ్యలోనే ఆగిపోతాయి. అలాంటి వారికి మార్గదర్శనం చేస్తూ, ప్రభావంతంగా పని చేసేలా ప్రోత్సహించేదాన్ని.

అందుకే 'లా'...

ఇక నా చదువంతా మా సొంతూరు వరంగల్‌లోనే సాగింది. అక్కడి ఎల్‌బీ కాలేజీలో బీకాం చదివాను. కాకతీయ విశ్వవిద్యాలయం (1999)లో ఎల్ఎల్ఎం పూర్తి చేశాను. రెండేళ్ల కిందటే 'లీగల్ ప్రొటెక్షన్ ఆఫ్ గర్ల్ చైల్డ్ ఇన్ ఇండియా' అంశం మీద ఉస్మానియా వర్సిటీ నుంచి పీహెచ్‌డీ పట్టా పొందాను. ఈ మధ్యలో నల్సార్ విశ్వవిద్యాలయంలో 'ఫ్యామిలీ డిస్ప్యూట్స్ రిజల్యూషన్'పై పీజీ డిప్లమో చదివాను. మొదటి నుంచీ సేవా దృక్పథంతో ఉన్నాను కాబట్టి, లా చదివితే చట్టం కూడా తెలుస్తుంది కదా. దాని వల్ల మరింత సమర్థవంతమైన సేవలు ఇవ్వగలుగుతాను. అవసరమైన చోట న్యాయబద్ధంగా పోరాడగలుగుతాను. చాలా వివాదాల్లో అంతిమ నిర్ణయాలు న్యాయ సంబంధ అంశాలతోనే ముడిపడి ఉంటాయి. అందుకే నేను లా చదివాను. మరింత లోతైన అవగాహన కోసం అందులో పీహెచ్‌డీ చేశాను. అంతేకాదు... ఆటల్లో కూడా నేను ముందుండేదాన్ని. కబడ్డీలో జాతీయ స్థాయి క్రీడాకారిణిని. బాస్కెట్‌బాల్‌లో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించాను. బ్యాడ్మింటన్, జావెలిన్ త్రో, లాంగ్ జంప్, హైజంప్, షార్ట్‌పుట్ పోటీల్లో పాల్గొనేదాన్ని. కూచిపూడి నాట్యం నేర్చుకున్నాను.

జాతీయ భావన...

ఇప్పుడు ప్రధానంగా నేను దృష్టి పెడుతున్న అంశాలేమిటంటే... రాజ్యాంగం కల్పించిన హక్కులు, ప్రభుత్వ పథకాల గురించి పౌరులకు చెప్పి, వాటిపై అవగాహన కల్పిస్తున్నాను. ప్రభుత్వానికి... ప్రజలకు మధ్య వారధిలా పని చేస్తున్నాను. కొన్ని ప్రాంతాలు, సమూహాల్లో మహిళలకు తమ హక్కుల గురించి కనీస మాత్రం తెలియదు. ఒకరికి ఒకరు తోడుగా ఉండాలని, అందరూ కలిస్తేనే సమాజ నిర్మాణం జరుగుతుందని వారికి అర్థమయ్యేలా చెప్పే ప్రయత్నం నాది. తద్వారా జాతీయ భావన, సద్భావన పెంపొందుతుంది. అదే సమయంలో స్వయం అభివృద్ధి కూడా ముఖ్యం. ఒక కుటుంబం ఆర్థికంగా ఎదగడానికి ఏంచేస్తే బాగుంటుంది? మహిళలపై అత్యాచారాలు, వివక్ష లైంగిక వేధింపులను అరికట్టడానికి ఏమేం చర్యలు తీసుకోవాలి? తదితర కీలక అంశాల పరిష్కారానికి కృషి చేస్తున్నా. నాకు తెలిసిన విజ్ఞానాన్ని నలుగురికీ పంచుతున్నా.

గళం... బలంగా...

ఇప్పటివరకు వరంగల్, హైదరాబాద్, కరీంనగర్, సంగారెడ్డి, రంగారెడ్డి, నల్లగొండ సహా తెలంగాణలోని చాలా ప్రాంతాల్లో పర్యటించాను. మహిళల పట్ల అసమానతలు, అఘాయిత్యాలు, వివక్షపై పోరాడేందుకు పెద్దఎత్తున రాస్తారోకోలు, ధర్నాలు నిర్వహించాం. వీలైనంతవరకు మహిళలందరూ కలిసికట్టుగా ఉండి, తమ సమస్యలు తామే పరిష్కరించుకొనేలా వారిలో చైతన్యం తీసుకువస్తున్నాను. వారిలో నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు, స్వయం ఉపాధికి సంబంధించిన వృత్తివిద్యల్లో పలు ఎన్‌జీఓలతో కలిసి శిక్షణ, నైపుణ్య తరగతులు నిర్వహిస్తున్నాం. వీటన్నిటి కోసం ఒక వేదిక ఉండాలనే ఆలోచనతో 'రుద్రమదేవి' పేరిట ఒక స్వచ్ఛంద సంస్థ కూడా నెలకొల్పాను.

> **ట్రాప్ చేసి పట్టేస్తారు...**
>
> నేను డీల్ చేసే కేసుల్లో ఉమెన్ ట్రాఫికింగ్ కూడా ప్రధానమైనది. బడి వయసు పిల్లలను ట్రాప్ చేసి తీసుకువెళ్లిపోతారు. అది ఎలా జరుగుతుందంటే... ఉదాహరణకు పక్కన ఎవరూ లేకుండా బడికి పోయివచ్చేవారు, ఇంట్లో తల్లితండ్రులు పట్టించుకోని అమ్మాయిలను దుండగులు లక్ష్యంగా చేసుకొంటారు. వారి ఇళ్ల పక్కనే భార్యాభర్తల్లా అద్దెకు దిగుతారు. కొంత కాలం ఆ అమ్మాయితో స్నేహం చేస్తారు. కొన్నాళ్లకు భార్య వెళ్లిపోతుంది. తరువాత వీడు అమ్మాయిని తీసుకెళ్లిపోయి వేర్వేరు ప్రాంతాల్లో తిప్పుతాడు. కొన్ని రోజులకు పెళ్లి చేసుకొంటాడు. తరువాత అమ్మేస్తాడు. తల్లితండ్రుల ఫిర్యాదుతో పోలీసులకు దొరికినా ఆ అమ్మాయి వాడిని వదిలి రానంటుంది. అంతలా కంట్రోల్‌లో పెట్టేస్తారు. అలాంటి ఈ మధ్య ఒక పదిహేనేళ్ల అమ్మాయిని కాపాడి తెచ్చారు పోలీసులు. రాత్రి పదకొండు గంటల సమయంలో పోలీస్ స్టేషన్‌కు వెళ్లాను. ఎంత చెప్పినా ఆ అమ్మాయి ఇంటికి రానంటుంది. ఆ వయసులో మంచేదో... చెడేదో వాళ్లకేం అర్థం కాదు. చివరకు ఆ అమ్మాయికి నచ్చజెప్పి ఇంటికి పంపించాను. నిందితుడి మీద పోక్సో చట్టం కింద కేసు పెట్టి, జైలుకు పంపించాం. ఇలాంటివి ఒక్క హైదరాబాద్‌లోనే చాలా కేసులు ఉన్నాయి. ఇదంతా ఒక ముఠా ద్వారా జరుగుతుంటుంది. అది పెద్ద చైన్.

న్యాయ సాయం...

అలాగే ఒక న్యాయవాదిగా ఉచిత న్యాయ సాయం (లీగల్ ఎయిడ్) కూడా అందిస్తున్నాను. వేల మందికి ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఇచ్చాను. ఇక విడాకులే మార్గం అనుకున్న వెయ్యికి పైగా జంటలను కలపగలిగాను. వరకట్నం సమస్య కావచ్చు, భార్య ఉద్యోగం చేయడం భర్తకు ఇష్టం లేకపోవచ్చు, లేదంటే ఆమె వస్త్రధారణ అతనికి నచ్చకపోవచ్చు, ఆమె పుట్టింటికి పోవడం ఇష్టంలేకపోవచ్చు, ఉద్యోగం చేసే అమ్మాయి ఇంట్లో పని చేయలేదని అత్తమామలు దెప్పి పొడవడం, టైమ్‌కు లేవరని, పనిమనిషి ఉన్నా వీళ్లే పని చేయాలని, పని మనిషి తప్పు చేసినా వీళ్లనే తిట్టడం... ముఖ్యంగా అసభ్య పదజాలంతో భార్యను దూషించి, మానసిక ఒత్తిడికి గురి చేయడం... ఇలా రకరకాలుగా వేధింపులకు గురవుతున్న మహిళలు నా దగ్గరకు వస్తారు. బాధిత మహిళలకు ధైర్యం చెప్పి, ఇరు కుటుంబాలను పిలిచి కౌన్సెలింగ్ ఇస్తాను. అవసరమైతే సైకాలజిస్టులు, సైక్రియాటిస్టులను కూడా పిలిపిస్తాను. ఈ సేవలన్నీ ఉచితంగానే అందిస్తున్నాను. నా సేవలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం 'జాతీయ యువ పురస్కారం' అందించింది.

విద్యార్థులకు అవగాహన...

దీంతోపాటు స్కూళ్లు, కాలేజీలకు వెళ్లి, విద్యార్థులకు లీగల్ కౌన్సెలింగ్ కూడా ఇస్తున్నాం. వాళ్ల విద్యాసంస్థలకు వెళ్లే దారిలో కానీ, స్నేహాలవల్ల కానీ ఒకవేళ ఊహించని సమస్యలు ఏవైనా ఎదురైతే వాటికి న్యాయపరమైన పరిష్కారాలు తెలియాలనే ఉద్దేశం. తద్వారా ఎలాంటి గొడవలకు పోకుండా సక్రమమైన మార్గంలో నడుచుకొంటారు. చట్టం తెలుసుకొని, కుదురుగా ఉండమని చెప్పే ప్రయత్నం నాది. ఎందుకంటే నేటి విద్యార్థులే భావిభారత నిర్మాతలు కదా. వారిని సన్మార్గంలో నడిపించాల్సిన బాధ్యత పెద్దలదే. సుప్రీమ్‌కోర్టు మార్గదర్శకాలను అనుసరించి ఫండమెంటల్ రైట్స్, ఫండమెంటల్ డ్యూటీస్ ఆఫ్ ది సిటిజన్ అన్నది బడి వయసులోనే మొదలుపెట్టాలి. దాని వల్ల వారి భవితవ్యం మెరుగ్గా ఉంటుంది. ఈ దిశగా అవగాహన కల్పించేందుకు పదహారేళ్లగా పాఠశాలలు, కళాశాలల్లో ఏటా 60 నుంచి 70 కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

నలభై వేలమంది...

సామాజిక కార్యక్రమాల నేపథ్యంలో విద్యార్థులు కావచ్చు, మహిళలు, వివిధ వర్గాల సమూహాలు కావచ్చు... ఇప్పటివరకు నేను నలభై వేలమందికి పైగా ప్రజలను కలిశాను. వారందరికీ నాకు సాధ్యమైనంతవరకు సహాయం అందించాను. వీరిలో చాలామంది తమను తాము ఉన్నతంగా తీర్చిదిద్దుకోవడమే కాకుండా... వేరొకరి సమస్యలు తెలుసుకొని పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నారు. కనీసం రోజుకు ఒక కేసన్నా నా దగ్గరకు వస్తుంది. మహిళలందరి సమస్యలకు సంబంధించి గతంలో ధర్నాలు, రాస్తారోకోల వంటి పెద్ద పెద్ద కార్యక్రమాలు చేసేవాళ్లం. ఇప్పుడు వ్యక్తిగతంగా వారికి ఎదురయ్యే సమస్యలపై దృష్టి పెట్టాను. అంటే ఒక సమస్య ఎదురైనప్పుడు న్యాయబద్ధంగా ఎలా పోరాడాలనేది నేర్పుతున్నాను.

ఉదాహరణకు ఇటీవల నా దగ్గరకు వచ్చిన ఓ గృహిణి కేసు గురించి చెబుతాను. ఆమెను తన భర్త ఉద్యోగానికి వెళ్లకుండా ఇంట్లో నిర్బంధించి, ఎవరితో ఫోన్లో కూడా మాట్లాడనివ్వకుండా వేధించాడు. 'మేమిద్దరం మానసికంగా విడిపోయాం. మా ఇద్దరి మధ్య ఏ సంబంధం లేదు' అని ఆమెతోనే బలవంతంగా లెటర్ రాయించి, వదిలిపెట్టేశాడు. ఆ అమ్మాయి ఎంటెక్ చదివింది. అతడిని ఆమె వద్దనుకున్నా... భయంతో ఇన్నాళ్లూ బయటకు రాలేదు. మన సమాజంలో 70 శాతం మంది మహిళలు ఇలా భయపడుతున్నవారే. ఆ వేధింపులు తట్టుకోలేక, కేసుల గురించి అవగాహన లేక, ఇక నాకు జీవితం లేదనే భావనతో మరణమే శరణ్యమనుకొంటారు. అలాంటి సందర్భాల్లో నాలాంటివారి అండ ఎంతో అవసరం. నేను ఆ అమ్మాయికి కౌన్సెలింగ్ ఇచ్చి, ముందుకు వచ్చి పోరాడే ధైర్యం నింపాను. ఇలా ఎన్నో కేసులు.”

● హనుమా

నవ్య | చిత్రజ్యోతి

గురు ద్రోణాచార్య పుత్రుడను.. అశ్వత్థామను



అత్యున్నత సాంకేతిక హంగులతో పాన్ ఇండియా సినిమాగా 'కల్కి 2898 ఏ.డీ' రూపుదిద్దుకుంటున్న సంగతి తెలిసిందే. ప్రభాస్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రానికి నాగ్ అశ్విన్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ పీరియాడికల్ సైన్స్ ఫిక్షన్ యాక్షన్ ఫిల్మ్‌లో అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, దీపికా పదుకొనే, దిశా పటానీ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఆదివారం అమితాబ్ పుట్టిన రోజు సందర్భంగా చిత్రబృందం ఈ సినిమాలో ఆయన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను, క్యారెక్టర్ ఇంట్రడక్షన్ గ్లింప్స్‌ను విడుదల చేసింది. ఈ వీడియోలో ఒక బాలుడు, అమితాబ్‌ను “నీ పేరెంటి.. నీతో ఏ భాషలో మాట్లాడాలి.. నువ్వు చాలా బాగా ఫైట్స్ చేస్తున్నావ్, ఎవ్వరు నువ్వు” అని ప్రశ్నించగా.. “అంతిమ యుద్ధానికి సమయం ఆసన్నమైంది. నేను కల్కి అవతారం కోసమే ద్వాపర యుగం నుంచి వేచి ఉన్నా.. నేను గురు ద్రోణాచార్యుడి పుత్రుడను.. అశ్వత్థామను” అని అమితాబ్ తన గురించి ఆ బాలుడికి చెప్తారు. ఈ గ్లింప్స్ సినిమాపై ఆసక్తిని మరింత పెంచేసింది. త్వరలోనే ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

రెండు తరాల ప్రయాణం

అజయ్ ఘోష్, చాందిని చౌదరి ప్రధాన పాత్రలు పోషించిన చిత్రం 'మ్యూజిక్ షాప్ మూర్తి'. శివ పాలడుగు దర్శకత్వంలో హర్ష గారపాటి, రంగారావు గారపాటి నిర్మించారు. చిత్ర బృందం టీజర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. దర్శకుడు అజయ్ భూపతి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ 'రెండు తరాల వ్యక్తులు కలసి ప్రయాణం చేస్తే ఎన్నో మంచి విషయాలు తెలుస్తాయి. అదే ఈ సినిమా చెప్పే పాఠం' అన్నారు. అజయ్ ఘోష్ మాట్లాడుతూ 'కథ విన్నప్పుడు నేను మెయిన్ లీడ్ ఏంటి అనుకున్నాను. సెట్స్ మీదకు వచ్చాక ఈ సినిమా గొప్పదనం తెలిసింది. ఇందులో కథే హీరో' అన్నారు. మధ్యతరగతి కుటుంబాల కథ ఇది. ప్రేక్షకులను నిరాశ పరచదు అని చాందిని చౌదరి తెలిపారు. మంచి సినిమాను ప్రేక్షకులకు అందించాలనే లక్ష్యంతో బడ్జెట్ పెరిగినా వెనక్కు తగ్గలేదు అని నిర్మాతలు చెప్పారు.



సింగరేణి సైరెన్



ప్రాణాలకు తెగించి సింగరేణి బొగ్గు గనుల్లో పనిచేస్తున్న కార్మికుల కష్టం వెండితెరపైకి ఎక్కనుంది. 'జార్జిరెడ్డి' చిత్రంతో దర్శకుడిగా గుర్తింపు పొందిన జీవన్ రెడ్డి కథను అందిస్తున్నారు. ధూమ్ర వారాహి బేనర్‌పై నిర్మిస్తున్న ఈ చిత్రానికి వివేక్ ఇనుగుర్తి దర్శకుడు. ఈ చిత్రం టైటిల్‌ను యూనిట్ ఆదివారం వెల్లడించింది. 'సింగరేణి జంగ్ సైరన్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. 1999లో జరిగిన యదార్థ సంఘటనల ఆధారంగా సర్వైవల్ డ్రామాగా ఈ సినిమా తెరకెక్కుతోంది. ప్రీ ప్రొడక్షన్ పనులు పూర్తయ్యాయి, త్వరలోనే చిత్రీకరణ ప్రారంభిస్తామని యూనిట్ తెలిపింది. ఇతర వివరాలను మేడే రోజున వెల్లడించనున్నారు. ఈ చిత్రానికి సంగీతం: సురేశ్ బొబ్బిలి. సినిమాటోగ్రఫీ: రాఖీ వనమాలి.



టాలీవుడ్ హీరో తిరువీర్ ఓ ఇంటివాడయ్యారు. కల్పనారావ్‌తో ఆయన వివాహం ఆదివారం జరిగింది. 'కొత్త జీవితం ప్రారంభం' అంటూ ఈ శుభవార్తను తిరువీర్ సోషల్ మీడియా ద్వారా వెల్లడించి, తమ పెళ్లి ఫొటోలను షేర్‌చేశారు.

విక్రమ్ చిత్రంలో విలన్‌గా

తమిళ హీరో విక్రమ్ కథానాయకుడిగా ఎస్. యూ అరుణ్ కుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'వీర ధీర శూరన్'. రియా శిబు నిర్మిస్తున్నారు. హీరోగా విక్రమ్‌కు ఇది 62వ చిత్రం. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతోంది. విక్రమ్ పుట్టిన రోజు సందర్భంగా విడుదల చేసిన టైటిల్ టీజర్‌కు మంచి స్పందన వచ్చింది. తాజాగా చిత్రబృందం మరో అప్డేట్‌ను వదిలింది. మలయాళ నటుడు సిద్దిఖీ ఈ చిత్రంలో కీలకపాత్ర పోషిస్తున్నట్లు ఆదివారం యూనిట్ తెలిపింది. గతంలో ఆయన 'అంతిమ తీర్పు, అగ్ని నక్షత్రం, నా బంగారు తల్లి' చిత్రాల్లో నటించారు. కాళి అనే కిరాణా షాపు యజమాని పాత్రలో విక్రమ్ కనిపించనున్నారు. ఎస్‌జే సూర్య, దుసరా విజయన్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: తేని ఈశ్వర్.



సినీ పురోహితుడు రోహిణి శాస్త్రి కన్నుమూత

- మహేశ్‌బాబుకు నామకరణం చేసింది ఆయనే
- ఎన్టీఆర్ నుంచి ఈతరం హీరోల సినిమాలకు ముహూర్త పూజా కార్యక్రమాల నిర్వహణ



పౌరహిత్యంలో 'శాస్త్రి బ్రదర్స్'గా సుప్రసిద్ధులైన అశ్విని, రోహిణి శాస్త్రుల్లో ఒకరైన రోహిణి శాస్త్రి (70) కన్నుమూశారు. శనివారం ఉదయం నిద్ర లేవకపోవడంతో కుటుంబీకులు ఆయన్ని మేల్కొలిపేందుకు ప్రయత్నించారు. ఆయన అపస్మారక స్థితిలో ఉండడంతో వైద్యులను రప్పించి పరీక్షించగా, అప్పటికే కన్నుమూసినట్లు తేలింది.

సినీరంగంతో ఎనలేని అనుబంధం...

శాస్త్రి బ్రదర్స్ పూర్వీకులది పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరు. రోహిణి శాస్త్రి ప్రాథమిక విద్య టి.నగర్‌లోని రామ కృష్ణ స్కూలులో జరిగింది. వారి తండ్రి తాంద్ర సుబ్రహ్మణ్య శాస్త్రితో కలిసి ఎంజీఆర్, ఎన్టీఆర్ చిత్రాల నుంచి నేటి మహేష్ బాబు, విజయ్ వంటి అగ్ర కథానాయకుల సినిమాల వరకు ముహూర్తం, పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. హీరో మహేష్‌బాబుకు నామకరణం చేసిందీ శాస్త్రి బ్రదర్సే. దివంగత దిగ్గజ దర్శకుడు దాసరి నారాయణరావు తొలి సినిమా 'తాత మనవడు' నుంచి ఆయన 100వ సినిమా 'లంకేశ్వరుడు' వరకు ముహూర్త పూజా కార్యక్రమాలు వారే నిర్వహించడం మరో విశేషం. శాస్త్రి బ్రదర్స్ పురోహితులుగానే దాదాపు వంద సినిమాల్లో కనిపించారు. రోహిణి శాస్త్రి దాసరి నారాయణరావు రూపొందించిన 'విశ్వామిత్ర' సీరియల్‌లోనూ నటించారు. నేడు టి.నగర్ కన్నమ్మపేట శ్మశానవాటికలో రోహిణి శాస్త్రి భౌతికకాయానికి అంత్యక్రియలు జరగనున్నాయి.

- చెన్నై, ఆంధ్రజ్యోతి

గుకేష్.. మరొక్క గేమ్



'క్యాండిడేట్స్' టైటిల్ దిశగా భారత కుర్రాడు

13వ రౌండ్‌లో విజయం

టొరొంటో: భారత టీనేజ్ గ్రాండ్‌మాస్టర్ గుకేష్ ప్రతిష్ఠాత్మక క్యాండిడేట్స్ చెస్ టోర్నీ టైటిల్ దిశగా దూసుకుపోతున్నాడు. ఆదివారం జరిగిన 13వ రౌండ్‌లో 17 ఏళ్ల గుకేష్ ఫ్రాన్స్‌కు చెందిన అలీరెజాను చిత్తు చేశాడు. తద్వారా మొత్తం ఎనిమిది పాయింట్లతో ఒకే ఒక్కడుగా అగ్రస్థానానికి చేరాడు. సోమవారం జరిగే ఆఖరిదైన 14వ రౌండ్‌లో వరల్డ్ నెం.3 హికారు నకామురాను గుకేష్ ఢీకొంటాడు. కరువానాతో గేమ్‌లో ప్రజ్ఞానంద ఓటమిపాలవగా, అబసోవ్‌తో మ్యాచ్‌ను విదిత్ గుజరాతీ డ్రా చేసుకున్నాడు. ఈరౌండ్ తర్వాత నెపోమ్నియాచి, నకామురా, కరువానా తలా ఎనిమిదేసి పాయింట్లతో రెండో స్థానంలో నిలిచారు.ప్రజ్ఞానంద (6), విదిత్ (6) సంయుక్తంగా ఐదో స్థానంలో కొనసాగుతున్నారు. మహిళల్లో..ముజిచుక్‌తో మ్యాచ్‌ను హంపి డ్రాగా ముగించింది. లీ టింగ్జీని ఓడించిన వైశాలీ వరుసగా నాలుగో గేమ్‌లోనూ గెలవడం విశేషం.

పంజాబ్‌కు పంచ్



సత్తా చాటిన సాయి కిశోర్ (4/33)

వరుసగా నాలుగో ఓటమి • 3 వికెట్లతో గుజరాత్ గెలుపు

ముల్లన్‌పూర్: పంజాబ్ కింగ్స్ పరాజయాల పరంపర కొనసాగుతూనే ఉంది. బ్యాటర్లు విఫలమైన చోట బౌలర్లు రాణిస్తూ మ్యాచ్‌ను ఆఖరి ఓవర్ వరకు తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. అటు పడుతూ, లేస్తూ సాగుతున్న గుజరాత్ టైటాన్స్ జట్టు తిరిగి గెలుపు బాట పట్టింది. స్పిన్నర్ సాయి కిశోర్ (4/33) అద్భుతంగా రాణించి పంజాబ్ వెన్నువిరిచాడు. దీంతో టైటాన్స్ మూడు వికెట్లతో నెగ్గింది. పంజాబ్‌కిది వరుసగా నాలుగో ఓటమి. ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా పంజాబ్ 20 ఓవర్లలో 142 పరుగులకు ఆలౌటైంది. ప్రభ్‌సిమ్రన్ (35), హర్‌ప్రీత్ బ్రార్ (29), కర్రాన్ (20) మాత్రమే రాణించారు. నూర్ అహ్మద్, మోహిత్ శర్మలకు రెండేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో గుజరాత్ 19.1 ఓవర్లలో 7 వికెట్లకు 146 పరుగులు చేసి గెలిచింది. రాహుల్ తెవాటియా (36 నాటౌట్), గిల్ (35), సుదర్శన్ (31) ఆకట్టుకున్నారు. హర్షల్‌కు మూడు, లివింగ్‌స్టోన్‌కు రెండు వికెట్లు దక్కాయి. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా సాయి కిశోర్ నిలిచాడు.

బౌలర్ల పోరాటం సరిపోలేదు..: స్వల్ప స్కోరును కాపాడుకునేందుకు పంజాబ్ బౌలర్లు చివరి వరకు పోరాడినా ఫలితం దక్కలేదు. గుజరాత్ ఓపెనర్ సాహా (13) ఆదిలోనే వెనుదిరగ్గా, కెప్టెన్ గిల్, సాయి సుదర్శన్ రెండో వికెట్‌కు 41 పరుగులు జోడించారు. స్వల్ప వ్యవధిలోనే గిల్, మిల్లర్ (4)లతో పాటు సుదర్శన్ వెనుదిరగడంతో టైటాన్స్ ఒత్తిడిలో పడింది. అటు అజ్మతుల్లా (13) కూడా నిరాశపరిచిన వేళ.. తెవాటియా బాధ్యత తీసుకున్నాడు. దీంతో 17, 18వ ఓవర్లలో మొత్తం 33 పరుగులు వచ్చాయి. ఇక 12 బంతుల్లో గెలుపునకు ఐదు పరుగులే కావాల్సి ఉండగా.. టైటాన్స్ నాలుగు రన్స్ చేసి షారుక్ (8), రషీద్ (3) వికెట్లను కోల్పోయింది. అయినా ఆఖరి ఓవర్ తొలి బంతిని ఫోర్‌గా మలిచి తెవాటియా మ్యాచ్‌ను ముగించాడు.

దెబ్బతీసిన సాయి కిశోర్: టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ ఇన్నింగ్స్‌లో ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ చెలరేగినా, మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. రెండో ఓవర్‌లోనే అతడు 4,4,6,4తో 21 రన్స్ రాబట్టాడు. ఆరో ఓవర్‌లో పేసర్ మోహిత్‌కు చిక్కడంతో తొలి వికెట్‌కు 52 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత పంజాబ్ వరుస విరామాల్లో వికెట్లను కోల్పోయింది. జితేశ్ శర్మ (13), అశుతోష్ (3), శశాంక్ (8)లను స్పిన్నర్ సాయి కిశోర్ వరుస ఓవర్లలో పెవిలియన్‌కు చేర్చడంతో 99/7 స్కోరుతో జట్టు దయనీయస్థితిలో నిలిచింది. అయితే చివర్లో హర్‌ప్రీత్ బ్రార్ వేగంగా ఆడి జట్టుకు గౌరవప్రదమైన స్కోరందించాడు.

స్కోరుబోర్డు

పంజాబ్: కర్రాన్ (ఎల్బీ) రషీద్ 20, ప్రభ్‌సిమ్రన్ (సి) సాహా (బి) మోహిత్ 35, రొసో (ఎల్బీ) నూర్ 9, జితేశ్ (బి) సాయి కిశోర్ 13, లివింగ్‌స్టోన్ (సి) తెవాటియా (బి) నూర్ 6, శశాంక్ (సి అండ్ బి) కిశోర్ 8, అశుతోష్ (సి) మోహిత్ (బి) సాయి కిశోర్ 3, హర్‌ప్రీత్ సింగ్ (రనౌట్) 14, హర్‌ప్రీత్ బ్రార్ (సి) షారుక్ (బి) సాయి కిశోర్ 29, హర్షల్ (సి) షారుక్ (బి) మోహిత్ 0, రబాడ (నాటౌట్) 1, **ఎక్స్‌ట్రాలు: 4; మొత్తం: 20 ఓవర్లలో 142; వికెట్ల పతనం:** 1-52, 2-63, 3-67, 4-78, 5-86, 6-92, 7-99, 8-139, 9-140, 10-142; **బౌలింగ్:** ఒమర్జాయ్ 2-0-13-0, సందీప్ 1-0-21-0, మోహిత్ శర్మ 4-0-32-2, రషీద్ 4-0-15-1, నూర్ అహ్మద్ 4-0-20-2, సాయి కిశోర్ 4-0-33-4, షారుక్ 1-0-7-0.

గుజరాత్: సాహా (సి) అశుతోష్ (బి) అర్ష్‌దీప్ 13, గిల్ (సి) రబాడ (బి) లివింగ్‌స్టోన్ 35, సాయి సుదర్శన్ (బి) కర్రాన్ 31, మిల్లర్ (బి) లివింగ్‌స్టోన్ 4, ఒమర్జాయ్ (సి) జితేశ్ (బి) హర్షల్ 13, తెవాటియా (నాటౌట్) 36, షారుక్ (బి) హర్షల్ 8, రషీద్ (సి) రొసో (బి) హర్షల్ 3, సాయి కిశోర్ (నాటౌట్) 0, **ఎక్స్‌ట్రాలు: 3; మొత్తం: 19.1 ఓవర్లలో 146/7; వికెట్ల పతనం:** 1-25, 2-66, 3-77, 4-97, 5-103, 6-138, 7-142; **బౌలింగ్:** రబాడ 4-0-40-0, అర్ష్‌దీప్ 2.1-0-17-1, హర్షల్ 3-0-15-3, కర్రాన్ 2-0-18-1, బ్రార్ 4-0-35-0, లివింగ్‌స్టోన్ 4-0-19-2.

నేటి మ్యాచ్

రాత్రి 7.30 గం.

రాజస్థాన్ X ముంబై

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
రాజస్థాన్	7	6	1	0	12	0.677
కోల్‌కతా	7	5	2	0	10	1.206
హైదరాబాద్	7	5	2	0	10	0.914
చెన్నై	7	4	3	0	8	0.529
లఖ్‌నవూ	7	4	3	0	8	0.123
గుజరాత్	8	4	4	0	8	-1.055
ముంబై	7	3	4	0	6	-0.133
ఢిల్లీ	8	3	5	0	6	-0.477
పంజాబ్	8	2	6	0	4	-0.292
బెంగళూరు	8	1	7	0	2	-1.046

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

రేస్‌వాకర్లు అక్షదీప్, ప్రియాంకకు ఒలింపిక్ బెర్త్

రోయింగ్‌లో బాల్‌రాజ్, అనిత, నారాయణలకు కూడా

న్యూఢిల్లీ: భారత రేస్ వాకర్లు అక్షదీప్, ప్రియాంక మిక్స్‌డ్ రిలే టీమ్ ఈవెంట్‌లో పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించారు. ఆదివారం టర్కీలోని అంటాల్యాలో జరిగిన ప్రపంచ అథ్లెటిక్స్ రేస్ వాకింగ్ టీమ్ చాంపియన్‌షిప్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో అక్షదీప్-ప్రియాంక జోడీ 18వ స్థానంలో నిలిచింది. దీంతో ఈ జంటకు ఒలింపిక్ బెర్త్ ఖరారైంది. భారత రోయర్ బాల్‌రాజ్ పన్వర్ కూడా పారిస్ క్రీడలకు బెర్త్ దక్కించుకున్నాడు. దక్షిణ కొరియాలోని చుంగ్జూలో జరిగిన ప్రపంచ ఆసియా, ఓసియానియా ఒలింపిక్, పారాలింపిక్ క్వాలిఫికేషన్ రెగెట్టా టోర్నీలో పురుషుల సింగిల్ స్కల్ ఈవెంట్‌లో బాల్‌రాజ్ మూడోస్థానంలో నిలిచి విశ్వక్రీడలకు క్వాలిఫై అయ్యాడు. ఇదే టోర్నీలో భారత పారా రోయర్లు అనిత, నారాయణ సత్తాచాటారు. మిక్స్‌డ్ డబుల్స్ స్కల్ ఈవెంట్ పీఆర్3 మిక్స్2ఎక్స్‌లో విజేతగా నిలవడంతో అనిత- నారాయణ జోడీ పారిస్ పారాలింపిక్స్‌కు అర్హత సాధించారు. జోడీ 18వ స్థానంలో నిలిచి, ఒలింపిక్స్ బెర్త్ దక్కించుకుంది.

అరెరె.. ఆర్సీబీ!

భారీ ఛేదనలో పరుగు తేడాతో కోల్‌కతా చేతిలో పరాజయం

రాణించిన సాల్ట్, అయ్యర్, రస్సెల్

జాక్స్, పటీదార్, కర్ణ్ పోరాటం వృథా



కర్ణ్ శర్మ (7 బంతుల్లో 20)




సాల్ట్ (14 బంతుల్లో 48)

కోల్‌కతా: ఆఖరి ఓవర్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) ఆటగాడు కర్ణ్ శర్మ (7 బంతుల్లో 3 సిక్స్‌లతో 20) సిక్స్‌లతో ఆశలు రేపినా.. నరాలు తెగే ఉత్కంఠ మధ్య చివరి బంతికి రనౌట్ చేసి కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్) విజయాన్ని దక్కించుకొంది. ఆదివారం నాటకీయ మలుపులు తిరుగుతూ సాగిన మ్యాచ్‌లో కోల్‌కతా ఒక్క పరుగు తేడాతో బెంగళూరుపై గెలిచింది. నైట్ రైడర్స్ నిర్దేశించిన 223 పరుగుల భారీ ఛేదనలో.. ఆఖరి ఓవర్‌లో ఆర్సీబీ గెలుపునకు 21 పరుగులు కావాలి. ఈ దశలో స్టార్క్ బౌలింగ్‌లో శర్మ మూడు సిక్స్‌లతో ఉత్కంఠ రేపాడు. అయితే, అతడు క్యాచవుట్ కావడంతో.. చివరి బంతికి మూడు రన్స్ కావాల్సి వచ్చింది. కానీ, ఒక్క పరుగు పూర్తి చేసిన ఫెర్గూసన్ రనౌటవడంతో ఆర్సీబీకి నిరాశ తప్పలేదు. తొలుత కోల్‌కతా 20 ఓవర్లలో 222/6 స్కోరు చేసింది. ఫిల్ సాల్ట్ (14 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్స్‌లతో 48), కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ (36 బంతుల్లో 7 ఫోర్లు, సిక్స్‌తో 50), రమణ్‌దీప్ (9 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లతో 24 నాటౌట్) సత్తా చాటారు. గ్రీన్, యశ్ దయాళ్ చెరో 2 వికెట్లు తీశారు. ఛేదనలో బెంగళూరు ఓవర్లన్నీ ఆడి 221 రన్స్‌కు ఆలౌటైంది. విల్ జాక్స్ (32 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్స్‌లతో 55), రజత్ పటీదార్ (23 బంతుల్లో 3 ఫోర్లు, 5 సిక్స్‌లతో 52) పోరాడారు. రస్సెల్ 3, హర్షిత్ రాణా, నరైన్ చెరో 2 వికెట్లు పడగొట్టారు. దీంతో ఓటముల్లో డబుల్ హ్యాట్రిక్ నమోదు చేసిన ఆర్సీబీ ప్లేఆఫ్స్ అవకాశాలు సంక్లిష్టమయ్యాయి. ఆల్‌రౌండ్ షోతో ఆకట్టుకున్న రస్సెల్ (27 నాటౌట్, 3/25)కు 'మ్యాన్ ఆఫ్ మ్యాచ్' దక్కింది.

ఆదుకొన్న జాక్స్, పటీదార్: ఛేదనలో ఓపెనర్ కోహ్లీ (18).. రాణా బౌలింగ్‌లో వివాదాస్పద రీతిలో అవుటయ్యాడు. విరాట్ దాన్ని నోబాల్‌గా భావించినా.. రివ్యూ అనంతరం లీగల్ డెలివరీగా ప్రకటించారు. ఇక, డుప్లెసి (7)ని వరుణ్ వెనక్కి పంపాడు. అయితే, జాక్స్ పటీదార్ మూడో వికెట్‌కు 48 బంతుల్లో 102 పరుగుల భాగస్వామ్యంతో జట్టును మ్యాచ్‌లో నిలిపారు. కానీ, 12వ ఓవర్‌లో వీరిద్దరినీ అవుట్ చేసిన రస్సెల్ మ్యాచ్‌ను మలుపుతిప్పాడు. తొలి బంతికి జాక్స్‌ను.. నాలుగో బంతికి పటీదార్‌ను పెవిలియన్ చేర్చడంతో బెంగళూరు 145/4తో నిలిచింది. గ్రీన్ (6)ను నరైన్, సుయాష్ (24)ను హర్షిత్ బోల్తా కొట్టించారు. డెత్ ఓవర్లలో దినేష్ కార్తీక్ (18 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 25) క్రీజులో ఉండడంతో ఆర్సీబీ గెలుస్తుందనుకున్నా.. కీలక సమయంలో కార్తీక్‌ను రస్సెల్ అవుట్ చేశాడు. ఆఖర్లో కర్ణ్ శర్మ భయపెట్టినా ఫలితం లేకపోయింది.

సాల్ట్ దూకుడు..: ఓపెనర్ సాల్ట్ అదిరే ఆరంభాన్నివ్వగా.. మిడిలార్డర్‌లో కెప్టెన్ అయ్యర్ ఆదుకోవడంతో.. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతా ప్రత్యర్థికి సవాల్ విసరగలిగే స్కోరు చేసింది. నరైన్ (10) విఫలమైనా.. సాల్ట్ భారీషాట్లతో స్కోరుబోర్డును పరుగులు పెట్టించాడు. అయితే, 5వ ఓవర్‌లో సాల్ట్‌ను సిరాజ్ అవుట్ చేయడంతో.. తొలి వికెట్‌కు 56 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. నరైన్, రఘువంశీ (3)లను యశ్ ఒకే ఓవర్‌లో అవుట్ చేయడంతో.. పవర్‌ప్లే ముగిసేసరికి కోల్‌కతా స్కోరు 75/3. వెంకటేష్ అయ్యర్ (16)ను గ్రీన్ క్రీజులో కుదురుకోన్వివలేదు. కానీ, రింకూ సింగ్ (24)తో కలసి 5వ వికెట్‌కు 40 పరుగులు జోడించిన శ్రేయాస్ అయ్యర్.. రస్సెల్‌తో ఆరో వికెట్‌కు 42 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి జట్టును ఆదుకొన్నాడు. ఫిఫ్టీ పూర్తి చేసుకొన్న అయ్యర్‌ను గ్రీన్ పెవిలియన్ చేర్చినా.. చివరి రెండు ఓవర్లలో రస్సెల్ అండతో రమణ్‌దీప్ దుమ్మురేపడంతో జట్టు స్కోరు 220 దాటింది.



రస్సెల్ (27 నాటౌట్, 3/25)

స్కోరుబోర్డు

కోల్‌కతా: సాల్ట్ (సి) పటీదార్ (బి) సిరాజ్ 48, నరైన్ (సి) కోహ్లీ (బి) యశ్ 10, రఘువంశీ (సి) గ్రీన్ (బి) యశ్ 3, వెంకటేష్ (సి) లోమ్రోర్ (బి) గ్రీన్ 16, శ్రేయాస్ (సి) డుప్లెసి (బి) గ్రీన్ 50, రింకూ (సి) యశ్ (బి) ఫెర్గూసన్ 24, రస్సెల్ (నాటౌట్) 27, రమణ్‌దీప్ (నాటౌట్) 24; **ఎక్స్‌ట్రాలు: 20; మొత్తం: 20 ఓవర్లలో 222/6; వికెట్ల పతనం:** 1-56, 2-66, 3-75, 4-97, 5-137, 6-179; **బౌలింగ్:** సిరాజ్ 4-0-40-1, యశ్ దయాళ్ 4-0-56-2, ఫెర్గూసన్ 4-0-47-1, కర్ణ్ శర్మ 4-0-33-0, గ్రీన్ 4-0-35-2.

బెంగళూరు: కోహ్లీ (సి అండ్ బి) రాణా 18, డుప్లెసి (సి) వెంకటేష్ (బి) వరుణ్ 7, జాక్స్ (సి) రఘువంశీ (బి) రస్సెల్ 55, పటీదార్ (సి) రాణా (బి) రస్సెల్ 52, గ్రీన్ (సి) రమణ్‌దీప్ (బి) నరైన్ 6, సుయాష్ (సి) రఘువంశీ (బి) రాణా 24, లోమ్రోర్ (సి అండ్ బి) నరైన్ 4, కార్తీక్ (సి) సాల్ట్ (బి) రస్సెల్ 25, కర్ణ్ శర్మ (సి అండ్ బి) స్టార్క్ 20, సిరాజ్ (నాటౌట్) 0, ఫెర్గూసన్ (రనౌట్) 1; **ఎక్స్‌ట్రాలు: 9; మొత్తం: 20 ఓవర్లలో 221 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-27, 2-35, 3-137, 4-138, 5-151, 6-155, 7-187, 8-202, 9-220, 10-221; **బౌలింగ్:** హర్షిత్ రాణా 4-0-33-2, స్టార్క్ 3-0-55-1, వరుణ్ 4-0-36-1, నరైన్ 4-0-34-2, సుయాష్ 2-0-33-0, రస్సెల్ 3-0-25-3.

ఇషాసింగ్‌కు రెండోస్థానం

న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్ షూటింగ్ సెలెక్షన్ ట్రయల్స్-2లో తెలుగు షూటర్ ఇషాసింగ్ ద్వితీయ స్థానంలో నిలిచింది. ఆదివారం జరిగిన పిస్టల్ 25 మీటర్ల విభాగంలో మనూ భాకర్ (585 స్కోరు) టాప్‌లో నిలవగా, ఇషా (581) రెండో స్థానం దక్కించుకుంది.

టెన్నిస్‌కు ముగురుజా గుడ్‌బై

మాడ్రిడ్: రెండుసార్లు గ్రాండ్‌స్లామ్ చాంపియన్, స్పెయిన్ స్టార్ గార్బినె ముగురుజా అంతర్జాతీయ టెన్నిస్‌కు వీడ్కోలు పలుకుతున్నట్టు ఆదివారం ప్రకటించింది. 2016లో ఫ్రెంచ్ ఓపెన్, 2017లో వింబుల్డన్ టైటిల్ నెగ్గిన 30 ఏళ్ల ముగురుజా.. వరల్డ్ నెంబర్‌వన్‌గానూ నిలిచింది.

బిజినెస్

అల్ట్రాటెక్ చేతికి ఇండియా సిమెంట్స్ గ్రైండింగ్ యూనిట్

డీల్ విలువ రూ.315 కోట్లు

న్యూఢిల్లీ: మహారాష్ట్రలో ఇండియా సిమెంట్స్‌కు చెందిన గ్రైండింగ్ యూనిట్‌ను రూ.315 కోట్లకు కొనుగోలు చేసినట్లు ఆదిత్య బిర్లా గ్రూప్ కంపెనీ అల్ట్రాటెక్ ప్రకటించింది. మహారాష్ట్రలోని పార్లీలో ఏటా 10.1 లక్షల టన్నుల సామర్థ్యం గల ఈ గ్రైండింగ్ యూనిట్‌ను కొనుగోలు చేసేందుకు బోర్డు ఆమోదం తెలిపిందని అల్ట్రాటెక్ పేర్కొంది. ఈ కొనుగోలుతో మహారాష్ట్ర మార్కెట్లో కంపెనీ స్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకునే అవకాశం లభిస్తుందని తెలిపింది. ఈ ఏడాది మార్చి ముగిసే నాటికి ఈ యూనిట్ టర్నోవర్ రూ.250.66 కోట్లుగా ఉండగా నికర ఆస్తి విలువ రూ.75.10 కోట్లుగా ఉందని తెలిపింది. కాగా పార్లీ యూనిట్‌తో పాటు ఇదే రాష్ట్రంలో కంపెనీకి చెందిన ధూలే యూనిట్ విస్తరణ కోసం మొత్తం రూ.504 కోట్లు పెట్టుబడిగా పెట్టేందుకు బోర్డు అనుమతినిచ్చిందని అల్ట్రాటెక్ వెల్లడించింది. ఇందులో పార్లీ యూనిట్ సామర్థ్యాన్ని ఏటా 12 లక్షల టన్నులకు విస్తరించేందుకు రూ.166.4 కోట్లు, ధూలే యూనిట్ విస్తరణ కోసం రూ.338 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్లు తెలిపింది. ఈ ప్లాంట్ల విస్తరణకు అవసరమైన మొత్తాలను పూర్తిగా అంతర్గత వనరుల ద్వారా సమీకరించుకోనున్నట్లు పేరొంది.

2023-24లో పన్ను రాబడి
రూ.19.58 లక్షల కోట్లు



అంచనాలను మించిన ప్రత్యక్ష పన్ను వసూళ్లు

న్యూఢిల్లీ: దేశంలో ప్రత్యక్ష పన్ను వసూళ్లు 2023-24 సంవత్సరంలో అంచనాలను మించి భారీగా వసూలయ్యాయి. 2022-23 ఆర్థిక సంవత్సరంతో పోల్చితే 17.7 శాతం వృద్ధితో రూ.19.58 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. ప్రత్యక్ష పన్నుల (ఆదాయపు పన్ను+కార్పొరేట్ పన్ను) ద్వారా వచ్చిన ఆదాయం గత ఏడాది బడ్జెట్ అంచనాల కన్నా రూ.1.35 లక్షల కోట్లు, సవరించిన అంచనాల కన్నా రూ.13,000 కోట్లు అధికంగా ఉంది. తాత్కాలిక బడ్జెట్లో ప్రభుత్వం 2023-24 ఆర్థిక సంవత్సరానికి ప్రత్యక్ష పన్ను వసూళ్ల లక్ష్యాన్ని రూ.19.45 లక్షల కోట్లకు పెంచింది. కాగా ఆర్థిక సంవత్సరం మొత్తానికి స్థూల ప్రత్యక్ష పన్ను వసూళ్ల లక్ష్యం రూ.18.48 లక్షల కోట్లు కాగా వాస్తవంగా వసూలైనది రూ.23.37 లక్షల కోట్లు, రిఫండ్లు (రూ.3.79 లక్షల కోట్లు) పోను నికర వసూళ్లు 17.7 శాతం వృద్ధితో రూ.19.58 లక్షల కోట్లున్నాయి. ఆర్థిక రంగంలో అంతర్గత శక్తికి, వ్యక్తిగత, కార్పొరేట్ ఆదాయాల్లో వృద్ధికి ఇది దర్పణం పడుతున్నదని సీబీడీటీ ఒక ప్రకటనలో తెలిపింది. కాగా ఇదే సంవత్సరానికి స్థూల పన్ను వసూళ్లు (రిఫండ్లు సర్దుబాటు చేయడానికి ముందు) రూ.23.37 లక్షల కోట్లుంది. 2022-23 సంవత్సరంలో వసూలైన రూ.19.72 లక్షల కోట్లతో పోల్చితే ఇది 18.48 శాతం అధికం. మరిన్ని వివరాలు...

- స్థూల కార్పొరేట్ పన్ను వసూళ్లు (అంచనా) 2023-24 ఆర్థిక సంవత్సరంలో 13.06 శాతం వృద్ధితో రూ.11.32 లక్షల కోట్లకు పెరిగాయి. అంతకు ముందు ఏడాది వసూళ్లు రూ.10 లక్షల కోట్లుగా ఉన్నాయి. నికర కార్పొరేట్ పన్ను వసూళ్లు ముందు ఏడాదితో పోల్చితే 10.26 శాతం పెరిగి రూ.8.26 లక్షల కోట్ల నుంచి రూ.9.11 లక్షల కోట్లకు చేరాయి.
- సెక్యూరిటీ లావాదేవీల పన్ను (ఎస్‌టీటీ) సహా స్థూల వ్యక్తిగత ఆదాయపు పన్ను వసూళ్లు 24.26 శాతం వృద్ధితో రూ.9.67 లక్షల కోట్ల నుంచి రూ.12.01 లక్షల కోట్లకు పెరిగాయి. నికర వసూళ్లు కూడా 25.23 శాతం వృద్ధితో రూ.8.33 లక్షల కోట్ల నుంచి రూ.10.44 లక్షల కోట్లకు పెరిగాయి.
- పన్ను రిఫండ్స్ మొత్తం రూ.3.79 లక్షల కోట్లుంది. అంటే ముందు ఏడాదిలో నమోదైన రూ.3.09 లక్షల కోట్ల కన్నా 22.74 శాతం పెరిగింది.
- రికార్డు స్థాయిలో జీఎస్‌టీ వసూళ్ల సహాయంతో పరోక్ష పన్ను వసూళ్లు కూడా సవరించిన అంచనాల కన్నా భారీగా పెరిగి రూ.14.84 లక్షల కోట్లకు చేరాయి.

నాట్కో కొత్తూరు ప్లాంట్‌లో
అంతా అపరిశుభ్రతే

యూఎస్ఎఫ్‌డీఏ హెచ్చరిక

న్యూఢిల్లీ: తెలంగాణలోని కొత్తూరు గ్రామంలో ఉన్న నాట్కో ఫార్మా ఫినిష్డ్ ఉత్పత్తుల ప్లాంట్ పరిశుభ్రతను పాటించడంలో విఫలమైందని అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ మండలి (యూఎస్ ఎఫ్‌డీఏ) ఆరోపించింది. ప్లాంట్‌లో ఉపయోగించే పరికరాలు, పాత్రలను నిర్దిష్ట కాలపరిమితిలో క్రమం తప్పకుండా శుభ్రం చేయలేదని అభియోగం మోపింది. ఈ మేరకు నాట్కో ఫార్మాకు హెచ్చరిక లేఖ పంపింది. గత ఏడాది అక్టోబరు 9వ తేదీ నుంచి 18వ తేదీ మధ్యలో ఎఫ్‌డీఏ బృందం ఈ ప్లాంట్‌ను తనిఖీ చేసింది. "మీ ప్లాంట్‌లో ఔషధాలకు తీసుకోవలసిన శుభ్రత చర్యలు తీసుకోలేదు. పరికరాలు, పాత్రలు క్రమం తప్పకుండా శానిటైజ్ లేదా స్టెరిలైజ్ చేయలేదు. ఇది ఔషధ భద్రత, నాణ్యత, స్వచ్ఛతలకు విఘాతం కలిగించేదిగా ఉంది" అని ఆ లేఖలో పేర్కొంది. ప్లాంట్‌లో ఉత్పత్తి అయిన ఔషధాల శాంపిల్స్ పరీక్షించగా ఉత్పత్తులు కాలుష్యరహితంగా ఉన్నాయనేందుకు ఎలాంటి ఆధారాలు లభించలేదని స్పష్టం చేసింది. అలాగే ఒక బ్యాచ్‌లోని ఔషధాలు లేదా వాటిలో ఉపయోగించిన పదార్థాలు నిర్దేశిత భద్రతా ప్రమాణాలు కలిగి ఉన్నాయా లేవా ఆ బ్యాచ్ ఔషధాలు అప్పటికే పంపిణీ నెట్‌వర్క్‌కు వెళ్లాయా అని నిశితంగా తనిఖీ చేయడంలో కూడా కంపెనీ విఫలమైందని ఆరోపించింది. వీటన్నింటిపై సమగ్ర, స్వతంత్ర దర్యాప్తు నిర్వహించి తగు దిద్దుబాటు చర్యలు తీసుకోవాలని కూడా సూచించింది. ఈ దిద్దుబాటు చర్యలు పూర్తయ్యే వరకు ఈ ప్లాంట్ నుంచి అమెరికా మార్కెట్‌కు పంపే ఉత్పత్తుల తయారీని తాత్కాలికంగా నిలిపివేయాలని కూడా కోరింది. తయారీ కార్యకలాపాలు పునరుద్ధరించాలనుకుంటే ముందుగా తమకు తెలియచేయాలని సూచించింది.

బంధన్ ఇన్నోవేషన్ ఫండ్

బంధన్ మ్యూచువల్ ఫండ్.. బంధన్ ఇన్నోవేషన్ ఫండ్‌ను ప్రారంభించింది. ఇది ఓపెన్ ఎండెడ్ థెమాటిక్ ఫండ్. ఆర్ అండ్ డీ పెట్టుబడులు, హై స్కిల్డ్- ఎంప్లాయీ కాస్ట్, ప్రత్యేక ఉత్పత్తులు లేదా సర్వీసులు, మంచి రిటర్నులకు ఆస్కారం ఉన్న కంపెనీలను ఎంచుకుని ఈ ఫండ్ ప్రధానంగా పెట్టుబడులు పెట్టనుంది. ఈ ఫండ్ ముగింపు తేదీ ఈ నెల 14. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.1,000. ఆ తర్వాత రూపాయి చొప్పున పెట్టుబడులు పెంచుకుంటూ పోవచ్చు.

22,550 పైన బుల్లిష్

(ఏప్రిల్ 22-26 తేదీల మధ్య వారానికి)



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

నిఫ్టీ గత వారం 21,778-2,2427 పాయింట్ల మధ్యన కదలాడి గత వారంతో పోల్చితే 372 పాయింట్ల నష్టంతో 22,147 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 22,550 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 22,100, 22,343, 22,432, 22,262 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి. 50 డిఎంఏ 200 డిఎంఏ కన్నా పైన ఉండడం దీర్ఘకాలిక బుల్లిష్ ట్రెండ్ సంకేతం.

బ్రేకౌట్ స్థాయి: 22,550
బ్రేక్‌డౌన్ స్థాయి : 21,750
నిరోధ స్థాయిలు: 22,350,22,450, 22,550 (22,250 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 21,950, 21,850, 21,750 (22,050 దిగువన బేరిష్)

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



22వ తేదీ			
హైదరాబాద్	390	విజయవాడ	397
వరంగల్	392	గోదావరి	397
చిత్తూరు	493	విశాఖపట్నం	411

దజను గుడ్లు రూ.60

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. **వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**



హైదరాబాద్	118	గోదావరి	121
వరంగల్	118	విజయవాడ	121
కరీంనగర్	118	గుంటూరు	125
మహబూబ్‌నగర్	118	ఒంగోలు	125
కర్నూలు	118	చిత్తూరు	110
విశాఖపట్నం	113		

అంతర్జాతీయ పరిణామాలే కీలకం..!

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం మిశ్రమంగా కదలాడే అవకాశాలున్నాయి. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ఎన్నికలు, అంతర్జాతీయ అంశాలు.. మార్కెట్లపై ప్రభావం చూపించే వీలుంది. ఇరాన్, ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో మదుపరులు అప్రమత్తంగా ఉండటం మంచిది. ఫియర్ ఇండియా విక్స్ పెరగటం దీన్ని ప్రతిబింబిస్తోంది. వరుసగా నాలుగు వారాలు లాభపడ్డ నిఫ్టీ గత వారం 1.65 శాతం మేర నష్టపోయింది. నిఫ్టీకి 21,900 వద్ద మద్దతు, 22,150 వద్ద నిరోధ స్థాయిలున్నాయి. ఒకవేళ సూచీ 22,000 ఎగువన నిలదొక్కుకుంటే 22,600 వెళ్లే అవకాశం ఉంది. బ్యాంకింగ్, ఫార్మా రంగాల్లో కన్సాలిడేషన్ జరిగి అప్‌ట్రెండ్ బాట పట్టొచ్చు. ఆర్థిక ఫలితాల సీజన్ మొదలవటంతో ఎంపిక చేసిన షేర్లలోనే పెట్టుబడులు పెట్టడం బెటర్.

స్టాక్ రికమండేషన్స్

ట్రెంట్: జీవితకాల గరిష్ఠాల్లో సాగుతున్న ఈ షేరు ప్రస్తుతం అక్యుములేషన్ జోన్‌లో ఉంది. ట్రేడింగ్, డెలివరీ వాల్యూమ్ గణనీయంగా పెరుగుతోంది. నిఫ్టీతో పోల్చితే జోరు ప్రదర్శిస్తోంది. గత శుక్రవారం ఈ షేరు రూ.71 లాభపడి రూ.4,158 స్థాయిల్లో క్లోజైంది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లో రూ.4,150/4,130 స్థాయిల్లో పొజిషన్ తీసుకుని రూ.4,255/4,300 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.4,100 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

బ్లూడార్ట్: సుదీర్ఘకాలంగా డౌన్‌ట్రెండ్‌లో పయనిస్తున్న ఈ షేరు టర్న్ అరౌండ్ అవుతోంది. క్రమక్రమంగా వాల్యూమ్ పెరుగుతోంది. డైలీ టైమ్ ఫ్రేమ్‌లో రూ.6,195 వద్ద నిరోధాన్ని అధిగమించింది. క్రితం నెల, వారం గరిష్ఠాలను క్రాస్ చేసింది. గత శుక్రవారం ఈ షేరు రూ.183 మేరకు లాభపడి రూ.6,297 వద్ద ముగిసింది. మదుపరులు ఈ కౌంటర్‌లోకి రూ.6,250/6,270 స్థాయిల్లో ప్రవేశించి రూ.6,455/6,490 టార్గెట్ ధరతో పొజిషన్ తీసుకోవచ్చు. అయితే రూ.6,220 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఎస్కార్ట్స్: ఈ షేరు జీవితకాల గరిష్ఠానికి చేరిన తర్వాత ఈ కౌంటర్‌లో కరెక్షన్ జరిగింది. గత ఏడాది అక్టోబరు నుంచి డౌన్‌ట్రెండ్‌లో సాగుతూ వస్తున్న ఈ షేరు క్రమంగా లాభాల్లో పయనిస్తోంది. మార్చి మూడో వారం నుంచి బైయింగ్ వాల్యూమ్ పెరుగుతోంది. గత శుక్రవారం ఈ షేరు 2.93 శాతం లాభంతో రూ.3,106 వద్ద క్లోజైంది. ట్రేడర్లు ఈ కౌంటర్‌లో రూ.3,100 స్థాయిల్లో పొజిషన్ తీసుకుని రూ.3,180/3,240 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.3,075 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

రేమండ్: ఈ కౌంటర్‌కు చాలా సానుకూల అంశాలు ఉన్నాయి. చివరి ఐదు సెషన్లలో డెలివరీ వాల్యూమ్ 3.7 రెట్లు పెరిగింది. షేరు విలువ అప్పర్ బొలింజర్ బ్యాండ్‌ను క్రాస్ చేసింది. అంతక్రితం వారం గరిష్ఠ స్థాయిని అధిగమించింది. కన్సాలిడేషన్ జరిగింది. గత శుక్రవారం ఈ షేరు 5.33 శాతం లాభంతో రూ.2,011 వద్ద క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లోకి రూ.2,000 స్థాయిల్లో ప్రవేశించి రూ.2,110/2,165 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,970 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

మోతీలాల్ ఓస్వాల్: బెంచ్ మార్క్ సూచీలతో సంబంధం లేకుండా ఈ స్టాక్ బ్రోకింగ్ షేరు గణనీయంగా రాణిస్తూ వస్తోంది. సరికొత్త గరిష్ఠాలను నమోదు చేస్తోంది. డెలివరీ, వాల్యూమ్ గణనీయంగా పెరుగుతోంది. బోనస్ షేర్లు ఇవ్వాలని యోచిస్తుండటం మరో సానుకూల అంశం. గత శుక్రవారం ఈ షేరు 7.02 శాతం లాభంతో రూ.2,232 వద్ద ముగిసింది. ట్రేడర్లు ఈ కౌంటర్‌లో రూ.2,200 స్థాయిల్లో పొజిషన్ తీసుకుని రూ.2,355 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.2,160 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం, మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

టెక్ వ్యూ
నిరోధం 22,300



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం కీలక స్థాయి 22,500 కన్నా దిగువన బలమైన కరెక్షన్‌తో ప్రారంభమై బలహీనతను ప్రదర్శించింది. శుక్రవారం మరో కీలక స్థాయి 22,000 కన్నా కూడా దిగజారి 22,150 సమీపంలో వారం గరిష్ఠ, కనిష్ఠ స్థాయిలకు మధ్యన ముగిసింది. 22,500 వద్ద నిలదొక్కుకోవడంలో విఫలం కావడంతో స్వల్పకాలిక ర్యాలీకి బ్రేక్ పడింది. 21,700 వద్ద బలమైన మద్దతు తీసుకుంది. మొత్తం మీద మార్కెట్ 22,700, 21,700 మధ్యన కదలాడుతోంది. గత వారం మిడ్‌క్యాప్-100 సూచీ 1,370 పాయింట్లు, స్మాల్‌క్యాప్-100 సూచీ 220 పాయింట్లు నష్టపోయాయి. మరింత కన్సాలిడేషన్ తర్వాత మాత్రమే తదుపరి కదలికలో స్పష్టత ఏర్పడుతుంది. ఈ వారం మార్కెట్ పాజిటివ్‌గానే ప్రారంభమయ్యే ఆస్కారం ఉంది.

బుల్లిష్ స్థాయిలు: నిఫ్టీ పాజిటివ్ ధోరణిలో ట్రేడయితే ప్రధాన నిరోధం 22,300 కన్నా పైన నిలదొక్కుకోవాలి. మరో నిరోధం 22,500. మరింత అప్‌ట్రెండ్ కోసం ఈ స్థాయి కన్నా పైన నిలదొక్కుకోవాలి. ఆ పైన నిరోధం 22,800 (చారిత్రక గరిష్ఠ స్థాయి).

బేరిష్ స్థాయిలు: మరింత బలహీనపడినా ట్రెండ్‌లో సానుకూలత కోసం మద్దతు స్థాయి 21,950 కన్నాపైన నిలదొక్కుకోవాలి. విఫలమైతే మరింత బలహీనపడుతుంది. ప్రధాన మద్దతు స్థాయి 21,700.

బ్యాంక్ నిఫ్టీ: బలమైన డౌన్‌ట్రెండ్‌లో ప్రారంభమై చివరిలో రికవరీ సాధించినా వారం మొత్తం మీద 1,000 పాయింట్ల నష్టంతో క్లోజయింది. ఈ సూచీ 49,000, 46,000 పరిధిలో చిక్కుకుపోయినట్టు కనిపిస్తోంది. ట్రెండ్‌లో సానుకూలత కోసం 48,000 వద్ద నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధం 48,300. మద్దతు స్థాయిలు 47,300, 46,900.

పాటర్న్ : మార్కెట్ స్వల్పకాలిక ఓవర్‌బాట్ స్థితిని సద్దుబాటు చేసుకుంటున్నట్టు కనిపిస్తోంది. గత వారం 100 డిఎంఏ వద్ద రికవరీ సాధించింది. రాబోయే కొద్ది రోజుల్లో 25, 50 డిఎంఏల వద్ద పరీక్ష ఎదుర్కొనవచ్చు. సానుకూలత కోసం ఇక్కడ నిలదొక్కుకుని తీరాలి.

టైమ్: ఈ సూచీ ప్రకారం బుధవారం తదుపరి రివర్సల్ ఉంది.

సోమవారం స్థాయిలు	
నిరోధం	22,255, 22,300
మద్దతు	22,100, 22,040

www.sundartrends.in

ప్రసంగాలు లేవు... అభివాదాలే..
విశాఖలో ముగిసిన జగన్ బస్సు యాత్ర

సీఎం జగన్ విశాఖలో ఆదివారం తన రోడ్‌షోను ప్రసంగాలు లేకుండా కేవలం అభివాదాలతోనే ముగించేశారు. కానీ ఎక్కడా ప్రజలను ఉద్దేశించి మాట్లాడకపోవడం, తమ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కనీసం కోరకపోవడం పార్టీ నేతలను సైతం ఆశ్చర్యానికి గురిచేసింది.

- ఆంధ్రజ్యోతి, విశాఖ



ఉండి టికెట్ రఘురామకే

బండారుకు మాడుగుల.. ఐదుగురు టీడీపీ అభ్యర్థుల మార్పు



అమరావతి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఐదుగురు అసెంబ్లీ అభ్యర్థులను టీడీపీ నాయకత్వం మార్చింది. వెంకటగిరి, ఉండి, మాడుగుల, పాడేరు(ఎస్టీ), మడకశిర (ఎస్సీ) స్థానాల్లో ఈ మార్పులు జరిగాయి. ఉండి ఎమ్మెల్యే మంతెన రామరాజు స్థానంలో నరసాపురం ఎంపీ రఘురామకృష్ణరాజుకు అవకాశం దక్కింది. పెందుర్తిని జనసేనకు కేటాయించడంతో అక్కడ మాజీ మంత్రి బండారు సత్యనారాయణ మూర్తికి అవకాశం లభించలేదు. దీంతో మాడుగుల స్థానాన్ని ఆయనకు కేటాయించారు. పాడేరు టికెట్‌ను గతంలో వెంకట రమేశ్‌నాయుడికి కేటాయించగా.. తాజాగా ఆయన్ను మార్చి మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరికి అవకాశం కల్పించారు. మడకశిరను సునీల్‌కుమార్ స్థానంలో ఎంఎస్ రాజుకు కేటాయించారు. వెంకటగిరి స్థానాన్ని మొదట మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ కుమార్తె లక్ష్మీ సాయిప్రియకు కేటాయించారు. అయితే ఇప్పుడు రామకృష్ణనే ఖరారు చేసి బీఫాం అందించారు. కాగా.. పెండింగ్‌లో ఉన్న అనపర్తి టికెట్ వ్యవహారం పరిష్కారమైంది. అక్కడి టీడీపీ మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి బీజేపీలో చేరి ఆ పార్టీ తరఫున పోటీ చేయడానికి సమ్మతించారు. నల్లమిల్లి చేరిక, టికెట్ ఖరారుపై బీజేపీ నుంచి అధికారిక ప్రకటన వెలువడ్డాక దెందులూరు, తంబళ్లపల్లె అభ్యర్థులపై టీడీపీ నిర్ణయం వెలువడనుంది.

మల్లెలు కోసి.. మురిసి..



తన భర్త లోకేశ్ పోటీ చేస్తున్న మంగళగిరిలో ప్రచారం చేస్తున్న నారా బ్రహ్మణి ఆదివారం పూల తోటల్లోని మహిళలను కలిసి మాట్లాడారు. వారితో కలిసి పూలు కోస్తూ... వారు చెప్పింది విన్నారు. కోసిన పూలను చూసి మురిసిపోయారు.

మన యుద్ధం రాక్షసులతో!

సానుభూతితో గెలిచేందుకు జగన్ యత్నం: బాబు.. ఐదేళ్లలో ఏం చేశాడో చెప్పుకోలేక డ్రామాలు

- చీకట్లో గులకరాయి దాడి చేశానంటూ నాపై తప్పుడు ప్రచారం
- బొండా ఉమను ఇరికించే కుట్ర
- ప్రజలు, శ్రేణుల అభీష్టం మేరకే అభ్యర్థులను ఎంపిక చేశాం
- ప్రచారానికి ఇంకా 20 రోజులే
- సంకల్పంతో ముందుకెళ్లాలి
- 3 పార్టీల మధ్య సమన్వయంతో ఓట్ల బదిలీ జరగాలి: టీడీపీ అధినేత
- అభ్యర్థులకు బీఫారాల అందజేత

అమరావతి/మంగళగిరి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): రాక్షసులతో మనం యుద్ధం చేస్తున్నామని టీడీపీ అధినేత చంద్రబాబు పార్టీ అభ్యర్థులతో అన్నారు. ప్రతి ఒక్కరూ సంకల్పంతో ముందుకెళ్లాలని సూచించారు. 'లేనిది ఉన్నట్లు, ఉన్నది లేనట్లు చెప్పడంలో జగన్ నేర్పరి. ప్రతిసారీ సానుభూతితో గెలవాలని చూస్తున్నాడు' అని మండిపడ్డారు.ఆదివారమిక్కడ ఉండవల్లిలోని తన నివాసంలో టీడీపీ తరఫున లోక్‌సభ, శాసనసభకు పోటీ చేసే అభ్యర్థులకు ఆయన బీఫారాలు అందించారు. శ్రీకాకుళం జిల్లా నుంచి మొదలు పెట్టి అన్ని జిల్లాల ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు వాటిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐదేళ్లలో ఏం చేశాడో చెప్పుకోలేక జగన్ డ్రామాలకు తెరతీస్తున్నాడని విమర్శించారు. తండ్రి అధికారంలో ఉన్నప్పుడు రూ.43 వేల కోట్లు అక్రమంగా సంపాదించారని సీబీఐ నిర్ధారిస్తే.. దానిని నిరూపించుకోకుండా తనపై అక్రమ కేసులు పెట్టారని ప్రచారం చేసుకుంటున్నాడని ధ్వజమెత్తారు. 'ఆయన బస్సుయాత్రలో వాళ్లే కరెంటు తీసేసుకున్నారు. చీకట్లో నేను గులకరాయి దాడి చేయించానని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఘటన జరిగిన కొద్ది క్షణాలకే ప్లకార్డులు పట్టుకుని వచ్చి ధర్నాలు చేశారు. రాయి విసిరాడంటున్న వ్యక్తితో బొండా ఉమామహేశ్వరరావు ప్రమేయం ఉందని చెప్పించేందుకు కుట్రలు చేస్తున్నారు. పెన్షన్ల పంపిణీకి నిధుల్లేకుండా చేశారు. కానీ వలంటీర్లతో పంపిణీ చేయొద్దనడంతోనే పెన్షన్లు ఆగిపోయాయని విషప్రచారం చేశారు. జగనే అందరినీ అంతం చేయడానికి ప్రయత్నిస్తూ.. తనను అంతం చేయడానికి వస్తున్నారంటూ ఎదుటివారిపై బురదజల్లుతున్నారు.



అభ్యర్థులతో ప్రమాణం చేయిస్తున్న చంద్రబాబు

అమరావతి, పోలవరాన్ని విధ్వంసం చేశారు. రాష్ట్రాన్ని అడ్డగోలుగా దోచుకున్నారు' అని విరుచుకుపడ్డారు. పెన్షన్ల విషయంలో జగన్ చేసిన కుట్రలు, ఆడిన గులకరాయి డ్రామాను ప్రజలు ఛీకొట్టారన్నారు. ప్రజాగళానికి వస్తున్న స్పందనే జగన్ పతనాన్ని చాటిచెబుతోందని వ్యాఖ్యానించారు.

'ప్రజలు గెలవాలి.. రాష్ట్రం నిలవాలి'

బీఫాం పొందిన ప్రతి ఒక్కరూ గెలిచి అసెంబ్లీలో అడుగు పెట్టాలని టీడీపీ అధినేత చంద్రబాబు ఆకాంక్షించారు. ప్రజలు, కార్యకర్తల అభీష్టం మేరకే అభ్యర్థులను ఎంపిక చేశామన్నారు. 'రాష్ట్రంలో ప్రత్యేక పరిస్థితుల్లో ఎన్నికలు జరుగుతున్నాయి. ప్రజలు గెలవాలి.. రాష్ట్రం నిలవాలన్నదే మన నినాదం. మూడు పార్టీల మధ్య సమన్వయం ఉండాలి. ఓటు బదిలీ జరగాలి' అని ఉద్బోధించారు. వైసీపీ నుంచి టీడీపీలోకి మంచి వాళ్లను మాత్రమే తీసుకుని సీట్లిచ్చామన్నారు. వైసీపీలో సీటు ఇస్తామన్నా.. తీసుకోకుండా కొందరు బయటకు వచ్చారని తెలిపారు. 'పోలింగ్‌కు ఇక 22 రోజులు, ప్రచారానికి 20 రోజులే ఉన్నాయి. ఈ 20 రోజులూ అభ్యర్థులకు ఎంతో కీలకం' అని చెప్పారు.



పార్టీ బీ ఫారం అందుకున్న తర్వాత చంద్రబాబుకు పాదాభివందనం చేస్తున్న లోకేశ్

కేడర్‌తో అనుసంధానం కావాలని, అన్నీ వర్గాల్లో జగన్ ప్రభుత్వంపై వ్యతిరేకత ఉందన్నారు. మళ్లీ రాష్ట్రానికి మంచి రోజులు రాబోతున్నాయని ప్రజలకు తెలియజేయాలని అభ్యర్థులకు సూచించారు.

147 మంది అభ్యర్థులు హాజరు

జనసేన, బీజేపీలతో పొత్తుల కారణంగా 144 అసెంబ్లీ స్థానాల్లో, 17 లోక్‌సభ స్థానాల్లో టీడీపీ పోటీచేస్తున్న సంగతి తెలిసిందే. వీరిలో 17 మంది ఎంపీ అభ్యర్థులూ ఉండవల్లి వచ్చి తొలుత బీ ఫారాలు తీసుకున్నారు. అసెంబ్లీ అభ్యర్థుల్లో 144 మందికి గాను 130 మంది హాజరయ్యారు. వివిధ కారణాలతో 14 మంది గైర్హాజరయ్యారు. అనపర్తి టికెట్‌తో ముడిపడి ఉండడం.. తంబళ్లపల్లె, దెందులూరు అభ్యర్థులను ఇంకా ఖరారు చేయకపోవడంతో వారిని పిలవలేదు. ముందుగా శ్రీకాకుళం పార్లమెంట్ అభ్యర్థిగా రామ్మోహన్‌నాయుడు బీఫారం అందుకున్నారు. మంగళగిరి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న లోకేశ్ కూడా చంద్రబాబు నుంచి బీ ఫారం స్వీకరించి తోటి అభ్యర్థులతో కలిసి ప్రమాణపత్రం చదివారు. అనంతరం తండ్రి కాళ్లకు నమస్కరించి ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు.



చింటూ: ఏంట్రా కబుర్లు! ఈ దారి మధ్యలో పచ్చటి చెట్లు ఉండాలి కదరా!

చిన్నూ: నెల కిందట మీ అన్నియ్య వచ్చాడులే!

చింటూ: ఇక్కడ రోడ్డు ఉండాలే?

చిన్నూ: ఆ గోతుల మధ్య అక్కడక్కడా ఉంది కదరా! చాలదేంటి?

చింటూ: మన బ్యాచోళ్లు ఎవరూ కనపడరే!

చిన్నూ: హైదరాబాద్, బెంగళూరు, చెన్నైలో కనిపిస్తారు.

చింటూ: ఇంకెంతసేపురా బాబూ.. ఆ కానిస్టేబులు ట్రాఫిక్ ఆపేసి పైకి చూస్తున్నాడేంటి?

చిన్నూ: అన్నియ్య హెలికాప్టర్‌లో వెళ్తున్నాడు కదరా!



9 మందితో ఏపీ కాంగ్రెస్ లోక్‌సభ అభ్యర్థుల జాబితా

న్యూఢిల్లీ, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ అభ్యర్థులను ఆదివారం ఏఐసీసీ ప్రకటించింది. శ్రీకాకుళం నుంచి డాక్టర్ పేడాడ పరమేశ్వరరావు, విజయనగరం నుంచి బొబ్బిలి శ్రీను, అమలాపురం(ఎస్సీ) నుంచి జంగా గౌతమ్, మచిలీపట్టణం నుంచి గొల్లు కృష్ణ, విజయవాడ నుంచి వల్లూరు భార్గవ్, ఒంగోలు నుంచి ఈద సుధాకర్ రెడ్డి, నంద్యాల నుంచి జంగిటి లక్ష్మీ నరసింహ యాదవ్, అనంతపురం నుంచి మల్లికార్జున వజ్జల, హిందుపూర్ నుంచి బీఏ సమద్ షహీన్ పోటీ చేయనున్నారు. ఈమేరకు ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ ప్రకటన చేశారు.

ప్రాణాలకు తెగించి పోరాడుతున్నాం

రేపు మాకు, మా పిల్లలకు ఏమవుతుందో తెలియదు.. సునీతకు, నాకు దేవుడే రక్షణ

పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల భావోద్వేగం



కర్నూలు(అర్బన్)/ నందికొట్కూరు, ఏప్రిల్ 21: వివేకా హత్య కేసులో న్యాయం కోసం పోరాటం చేస్తున్న తమకు, తమ పిల్లలకు రేపు ఏమవుతుందో తెలియని పరిస్థితి ఉందని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల సంచలన వ్యాఖ్యలు చేశారు. అయినా కూడా ప్రాణాలకు తెగించి మొండిగా న్యాయం కోసం పోరాటం చేస్తున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. తనకు, సునీతకు దేవుడే రక్షణ అన్నారు. ఆదివారం కర్నూలు నగరంలో నిర్వహించిన ఆమె విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కర్నూలులో అవినాశ్‌రెడ్డిని సీబీఐ అధికారులు అరెస్టు చేయడానికి వచ్చినప్పుడు ఎంత డ్రామా జరిగిందో అందరికీ తెలుసని, ఆ సమయంలో సీఎం జగన్ అడ్డుపడకుండా ఉండి ఉంటే వివేకా హత్య కేసులో నిందితులకు నేడు శిక్షపడి ఉండేదని చెప్పారు. అప్పుడు తాను, సునీత రోడ్డుపైకి రావాల్సిన అవసరమే ఉండేది కాదని పేర్కొన్నారు. గూగుల్ టేక్‌అవుట్ అవినాశ్‌రెడ్డి వైపే ఎందుకు చూపుతోందో ఆయనే సమాధానం చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. వైఎస్ వివేకానందరెడ్డిని గొడ్డలితో దారుణంగా చంపి, మభ్యపెట్టాలని చూస్తున్నారని మండిపడ్డారు. వివేకా హత్య కేసులో అవినాశ్‌రెడ్డిని సీబీఐ నిందితుడిగా చేర్చింది వాస్తవం కాదా? సీబీఐ చార్జిషీట్‌లో పేర్కొన్న విషయాలే మాట్లాడుతున్నాం. మేమేం తప్పుగా మాట్లాడలేదు. ఫోన్‌కాల్ రికార్డులు, గూగుల్ టేక్‌అవుట్ రికార్డులు ఇలా అన్ని ఆధారాలూ సీబీఐ దగ్గర ఉన్నాయి. హత్యకు సంబంధించి డబ్బు లావాదేవీలు జరిగాయి. సీబీఐ వెల్లడించాకే హత్య ఎవరు చేశారన్నది తెలిసింది. నేను రాజశేఖరరెడ్డి బిడ్డను. మా అత్తతో పాటు ఎవరు, ఎన్ని విధాలుగా మాట్లాడినా చివరకు న్యాయమే గెలుస్తుంది. ప్రజాకోర్టులో న్యాయం జరుగుతుందని సునీత, నేను కొంగు పట్టుకుని ప్రజలను అభ్యర్థిస్తున్నాం. మా ప్రాణాలను తెగించి భయపడుతూ న్యాయం కోసం పోరాడుతున్నాం. మమ్మల్ని పబ్లిక్ టాయిలెట్లలాగా వైసీపీ మూకలు ట్రీట్ చేయడం సరికాదు. వివేకానందరెడ్డి ప్రజాసేవలో బతికిన వ్యక్తి. ఎమ్మెల్సీగా ఉన్నప్పుడు ఆయన పర్సనల్ లైఫ్ గుర్తుకు రాలేదా?' అని వైసీపీ నాయకులను ఆమె నిలదీశారు. 'వివేకానందరెడ్డి సుదీర్ఘకాలం రాజకీయ నాయకుడిగా కొనసాగారు. ఆయన సేవలను జగన్ అన్ని విధాలుగా వాడుకున్నారు. చనిపోయిన వ్యక్తి, సంజాయిషీ ఇవ్వలేని వ్యక్తిగత జీవితంపై దుర్మార్గంగా మాట్లాడటం తగదు. వైసీపీ గూండాలు, నాయకులు, మూకలకు మళ్లీ చెబుతున్నా.. వివేకా పర్సనల్ లైఫ్‌ని టార్గెట్ చేసి మాట్లాడటం మానుకోవాలి' అని షర్మిల హెచ్చరించారు.

చెల్లికి వాటా ఇవ్వాల్సిందే

ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్న అప్పులపై షర్మిల ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆస్తిలో వాటా పొందే హక్కు ఆడబిడ్డకు ఉంటుందన్నారు. న్యాయపరంగా ఇవ్వాల్సింది పోయి.. ఏదో కొసరు ఇచ్చి దాన్ని కూడా అప్పుగా చూపించే వాళ్లను ఏమనాలి? అని ఆమె సీఎం జగన్‌పై అసహనం వ్యక్తం చేశారు. 'జగన్ నాకు అప్పు ఇచ్చారని అఫిడవిట్‌లో చూపించాను. అదే విషయంపై ఇప్పుడు క్లారిటీ ఇస్తున్నా. సమాజంలో ఏ అన్న అయినా తన చెల్లికి ఆస్తిలో వాటా ఇవ్వాల్సిందే. అది ఆడబిడ్డకున్న హక్కు. అయితే కొందరు మాత్రం ఆస్తిలో చెల్లెళ్లకు ఇవ్వాల్సిన వాటాను తమ వాటాగా భావిస్తారు. తామేదో చెల్లికి గిఫ్ట్‌గా ఇస్తున్నామని బిల్డప్ ఇచ్చేవాళ్లు కూడా సమాజంలో ఉన్నారు. మరికొందరు చెల్లెలు వాటా ఇవ్వాల్సింది ఇవ్వకపోగా... దాంట్లో ఒక్క కొసరు ఇచ్చి... అది కూడా అప్పు ఇచ్చినట్లు చూపిస్తున్నారు. అలాంటివాళ్లను ఇంకేమనాలి?... ఇది వాస్తవం. ఇది దేవుడికి తెలుసు. మా కుటుంబం మొత్తానికి తెలుసు' అని షర్మిల పేర్కొన్నారు.



నరసాపురంలో నిర్వహించిన వారాహి విజయయాత్రలో పవన్

సింహాలు కాదు.. పందికొక్కులు!

సలహాదారు సజ్జలపై పవన్ ఫైర్

- చిరంజీవిని ఏమైనా అంటే ఊరుకోను.. ఆయన అజాతశత్రువు
- ఒకప్పుడు చంద్రబాబు సాఫ్ట్.. జైలుకు వెళ్లి వచ్చాక చాలా మార్పు
- దుర్మార్గులపై ఇక కఠినంగా ఉంటారు.. ఆయనకు నేను తోడు
- సజ్జలా.. నువ్వు, జగన్ పద్ధతులు మార్చుకోండి
- లేదంటే మేమొచ్చాక రోడ్డుపై మోకాళ్లపై దేకిస్తా: పవన్ కల్యాణ్

భీమవరం-ఆంధ్రజ్యోతి/నరసాపురం, ఏప్రిల్ 21: ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిపై జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. తన అన్న చిరంజీవిని ఏమైనా అంటే ఊరుకోనని స్పష్టం చేశారు. ఆదివారం రాత్రి పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం, భీమవరంలో జరిగిన ఎన్నికల సభల్లో ఆయన ప్రసంగించారు. ఎన్డీయే అభ్యర్థుల తరఫున ప్రచారం చేశారు. 'సజ్జల పులివెందుల నుంచి వచ్చారో.. ఫ్యాక్షన్ నేపథ్యం నుంచి వచ్చారో తెలియదు, సింహం సింగిల్‌గా వస్తుందంటాడు.. కానీ రాష్ట్రాన్ని దోచుకున్న పందుకొక్కుల సమూహం మీది. మీ అందరికీ డబ్బులు, అధికారం, అహంకారం ఎక్కువయ్యాయి. సజ్జలను హెచ్చరిస్తున్నా.. మా అన్న చిరంజీవి అజాత శత్రువు.. ఆయన జోలికి గానీ, శెట్టి బలిజ, కాపు, ఎస్సీ, ఎస్టీ.. ఇలా ఏ సామాజికవర్గం జోలికి గానీ వచ్చినా ఊరుకోను. చిరంజీవి జనసేనకు రూ.5 కోట్లు ఇచ్చి, ఆయన కుమారుడు రామ్‌చరణ్‌ను కూడా విరాళం ఇవ్వమని చెప్పినందుకు రాజకీయం చేస్తున్నారు. ఎన్నికల్లో పోటీ చేస్తున్న సీఎం రమేశ్ (అనకాపల్లి లోక్‌సభ), పంచకర్ల రమేశ్‌బాబు (పెందుర్తి)ను గెలిపించాలని చిరంజీవి చెబితే.. సజ్జలా నీకెందుకంత బాధ? ఒక్కసారి అద్దాల్లో మీ ముఖాలు చూసుకోండి. సింహాల్లా కాదు.. గుంటనక్కల్లా ఉన్నారు. మీరు కలుగుల్లో పందికొక్కుల సమూహం.. ఒకప్పుడు చంద్రబాబు సాఫ్ట్‌గా ఆలోచించేవారు. జైలుకు వెళ్లి వచ్చిన తర్వాత చాలా మార్పు వచ్చింది. దుర్మార్గులపై కఠినంగా ఉండాలని నిర్ణయానికి వచ్చారు. ఆయనకు నేను తోడు. జగన్ అండ్ కోకు ఎదురుదెబ్బ తప్పదు. నరసాపురం గడ్డ నుంచి చెబుతున్నా.. సజ్జలా.. నువ్వు, మీ జగన్ పద్ధతులు మార్చుకోండి. లేదంటే కూటమి అధికారంలోకి వచ్చాక రోడ్డుపై మోకాళ్లపై దేకిస్తా' అని స్పష్టం చేశారు. "ముగ్గురు పెళ్లాలంటావేంట్రా మూర్ఖుడా.. వ్యక్తిగత జీవితాల గురించి ఎందుకు మాట్లాడుతున్నావ్? ప్రతి జీవితంలో ఒడిదొడుకులుంటాయి. మీ సతీమణి భారతిని నీ పెళ్లాం అంటే నీకు కోపం రాదా..? వ్యక్తిగత జీవితాల జోలికొస్తే ఊరుకునేది లేదు." అని జగన్‌ను హెచ్చరించారు



అబ్బ చా!



నేను ఎవరికీ ద్రోహం చేయలేదు

నాకు సంబంధంలేని వ్యవహారంలో నరకం అనుభవిస్తున్నా. నా జీవితంలో ఎవరికీ ద్రోహం చేయలేదు. నాకు ముందస్తు బెయిల్ వస్తే రిలీఫ్ అంటున్నారు. వ్యవస్థల్లో పలుకుబడిని ఉపయోగించుకుని, చంద్రబాబు పరపతితో బీజేపీలో ఉన్న పెద్దలతో మమ్మల్ని నరకయాతనకు గురిచేశారు.

- వైఎస్ అవినాశ్‌రెడ్డి, ఎంపీ

ఆనాటి ముచ్చట

గెలిచింది 175
ఎమ్మెల్యేలు 250

1970ల్లో భారీఎత్తున పార్టీల ఫిరాయింపులు ఉండేవి. ఈ రోజు ఒక పార్టీలో ఉన్నవారు రేపు ఏ పార్టీలో ఉంటారో చెప్పలేని పరిస్థితి. అప్పట్లో ఇందిరా కాంగ్రెస్, పాత కాంగ్రెస్ నడుమ ఈ జంపింగ్‌లు యథేచ్ఛగా సాగేవి. (ఉమ్మడి) ఆంధ్రప్రదేశ్‌లోనూ ఇదే జాడ్యం ఉండేది. 1978 అసెంబ్లీ ఎన్నికల్లో ఇందిరా కాంగ్రెస్ (కాంగ్రెస్-ఆర్) 175 స్థానాల్లో విజయం సాధించింది. జనతా పార్టీ 60, కాంగ్రెస్ (ఆర్గనైజేషన్) 30 చోట్ల గెలిచాయి. ఐదేళ్లలో నలుగురు సీఎంలు (మర్రి చెన్నారెడ్డి, టి.అంజయ్య, భవనం వెంకట్రాం, కోట్ల విజయభాస్కర్‌రెడ్డి) మారారు. ఇదే సమయంలో ఫిరాయింపులు కూడా జోరందుకున్నాయి. 1982 నాటికి ఇందిరా కాంగ్రెస్ బలం 250కి చేరడం విశేషం. జనతా, కాంగ్రెస్ (ఓ) ల నుంచి దరిదాపుగా 75 మంది ఈ పార్టీలో చేరిపోయారు.



అబ్ కీ బార్?

సూరత్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి నామినేషన్ తిరస్కరణ

» నామినేషన్ పత్రాలపై సంతకాలు తమవి కావన్న ప్రతిపాదకులు

సూరత్, ఏప్రిల్ 21: గుజరాత్‌లో కాంగ్రెస్‌కు ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ సూరత్ లోక్‌సభ అభ్యర్థి నీలేశ్ కుంబాని నామినేషన్ పత్రాలపై ఉన్న సంతకాలు తమవి కావని ముగ్గురు ప్రతిపాదకులు జిల్లా రిటర్నింగ్ అధికారికి అఫిడవిట్లు సమర్పించారు. దీంతో కుంబాని నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. మరోవైపు, సూరత్ నుంచి కాంగ్రెస్ ప్రత్యామ్నాయ అభ్యర్థి సురేశ్ పడ్సాల నామినేషన్ ఫారం కూడా చెల్లుబాటుకాలేదు. దీంతో గుజరాత్‌లో ప్రధాన ప్రతిపక్ష పార్టీ అయిన కాంగ్రెస్ సూరత్‌లో ఎన్నికల బరిలో లేకుండా పోయినట్టయింది.

'జై భవాని', 'హిందూ' పదాలను తొలగించం



అమిత్‌షా మాట్లాడుతున్న వీడియోను చూపిస్తున్న ఉద్ధవ్

ముంబై, ఏప్రిల్ 21: శివసేన (యూబీటీ) గేయం నుంచి 'జై భవాని', 'హిందూ' పదాలను తొలగించేది లేదని ఆ పార్టీ అధినేత, మహారాష్ట్ర మాజీ సీఎం ఉద్ధవ్ ఠాక్రే స్పష్టం చేశారు. ఆ పదాలను తొలగించాలంటూ ఎన్నికల కమిషన్(ఈసీ) నుంచి నోటీసు అందిందని, కానీ ఆ ఆదేశాలను పాటించబోమని స్పష్టం చేశారు. ఆ పదాలను తొలగించాలని ఆదేశించడం మహారాష్ట్రను అవమానించడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన ఇక్కడ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'తుల్జా భవానీ అమ్మవారి ఆశీస్సులతో ఛత్రపతి శివాజీ హైందవీ స్వరాజ్‌ను స్థాపించారు. అమ్మవారి పేరు మీద కానీ హిందూ మతం పేరుతో కానీ మేం ఓట్లు అడగడం లేదు. కానీ ఆ పదాలను తొలగించాలంటే సహించేది లేద'ని పేర్కొన్నారు. బహిరంగ సభల్లో తాను 'జై భవాని', 'జై శివాజీ' అని నినదించే సంప్రదాయాన్ని కొనసాగిస్తానని తెలిపారు. 'ఒకవేళ మాపై చర్యలు తీసుకుంటే కనుక, ప్రధాని మోదీ కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో 'జై బజరంగబలీ' అని ఈవీఎంల బటన్ నొక్కాల'ని ప్రజలకు పిలుపునిచ్చినప్పుడు ఈసీ ఏం చేసిందో మాకు చెప్పాల'ని పేర్కొన్నారు. అయోధ్య బాలరాముడి ఉచిత దర్శనం కావాలంటే బీజేపీకి ఓటు వేయాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రచారం చేశారని గుర్తుచేశారు.

'ఉచితాల' నియంత్రణకు కేంద్రం కృషి చేయాలి



హైదరాబాద్, ఏప్రిల్ 21: ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు ఇబ్బడిముబ్బడిగా ఉచిత పథకాలు ప్రకటించకుండా ఎలా నియంత్రించాలన్న దానిపై విస్తృత చర్చ జరగాలని ఆర్బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు అభిప్రాయపడ్డారు. ఈ అంశంలో రాజకీయ పార్టీలు ఏకాభిప్రాయానికి రావాలని, ఇందుకు కేంద్రప్రభుత్వం, ప్రధాని చొరవ తీసుకోవాలని సూచించారు. పార్టీల ఏకాభిప్రాయ సాధన కోసం కేంద్ర ప్రభుత్వం శ్వేతపత్రం' విడుదల చేయాలన్నారు. ప్రభుత్వం ఈ దిశగా కృషి చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇటీవల పీటీఐ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఉచితాల వల్ల జరుగుతున్న లాభలేంటి.. వాటి వల్ల నష్టమేంటి అన్నదానిపై ప్రజల్లో అవగాహన పెంచాలని, ఇది ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. కేంద్రమైనా, రాష్ట్రాలైనా చట్టం నిర్దేశించిన ప్రకారం ఆర్థిక క్రమశిక్షణను పాటించాలన్నారు. 2047వరకు ఏటా 7.6శాతం వృద్ధిని సాధిస్తే భారత్ అభివృద్ధి చెందిన దేశంగా అవతరిస్తుందన్న ఐఎంఎఫ్ అంచనాలపై స్పందిస్తూ.. చైనా అలా రెండు దశాబ్దాల పాటు వృద్ధిని సాధించిందని, కానీ భారత్ ముందు చాలా సవాళ్లున్నాయని పేర్కొన్నారు. ప్రధాని మోదీ చెప్తున్నట్టు 2029కల్లా భారతదేశం ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించినా.. అప్పటికి మనది పేద దేశంగానే ఉంటుందని, సంబురాలు చేసుకోవాల్సింది ఏమీ లేదని వ్యాఖ్యానించారు.

అమిత్‌షా ఆస్తులు ఐదేళ్లలో రెట్టింపు!

న్యూఢిల్లీ, ఏప్రిల్ 21: కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, ఆయన భార్య సోనాల్ పేరున మొత్తం రూ.65.67 కోట్ల ఆస్తులు ఉన్నట్టు తాజా ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు. 2019 లోక్‌సభ ఎన్నికల సమయంలో రూ.30.49 కోట్లుగా ఉన్న వీరి ఆస్తులు ఈ ఐదేళ్లలో రెట్టింపు అవడం విశేషం. గుజరాత్‌లోని గాంధీనగర్ లోక్‌సభ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆయన ఈనెల 19న నామినేషన్ దాఖలు చేశారు. దానికి జత చేసిన అఫిడవిట్‌లో తనకు రూ.20.23 కోట్ల చరాస్తులు, సోనాల్‌కు 22.46 కోట్ల చరాస్తులు ఉన్నట్లు వెల్లడించారు. అలాగే, అమిత్‌షా పేరిట రూ.16.31 కోట్ల స్థిరాస్తులు, సోనాల్ పేరిట రూ.6.55 కోట్ల స్థిరాస్తులు ఉన్నాయి. అమిత్‌షా, సోనాల్ దంపతుల ఆస్తుల్లో 57% వరకు స్టాక్ మార్కెట్లలోనే పెట్టుబడులు పెట్టినట్టు అఫిడవిట్ ఆధారంగా ఒక ఆంగ్ల ఆన్‌లైన్ వార్తా పత్రిక విశ్లేషించింది. గత ఐదేళ్లలో స్టాక్ మార్కెట్లలో వీరి పెట్టుబడులు 71 శాతం పెరిగినట్టు తెలిపింది.

కేరళలో కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 21: లోక్‌సభ ఎన్నికల వేళ కేరళలో కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బ తగిలింది. ఆ రాష్ట్రంలో వయనాడ్ జిల్లా కాంగ్రెస్ కమిటీ(డీసీసీ) జనరల్ సెక్రటరీ పీఎం. సుధాకరన్ ఆ పార్టీని వీడి బీజేపీలో చేరారు. అనంతరం మాట్లాడుతూ... వయనాడ్ నుంచి పోటీలో ఉన్న రాహుల్ గాంధీ కాంగ్రెస్ జిల్లా నేతలకూ అందుబాటులో ఉండడం లేదని ఆరోపించారు. మా పరిస్థితే ఇలా ఉందంటే ఇక సామాన్యుల పరిస్థితి ఎలా ఉంటుందో అంచనా వేయండి... అని అన్నారు. ఆయన(రాహుల్ గాంధీ)కు ఐదేళ్ల సమయం ఇచ్చాం... మళ్లీ గెలిపిస్తే ఇక వయనాడ్ అభివృద్ధికి దారులు మూసుకుపోయినట్టే... అని వ్యాఖ్యానించారు.

నాకు, నా మేనల్లుడికి రక్షణ లేదు: మమత

కుమార్‌గంజ్, ఏప్రిల్ 21: తనను, తన మేనల్లుడు అభిషేక్ బెనర్జీని బీజేపీ లక్ష్యంగా చేసుకుందని, ఆ పార్టీ నుంచి తమకు ముప్పు ఉందని పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఆందోళన వ్యక్తం చేశారు. "సోమవారం 'భారీ పేలుడు' సంభవిస్తుంది. అది టీఎంసీని, ఆ పార్టీ సీనియర్ నాయకత్వాన్ని కదిలించివేస్తుంది" అని బీజేపీ నాయకుడు, రాష్ట్ర ప్రతిపక్ష నేత సువేందు అధికారి శనివారం చేసిన వ్యాఖ్యలపై ఆమె ఈ మేరకు స్పందించారు. బాలూర్‌ఘాట్ లోక్‌సభ స్థానంలోని కుమార్‌గంజ్‌లో మమత ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. "మాపై కుట్రలు జరుగుతున్నాయి. మా ప్రాణాలకు రక్షణ లేదు. కానీ మేం కాషాయ పార్టీకి భయపడం" అని వ్యాఖ్యానించారు. "అక్రమ సంపదను కాపాడుకోవడానికే బీజేపీలో చేరిన దేశద్రోహి సువేందు" అని మమత మండిపడ్డారు. అతని తాటాకు చప్పుళ్లకు భయపడబోనన్నారు.

ముస్లింలకు పంచేస్తారు

(మొదటి పేజీ తరువాయి)

ఆస్తులపై ముస్లింలకు మొదటి హక్కు ఉందని గతంలో మన్మోహన్ సింగ్ ప్రభుత్వమే చెప్పిందని మోదీ గుర్తుచేశారు. ఈ లెక్కన దేశ ప్రజల ఆస్తులను ఎక్కువమంది పిల్లలు ఉన్నవారికి పంపిణీ చేయనున్నారని ఆరోపించారు. "మీ ఆస్తులను చొరబాటుదారులకు పంచుతారు. మీరు కష్టపడి సంపాదించిన డబ్బును వారికి ఇవ్వడం మీకు ఆమోదయోగ్యమేనా? మీ కష్టార్జితాన్ని జప్తు చేసే హక్కు ప్రభుత్వాలకు ఉందా?' అని ఆయన ప్రశ్నించారు. మన తల్లుల వద్ద ఉన్న బంగారం ప్రదర్శన కోసం కాదని, అది వారి ఆత్మగౌరవానికి సంబంధించినదని స్పష్టం చేశారు. మంగళసూత్రం విలువ బంగారంలోనో, దాని ధరలోనో లేదని, ఆమె కలలకు ప్రతిరూపమైన దాన్ని లాక్కోవడం గురించి వారు మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. 2006లో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చేసిన వివాదాస్పద 'ఫస్ట్ క్లెయిమ్' వ్యాఖ్యలను ఈ సందర్భంగా మోదీ ప్రస్తావించారు. కాంగ్రెస్ ప్రస్తుతం వామపక్షాల కబంధ హస్తాల్లో చిక్కుకుందని, ఆ పార్టీ మేనిఫెస్టో ఆందోళనకరంగా, తీవ్ర భావజాలంతో ఉందని ఆరోపించారు.

చేసిన పాపాలకు కాంగ్రెస్‌ను దేశం శిక్షిస్తోంది

కాంగ్రెస్ చేసిన పాపాలకు దేశం ఆ పార్టీని శిక్షిస్తోందని ప్రధాని మోదీ అన్నారు. ఒకప్పుడు 400సీట్లు గెలుచుకున్న పార్టీ.. ఇప్పుడు లోక్‌సభ ఎన్నికల్లో 300 సీట్లలో కూడా పోటీ చేయలేకపోతోందని ఎద్దేవా చేశారు. వారికి పోటీ చేయడానికి అభ్యర్థులే దొరకని పరిస్థితి ఉందని తెలిపారు. ప్రస్తుతం ఆ పార్టీ పరిస్థితి చాలా దారుణంగా ఉందని, దీనికి కాంగ్రెస్సే స్వయంగా బాధ్యత వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఎన్నికల్లో పోటీ చేయలేనివారు, గెలవలేనివారు బరిలో నుంచి పలాయనం చిత్తగించారని అన్నారు. "రాజస్థాన్ నుంచి దక్షిణాది నేత ఒకరిని కాంగ్రెస్ రాజ్యసభకు పంపింది. ఈ రాష్ట్ర సమస్యలపై ఆయన సభలో ఎప్పుడూ మాట్లాడలేదు. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌ను కూడా మీరు రాజ్యసభకు పంపారు. ఆయన అనారోగ్యంతో ఉన్నారు. మీ రాష్ట్రంలో ఎన్నడైనా ఆయన్ను చూశారా? ఇప్పుడు మీరు మరో నేతను కాపాడారు. ఎన్నికల్లో పోటీ చేసి గెలవలేని వారు రంగాన్ని వీడి రాజస్థాన్ నుంచి రాజ్యసభ సభ్యులుగా ఎంపికయ్యారు" అని పరోక్షంగా సోనియా గాంధీని ఉద్దేశించి మోదీ వ్యాఖ్యానించారు. "తొలిదశ పోలింగ్‌లోనే సగం రాజస్థాన్ కాంగ్రెస్‌ను శిక్షించింది. దేశభక్తిని అణువణువునా నింపుకున్న రాజస్థాన్‌కు.. కాంగ్రెస్ ఎన్నటికీ దేశాన్ని బలోపేతం చేయలేదని తెలుసు. 2014కు ముందు నాటి పరిస్థితులు మళ్లీ రావాలని ఈ దేశం కోరుకోవడం లేదు. బంధుప్రీతి, అవినీతి అనే చెదపురుగులను వ్యాప్తి చేయడం ద్వారా కాంగ్రెస్ దేశాన్ని నిర్వీర్యం చేసింది. నేడు దేశం మొత్తం ఆ పార్టీపై ఆగ్రహంతో ఉంది. అది చేసిన పాపాలకు శిక్షిస్తోంది. కాంగ్రెస్‌పై చాలా ఆగ్రహంతో ఉన్న యువత... మళ్లీ ఆ పార్టీ ముఖం చూడలనుకోవడం లేదు" అని మోదీ అన్నారు.

కూటమిలో కుమ్ములాటలు

ఇండియా కూటమి పరిస్థితి ఎగిరేలోపే దారం తెగిన గాలిపటంలా తయారైందని ప్రధాని విమర్శించారు. అది పేరుకు మాత్రమే పొత్తు అని, చాలా రాష్ట్రాల్లో కూటమిలోని భాగస్వామ్య పార్టీలు పరస్పరం కొట్లాడుకుంటున్నాయని వ్యాఖ్యానించారు. ప్రస్తుత ఎన్నికల్లో దేశంలో దాదాపు 25శాతం సీట్లలో ఈ కూటమికి చెందిన వారు ఒకరిపై మరొకరు పోటీ పడుతున్నారని చెప్పారు. ఎన్నికలకు ముందే ఈ స్థాయిలో కొట్టుకుంటున్నారంటే... ఇక ఆ తర్వాత దోచుకోవడానికి ఇంకెంతకు తెగిస్తారో ఊహించుకోవచ్చని, ఇలాంటి వారికి ఇంత పెద్ద దేశాన్ని అప్పగిస్తామా అని మోదీ ప్రశ్నించారు. కాగా, సంపద పంపిణీ విషయంలో తమ పార్టీని లక్ష్యంగా చేసుకొని మోదీ విద్వేషపూరిత వ్యాఖ్యలు చేశారని కాంగ్రెస్ మండిపడింది. మొదటి దశ లోక్‌సభ ఎన్నికల్లో పరిస్థితి నిరాశజనకంగా ఉండటంతో ప్రజల దృష్టిని మళ్లించేందుకే మోదీ ఇలాంటి అబద్ధాలకు తెగబడ్డారని ఖర్గే దుయ్యబట్టారు. మోదీ అవాస్తవాలను 140 కోట్ల దేశ ప్రజలు నమ్మరని ఆయన పేర్కొన్నారు.



రాజస్థాన్‌లోని బన్‌స్వారలో మాట్లాడుతున్న మోదీ

దక్షిణాదిలో రికార్డు సీట్లు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 21: ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో దక్షిణ భారతదేశం రికార్డు స్థాయి సీట్లతో బీజేపీని ఆశీర్వదిస్తుందని మోదీ ధీమా వ్యక్తంచేశారు. దక్షిణ భారత్ వ్యాప్తంగా తాను పర్యటిస్తున్నానని, తాను వెళ్లినప్పుడు అద్భుతమైన స్పందనను చూస్తున్నానని పేర్కొన్నారు. దక్షిణాదితో తమ పార్టీకి దగ్గరి సంబంధం ఉందని, తమ పార్టీ అధ్యక్షుల్లో ముగ్గురు దక్షిణాది నుంచే వచ్చారని చెప్పారు. 1984లో కేవలం రెండు సీట్లకే పరిమితమైనప్పుడు అందులో ఒకటి దక్షిణ భారతదేశం నుంచి ఉన్నట్టు మోదీ గుర్తు చేశారు. కేరళకు చెందిన మాతృభూమి వార్తాపత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మోదీ ఈ విషయాలు పేర్కొన్నారు.

మోదీ పాలనలో శిక్షగా రైలు ప్రయాణం

రైల్వే ప్రైవేటీకరణకు మోదీ కుట్ర: రాహుల్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): నరేంద్ర మోదీ పాలనలో రైలు ప్రయాణం శిక్షగా మారిందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ విమర్శించారు. కేరళ ఎక్స్‌ప్రెస్ ప్రయాణికులతో కిక్కిరిసిన వీడియోను ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. కేరళ నుంచి న్యూఢిల్లీకి వెళ్తున్న రైలులో.. సీట్ల మధ్యలోనే కాక, వాష్‌రూమ్‌లలో కూడా ప్రయాణికులు కూర్చున్న దృశ్యాలు ఆ వీడియోలో ఉన్నాయి. "నరేంద్ర మోదీ పాలనలో రైలు ప్రయాణం శిక్షగా మారింది. సామాన్యులు ప్రయాణించే జనరల్ బోగీల సంఖ్యను తగ్గించి, ఉన్నత వర్గాలు ప్రయాణించే రైళ్ల సంఖ్యను పెంచారు. దీని ద్వారా సామాన్యులకు రైలు ప్రయాణాన్ని దూరం చేయాలని మోదీ భావిస్తున్నారు. రైల్వేను ప్రైవేటీకరించి తన స్నేహితులకు కట్టబెట్టాలని మోదీ ఆలోచిస్తున్నారు. రైల్వేను మోదీని గద్దె దించాలి" అని రాహుల్ పిలుపునిచ్చారు.

బీజేపీ పార్టీ కాదు..'మోదీ కల్ట్'

తిరువనంతపురం, ఏప్రిల్ 21: "బీజేపీ ఇక ఎంత మాత్రం రాజకీయ పార్టీ కాదు. అది మోదీని ఆరాధించే ఓ కల్ట్. ఇది ముదిరితే నియంతృత్వం వస్తుంది" అని కాంగ్రెస్ సీనియర్ నేత చిదంబరం అన్నారు. మోదీ మూడోసారి అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తారని విమర్శించారు. సరిహద్దుల్లో చైనా అక్రమణలను మోదీ ప్రభుత్వం దాచిపెడుతోందని విమర్శించారు. చైనా దురాక్రమణలకు లద్దాఖ్ ఎంపీ, అరుణాచల్ ప్రదేశ్ ప్రజలు చెప్పే మాటలే సాక్ష్యాలని అన్నారు. ఇండియా కూటమి అధికారంలోకి వస్తే సీఏఏను రద్దు చేస్తామని, పార్లమెంటు తొలి సమావేశంలోనే దీనిపై నిర్ణయం తీసుకుంటామని చిదంబరం తెలిపారు. సీఏఏపై కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రస్తావన లేదంటూ కేరళ సీఎం పినరయ్ విజయన్ చేసిన విమర్శలకు సమాధానం ఇస్తూ ఈ వివరణ ఇచ్చారు. తానే మేనిఫెస్టో కమిటీ చైర్మన్‌గా ఉన్నానని, మరీ పెద్దదవుతుందన్న ఉద్దేశంతోనే ఇలాంటి కొన్ని అంశాలను అందులో చేర్చలేదని తెలిపారు. సీఏఏపై కాంగ్రెస్ వైఖరిని గతంలోనే తిరువనంతపురం ఎంపీ శశిథరూర్ లోక్‌సభలో స్పష్టం చేశారని గుర్తుచేశారు.

బీజేపీని సాగనంపండి

(మొదటి పేజీ తరువాయి)

వీడకుండా.. జైలుకైనా వెళ్లేందుకు ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, ఝార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సోరెన్ సిద్ధపడ్డారని ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే అన్నారు. "గిరిజనులను బీజేపీ అంటరాని వారిలా జమకడుతోంది. అందుకే రాష్ట్రపతి ద్రౌపది ముర్మును పార్లమెంట్ భవన ప్రారంభానికి పిలవలేదు. అయోధ్య రామమందిరం ఉద్ఘాటనకు ఆహ్వానించలేదు. రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ చేసే ఏ ప్రయత్నాన్నైనా తిప్పికొట్టేందుకు విపక్షాలు సిద్ధంగా ఉన్నాయి. బీజేపీ ఎన్ని కుట్రలు చేసినా.. ఇండియా కూటమిని విచ్ఛిన్నం చేయలేదు" అని ఆయన వ్యాఖ్యానించారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 150-180 స్థానాలకే పరిమితమవుతుందని జోస్యం చెప్పారు. కేజ్రీవాల్ భార్య సునీత కేజ్రీవాల్ మోదీ సర్కారుపై తీవ్రంగా మండిపడ్డారు. "తిహాడ్ జైలులో ఉన్న నా భర్త కేజ్రీవాల్‌ను కేంద్రంలోని బీజేపీ సర్కారు చంపేయాలని కోరుకుంటోంది. కేజ్రీవాల్ మధుమేహంతో బాధపడుతున్నా ఆయనకు ఇన్సులిన్ ఇవ్వడం లేదు" అని ఆరోపించారు. "కేంద్ర ప్రభుత్వానిది నియంతృత్వమే. నా భర్త మంచి విద్య, ఆరోగ్య వసతులను కల్పించడమే నేరమా? కేజ్రీవాల్ ఐఐటీలో చదివారు. విదేశాలకు వెళ్లే అవకాశం ఉన్నా.. దేశభక్తికి ప్రాధాన్యమిచ్చారు. ఐఆర్ఎస్ అధికారి అయిన కేజ్రీవాల్.. ప్రజాసేవకు ముందుకు వచ్చారు. ప్రజల సంతోషం కోసం తన జీవితాన్ని పణంగా పెట్టారు" అని ఉద్వేగంగా చెప్పారు. జైలులో ఉన్న హేమంత్ సోరెన్ ఈ ర్యాలీ సందర్భంగా ఓ లేఖను పంపారు. ఆ లేఖను సోరెన్ భార్య కల్పన చదివి వినిపించారు. "ఝార్ఖండ్ ప్రజలు ప్రజాస్వామ్యాన్ని ఓడిపోనివ్వొద్దు. విపక్షాలను అణగదొక్కేందుకు ఈడీ, సీబీఐల ద్వారా కేంద్రంలోని బీజేపీ అధికార దుర్వినియోగానికి పాల్పడుతోంది. బీజేపీని ఝార్ఖండ్ నుంచి తరిమికొట్టాలి. ఒకవేళ బీజేపీ గెలిస్తే.. అది ఝార్ఖండ్‌లోని గిరిజనుల పాలిట పెనుముప్పే" అని ఆ లేకలో సోరెన్ పేర్కొన్నారు. కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ మాట్లాడుతూ.. అస్వస్థత కారణంగా అగ్ర నేత రాహుల్‌గాంధీ ఈ ర్యాలీకి హాజరు కాలేదని వివరించారు. నేషనల్ కాన్ఫరెన్స్ చీఫ్ ఫరూఖ్ అబ్దుల్లా మాట్లాడుతూ.. రాముడు తమకే సొంతమనేలా బీజేపీ వ్యవహరిస్తోందని మండిపడ్డారు. రాముడు అందరివాడని చెప్పారు. ఈ కార్యక్రమాల్లో ఇండియా కూటమి నేతలు శిబూ సోరెన్(జేఎంఎం చీఫ్), తేజస్వీ యాదవ్(ఆర్జేడీ), అఖిలేశ్ యాదవ్(సమాజ్ వాదీ), భగ్వంత్ మాన్(పంజాబ్ సీఎం-ఆప్) తదితరులు పాల్గొన్నారు. కాగా.. జైల్లో ఉన్న కేజ్రీవాల్, హేమంత్ సోరెన్‌ల కోసం సభలో రెండు కుర్చీలను ఖాళీగా పెట్టారు. సభ బయట వీరిద్దరి భారీ కటౌట్లను ఏర్పాటు చేశారు.



ఉల్‌గుల్ న్యాయ్ మహార్యాలీలో 'ఇండియా' నేతల అభివాదం

మళ్లీ యడ్డీయే దిక్కు!

పక్కనపెట్టిన వృద్ధ నేతకే బీజేపీ అందలం



వయసు మీరిందని పక్కన పెట్టారు.. రాష్ట్రంలో ఒక్కో ఇటుకా పేరుస్తూ బీజేపీని నిర్మించి ప్రబల శక్తిగా మార్చిన నేతను మూలనపడేశారు.. గత అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపికలో ఆయనకు పాత్ర లేకుండా చేశారు. కానీ ఈ ప్రయోగం విఫలమై కర్ణాటకలో బీజేపీ భారీ పరాజయం మూటగట్టుకుంది. ఆ దెబ్బతో మళ్లీ ఇప్పుడు ఆయన్నే ముందుపెట్టి లోక్‌సభ ఎన్నికలకు వెళ్తోంది. ఆయనెవరో కాదు.. కర్ణాటక మాజీ సీఎం యడియూరప్ప(81). ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని విజయం దిశగా నడిపించే బాధ్యతను ప్రధాని మోదీ-కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఇప్పుడు ఆయన భుజాలపైనే పెట్టారు. అభ్యర్థుల ఎంపిక నుంచి ప్రచారం, వ్యూహాల వరకు అన్నీ ఆయనకే అప్పగించారు. ఈసారి దేశవ్యాప్తంగా 400 లోక్‌సభ స్థానాలు గెలవాలని లక్ష్యంగా పెట్టుకున్న మోదీ-షా.. కర్ణాటకలో గత ఎన్నికల మాదిరి 25 స్థానాలు కాకున్నా గరిష్ఠ సంఖ్యలో సీట్లు గెలుచుకోవాలంటే యడియూరప్ప సహాయం అవసరమని భావించారు. అందుకే గత సెప్టెంబరు నుంచే ఆయన్ను రంగంలోకి దించారు. మూడు దశాబ్దాల క్రితం కర్ణాటకలో కేవలం నలుగురు ఎమ్మెల్యేలతో బీజేపీకి పునాదులు వేసిన యడియూరప్ప.. తన కృషితో పార్టీని అధికారంలోకి తీసుకొచ్చారు. నాలుగుసార్లు సీఎం అయ్యారు. మొదటి రెండు సార్లు మెజారిటీ లేక రాజీనామా చేశారు. 2008 అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం పార్టీకి సొంత మెజారిటీ సాధించి పెట్టారు. 2013 ఎన్నికల నాటికి బీజేపీ నుంచి బయటకు వచ్చేసి సొంత పార్టీ పెట్టుకున్నారు. దరిమిలా బీజేపీ ఘోరంగా ఓడిపోయింది. 2014 లోక్‌సభ ఎన్నికల ముంగిట మోదీని ప్రచార కమిటీ సారథిగా నియమించగానే.. ఆయన చేసిన మొదటి పని యడియూరప్పను తిరిగి పార్టీలోకి తీసుకురావడం. ఫలితంగా 2018 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ కర్ణాటకలో అతిపెద్ద పార్టీగా అవతరించింది. ఆ ఏడాది మే 17న యడ్డీ మళ్లీ సీఎంగా ప్రమాణం చేశారు. కానీ ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మెజారిటీ సాధించలేక ఆరు రోజులకే రాజీనామా చేశారు. హెచ్‌డీ కుమారస్వామి నేతృత్వంలో కాంగ్రెస్-జేడీఎస్ సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడింది. అయితే 17 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రాజీనామా చేయడంతో 2019 జూలైలో కుమారస్వామి సర్కారు కూలింది. ఆ నెల 26న యడియూరప్ప తిరిగి సీఎం అయ్యారు.

వయోభారం సాకుతో

2021లో వయోభారం సాకుతో మోదీ-షా యడియూరప్పతో రాజీనామా చేయించారు. బొమ్మైను సీఎంను చేశారు. నిరుడు అసెంబ్లీ ఎన్నికల్లో జాతీయ నాయకత్వం యడియూరప్పను పూర్తిగా పక్కనపెట్టింది. అభ్యర్థుల ఎంపికలో ఆయన మాటకు విలువివ్వలేదు. సీనియర్ నేతలు శెట్టర్, లక్ష్మణ్ సవది, ఈశ్వరప్పలాంటి వారికి కూడా టికెట్లు నిరాకరించింది. దీంతో రాష్ట్ర బీజేపీలో సంక్షోభం చెలరేగింది. ఫలితంగా అసెంబ్లీ ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోయింది. ఆ తర్వాత యడియూరప్ప విలువ ఢిల్లీ పెద్దలకు తెలిసివచ్చింది. యడ్డీని క్రియాశీలం చేసే క్రమంలో ఆయన కుమారుడు విజయేంద్రకు నిరుడు నవంబరు 10న రాష్ట్ర పార్టీ పగ్గాలు అప్పగించింది. నాటి నుంచి మాజీ సీఎం అవిశ్రాంతంగా పార్టీ బలోపేతానికి కృషిచేస్తున్నారు. నిరుడు అసెంబ్లీ ఎన్నికల సమయంలో పార్టీని వీడిపోయిన వారిలో అత్యధికులను తిరిగి వెనక్కి తీసుకొచ్చారు. లింగాయత్‌లు తిరిగి పార్టీకి మద్దతిచ్చే దిశగా యడియూరప్ప ఆ వర్గానికి చెందిన నేతలకు తిరిగి టికెట్లు ఇప్పించారు. ఇంకోవైపు.. మోదీ తన రాష్ట్ర పర్యటనల్లో యడియూరప్పను ప్రశంసిస్తున్నారు. ఇటీవల శివమొగ్గ సభలో.. దక్షిణ భారతంలో బీజేపీ వేళ్లూనుకోవడానికి ఆయన నిరంతరం శ్రమిస్తున్నారని ఆకాశానికెత్తారు. దీంతో ఈ ఎన్నికల్లో సీనియర్ నేతలంతా యడియూరప్ప వెన్నంటే ఉంటున్నారు.

- బెంగళూరు, ఆంధ్రజ్యోతి.



మస్కట్‌లో సీతారాముల కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

ఒమాన్‌లో వైభవంగా శ్రీరామనవమి!

మస్కట్‌లోని శ్రీకృష్ణమందిరంలో వేడుకలు

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి): జై శ్రీరాం నినాదాలతో ఎడారి దేశం మారుమోగింది.. శ్రీరామనవమి సందర్భంగా ఒమాన్ రాజధాని మస్కట్‌లో సీతారాముల కల్యాణోత్సవం కన్నుల పండువగా జరిగింది. దేశం నలుమూలల నుంచి వందలాది మంది ప్రవాస దంపతులు మస్కట్‌లోని పురాతన శ్రీకృష్ణ మందిరానికి వేకువ జామునే చేరుకోవడంతో కిక్కిరిసిపోయింది. కాశీ పుణ్యక్షేత్రం నుంచి వచ్చిన కె.నాగశ్రీ నట్వర్‌లాల్, స్వామి అనమేశ్వరానంద సరస్వతి ఆధ్వర్యంలో స్థానిక తెలుగు ప్రవాస పురోహితులు, వేదపండితులు సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించారు. భారత రాయబారి అమిత్ నారంగ్ కూడా ఈ వేడుకలో పాల్గొన్నారు. భద్రాచలం నుంచి ప్రత్యేకంగా తెప్పించిన తలంబ్రాలను భక్తులకు అందజేశారు. ఇటు సౌదీ అరేబియాలో తెలుగు ప్రవాస సంఘం 'సాటా' ఆధ్వర్యంలో రియాద్ నగరంలో.. ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ అధ్వర్యంలో ఖతర్‌లోనూ శ్రీరామనవమి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. దుబాయ్, ఇతర ఎమిరేట్లలో శ్రీరామనవమి వేడుకలను ప్రవాసులు ఇళ్లలోనే జరుపుకొన్నారు.

ఆస్తుల వేలానికి 30 రోజుల నోటీసు తప్పనిసరి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 21: ఇచ్చిన అప్పును తిరిగి వసూలు చేసే క్రమంలో ఆస్తులను వేలం వేయాలనుకుంటే బ్యాంకులు తప్పనిసరిగా రుణగ్రహీతకు 30 రోజులు ముందుగా నోటీసు ఇవ్వాల్సి ఉంటుంది. అలా చేయకుంటే బ్యాంకే బాధ్యత వహించాల్సి ఉంటుందని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. అంతేకాకుండా ఆ ఆస్తి అమ్మకాన్ని న్యాయస్థానం పక్కన పెడితే దాన్ని కొనుగోలు చేసిన వారు ఆటోమేటిక్‌గా కిరాయిదార్లుగా మారుతారని స్పష్టం చేసింది. తీసుకున్న రుణాన్ని తిరిగి చెల్లించకపోవడంతో ఓ సంస్థ ఆస్తిని బ్యాంకు వేలం వేసింది. అందులో కిరాయికి ఉంటున్నవారే దాన్ని దక్కించుకున్నారు. ఆ మేరకు వారికి సేల్ సర్టిఫికెట్ కూడా ఇచ్చారు. అయితే నిబంధనల ప్రకారం బ్యాంకు తమకు 30 రోజులు ముందుగా నోటీసు ఇచ్చి వేలం వేయాల్సి ఉండగా దాన్ని పాటించలేదంటూ రుణగ్రహీతలు డెట్ ట్రైబ్యునల్‌ను ఆశ్రయించారు. విచారణ జరిపిన ట్రైబ్యునల్.. బ్యాంకు నోటీసు ఇవ్వకపోవడం నిబంధనలకు వ్యతిరేకమని పేర్కొంది. దీనిని సవాలు చేస్తూ కొనుగోలుదార్లు సుప్రీంకోర్టుకు వెళ్లారు. విచారించిన ధర్మాసనం.. బ్యాంకుదే తప్పని తేల్చింది. కొనుగోలుదారులకు వారు చెల్లించిన సొమ్ముపై 12% వడ్డీ కట్టాలని ఆదేశించింది. బ్యాంకు తప్పు చేసినందున వడ్డీ భారాన్ని కూడా అదే భరించాల్సి ఉంటుందని పేర్కొంది.

యూజీసీ-నెట్‌కు నోటిఫికేషన్

మొదటి సారి 3 కేటగిరీల్లో దరఖాస్తులు.. మే 10 వరకు దరఖాస్తులు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 21: దేశంలోని వర్సిటీల్లో జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్(జేఆర్ఎఫ్), అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల దరఖాస్తుకు అర్హత, పీహెచ్‌డీల్లో ప్రవేశాలకు నిర్వహించే యూజీసీ-నెట్ పరీక్షకు నోటిఫికేషన్ విడుదలైంది. ఈ మేరకు యూజీసీ షెడ్యూల్‌ను విడుదల చేసింది. తొలిసారిగా మూడు కేటగిరీలకు పరీక్షలను నిర్వహించనుంది. అంతేకాదు.. నాలుగేళ్ల డిగ్రీని 75% మార్కుల ఉత్తీర్ణతతో పూర్తిచేసిన విద్యార్థులకు నేరుగా పీహెచ్‌డీలో చేరే అవకాశాన్ని కల్పించింది. మే 10 (రాత్రి 11.50లోపు) వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. జూన్ 16న పరీక్ష ఉంటుంది. జనరల్/అన్-రిజర్వ్‌డ్ కేటగిరీకి రూ.1,150, జనరల్-ఈడబ్ల్యూఎస్, ఓబీసీ(నాన్-క్రీమీలేయర్) అభ్యర్థులకు రూ.600, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, థర్డ్ జెండర్ కేటగిరీలకు రూ.325 చొప్పున దరఖాస్తు ఫీజుగా నిర్ణయించారు. పీజీలో 55% మార్కులు ఉన్నవారు యూజీసీ-నెట్‌కు అర్హులు. ఓబీసీ(నాన్-క్రీమీలేయర్), ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, థర్డ్‌జెండర్ కేటగిరీ అభ్యర్థులు పీజీలో 50% మార్కులను సాధిస్తే సరిపోతుందని యూజీసీ వెల్లడించింది. జేఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసేవారి వయసు ఈ ఏడాది జూన్ 1 నాటికి 30 ఏళ్లు మించకూడదు. అసిస్టెంట్ ప్రొఫెసర్, పీహెచ్‌డీ కేటగిరీకి ఎలాంటి గరిష్ఠ వయోపరిమితి లేదు. కాగా, రెండు కేటగిరీల్లో-- జేఆర్ఎఫ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ కేటరీలకు మాత్రమే పరీక్షలు జరిగేవి. కొన్ని వర్సిటీలు మాత్రమే పీహెచ్‌డీలో ప్రవేశాలకు యూజీసీ-నెట్ అర్హతను పరిగణనలోకి తీసుకునేవి. యూజీసీ-నెట్‌తో పీహెచ్‌డీలో ప్రవేశాలు పొందవచ్చంటూ మార్చి 28న యూజీసీ నోటిఫికేషన్‌ను విడుదల చేసిన విషయం తెలిసిందే..! ఆ మేరకు మొదటి కేటగిరీలో జేఆర్ఎఫ్, అసిస్టెంట్ ప్రొఫెసర్, పీహెచ్‌డీకి అర్హత.. రెండో కేటగిరీలో జేఆర్ఎఫ్ వినహా, మిగతా రెండు అంశాలకు, మూడో కేటగిరీలో కేవలం పీహెచ్‌డీలో ప్రవేశాలకు నెట్ పరీక్షను నిర్వహించనున్నట్లు తాజా నోటిఫికేషన్‌లో వెల్లడించింది.

నాలుగేళ్ల డిగ్రీతో పీహెచ్‌డీ

నాలుగేళ్ల బ్యాచిలర్స్ డిగ్రీ పూర్తిచేసిన విద్యార్థులు యూజీసీ-నెట్ ద్వారా ఇకపై నేరుగా పీహెచ్‌డీలో ప్రవేశాలు పొందవచ్చు. అయితే.. వారు 75% మార్కులతో పాస్ అయి ఉండాలి. ఎస్సీ, ఎస్టీలతో పాటు.. యూజీసీ సూచించిన కేటగిరీల అభ్యర్థులు 70% మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తే సరిపోతుంది. వీరు మూడో కేటగిరీ-- కేవలం పీహెచ్‌డీకి మాత్రమే అర్హులు. జేఆర్ఎఫ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు అర్హత ఉండదు.

బెంగళూరు పేలుళ్ల సూత్రధారులకు పాక్‌తో లింక్

బెంగళూరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): బెంగళూరు రామేశ్వరం కెఫేలో బాంబు పేలుళ్ల సూత్రధారులకు పాకిస్థాన్‌తో సంబంధాల ఉన్నట్టు ఎన్ఐఏ విచారణలో తేలింది. పాకిస్థాన్‌కు చెందిన కర్నల్ అనే కోడ్ పేరు కలిగిన వ్యక్తితో.. బాంబు పేలుళ్ల సంఘటనలో అరెస్టు అయిన అబ్దుల్ మతీన్ తాహా, ముసావీర్ హుసేన్ షజీబ్‌కు సంబంధాలున్నట్టు అధికారులు నిర్ధారించుకున్నారు. ఐఎస్ అల్-హింద్ అనే ఉగ్రవాద సంస్థతోనూ వీరికి 2019-20 నుంచి సంబంధాలు ఉన్నట్టు తెలుస్తోంది. కర్నల్ అనే కోడ్ ఉన్న అనుమానితుడితో 2022లో మంగళూరులో జరిగిన కుక్కర్‌బాంబు పేలుళ్ల కేసు నిందితుడికి సంబంధాలు ఉన్నట్టు ఉన్నత వర్గాల ద్వారా తెలుస్తోంది. కర్నల్‌కు పాకిస్థాన్ ఇంటెలిజెన్స్ సంస్థ ఐఎస్ఐతో సంబంధాలు ఉన్నట్టు సమాచారం. వీరు భారత్‌లో బాంబు పేలుళ్లకు కుట్రలు సాగిస్తున్నట్టు అనుమానిస్తున్నారు. ఇస్లామిక్ స్టేట్ పేరిట స్థానిక యువతను కర్నల్ నియమించుకుంటున్నాడు. వారితో దేశవ్యాప్తంగా గ్రూపులను ఏర్పాటు చేసి, బాంబు దాడులు జరపడానికి ఆ వ్యక్తి కుట్రలు చేస్తున్నాడు. రామేశ్వరం కెఫేలో మార్చి 1న సంభవించిన పేలుళ్ల వెనుక అతని హస్తం ఉన్నట్టు గుర్తించిన ఎన్ఐఏ దర్యాప్తు మరింత వేగవంతం చేసింది.



అబ్ కీ బార్?

మా అభ్యర్థికి మీరేసే ఓటే పెళ్లి బహుమతి!

పెళ్లి శుభలేఖపై ఎన్నికల ప్రచారం.. కేసు నమోదు

కొడిపల్లి: "మా తమ్ముడికి మీరు ఇచ్చే బహుమతి రఘునందన్‌రావుకి మీరు వేసే ఓటు" అంటూ మెదక్ మండల పరిధిలోని మహ్మద్‌నగర్ గేట్‌తండాకు చెందిన నునావత్ సురేష్‌నాయక్.. పెళ్లి కార్డు ద్వారా ఎన్నికల ప్రచారం మొదలుపెట్టారు. నిబంధనలను ఉల్లంఘిస్తూ పెళ్లి పత్రికపై ఇలా ప్రచారం చేస్తున్నందుకు చంద్రయ్య చేసిన ఫిర్యాదు మేరకు సురేష్‌నాయక్‌పై కేసు నమోదు చేశారు.



సీఎం రేవంత్‌రెడ్డి హైటెన్షన్ వైర్

- ముట్టుకుంటే మాడి మసైపోతారు
- రాజగోపాల్ పవర్ ట్రాన్స్‌ఫార్మర్: మంత్రి వెంకట్‌రెడ్డి



యాదాద్రి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వానికి సీఎం రేవంత్‌రెడ్డి హైటెన్షన్ వైర్‌లాంటివారని, ప్రభుత్వాన్ని కూల్చేందుకు ముట్టుకుంటే కేసీఆర్, కేటీఆర్ సహా ఎవరైనా మాడి మసైపోతారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి మద్దతుగా సీఎం రేవంత్‌రెడ్డి భువనగిరిలో నిర్వహించిన రోడ్ షోలో మంత్రి మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి హైటెన్షన్ వైర్‌లా ఉంటే, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌గా ఉన్నారని చెప్పారు. "గతంలో పూటకు గతిలేని ఓ పొట్టోడు పదేళ్ల అధికారంలో ఉండి లక్షల కోట్లు అక్రమంగా దండుకొని నేడు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నాడు. త్వరలోనే కాంగ్రెస్ కార్యకర్తలు అతడికి అన్ని రకాలుగా బుద్ధి చెప్పేందుకు సిద్ధమవుతున్నారు" అని ఘాటుగా హెచ్చరించారు. ఇప్పటికైనా వక్ర బుద్ధిని మార్చుకొని అభివృద్ధికి సహకరించాలని, లేనిపక్షంలో ప్రజల నుంచి శాస్తి తప్పదని సూచించారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఉమ్మడి జిల్లా సమస్యలకు నెలవుగా మారిందన్నారు. కేంద్రంలో పదేళ్ల అధికారంలో ఉన్న బీజేపీ రాష్ట్రానికి, ఉమ్మడి జిల్లాకు చేసిందేమీ లేదని, కిషన్‌రెడ్డి కేంద్రమంత్రిగా ఉన్నప్పటికీ రాష్ట్రానికి నిధులు తీసుకురాలేదని విమర్శించారు. నల్లగొండ ఎంపీ స్థానాన్ని 5 లక్షలు, భువనగిరి స్థానాన్ని 4 లక్షల మెజార్టీతో కాంగ్రెస్ పార్టీ గెలుచుకోవడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.



రేవంత్ పని కేసీఆర్‌ను తిట్టుడేనా?:హరీశ్

మెదక్, ఏప్రిల్ 21: సీఎం రేవంత్ రెడ్డి ఎక్కడ ప్రసంగించినా మాజీ సీఎం కేసీఆర్‌పై ఇష్టమొచ్చినట్లుగా వ్యాఖ్యలు చేస్తున్నారని, రేవంత్ పని కేసీఆర్‌ను తిట్టుడేనా? అని మాజీ మంత్రి హరీశ్ రావు ప్రశ్నించారు. ఏడుపాయల వనదుర్గా ఆలయ అభివృద్ధికి గతంలో కేసీఆర్ రూ.100 కోట్ల నిధులను మంజూరు చేస్తే, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి.. దానికి సంబంధించిన ఈ జీవో రద్దు చేసి ఆ నిధులను వెనక్కి తీసుకున్నారని ఆరోపించారు. రేవంత్‌కు వనదుర్గామాత ఉసురు తగిలి తీరుతుందని శాపనార్థాలు పెట్టారు. ఆదివారం రాత్రి మెదక్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డి నాన్ లోకల్ అని విమర్శిస్తున్న రేవంత్‌రెడ్డికి.. మల్కాజిగిరి నాన్ లోకల్ కాదా అని ప్రశ్నించారు. రేవంత్‌కు తన ఎత్తుతో ఏం పని అని, ముందు రైతు రుణమాఫీ గురించి ఆలోచించాలని హితవు పలికారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమై 20 రోజులు గడుస్తున్నా ఇంతవరకూ ఏ మంత్రి కూడా కేంద్రాలను సందర్శించలేదని ఆరోపించారు.

పంద్రాగస్టులోగా 2 లక్షల రుణమాఫీ

(మొదటిపేజీ తరువాయి)

మరీ ఆ పనులు చేయిస్తానని పేర్కొన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని ఈ సందర్భంగా పొగడ్తలతో ముంచెత్తారు. తనతోపాటు.. సీఎంగా పనిచేసే అర్హత ఉన్న వ్యక్తి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. సీఎం పదవి తనకు అర్హత కాదని.. ఒక బాధ్యత అని చెప్పారు. "భూమికి మూరెడు లేనోడికి చెబుతున్నా..! కోమటిరెడ్డి బ్రదర్స్ ఫాంహౌస్‌లో మందులో సోడా కలిపి రాజకీయాల్లోకి రాలేదు. సొంత ఆస్తులు కరగబెట్టి సేవ చేసిండ్రు. మంత్రి పదవిని త్యాగం చేసి.. నల్లగొండ గడ్డపై నిరవధిక నిరాహార దీక్ష చేశారు. అధిష్ఠానాన్ని ఒప్పించి తెలంగాణ రాష్ట్ర సాధనకు కోమటిరెడ్డి బ్రదర్స్ కృషిచేశారు. తెలంగాణ వచ్చాకే.. మంత్రి పదవి తీసుకుంటానని ప్రతిజ్ఞ చేశారు. బీఆర్ఎస్ వాళ్లు అడవి పందుల్లా మెక్కి బలిసిండ్రు. కేసీఆర్ వామపక్షాల మద్దతు తీసుకున్నారు. కానీ, వారికి కనీస గౌరవం ఇవ్వలేదు. కుటుంబ పాలనతో రాష్ట్రాన్ని 7 లక్షల కోట్ల మేర అప్పులపాలు చేశారు" అని వ్యాఖ్యానించారు. స్థానిక నేతలు ఎప్పుడైనా తనను కలవొచ్చని పేర్కొన్నారు.

కిరణ్‌ను గెలిపిస్తే..భువనగిరిలో ట్రిపుల్ ఇంజన్

"అటువైపు జానారెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి.. ఇటువైపు కోమటిరెడ్డి బ్రదర్స్.. మనకు మనమే పోటీ పడి చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని 3 లక్షల మెజారిటీతో గెలిపించాలి. భువనగిరిలో ఇప్పటికే డబుల్ ఇంజన్(కోమటిరెడ్డి బ్రదర్స్) ఉంది. కిరణ్‌ను గెలిపిస్తే ట్రిపుల్ ఇంజన్ అవుతుంది" అని రేవంత్‌రెడ్డి కోరారు. గందమళ్ల, డిండి, బస్వాపూర్ రిజర్వాయర్‌లను, ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌ను పూర్తిచేస్తామని, పిలాయిపల్లి, ధర్మారెడ్డి, బూనాదిగాని కాల్వలను పునరుద్ధరించేందుకు నిధులను కేటాయిస్తామన్నారు. రూ.60 వేల కోట్లతో మూసీ ప్రక్షాళన చేపడతామని, భువనగిరిని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. "ప్రభుత్వ విప్‌లుగా, రాజ్యసభ్య సభ్యులుగా, ఎమ్మెల్సీలుగా బడుగు బలహీనవర్గాల నేతలకు అవకాశం కల్పించాం. బీసీ జనాభా లెక్కల ప్రకారం నిధులు, నియామకాలు చేపట్టేలా తగిన చర్యలు తీసుకుంటాం. బీఆర్ఎస్ కుటుంబ న్యాయం చేయగా.. కాంగ్రెస్ సామాజిక న్యాయం చేస్తుంది. ఎలక్షన్లు, కలెక్షన్ల పేరుతో కేసీఆర్ హైదరాబాద్‌లో ఉన్న ఆంధ్రాప్రాంత వ్యాపారుల వద్ద పెద్ద ఎత్తున డబ్బులు దోచుకున్నారు. పదేళ్లపాటు తెలంగాణ తల్లి కేసీఆర్ గడీలో కన్నీళ్లు పెట్టుకుంది. ప్రజాధనంతో కట్టిన ప్రజాభవన్‌ను కేసీఆర్ గడీగా మార్చారు. గడీల పాలనను బద్దలు కొట్టి, ప్రజాపాలనను తీసుకొచ్చాం" అని వ్యాఖ్యానించారు.





రోడ్‌షోలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. హాజరైన ప్రజలు

బీఆర్ఎస్, బీజేపీని బొందపెట్టాలి

కమ్యూనిస్టులకు రేవంత్ పిలుపు

బీఆర్ఎస్, బీజేపీలను బొందపెట్టడానికి కమ్యూనిస్టులు కలిసి రావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. మతం, దేవుడి పేరుతో.. కేంద్ర దర్యాప్తు సంస్థలతో బీజేపీ రాజకీయాలు చేస్తోందని మండిపడ్డారు. కాంగ్రెస్ మాత్రం ప్రజాస్వామ్యం, రాజ్యాంగ రక్షణే లక్ష్యంగా పనిచేస్తోందని వివరించారు. ఇప్పటికే సీపీఐ తమతో కలిసి పనిచేస్తోందని.. మరో వామపక్ష పార్టీ కూడా తమ నిర్ణయంపై పునరాలోచన చేసుకోవాలని కోరారు.

సర్కారును ఎందుకు కూలగొడతారు?

"కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలైనా కాకముందే కూలగొడతామని.. లోక్‌సభ ఎన్నికల్లో ఓడించాలని కేసీఆర్ అంటున్నారు. ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నందుకు మా ప్రభుత్వాన్ని కూలగొడతారా? మమ్మల్ని ఓడిస్తారా? కేసీఆర్ సర్కారు నిరుద్యోగుల ఆశలకు గండికొడితే.. మేము ప్రజాపాలనలో మూణ్నెల్లలో 30 వేల మందికి ఉద్యోగ నియామక పత్రాలు ఇచ్చాం. ఆడబిడ్డలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం సౌకర్యం కల్పించాం. రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద రూ.10 లక్షల బీమా ఇస్తున్నాం. రూ.400 నుంచి రూ.1200 పెంచిన గ్యాస్ ధరల భారాన్ని.. 40 లక్షల పేద కుటుంబాల తరఫున రూ.500 చొప్పున భరిస్తున్నాం. 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు ఇస్తున్నాం. ఇవన్నీ చేస్తున్నందుకు మా ప్రభుత్వాన్ని కూలగొడతారా?" అని రేవంత్‌రెడ్డి నిలదీశారు. మరోసారి కేసీఆర్ ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే.. ఆయన లాగులో తొండలు వేసి, కొట్టిస్తామని హెచ్చరించారు. "ఇదేమైనా ఫుల్ బాటిలా? పడిపోవడానికి?? ప్రభుత్వం పడిపోతదని ఎవరైనా మాట్లాడితే ఉరికించి కొడతాం" అని వ్యాఖ్యానించారు. నల్లగొండ జిల్లా అంటేనే ఉద్యమాల గడ్డ అని.. భువనగిరి ఖిల్లా కాంగ్రెస్ అడ్డా అని స్పష్టం చేశారు.

మోదీ, కేడీ ఒక్కటే..

కేంద్రంలో మోదీ.. రాష్ట్రంలో కేడీ(కేసీఆర్) ఇద్దరూ ఒకరికొకరు మద్దతు ఇచ్చుకుంటారని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. పదేళ్లలో పార్లమెంట్‌లో అనేక బిల్లులకు బీఆర్ఎస్ పూర్తి సహకారం అందించిందని గుర్తుచేశారు. బీజేపీ పదేళ్ల పాలనలో ప్రజలకు చేసిందేమీలేదని, కేంద్ర సంస్థలను దుర్వినియోగం చేసిందని విమర్శించారు. "భువనగిరి నుంచి కుర్మ నేత క్యామ మల్లేశ్‌ను బీఆర్ఎస్ బరిలో దింపింది. వెనుక నుంచి బూరకు కేసీఆర్ బూర ఊదుతున్నారు. బిడ్డ(ఎమ్మెల్సీ కవిత)కు బెయిల్ రావాలంటే భువనగిరిలో బీజేపీ గెలవాలంట!" అని రేవంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు. రాష్ట్ర అవతరణను అవమానించిన బీజేపీకి తెలంగాణలో ఓటు అడిగే నైతికతను లేదన్నారు. ఇండియా కూటమి గెలుపుతో రాహుల్ గాంధీ ప్రధాని అవుతారని తెలిపారు.

3 జిల్లాల్లో నేడు రేవంత్ పర్యటన

నామినేషన్ కార్యక్రమాల్లో పాల్గొననున్న సీఎం

ఆదిలాబాద్/నిజామాబాద్ అర్బన్/మేడ్చల్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి) : లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి ఆదిలాబాద్, నిజామాబాద్, మేడ్చల్ జిల్లాల్లో పర్యటించనున్నారు. సోమవారం ఉదయం 11 గంటలకు ఆదిలాబాద్ చేరుకోనున్న సీఎం.. పార్టీ అభ్యర్థి ఆత్రం సుగుణ నామినేషన్ దాఖలు కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు హాజరవుతారు. అక్కడి నుంచి 12.30 గంటలకు నిజామాబాద్‌కు బయలుదేరి వెళ్తారు. నిజామాబాద్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న జీవన్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమానికి హాజరవుతారు. అనంతరం పాత కలెక్టరేట్ మైదానంలో ఏర్పాటు చేయనున్న బహిరంగ సభలో పాల్గొననున్నారు. అలాగే, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని అంతాయపల్లిలో నిర్వహించనున్న బహిరంగ సభకూ సీఎం హాజరుకానున్నారు. మల్కాజిగిరి అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమంలోనూ పాల్గొంటారు. ఈ మేరకు మూడు జిల్లాల్లోనూ కాంగ్రెస్ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా, నిజమాబాద్ సభ ఏర్పాట్లను షబ్బీర్ అలీ, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి తదితరులు పరిశీలించారు.

రామపాలన కావాలంటే రాహుల్‌ను ప్రధానిని చేయండి

రామాలయం నిర్మాణంతో సమస్యలు పోయాయా? .. పేదల కోసం పాలన చేసిన చరిత్ర రామునిది

- శ్రీరాముని ఆదర్శాలు నిలబెట్టేది రాహుల్ గాంధీనే: జగ్గారెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): దేశంలో శ్రీరాముని పరిపాలన కావాలంటే రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిని చేయాలని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శ్రీరాముని ఆదర్శాలు నిలబెట్టేది, ఆయన నిజమైన వారసుడు రాహుల్‌గాంధీనేనన్నారు. రామాలయం నిర్మాణంతో ప్రజల సమస్యలన్నీ పోయాయా అని ప్రశ్నించారు. గుడి నిర్మాణం చేస్తే సంతోషిస్తానంటూ రాముల వారు చెప్పలేదని, ఆయన పేదల కోసం పాలన చేశారని అన్నారు. అదే విధంగా పేదల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్న నాయకుడు రాహుల్‌గాంధీ అని చెప్పారు. ఎన్నాళ్లు అధికారంలో ఉన్నామన్నది కాదని, పాలనలో ప్రజలు తృప్తిగా జీవిస్తే అది రామరాజ్యమవుతుందని పేర్కొన్నారు. గాంధీభవన్‌లో ఆదివారం జగ్గారెడ్డి మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. శ్రీరాముని ఆదర్శాలు నిలబెట్టేది రాహుల్‌గాంధీనేనన్నారు. కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఈటల రాజేందర్‌లు రాజకీయంగా బతకాలంటే.. జైశ్రీరామ్ అనక తప్పదన్నారు. ఈటల రాజేందర్ రాజకీయ జీవితం.. రాహుల్‌గాంధీ నాయకత్వం ముందు చాలా చిన్నదని చెప్పారు. రాహుల్ గాంధీ నాయకత్వం, చరిత్ర, రాజకీయం మీద మాట్లాడుతున్న బీజేపీ నేతలు.. ఆయన ముందు చిన్న వ్యక్తులని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం దేశ రాజకీయాలు రాహుల్‌గాంధీ, నరేంద్ర మోదీల చుట్టే తిరుగుతున్నాయని జగ్గారెడ్డి అ న్నారు. అయితే రాహుల్‌కు, మోదీకి చాలా వ్యత్యాసం ఉందని పేర్కొన్నారు. అద్వాణీ రథయాత్రకు ముందు దేశ ప్రజలతో పాటు గుజరాత్ రాష్ట్ర ప్రజలకు కూడా మోదీ ఎవరో తెలియదన్నారు. అద్వాణీ రథయాత్ర ప్రారంభం అయినప్పుడు మోదీ ఆయన వెనుక ఉండి సేవ చేసే వారని గుర్తు చేశారు. రథయాత్ర పూర్తయ్యాక.. గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచారన్నారు. తదనంతర పరిణామాల్లో అద్వాణీ ఆయనను సీల్డ్ కవర్ ద్వారా సీఎంగా ప్రకటించారని చెప్పారు. అనేక రాష్ట్రాలకు సీఎంలను సీల్డ్ కవర్‌లో డిసైడ్ చేసిన నాయకుడు రాహుల్‌గాంధీ అన్నారు. సీఎంలను డిసైడ్ చేసే రాహుల్‌గాంధీకి, సీల్డ్ కవర్ సీఎం.. మోదీకి చాలా తేడా ఉందని ఆయన పేర్కొన్నారు.



గర్వం లేని వ్యక్తి రాహుల్

ప్రధాని కాకముందు ప్రజల కోసం మోదీ ఏ పోరాటాలు చేశారో చెప్పాలంటూ బీజేపీ నేతలను జగ్గారెడ్డి ప్రశ్నించారు. ప్రధాని పదవిని చేపట్టే అవకాశం వచ్చినా.. వద్దనుకున్న రాహుల్ గాంధీ తనకు బదులు మన్మోహన్ సింగ్‌ను ప్రధాన మంత్రిని చేశారని గుర్తుచేశారు. ప్రధానినే నిర్ణయించిన నేత రాహుల్‌గాంధీ అని, అంత పెద్ద కుటుంబం నుంచి వచ్చినా ఆయనలో ఏ మాత్రం గర్వం లేదని కొనియాడారు. సామాన్య జనంతో మమేకమయ్యే నేత రాహుల్‌గాంధీ అయితే.. సోషల్ మీడియాలో తనను తాను మార్కెటింగ్ చేసుకుని ఎదిగిన వ్యక్తి మోదీ అని విమర్శించారు.

రాష్ట్రంలో కాంగ్రెస్‌కు 14 సీట్లు ఇవ్వండి

తెలంగాణ నుంచి కాంగ్రెస్‌కు 14 లోక్‌సభ సీట్లు ఇవ్వాలంటూ రాష్ట్ర ప్రజలకు జగ్గారెడ్డి విజ్ఞప్తి చేశారు. టికెట్ల కేటాయింపులో కొందరికి అన్యాయం జరగవచ్చని, కానీ అది ఒక్కరి సమస్య మాత్రమేనని ఓ ప్రశ్నకు సమాధానంగా ఆయన చెప్పారు. టికెట్ల కేటాయింపులతోనే సమస్యలు పోవన్నారు.

మూటలు మోసి.. దోసెలు వేసి..



కొల్లాపూర్‌లో ఆర్ఎస్ ప్రవీణ్ వినూత్న ప్రచారం

కొల్లాపూర్, ఏప్రిల్ 21: ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ కొల్లాపూర్‌లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ వినూత్నంగా ప్రచారం నిర్వహించారు. కూలీలతో కలసి మూటలు మోస్తూ, హోటల్లో దోసెలు వేస్తూ, ప్రజల సమస్యలు తెలుసుకుంటూ ఆయన ప్రచారం సాగించారు. ఆదివారం ఉదయం ఆయన కొల్లాపూర్‌లోని మినీ స్టేడియంలో క్రీడాకారులు, వాకర్స్, వృద్ధులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. పట్టణంలో హమాలీలతో కలిసి బస్తాలు మోశారు. నాటు కోడిని తూకం వేశారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపిస్తే సమస్యల పరిష్కారానికి పోరాడతామని ప్రవీణ్ కుమార్ తెలిపారు.

గూగుల్ మ్యాప్స్ గందరగోళం



చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి రథం కేపీహెచ్‌బీలో!

కేపీహెచ్‌బీకాలనీ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఎక్కడికైనా తెలియని చోటుకు వెళ్లాలంటే గూగుల్ మ్యాప్స్‌ను నమ్ముకుంటాం! కానీ ఒక్కోసారి ఆ యాప్ మనల్ని మోసం చేస్తుంది. చేరాల్సిన చోటుకు కాకుండా వేరెక్కడికో తీసుకెళ్తుంది! చేవెళ్ల పార్లమెంటు స్థానం నుంచి పోటీచేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డికి చెందిన ప్రచార వాహనం ఒకటి అలాగే ఆదివారం దారితప్పి మల్కాజిగిరి పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో తెగ తిరిగేసింది!! సాధారణంగా పార్లమెంటు సీటుకు పోటీచేసే అభ్యర్థులకు.. తమ పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లోని వీధివీధినా తిరిగి ప్రచారం చేసే అవకాశం ఉండదు. అందుకే ప్రచార రథాలు ఏర్పాటు చేసుకుని వీధివీధినా తిప్పుతూ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తుంటారు. ఈ క్రమంలోనే.. రంజిత్‌రెడ్డి కొన్ని ప్రచార వాహనాలను ఏర్పాటు చేసుకున్నారు. కానీ, వాటిలో ఒకటి చేవెళ్ల పరిధిలో కాకుండా కేపీహెచ్‌బీలో తిరుగుతుండడంతో స్థానికులు ఆసక్తిగా తిలకించారు. కొంతమంది ఆ వాహనాన్ని ఆపి.. "మీ ప్రచార రథాన్ని ఇక్కడ ఎందుకు తిప్పుతున్నారు, ఇది ఏ నియోజకవర్గమో మీకు తెలుసా" అని అడిగితే.. "అవేమీ మాకు తెలియవు. మేము ఎక్కడ తిరగాలో గూగుల్ మ్యాప్ ద్వారా లొకేషన్ ఇచ్చారు.. దాని ప్రకారం తిరుగుతున్నాం" అని వాహనంలోని సిబ్బంది చెప్పడంతో ఆశ్చర్యానికి గురయ్యారు.

కేసీఆర్ అంటే ఆరంభం, ఆర్భాటం, అంతం

- దిగ్విజయ్ చేసిన తప్పు వల్లే బీఆర్ఎస్ ఉంది
- సీఎం రేవంత్ కుడి, ఎడమ చూసుకోవాలి
- కుర్చీ ఎవరు లాగేస్తారో తెలియని పరిస్థితి

మీట్ ది ప్రెస్‌లో బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్



హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): కేసీఆర్ అంటే ఆరంభం.. ఆర్భాటం.. అంతం అని మెదక్ లోక్‌సభ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి ఎం. రఘునందన్‌రావు అన్నారు. ఆరంభించడం, ఆర్భాటం చేయడం, అంతం చేయడం అన్నీ కేసీఆర్ చేస్తారని తెలిపారు. భస్మాసురుడి వల్లే కేసీఆర్ తన తలపై తన భస్మాసుర హస్తం పెట్టుకుంటారని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి తన కుడి, ఎడమలను జాగ్రత్తగా చూసుకోవాలని, సీఎం కుర్చీని ఎవరు లాగేస్తారో తెలియని పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. తెలంగాణ జర్నలిస్టు యూనియన్ (టీజేయూ) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో ఆదివారం నిర్వహించిన మీట్ ద ప్రెస్‌లో రఘునందన్‌రావు పలు అంశాలపై మాట్లాడారు. నిజానికి, బీఆర్ఎస్ ఎప్పుడో కాంగ్రెస్‌లో విలీనం కావాల్సిందని అన్నారు. కానీ, కాంగ్రెస్ నేత దిగ్విజయ్‌సింగ్ చేసిన తప్పు వల్ల బీఆర్ఎస్ పదేళ్ల పాటు బతికిందని తెలిపారు. రాష్ట్ర ప్రజలు బీఆర్ఎస్‌కు వీఆర్ఎస్ ఇచ్చారని, కేసీఆర్ తన ఫాంహౌస్‌ను వ్యవసాయ పరిశోధన కేంద్రంగా మార్చుకుంటే మంచిదని హితవు పలికారు. తాను అసెంబ్లీలో అడుగుపెడితే వాళ్లకు కుర్చీలు ఉండవనే భయంతో తండ్రీకొడుకులు(కేసీఆర్, కేటీఆర్) తనని దుబ్బాక ఎన్నికల్లో ఓడించారని చెప్పారు. ఇక, రఘునందన్‌కు దుబ్బాకలో గడీ ఉందని సీఎం రేవంత్ అంటున్నారని, అది నిరూపిస్తే సొంత ఖర్చులతో ఆ గడీని ముఖ్యమంత్రి పేరిట రిజిస్ట్రేషన్ చేయిస్తానని పేర్కొన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ కవల పిల్లలని, ఆ రెండు పార్టీల మధ్య సత్సంబంధాలు ఉన్నాయని ఆరోపించారు. రీజనల్ రింగ్ రోడ్డును అష్ట వంకరలు తిప్పిన వెంకట్రామిరెడ్డిపై ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. మెదక్‌తో ఏం సంబంధం ఉందని వెంకట్రామిరెడ్డిని బీఆర్ఎస్ పోటీలో నిలబెట్టిందని నిలదీశారు. మెదక్‌లో తన గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ ఫిరాయింపులను తాను సమర్థించనని పేర్కొన్నారు. అయితే, పార్టీ మారాలనుకునే వారు పదవికి రాజీనామా చేసి మళ్లీ పోటీ చేయాలని ఆయన అన్నారు.

ఓటు ఉంటుందో.. ఉండదో!?



- 5.41 లక్షల పేర్ల తొలగింపుతో గందరగోళం.. 'చిరునామా'లో లేరని 4.4 లక్షలు ఔట్
- బోగస్ ఓట్లను ముందే నిర్ధారించలేదేం?.. ఫిబ్రవరి 8న తుది జాబితా ఎలా ప్రకటించారు?
- ఒకవైపు ఎన్నికల ప్రక్రియ.. మరోవైపు తొలగింపులా?.. అధికారుల తీరుపై విమర్శల వెల్లువ

హైదరాబాద్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): పార్లమెంటు ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కావడానికి ముందు రోజు అంటే ఈ నెల 17న హైదరాబాద్ జిల్లాలో లక్షలాది మంది పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించినట్టు అధికారులు ప్రకటించడంతో గందరగోళం నెలకొంది. ఎవరి పేర్లు ఉంటాయో మరెవరి పేర్లు ఉండవో తెలియని అయోమయంలో ఓటర్లు ఉన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం జాతీయ స్థాయిలో అన్ని పార్లమెంటు నియోజకవర్గాల్లో నిర్దేశించిన గడువులోగా ఓటర్ల జాబితా రూపొందించి, వాటిపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే స్వీకరిస్తుంది. వాటిని పరిష్కరించి, తుది జాబితా ప్రకటిస్తుంది. కానీ హైదరాబాద్‌లో ఈ ప్రక్రియ ప్రహసనంగా మారింది. ప్రతిసారి ఎన్నికల సందర్భంగా కుప్పలుతెప్పలుగా వస్తున్న ఫిర్యాదులపై అధికార యంత్రాంగం నిర్లిప్తంగా వ్యవహరిస్తుండడంతో సమస్యలు పరిష్కారం కావడం లేదు. ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితా రూపొందించకపోవడమే సమస్యలకు కారణమన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. హైదరాబాద్ జిల్లాలోని రెండు లోక్‌సభ నియోజకవర్గాల్లో 43,18,078 మంది అర్హులైన ఓటర్లు ఉన్నట్లు అధికారులు ఫిబ్రవరి 8న తుది జాబితా ప్రకటించారు. ఇందులో హైదరాబాద్ పరిధిలో 22,06,654 మంది, సికింద్రాబాద్ పరిధిలో 21,11,424 మంది ఓటర్లు ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ జాబితాను పరిగణనలోకి తీసుకుని ఎన్నికలు నిర్వహించాలి. కానీ ఈ నెల 17న ఈ ఓటర్ల జాబితా నుంచి 5,41,201 మంది పేర్లను తొలగించినట్లు ప్రకటించడంతో విస్మయం వ్యక్తమవుతోంది. వీరిలో 4,39,801 మంది పేర్లను చిరునామాలో పేర్కొన్న ఇళ్లలో లేని కారణంగా తొలగించినట్లు అధికారులు తెలిపారు. హైదరాబాద్‌కు ప్రతిరోజూ వేలాది కుటుంబాలు వలస వస్తూ ఉంటాయి. నగరంలో ఉపాధి కోసం ఒకచోటు నుంచి మరోచోటుకు మారడం సర్వసాధారణం. కిరాయి ఇళ్లల్లో ఉంటున్న కుటుంబాలు కూడా మారుతూ ఉంటాయి. ఇల్లు మారినా పోలింగ్ రోజు అంతకుముందున్న ప్రాంతానికి వచ్చి ఓటు వేస్తుంటారు. ఈ విషయాలను పట్టించుకోకుండా చివరి నిమిషంలో లక్షలాది మంది పేర్లు తొలగించడంపై ఓటర్లు మండిపడుతున్నారు. తమ పేరు ఓటర్ల జాబితాలో ఉందో లేదోనని ఆందోళన చెందుతున్నారు. కాగా, 54,259 డూప్లికేట్ పేర్లను, 2023 జనవరి నుంచి మరణించిన 47,141 మంది పేర్లను కూడా తొలగించినట్లు అధికారులు తెలిపారు. పార్లమెంటు ఎన్నికల్లో ఓటు వేసేందుకు జాబితాలో తమ పేర్లు ఉన్నాయో లేవో తెలియాలంటే ఓటర్లు ఏప్రిల్ 25 వరకు నిరీక్షించాల్సిందే. ఈ విషయంలో అధికారులను ప్రశ్నిస్తే తమకు సంబంధం లేదని, కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటున్నట్లు చెబుతున్నారు. కొన్నేళ్లుగా ఓటర్ల జాబితా రూపకల్పన తీరుపై ఎన్ని ఫిర్యాదులు చేసినా పట్టించుకోని అధికారులు నామినేషన్ ప్రక్రియకు ముందు లక్షలాది మంది పేర్లు తొలగించడంలో ఆంతర్యంపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.



ఆస్పత్రిలో తల్లిని కలిసిన రాధాకిషన్‌రావు

- ఉదయం భద్రత మధ్య చంచల్‌గూడ జైలు నుంచి కరీంనగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి
- ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2:45 వరకు అక్కడే
- సాయంత్రానికి మళ్లీ చంచల్‌గూడ జైలుకు తరలింపు


కరీంనగర్‌లో తల్లిని కలిసేందుకు ఆస్పత్రి లోపలికి వెళ్తున్న మాజీ డీసీపీ రాధాకిషన్‌రావు

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 21 : ఫోన్‌ట్యాపింగ్ కేసులో నిందితుడిగా జ్యుడిషియల్ రిమాండ్‌లో ఉన్న మాజీ డీసీపీ (ఎస్‌ఐబీ), పొట్లపల్లి రాధాకిషన్‌రావు ఆదివారం కరీంనగర్‌లోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తల్లి సరోజనాదేవి(95)ని పరామర్శించారు. తన తల్లి అనారోగ్యంతో బాధపడుతోందని, ఆమెను చూసేందుకు అనుమతివ్వాలంటూ నాంపల్లి కోర్టులో రాధాకిషన్‌రావు పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. ఈ మేరకు ఆదివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు తల్లి వద్ద గడిపేందుకు షరతులతో కూడిన మధ్యంతర బెయిల్‌ను కోర్టు మంజూరు చేసింది. ఈ మేరకు ఆయన్ను చంచల్‌గూడ జైలు నుంచి ఎస్కార్ట్, పైలట్ వాహనాల సెక్యూరిటీ మధ్య కరీంనగర్‌కు తరలించారు. అంతకుముందే కరీంనగర్‌లోని ఆస్పత్రి వద్ద పోలీసులు బారికేడ్లు పెట్టారు. రాధాకిషన్‌రావును మీడియా, ఇతరులతో మాట్లాడకుండా, ఎవరినీ కలవకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆస్పత్రిలో తల్లితోపాటు ఆమెకు సహాయకులుగా ఉన్న బంధువులతో మాట్లాడేందుకు మాత్రమే రాధాకిషన్‌రావుకు కోర్టు అనుమతించినట్లు సమాచారం. ఉదయం 11 గంటలకు ఆస్పత్రికి చేరుకున్న రాధాకిషన్‌రావు మధ్యాహ్నం 2:45 వరకు తల్లి సరోజనాదేవి వద్ద ఉన్నారు. మధ్యంతర బెయిల్ గడువు ముగిశాక ఎస్కార్ట్ పోలీసులు రాధాకిషన్‌రావును కరీంనగర్ నుంచి తిరిగి హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలుకు తరలించారు.


యాదగిరిగుట్ట ప్రధానాలయంలో క్యూలైన్ల కాంప్లెక్స్‌లో భక్తుల రద్దీ

యాదగిరిగుట్టకు పోటెత్తిన భక్తులు

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 21: ఆదివారం కావడంతో యాదగిరిగుట్ట నరసింహ స్వామి క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. సెలవురోజున ఇష్టదైవాలను దర్శించుకునేందుకు భక్తులు అధికసంఖ్యలో వచ్చారు. సుమారు 25వేల నుంచి 30వేల మంది భక్తులు క్షేత్ర దర్శనానికి రాగా ప్రత్యేక, ధర్మ దర్శన క్యూలైన్లు భక్తులతో నిండిపోయాయి. ప్రత్యేక దర్శనానికి గంట సమయం, ధర్మ దర్శనానికి గంటన్నర సమయం పట్టింది. ప్రధానాలయం, ప్రసాద విక్రయశాలల్లో కూడా రద్దీ నెలకొంది. యాదగిరిగుట్ట పరిధిలో 43.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదుకాగా, వేసవి తాపానికి భక్తులు ఇబ్బంది పడ్డారు. ఆలయ ఉత్తర దిశలో ఏర్పాటు చేసిన షెడ్డు కింద సేదతీరారు. కాగా, ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 44,63,708 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు.

మల్లన్న సన్నిధిలో జస్టిస్ మహేశ్వరి


జస్టిస్ మహేశ్వరికి స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ ఈఓ

శ్రీశైలం, ఏప్రిల్ 21: శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్ల దర్శనార్థం ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్న వీరికి ఆలయ కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం జస్టిస్ మహేశ్వరి దంపతులు స్వామివారికి అభిషేకం, భ్రమరాంబికా దేవి అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించుకున్నారు.

పుడమి సంరక్షణ ఉద్యమంగా చేపట్టాలి:సురేఖ

హైదరాబాద్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పుడమి సంరక్షణ చర్యలను ఒక ఉద్యమంలా చేపట్టగలిగితేనే భవిష్యత్‌లో భూమి నివాసయోగ్య గ్రహంగా మనగలుగుతుందని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ సూచించారు. "ప్రపంచ ధరిత్రి దినోత్సవాన్ని(ఏప్రిల్ 22)" పురస్కరించుకుని మంత్రి సందేశం ఇస్తూ.. మనుషుల అత్యాశ, అనాలోచిత చర్యలతో నేలతల్లి జీవాన్ని కోల్పోతున్నదన్నారు. నీటి వనరులు కలుషితమవుతున్నాయని, పీల్చే గాలి విషతుల్యమవుతున్నదన్నారు. అరుదైన జీవజాతులు నశిస్తున్నాయని, పక్షులు కనుమరుగు అవుతున్నాయని, ఉష్ణోగ్రతలు పెరిగి, అకాల వర్షాలు, వరదలతో ప్రకృతి వైపరీత్యాలతో మనుషుల ఉనికికే ప్రమాదం వాటిల్లుతున్నదని పేర్కొన్నారు. ఐక్యరాజ్య సమితి పిలుపు మేరకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా నిర్మూలించడంతో పాటు, 2040 నాటికి ప్లాస్టిక్ ఉత్పత్తిని 60 శాతానికి తగ్గించేందుకు ప్రతి ఒక్కరు ప్లాస్టిక్ రహిత జీవనశైలిని అలవర్చుకోవాలని మంత్రి సురేఖ తెలిపారు.

రాజకీయ ప్రయోజనాల కోసమే ఏబీవీపీ దాడులు

- హెచ్‌సీయూలో ఏబీవీపీ చిచ్చు పెడుతోంది: తమ్మినేని

హైదరాబాద్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో రాజకీయ ప్రయోజనాల కోసమే పథకం ప్రకారం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఏబీవీపీ మూక దాడులు చేస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఆరోపించారు. సున్నితమైన అంశాలను తెర మీదకు తెచ్చి తద్వారా రాజకీయ ప్రయోజనాల కోసం హెచ్‌సీయూలో ఏబీవీపీ చిచ్చు పెడుతోందని ఆరోపించారు. వర్శిటీలో పది రోజులుగా ఏబీవీపీ నాయకత్వంలో మూకదాడులు జరుగుతున్నాయని, దాడిలో 20 మందికి పైగా గాయపడ్డారని, ఎనిమిది మంది ఆసుపత్రిలో చేరారని తెలిపారు. ఈ సందర్భంగా ఏబీవీపీ చేస్తున్న దాడులను సీపీఎం ఖండిస్తుందన్నారు. పోలీసులు రెండు విద్యార్థి సంఘాల మధ్య ఘర్షణలా చూడకుండా లోతుగా విచారణ జరిపి దోషులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

మాల్దీవుల పార్లమెంట్ ఎన్నికల్లో మయిజ్జుకు భారీ మెజార్టీ

మాలే, ఏప్రిల్ 21 : మాల్దీవులు అధ్యక్షుడు మహ్మద్ మయిజ్జు పాలనకు అగ్నిపరీక్షగా భావించిన పార్లమెంట్ ఎన్నికల్లో అంచనాలు తలకిందులయ్యాయి. ఆదివారం జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో మయిజ్జు సారథ్యంలోని పీఎన్‌సీ(పీపుల్స్ నేషనల్ కాంగ్రెస్) పార్టీ ప్రస్తుతమున్న సమాచారం మేరకు 60కు పైగా స్థానాల్లో గెలుపొందింది. మొత్తం 93 స్థానాలకు ఎన్నికలు జరగ్గా పీఎన్‌సీ 67 సీట్లు గెలిచే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. అవినీతి ఆరోపణలు, చైనాకు అంటకాగుతూ భారత్ పట్ల మయిజ్జు అనుసరిస్తున్న విధానాల నేపథ్యంలో ఈ ఫలితం అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది.

సచివాలయంలో పార్కింగ్ సౌకర్యం!

- డ్రైవర్ల కోసం రెస్ట్ రూమ్‌ల నిర్మాణం
- 'ఆంధ్రజ్యోతి' కథనంతో చర్యలు
- 15 కోట్లతో కొత్తగా అంచనాల తయారీ


సచివాలయంలోని ఎలక్ట్రిక్ వాహనాలు

హైదరాబాద్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు సచివాలయంలో వాహనాల పార్కింగ్, డ్రైవర్ల సమస్యలు తీరనున్నాయి. పార్కింగ్, డ్రైవర్ల కోసం రెస్ట్ రూమ్‌లతో పాటు మరికొన్ని సౌకర్యాల కల్పనకు రంగం సిద్ధమైంది. దీనికి ఆర్ అండ్ బీ అధికారులు అంచనాలు సిద్ధం చేస్తున్నారు. వీలైనంత త్వరగా ఈ నిర్మాణాలు పూర్తి చేయాలని నిర్ణయించారు. పార్కింగ్ సౌకర్యం కోసం సోలార్ రూఫ్‌టాప్ సహా మరో రెండు రకాల నమూనాలు పరిశీలిస్తున్నారు. సుమారు రూ.15 కోట్ల మేర ఖర్చవుతుందని భావిస్తున్నారు. 'వాహనాలు నిలువ నీడ లేకపాయే!' శీర్షికన ఏప్రిల్ 6న 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన విషయం విదితమే. ఆ కథనం చర్చనీయాంశం అవడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. సచివాలయ నిర్మాణ సమయంలో పార్కింగ్ కోసం సిద్ధం చేసిన మ్యాప్‌ను పరిశీలించడంతో పాటు అప్పుడు ఎందుకు ఏర్పాటు చేయలేకపోయామనే దానిపై చర్చించుకున్నారు. డ్రైవర్లకు కనీస సౌకర్యాలు కల్పించలేకపోవడంపైనా తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పుడు కొత్త నమూనా సిద్ధం చేస్తున్నారు. వాస్తవానికి అప్పట్లో పార్కింగ్ సౌకర్యం ఏర్పాటు కోసం రూ.10 కోట్లు అవసరమవుతాయని నిర్ణయించి, బడ్జెట్ కూడా కేటాయించారు. కానీ కార్యరూపం దాల్చలేదు. దీంతో గతంలో కేటాయించిన పనులను రద్దు చేయనున్నారు. ఈ విషయంపై ప్రభుత్వానికి లేఖ రాయాలని అధికారులు నిర్ణయించారు.

ఎంట్రీ పాయింట్ సమస్య ఎలా?

సందర్శకుల ఎంట్రీ పాయింట్ అంశంపైనా స్పష్టత రావాల్సి ఉంది. మంత్రులు, అధికారులను కలిసేందుకు వచ్చేవారు పాసులు జారీ చేసే కౌంటర్ నుంచి లోపలికి వెళ్లాలంటే కిలోమీటరుకు పైగా దూరం ఉంది. దాంతో వృద్ధులు, వికలాంగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కౌంటర్ ఎదురుగా నుంచే సచివాలయంలోకి వెళ్లేలా మార్గం ఏర్పాటు చేయడంతో పాటు, వృద్ధులు, వికలాంగులు వెళ్లేందుకు ఎలక్ట్రిక్ వాహనాలు అందుబాటులో ఉంచాలని పలువురు సూచిస్తున్నారు. సచివాలయం ప్రారంభోత్సవ సమయంలో నలుగురు వెళ్లేందుకు వీలుగా రెండు, మూడు ఎలక్ట్రిక్ వాహనాలను అక్కడ ఉంచారు. వాటిని ఇప్పుడు వృద్ధులు, వికలాంగుల కోసం వినియోగించాలని ప్రభుత్వానికి వినతులు వస్తున్నాయి.

అనుమతుల్లో మహా వేగం!

(మొదటి పేజీ తరువాయి)

స్థానచలనం, హెచ్‌ఎండీఏ మాజీ డైరెక్టర్ ఆదాయానికి మించి ఆస్తుల కేసుల్లో పట్టుబడడం, గత ప్రభుత్వ హయాం నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణాలకు అనుమతులిచ్చారంటూ వచ్చిన ఆరోపణలపై విజిలెన్స్ విచారణలు.. వీటన్నింటి నేపథ్యంలో ఏ క్షణం ఏ అధికారిపై వేటు పడుతుందోననే సందేహాలున్నాయి. కానీ, ఎన్ని ఉన్నా అనుమతులు ఆగట్లేదని విశ్వసనీయవర్గాల సమాచారం. గత సర్కారు హయాంలో కొన్ని ఫైళ్లను ఆన్‌లైన్‌లో టీఎస్‌బీపాస్ నుంచి తప్పించి ఆఫ్‌లైన్‌లోకి మార్చి అడ్డగోలుగా అనుమతులిచ్చినట్లుగా వచ్చిన ఆరోపణల నేపథ్యంలో.. ఆ అనుమతులను ఆపి, వాటిని మళ్లీ ఆన్‌లైన్‌లోకి మార్చే ప్రక్రియ జరుగుతోంది. గతంలో జరిగిన తప్పిదాలను సవరిస్తూనే హెచ్‌ఎండీఏలో భవన నిర్మాణ, లే-అవుట్, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ల జారీలో వేగం పెంచాలని అధికార యంత్రాంగానికి ప్రభుత్వం భారీ టాస్క్‌నిచ్చింది. పూర్తిగా ఆన్‌లైన్‌లోనే అనుమతివ్వాలంటూ ఆదేశాలిచ్చింది. ఆ ఆదేశాలకు అనుగుణంగా వివిధ ఫైళ్లపై పూర్తిస్థాయి నివేదికలను అందజేస్తూనే.. మరోవైపు అనుమతుల జారీ వేగవంతం చేశారు. లెక్కల్లో చెప్పాలంటే.. గతఏడాది డిసెంబర్ నుంచి ఈ ఏడాది ఏప్రిల్ 20వరకూ హెచ్‌ఎండీఏలో 827 భవన నిర్మాణాలకు అనుమతులిచ్చారు. వాటిలో 708 అనుమతులు.. డిసెంబరు నుంచి మార్చి నడుమ ఇచ్చినవే. అదే.. అసెంబ్లీ ఎన్నికల ముందు నాలుగు నెలల్లో (ఆగస్టు నుంచి నవంబరు వరకు) 745 భవన నిర్మాణ అనుమతులిచ్చారు. ఈ నాలుగు నెలల్లో 359 దరఖాస్తులకుగాను 229 ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు (ఓసీ) జారీ చేశారు. ఎన్నికల తర్వాత నాలుగు నెలల్లో హెచ్‌ఎండీఏకు 376 దరఖాస్తులు రాగా.. 215 ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లను జారీ చేశారు. ఇంకా 99 దరఖాస్తులు ప్రాసెస్‌లో ఉన్నాయి. నిర్ణీత గడువులోగా వాటినీ పరిష్కరించనున్నారు.

ఆపింది వాటినే..

ఆన్‌లైన్‌లో అనుమతులు, పారదర్శకత కోసం తీసుకొచ్చిన టీఎస్‌బీపాస్‌కు.. గత సర్కారు హయాంలో ఆఫ్‌లైన్ దందాతో తూట్లు పొడిచినట్లు ఆరోపణలున్నాయి. 2020 నుంచి 2023 డిసెంబరు నడుమ.. ఏడు అంతస్తుల నుంచి 58 అంతస్తుల వరకు భవన నిర్మాణ అనుమతులు పొందిన వాటిలో అత్యధిక ఫైళ్లు ఆఫ్‌లైన్‌లోకి మార్చినవే. టీఎస్‌బీపాస్‌లో దరఖాస్తు చేసిన తర్వాత.. రెవెన్యూపరమైన అంశాలను పరిశీలించే తహశీల్దార్ స్థాయిలోనే ఆయా ఫైళ్లను సాంకేతిక ఇబ్బందుల పేరిట ఆఫ్‌లైన్‌లోకి మార్చేసి అనుమతులిచ్చేశారు. దీనిపై కొత్తగా వచ్చిన ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేసింది. ఆఫ్‌లైన్‌లో జారీచేసిన అనుమతులన్నీ పూర్తిగా ఆన్‌లైన్‌లోకి మార్చేందుకు చర్యలు చేపట్టింది. వాటన్నింటినీ పునఃపరిశీలించి అనుమతులిచ్చేందుకు ఇటీవలే మార్గదర్శకాలు జారీ చేసింది. వివిధ దశల్లో ఆగిన దాదాపు 200 మాన్యువల్ ఫైల్స్‌ను పూర్తిగా ఆన్‌లైన్‌లోకి మార్చాలని, ఆన్‌లైన్‌లోనే వివిధ దశల్లో అధికారులు పునఃపరిశీలన చేసి, అన్నీ పక్కాగా ఉంటేనే అనుమతులివ్వాలని ప్రభుత్వం తన మార్గదర్శకాల్లో స్పష్టం చేసినట్లు తెలిసింది. దీంతో, ఇప్పటికే ఫీజులు కట్టి.. ప్రొసీడింగ్స్ కోసం ఎదురుచూస్తున్న ప్రాజెక్టులకు సైతం మొదటి నుంచి ఆన్‌లైన్‌లో రీ వెరిఫికేషన్ చేసిన తర్వాతే అనుమతులు జారీ చేయనున్నారు. ఈ మేరకు, ఆయా ఫైల్స్‌ను పూర్తిగా టీఎస్‌బీపాస్‌లోకి మళ్లీ అప్‌లోడ్ చేసే ప్రక్రియను జోన్లవారీగా ప్రారంభించారు. అప్‌లోడింగ్ పూర్తికాగానే.. ఆన్‌లైన్‌లో తొలుత పార్ట్-బీ పరిశీలన, ఆ తర్వాత ఏపీవో, ప్లానింగ్ ఆఫీసర్, డైరెక్టర్‌ల పునఃపరిశీలన చేయనున్నారు. ఆ తర్వాత ఆన్‌లైన్‌లో వచ్చే దస్త్రాలకు మాత్రమే హెచ్‌ఎండీఏ కమిషనర్ ఆమోదముద్ర వేయనున్నారు. ఆ వెంటనే ఫీజు లెటర్లు జారీ, ఫీజులు చెల్లించినవారికి ప్రొసీడింగ్ కాపీలను జారీ చేసేవిధంగా కసరత్తు చేస్తున్నారు.



సత్వర అనుమతులతో రియల్ ఎస్టేట్ వృద్ధి

ఆన్‌లైన్‌లో సత్వర భవన నిర్మాణ అనుమతులు.. హైదరాబాద్ రియల్ ఎస్టేట్ అభివృద్ధికి దోహదం చేస్తాయి. ప్రభుత్వం మారిన తర్వాత హెచ్‌ఎండీఏలో అనుమతులు ఇంత వేగవంతమవుతాయనుకోలేదు. హెచ్‌ఎండీఏలో రెగ్యులర్‌గా ఎంఎస్‌బీ కమిటీ సమావేశాలు జరుగుతున్నాయి. దీంతో బహుళ అంతస్తుల భవన నిర్మాణ అనుమతులపై కమిటీ ఓ నిర్ణయం తీసుకోవడానికి అవకాశాలున్నాయి.

రాజశేఖర్ రెడ్డి, క్రెడాయ్ హైదరాబాద్ అధ్యక్షుడు

అప్పుడెన్ని? ఇప్పుడెన్ని?

2023 ఆగస్టు నుంచి నవంబర్ నడుమ

నెల	ఓసీల జారీ	భవన అనుమతులు
ఆగస్టు	50	203
సెప్టెంబర్	63	190
అక్టోబర్	61	182
నవంబర్	55	170
మొత్తం	229	745

కొత్త ప్రభుత్వం వచ్చాక

నెల	ఓసీల జారీ	భవన అనుమతులు
డిసెంబర్	59	192
జనవరి	45	163
ఫిబ్రవరి	26	171
మార్చి	85	182
ఏప్రిల్	-	119
మొత్తం	215	827

ఉమాను వెనుకేసుకొస్తున్నావా?

- గులకరాయిని టీడీపీ నేతలు వేయమన్నారా?
- పోలీసులు పదేపదే ఒత్తిడి చేశారన్న దుర్గారావు
- రెండురోజులపాటు కొట్టారు
- నావి, కుటుంబానివి సంతకాలు తీసుకున్నారు
- 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి'కి దుర్గారావు వెల్లడి

విజయవాడ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : "గులకరాయి ఘటనలో మీపార్టీ నేతలను వెనుకేసుకువస్తున్నావా? ఉమాను వెనకేసుకొస్తున్నావా?టీడీపీ నాయకులు ఎవరైనా గులకరాయి వేయమన్నారా? వారు ఎవరైనా దీని వెనుక ఉన్నారా?" అంటూ పోలీసులు తనను రెండురోజులపాటు ఒత్తిడికి గురిచేశారని, కొట్టారని వేముల దుర్గారావు తెలిపారు. విజయవాడ సెంట్రల్ టీడీపీ అభ్యర్థి బొండా ఉమా పేరు పదేపదే పోలీసులు ప్రస్తావించారని చెప్పారు. గులకరాయి కేసుతో తనకు సంబంధం లేదన్నా వినలేదన్నారు. 'రెండు రోజులపాటు తమ అదుపులో ఉంచుకుని కొట్టారు. ఎటువంటి ఆధారాలు లభించకపోవడంతో వదిలేశారు" అని తెలిపారు. 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి'తో ఆయన మాట్లాడారు. "ఈనెల 16వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు డాబాకొట్లు సెంటర్‌లోని టీ స్టాల్ దగ్గర ఆటో పెట్టుకుని కూర్చున్నాను. కారులో వచ్చిన సివిల్ పోలీసులు నన్ను ఎక్కించుకుని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌పైన ఉన్న సీసీఎస్‌కు తీసుకెళ్లారు. ఎందుకు తీసుకొచ్చారని వారిని అడిగాను. సీఎం జగన్‌పై దాడి చేయించింది నువ్వే కదా అని పోలీసులు అన్నారు. నాకు 100 ప్రశ్నలు వేశారు. నేను రాయి వేయించలేదని చెప్పాను. నేను రాయి వేయించాననడానికి ప్రూఫ్ ఏమిటని అడిగాను. వేముల సతీశ్‌ను ఒత్తిడికి గురిచేసి బలవంతంగా నా పేరు చెప్పించారు. నన్ను అరెస్టు చేయడానికి పది గంటలకు ముందు సతీష్‌ను తీసుకెళ్లారు. రాయి వేయమని నేను ఎవరికీ చెప్పలేదు. నువ్వు టీడీపీలో తిరుగుతున్నావా అని అడిగితే అవునని సమాధానం చెప్పాను. టీడీపీ నాయకులు ఎవరైనా వేయమన్నారా అని ప్రశ్నించారు. మీ నాయకులు ఎవరైనా ఉన్నారా చెప్పమన్నారు. నేను రాయి వేయమని చెప్పలేదు కాబట్టి నీతి నిజాయితీగా ఉన్నాను. పోలీసులు విచారణ చేసుకుని, నా డేటా అంతా తీసుకొని అన్నీ పరిశీలించిన తర్వాత ఏ తప్పూ చేయలేదని అజిత్‌సింగ్ నగర్ పోలీస్‌స్టేషన్ దగ్గర శనివారం రాత్రి అప్పగించారు. వారు నన్ను మా ఇంటికి తీసుకొచ్చారు. నాతో, మా అమ్మ, భార్యతో ఖాళీ కాగితాలపై సంతకాలు చేయించుకున్నారు. పారం 60 నోటీసుపై సంతకాలు పెట్టించుకున్నారు. ఏదైనా అవసరమైతే స్టేషన్ రావాలని చెప్పారు.

నేడు కవిత బెయిల్ పిటిషన్లపై విచారణ

- ఈడీ, సీబీఐ రెండు కేసుల్లోనూ ఒకే రోజు వాదనలు



న్యూఢిల్లీ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టయి తిహాడ్ జైలులో ఉన్న ఎమ్మెల్సీ కవిత బెయిల్ పిటిషన్లపై రౌస్ అవెన్యూ కోర్టులో సోమవారం విచారణ జరగనుంది. ఈ కేసులో మార్చి 15న కవితను హైదరాబాద్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అరెస్టు చేసి 16న ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో హాజరు పరిచిన విషయం తెలిసిందే. కోర్టు అనుమతితో రెండు విడతలుగా 10 రోజులు ఈడీ కస్టడీలోకి తీసుకుని కవితను విచారించింది. ఆ తర్వాత కవితకు 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించడంతో మార్చి 26న తిహాడ్ జైలుకు తరలించారు. ఇంతలోనే సీబీఐ రంగంలోకి దిగి కవిత తిహాడ్ జైలులో ఉండగానే ఈ నెల 11న అరెస్టు చేసింది. ఈడీ కేసులో తన కుమారుడికి పరీక్షలున్నాయని, మధ్యంతర బెయిల్ ఇవ్వాలని కవిత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. అయితే.. కవిత సమాజాన్ని ప్రభావితం చేయగలిగే వ్యక్తని, ఆమెకు బెయిల్ ఇస్తే సాక్ష్యులను ప్రభావితం చేసే అవకాశం ఉందని కోర్టులో ఈడీ వాదనలు వినిపించింది. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి.. కవిత మధ్యంతర బెయిల్ పిటిషన్‌ను కొట్టివేస్తూ తీర్పు ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఈడీ కేసులో బెయిల్ కోసం మార్చి 26న, సీబీఐ కేసులో బెయిల్ ఇవ్వాలని కోరుతూ ఈ నెల 15న న్యాయస్థానంలో పిటిషన్లు దాఖలు చేశారు. తనకు ఆరోగ్య సమస్యలున్నాయని.. జైల్లో ఉంటే అవి మరింత పెరిగి ఇబ్బందిగా మారుతుందని, తనకు బెయిల్ మంజూరు చేయాలని పిటిషన్లలో కవిత విజ్ఞప్తి చేశారు. ఈ రెండు బెయిల్ పిటిషన్లపై సోమవారమే విచారణ జరగనుంది.

రేపటితో ముగియనున్న కవిత కస్టడీ..

జైల్లో ఉన్న కవిత జ్యుడీషియల్ కస్టడీ మంగళవారంతో ముగియనుంది. ఈ నేపథ్యంలో కవితను ఈనెల 23న ఉదయం రౌస్ అవెన్యూ కోర్టు ముందు హాజరు పరచనున్నారు. తొలుత ఈడీ కేసులో ఆమె జ్యుడీషియల్ కస్టడీ ఈనెల 23వరకు విధించగా.. ఈ నెల 11న జైల్లోనే కవితను సీబీఐ అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అనంతరం కోర్టు మూడు రోజుల సీబీఐ కస్టడీకి అప్పగించింది. దీంతో ఈ నెల 15న కవితను మరోసారి కోర్టులో సీబీఐ ప్రవేశపెట్టింది. సీబీఐ కేసులోనూ కవిత జ్యుడీషియల్ కస్టడీని ఈ నెల 23 వరకు విధిస్తూ ట్రయల్ కోర్టు తీర్పు చెప్పింది. సీబీఐ, ఈడీల రెండు కేసుల్లో కవిత జ్యుడీషియల్ కస్టడీ మంగళవారంతోనే ముగియనుంది. కవిత బెయిల్ పిటిషన్లను రౌస్ అవెన్యూ కోర్టు తిరస్కరిస్తే.. 23న ఆమె జ్యుడీషియల్ కస్టడీని మరో 14 రోజులు పొడిగించే అవకాశం ఉంది. బెయిల్‌ను ట్రయల్ కోర్టు తిరస్కరిస్తే కవిత పై కోర్టులను ఆశ్రయించే అవకాశం ఉంది.

ఆ మసాలాల్లో క్యాన్సర్ కారకాలు!

ఎవరెస్ట్, ఎండీహెచ్ స్పైసెస్‌కు చెందిన నాలుగు ఉత్పత్తుల్లో ఇథిలీన్ ఆక్సైడ్

- హాంకాంగ్ ఆహార నియంత్రణ ప్రాధికార సంస్థ వెల్లడి.. వాటి ఉపసంహరణ



హైదరాబాద్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): భారతదేశంలో ప్రసిద్ధి చెందిన మసాలా ఉత్పత్తుల తయారీ సంస్థలు.. ఎవరెస్ట్, ఎండీహెచ్ (మహాషియాన్ డి హట్టి ప్రైవేట్ లిమిటెడ్)! ఈ రెండు సంస్థలకు చెందిన నాలుగు ఉత్పత్తుల్లో క్యాన్సర్ కారకాలు ఉన్నాయని హాంకాంగ్ ఆహార నియంత్రణ ప్రాధికార సంస్థ 'సెంటర్ ఫర్ ఫుడ్ సేఫ్టీ' వెల్లడించింది. సాధారణ పరీక్షల్లో భాగంగా ఈ రెండు కంపెనీలకు చెందిన నాలుగు ఉత్పత్తుల నమూనాలను పరీక్షించామని.. వాటిలో మానవ వినియోగానికి పనికిరాని ఇథిలీన్ ఆక్సైడ్ (పురుగుమందుల్లో ఉండే రసాయనం) ఉన్నట్టు వెల్లడైందని వివరించింది. ఆ నాలుగు ఉత్పత్తుల్లో ఒకటి ఎవరెస్ట్ కంపెనీకి చెందిన ఫిష్ కర్రీ మసాలా కాగా.. మిగతా మూడూ ఎండీహెచ్ స్పైసెస్‌కు చెందిన మద్రాస్ కర్రీ పౌడర్ (స్పైస్ బ్లెండ్ ఫర్ మద్రాస్ కర్రీ), మిక్స్‌డ్ మసాలా పౌడర్, సాంబార్ మసాలా. వీటిలో తాము గుర్తించిన ఇథిలీన్ ఆక్సైడ్‌ను.. 'ఇంటర్నేషనల్ ఏజెన్సీ ఫర్ రిసెర్చ్ ఆన్ క్యాన్సర్' సంస్థ గ్రూప్ 1 క్యాన్సర్ కారకంగా వర్గీకరించిందని తెలిపింది. ఈ నేపథ్యంలో ఈ నాలుగు ఉత్పత్తుల విక్రయాన్ని నిలిపివేయాలని, ఇప్పటికే దుకాణాల్లో విక్రయానికి సిద్ధంగా ఉంచినవాటిని తొలగించాల్సిందిగా విక్రేతలను ఆదేశించినట్టు వెల్లడించింది. ఈ ఉత్తర్వులను ఉల్లంఘిస్తే 50 వేల డాలర్ల జరిమానాతో పాటు ఆరు నెలల జైలు శిక్ష కూడా వేస్తారని అక్కడి అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం దీనిపై దర్యాప్తు కొనసాగుతోందని, అది పూర్తయిన అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని వివరించారు. హాంకాంగ్ సెంటర్ ఫర్ ఫుడ్ సేఫ్టీ ప్రకటన నేపథ్యంలో.. భారతదేశం నుంచి దిగుమతి చేసుకున్న ఎవరెస్ట్ ఫిష్ కర్రీ మసాలను సింగపూర్ తన మార్కెట్ల నుంచి ఉపసంహరించింది. రొమ్ము క్యాన్సర్, లింఫోమా (లింప్ గ్రంధుల్లో క్యాన్సర్)కు కారణమయ్యే ఇథిలీన్ ఆక్సైడ్ ఆనవాళ్లు అందులో ఉండడమే తమ నిర్ణయానికి కారణంగా పేర్కొంది. ఇథిలీన్ ఆక్సైడ్ వినియోగం వల్ల వెంటనే ఎలాంటి ముప్పూ లేకపోయినా.. దీర్ఘకాల వినియోగం వల్ల ఆరోగ్యానికి హాని కలుగుతుందని హెచ్చరించింది. ఈ రెండు సంస్థల ఉత్పత్తులను విదేశాల్లో ఉపసంహరించడం ఇదే మొదటిసారి కాదు. గత ఏడాది జూన్‌లో అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ సంస్థ ఎఫ్‌డీఏ.. ఎవరెస్ట్ సాంబార్ మసాలా, గరమ్ మసాలా, మ్యాగీ మసాలాల్లో సాల్మొనెల్లా బ్యాక్టీరియా ఉన్నట్టు గుర్తించి వాటిని మార్కెట్ల నుంచి ఉపసంహరించింది. అలాగే.. 2019 సెప్టెంబరులో ఎండీహెచ్ సాంబార్ మసాలా ప్యాకెట్లనూ ఇదే సాల్మొనెల్లా బ్యాక్టీరియా జాడ నేపథ్యంలో మార్కెట్ నుంచి ఉపసంహరించారు. భారతీయులు విస్తృతంగా వాడుతున్న ఈ మసాలాల్లో క్యాన్సర్ కారకాలు ఉన్నాయని విదేశీ ఆహార సంస్థలు గుర్తిస్తుంటే.. మన దేశంలో ఆహారనియంత్రణ సంస్థ ఏం చేస్తోందని వైద్యనిపుణులు ప్రశ్నిస్తున్నారు. కాగా.. హాంకాంగ్, సింగపూర్ చర్యలపై ఎవరెస్ట్, ఎండీహెచ్ కంపెనీల యాజమాన్యాలు ఇంతవరకూ స్పందించలేదు.

ఏపీలో అరాచకాలపై వేలు నరుక్కొని నిరసన

- దేశ రాజధాని ఢిల్లీలో కలకలం
- బాధితురాలు గుంటూరు మహిళ
- మాజీ హోంమంత్రి సుచరిత అనుచరుల అక్రమాలపై ఏకరువు





గుంటూరు, ఏప్రిల్ 21 : దేశవ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్న తరుణంలో ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న అక్రమాలపై గుంటూరు రూరల్ మండలం స్వర్ణ భారతి నగర్‌లోని కృష్ణతులసి నగర్ డి బ్లాక్ కు చెందిన కోపూరి లక్ష్మి దేశ రాజధానిలో ఆదివారం 'ఏకలవ్య' తరహాలో నిరసన చేపట్టారు. ఢిల్లీలోని ఇండియా గేటు వద్ద అనుచరులతో నిరసన వ్యక్తం చేస్తూ ఒక్కసారిగా తన ఎడమ చేతి బొటన వేలును నరుక్కుని కలకలం రేపారు. రాష్ట్రంలో జరుగుతున్న అరాచకాలకు గుంటూరు జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంలో జరుగుతున్న ఘటనలే నిదర్శనమంటూ ఆమె ఆక్రోశించారు. ముఖ్యంగా ప్రత్తిపాడు నియోజకవర్గంలో జరుగుతున్న అవినీతి అక్రమాలను దేశ ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ దృష్టికి తీసుకువెళ్లాలనే ఉద్దేశంతో ఆమె మూడు రోజుల క్రితం మహిళా, ప్రజా సంఘాల నాయకులు బొందలపాటి అమరేశ్వరి, మారిపాక జయమ్మ, నూతక్కి కృష్ణరేఖ, గణేష్, నామాల నాగార్జున తదితరులతో కలిసి ఢిల్లీ చేరుకున్నారు. ప్రధాని, రాష్ట్రపతి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తులను కలిసేందుకు ప్రయత్నించి, సాధ్యం కాకపోవడంతో వారి కార్యాలయాల్లో వినతి పత్రాలు అందించారు. అనంతరం ఆదివారం సాయంత్రం ఆమె తన ఎడమ చేయి బొటనవేలు నరుక్కున్నారు. తాను స్వయంగా ప్రధాని, రాష్ట్రపతి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తులను కలిసి విజ్ఞప్తి చేసే అవకాశం కల్పించాలని ఆమె వేడుకుంటున్నారు. బొటన వేలు తెగిపడడంతో ఢిల్లీ వెళ్లిన సన్నిహితులు, ఢిల్లీలోని ఏపీ అసోసియేషన్‌కు సంబంధించిన ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఆమె కథనం మేరకు.. కోపూరి లక్ష్మి ఆదర్శ మహిళా మండలి అధ్యక్షురాలుగా మహిళా సమస్యలు, ప్రజా సమస్యలపై తన గళం వినిపిస్తున్నారు. గుంటూరు జిల్లాలో మాజీ హోం మంత్రి సుచరిత ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రత్తిపాడు నియోజకవర్గంలో ఎన్నో ఘోరాలు జరుగుతున్నాయంటూ వాటిపై పోరాటం చేస్తున్నారు. ముఖ్యంగా తమ ప్రాంతంలో కొందరు సభ్యులుగల ముఠా చిన్న పిల్లలకు గంజాయి అలవాటు చేయడం, వారితో విక్రయించడం, నేరాలు చేయించడం ద్వారా వారిలో నేర ప్రవృత్తిని పెంపొందిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎన్నో అరాచకాలు, మహిళలపై, దళితులపై దారుణాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ముఖ్యంగా 41వ డివిజన్‌లో భూకబ్జాలు, ప్రభుత్వాధికారుల సంతకాలను మాజీ హోంమంత్రి సుచరిత అనుచరులే చేస్తున్నారని తెలిపారు. ఎస్పీలు, కలెక్టర్లకు ఫిర్యాదు చేసినా, వారు చర్యలకు ఆదేశించినా, కేసులు నమోదు చేసినా ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఆయా అక్రమాలపై నియోజకవర్గ ఎమ్మెల్యే, మాజీ హోంమంత్రి మేకతోటి సుచరితకు, ప్రస్తుత వైసీపీ అభ్యర్థి బాలసాని కిరణ్‌కుమార్ అనుచరులు పిల్లి మేరి, బొల్లెద్దు వెంకట్, షేక్ నాగులు, ఎమ్మెల పుష్పలత, పులిపాటి అంజలి, పులిపాటి లోకయ్య తదితరులను విచారించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.